


# సోమర్సెట్ మామ్ కథలు

అనువాదం: ఎలనాగ

# సోమర్సెట్ మామ్ కథలు

అనువాదం:

**ఎలనాగ**

విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్
విజయవాడ

**SOMERSET MAUGHAM** ***KATHALU***

***- Translated by Elanaaga***

---

ప్రచురణ నెం. : 2350/609

ప్రతులు : 1000

ప్రథమ ముద్రణ : జనవరి, 2016

టైటిల్ డిజైన్ : గిరిధర్

© రచయిత

**వెల : ₹ 120/-**

**ప్రతులకు**

**విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్**
33-22-2, చంద్రం బిల్డింగ్స్
చుట్టుగుంట, విజయవాడ-520004
ఫోన్ : 0866-2430302
Email : vphpublish@gmail.com

**విశాలాంధ్ర బుక్‌హౌస్**
విజయవాడ, విశాఖపట్నం,
అనంతపురం, గుంటూరు
తిరుపతి, కాకినాడ, ఒంగోలు
శ్రీకాకుళం, కడప, విజయనగరం

**హెచ్చరిక :** ఈ పుస్తకంలో ఏ భాగాన్నైనా పూర్తిగా కానీ, పాక్షికంగా కానీ కాపీరైట్ హక్కు కలిగినవారి నుండి లేక ప్రచురణకర్తల నుండి ముందుగా రాతపూర్వక అనుమతి పొందకుండా ఏ రూపంగా వాడుకున్నా కాపీరైట్ చట్టరీత్యా నేరం.

---

**ముద్రణ : విశాలాంధ్ర విజ్ఞాన సమితి ముద్రణాలయం - విజయవాడ**

ముందుమాట :

# తెలుగులో సోమర్సెట్ మామ్ కథలు

**అంపశయ్య నవీన్**

**సో**మర్సెట్ మామ్ ఇంగ్లీషులో రచించిన కథల్ని ఎలనాగ గారు తెలుగులోకి అనువదించి, తెలుగు పాఠకులు ఆ కథల్ని చదివి ఆనందించే అవకాశం కల్గిస్తున్నారని తెలిసి నేను చాలా సంతోషించాను.

చిన్న కథల రచయితగా సోమర్సెట్ మామ్ ప్రపంచవ్యాప్తంగా కొన్ని లక్షలమంది పాఠకుల హృదయాలను రంజింపజేశారు. ఎంతోమంది తెలుగు కథకులు కూడా ఆయన కథల్ని చదివి కథలు ఎలా రాయాలో తెలుసుకున్నారు. తన కథల్ని గూర్చి సోమర్సెట్ మామ్ ఆయన ఆత్మకథలో (The Summing up) ఇలా చెప్పుకున్నారు.

"I Wanted to write stories that proceeded, tightly knit, in an unbroken line from the exposition to the conclusion. I saw the short story as a narrative of single event, material or spiritual, to which by the elimination of everything that was not essential to its elucidation, a dramatic unity could be given. I had no fear of what is technically known as the point. It seemed to me that it was reprehensible only if it was not logical, and I thought that the discredit that had been attached to it was due only to the fact that it had been too often tacked on, nearly for effect without legitimate reason. In short, I prefer to end my short stories with a fullstop rather than with a straggle of dots" (the summing up - page No. 155) (బిగువైన అల్లికతో ప్రతిపాదన నుండి ముగింపు దాకా ఏకధారగా సాగే కథలంటే నాకు ఇష్టం. నా దృష్టిలో కథానిక అనేది ఒకే సంఘటనను వివరించే రచన. అది భౌతికమైనది కావచ్చు లేక ఆధ్యాత్మికమైనది కావచ్చు. దాని వర్ణనకు అవసరం కానిదాన్నంతా వదిలేయటం ద్వారా అద్భుతమైన ఏకతను సాధించే వీలుంది. అసలైన ఉద్దేశం అని సాంకేతికంగా మనం చెప్పుకునేదాని గురించిన భయం నాకు లేదు. సహేతుకంగా లేనప్పుడు మాత్రమే దాన్ని తప్పు పట్టాలని అనిపిస్తుంది. సమ్మతమైన కారణం లేకుండా కేవలం ప్రభావం కోసమే తరచుగా చేర్చబడటం మూలంగానే హాని కలుగుతుందని నా అభిప్రాయం. క్లుప్తంగా చెప్పాలంటే, నేను నా కథానికలను ఫుల్‌స్టాప్‌తో ముగించటానికే ఇష్టపడుతాను తప్ప చుక్కల వరుసతో కాదు.)

తెలుగు కథకుల్లో సోమర్సెట్ మామ్‌తో గాఢంగా ప్రభావితుడైన కథకుడు బుచ్చిబాబు. మామ్‌కు నోబెల్ ప్రైజ్ రాలేదని ఎంతో బాధపడేవాళ్ళల్లో బుచ్చిబాబుగారొకరు.

"మామ్‌కు నోబెల్ ప్రైజ్ రాలేదని బాధపడేవాళ్ళల్లో నేనొకణ్ణి. కథారచయితల్లో మామ్ అగ్రగణ్యుడనడానికి సందేహించను" అన్నాడు బుచ్చిబాబు.

సోమర్సెట్ మామ్ 150 కథలు రాశాడని ఆయన స్నేహితుల్లో ఒకడైన కారల్ ఫీఫర్ చెప్పాడు. ఈ కథలన్నీ మూడు సంపుటాల్లో ప్రచురించబడినాయి. మామ్ తన జీవితంలో ఒక క్రమం, ఆకృతి ఉన్నాయని చెప్పుకున్నాడు. ఇవే ఆయన కథల్లోనూ ఉన్నాయంటాడు బుచ్చిబాబు. ఆయన కథలన్నింటిలోనూ ఒక క్రమం – అంటే ఒక మంచి ప్రారంభం, ఒక మంచి మధ్యస్థం, ఒక మంచి ముగింపు ఉంటాయి. ఏ కథలో కూడా అనవసరమైన వర్ణనలుగానీ, సంఘటనలుగానీ, పాత్రలుగానీ ఉండవు. ఒక సంఘటన చుట్టూ తిరిగేదే మంచి కథ అంటాడు మామ్. అలాగే ఆయన రాసిన ఏ కథను కూడా అర్ధాంతరంగా ముగించడు.

మామ్ రాసిన కథలు అనేక దేశాల్లో జరిగినవి అయ్యుంటాయి. మామ్ గొప్ప యాత్రా ప్రేమికుడు. ఆయన ప్రపంచంలోని ఎన్నో దేశాల్ని సందర్శించాడు. మలయా, బోర్నియో, ఇంగ్లాండ్, టహిటీ, మెక్సికో, సమోవ, ఇటలీ, స్పెయిన్, ఫ్రెంచ్ గయానా, ఇండియా లాంటి ఎన్నో దేశాలు ఆయన కథలకు కథాస్థలాలు. ఆయన ఎక్కువగా ఓడలమీద ప్రయాణం చేశాడు. ఆయన కథలు రాస్తున్న రోజుల్లో విమాన ప్రయాణాలు లేవు.

"మామ్ కథలు రాసినప్పటి స్థితిగతులు ఇప్పుడు లేవు. చాలా మారిపొయ్యాయి. ఆ మార్పుల వల్ల కథల విలువ తగ్గిందనుకోను. ఏ ఒక్క తత్వానికి, రాజకీయ, జాతీయ సిద్ధాంతానికీ, జాతి మతాలతో ముడిపడ్డ దృక్పథానికి కట్టుపడిపోక, కేవలం మానవ ప్రకృతిని విశదపరచే కథలవడం వల్ల, అవి చారిత్రక మార్పులతో వెనుకబడిపోవు. ఆయనకు స్వదేశీయులైన ఆంగ్లేయుల పట్ల ప్రత్యేకమైన అభిమానం లేదు. ప్రపంచమంతా రెండు మూడుమార్లు చుట్టిరావడం వల్ల మానవ ప్రకృతిలోని ప్రధాన లక్షణాలను నిశితంగా పరిశీలించి, అవగాహన చేసుకొని, అన్ని రకాల వారికీ నచ్చే కథా వస్తువును ఎన్నుకోగల్గాడు. అదొక అంతర్జాతీయ దృక్పథం అనను నేను. మానవ వ్యవస్థ వ్యక్తీకరణ" అంటాడు బుచ్చిబాబు తను రాసిన "సోమర్‌సెట్ మామ్ – ఆయన కథా ప్రపంచం" అన్న సుదీర్ఘమైన వ్యాసంలో.

నేను బి.ఏ. విద్యార్థిగా ఉన్నప్పుడే లైబ్రరీల నుండి మామ్ కథానిక సంపుటాలను తెచ్చుకొని ఒక తీవ్రమైన ఆసక్తితో చదివేవాడిని. ఇప్పుడు చాలా కాలం తర్వాత "ఎలనాగ"గారు తెలుగులోకి అనువదించిన మామ్ కథలు చదువుతోంటే ఎంత ఆనందం కలిగిందో మాటల్లో చెప్పలేను. అయితే ఎలనాగ గారు మామ్ రచించిన 15 కథల్ని మాత్రమే అనువదించాడు. మామ్ రచించిన 'సానటోరియం', 'రెయిన్' లాంటి ఎన్నో గొప్ప కథల్ని ఆయన అనువదించలేదు. అయితే సూక్ష్మంలో

మోక్షం అన్నట్లుగా ఆయన అనువదించిన ఈ 15 కథలు చదివిన తెలుగు పాఠకులు మామ్ కథల్లోని ప్రత్యేకతల్ని అవగాహన చేసుకొని ఆనందించగల్గుతారనడంలో సందేహం లేదు.

ఎలనాగ గారి అనువాదం చాలా సరళంగా సాగింది. ఆయన అనువాదంలో చక్కని ధార కూడా వుంది. ఎక్కడా తట్టుకోకుండా ఆయన అనువాదం చక్కగా సాగిపోతుంది.

కానీ మామ్ కథల ఈ అనువాదాలు చదివాక నాకొక విషయం అర్థమైంది. కొన్నిచోట్ల ఎలనాగ గారు మామ్ రాసిన ఇంగ్లీషు వాక్యాలను యధాతథంగా తెలుగులోకి తీసుకురావాలని ప్రయత్నించినట్లనిపించింది. కొన్ని ఇంగ్లీషులో దీర్ఘమైన వాక్యాల్ని తెలుగులో కూడా అలాగే దీర్ఘమైన వాక్యాలుగా అనువదించాడు. కొంత స్వాతంత్ర్యం తీసుకొని వాటిని చిన్న చిన్న వాక్యాలుగా విడగొడ్తే తెలుగు పాఠకులకు ఎంతో సౌకర్యంగా వుండేది. ఉదాహరణకు ఈ వాక్యం చూడండి:

"నేను వివరించకుండా ఉండలేని ఈ సంఘటనలు ఏ ఆనందమయ దేశంలో జరిగాయో ఆ దేశం పేరు చెప్పేలా నన్ను ఏదీ చెయ్యజాలదు."

ఈ వాక్యాన్ని ఇలా విడగొట్టొచ్చు :

"నేను వివరించకుండా ఉండలేని కొన్ని సంఘటనలు జరిగాయి. కానీ అవి ఏ (ఆనందమయ) దేశంలో జరిగాయో చెప్పలేను." ఇక్కడ ఆనందమయ అనే పదం లేకుంటేనే బావుండేది అనిపిస్తుంది.

ఇలాంటి వాక్యాలు కొన్ని అక్కడక్కడ కనిపిస్తాయిగానీ మొత్తమ్మీద అనువాదం సాఫీగానే సాగింది. ఒక అనువాద రచన చదువుతున్నప్పుడు పాఠకుడెక్కడా అనువాదాన్ని చదువుతున్నట్లుగా భావించకూడదు. ఈ విషయంలో ఎలనాగ గారు చాలావరకు జాగ్రత్త పడ్డట్టుగానే అనిపించింది.

ఇక్కడే మామ్ కథల్లోని ఒక ప్రధానమైన లక్షణాన్ని చెప్పాలి. మామ్ తన చాలా కథల్ని 'నేనూ' అంటూ ఉత్తమపురుషలో చెప్పాడు. ఆయన తన కథల్లోని ఈ శిల్పాన్ని గూర్చి చెబుతూ 'ఫస్ట్ పర్సన్ సింగ్యులర్' పేరుతో ఒక పుస్తకమే రాశాడు. అయితే ఆయన కథల్లోని ఈ "నేనూ" అనేవాడికి ఆ కథల్లో ముఖ్యమైన పాత్ర ఉండదు. ఈ 'నేనూ' కేవలం జరుగుతున్న సంఘటనలకు సాక్షీభూతంగా మాత్రమే వుంటాడు. ఇప్పుడు ఎలనాగ గారు అనువాదం చేసిన ఈ 15 కథల్లోని చాలా కథల్లో ఈ 'నేనూ' అంటూ కథ చెప్పడాన్నే మనం చూస్తాం. అయితే ఈ 'నేనూ' పేరు ఏమిటన్న ప్రసక్తి వచ్చినప్పుడు 'మామ్' అనే ఈ 'నేనూ' అనేవాడు చెప్పేస్తాడు. ఈ కథల్లోని సంఘటనలన్నీ, పాత్రలందరూ నిజమైనవే అనే అభిప్రాయాన్ని కల్గించటం కోసమే ఆయన ఈ 'నేనూ' అంటే తనే అని చెబుతాడు. ఎలనాగ అనువాదం చేసిన కొన్ని కథల్నిప్పుడు చూద్దాం.

'కవిరాజు' కథ ఓ ప్రఖ్యాతకవిని కలుసుకోవాలన్న ఉత్సాహంతో ఓ పాఠకుడు ఆ కవి ఇంటికొచ్చినప్పుడు ఆ ఇంట్లోని అడుగడుగులో అతనికి కవిత్వమే కనిపిస్తుంది. ఆ విషయాన్ని ఆ ఇంట్లో ఉన్న వ్యక్తిని తన అభిమానకవే అనుకొని ఆ పాఠకుడు చెప్పేస్తాడు. అప్పుడా వ్యక్తి

"నేను మీరనుకుంటున్న కవిని కాదండి... మీరు పొరపాటుపడ్డారని చెప్పడంతో ఆ పాఠకుడు కంగుతింటాడు. అంతా మనం ఊహించుకోవడంలోనే ఉంటుందని భావం.

'కొలను' అనే కథలో ఒక కొలనులో ఈదులాడుతున్న ఓ సుందరాంగిని చూసి లాసన్ అనేవాడు ఆమె ప్రేమలో పడిపోతాడు. కానీ ఆ సుందరి అతన్ని అష్టకష్టాలు పెడుతుంది. ఆమె మరొకరికి మనస్సిచ్చిందని తెలిసి లాసన్ ఆ కొలనులోనే పడి ఆత్మహత్య చేసుకుంటాడు.

మామ్ రాసిన కథల్లో 'సర్వజ్ఞుడు' (Mr. Know All) అనే కథ చాలా ప్రఖ్యాతి వహించింది. సముద్రంమీద ఓడలో ప్రయాణం చేస్తున్న ఎందరో ప్రయాణీకులను గూర్చిన కథ ఇది. 'కెలాడా' అనే వ్యాపారి తనకు తెలియని విషయమంటూ ఏదీ లేదని తనను గూర్చి తాను గొప్పగా చెప్పుకుంటూ వుంటాడు. ఒకామె మెడలో ఉన్న ముత్యాలహారాన్ని చూసి అది చాలా ఖరీదైన ముత్యాలతో చేసిందంటాడు. ఆమె భర్త అది నకిలీదని, దాన్ని 80 డాలర్లకే కొన్నానని చెబుతాడు. ఇద్దరూ 100 డాలర్లకు పందెం కడ్తారు. దగ్గర్నుంచి చూశాక చెబుతానని కెలాడా ఆమె మెడలోని హారాన్ని తన చేతుల్లోకి తీసుకుంటాడు. సరిగ్గా అప్పుడే ఆమె నిజం చెప్పొద్దు అన్నట్టుగా అతనికి సైగ చేస్తుంది. అప్పుడు కెలాడా అది నకిలీది కాదని తెలిసినా అది నకిలీదేనని, తాను పొరపాటు పడ్డాననీ, తను ఓడిపోయానని ఒప్పుకొని ఆమె భర్తకు వంద డాలర్లు చెల్లిస్తాడు. ఆ మర్నాడు కెలాడా బస చేసిన గదిలోకి ఆమె వంద డాలర్ల నోటును చేరవేస్తుంది. ఆమె అభ్యర్థన మేరకే అతడు అబద్ధం చెప్పాడని మనకర్థమౌతుంది. ఆమె భర్తకు తెలీకుండా ఎవరో ఆమెకా విలువైన ముత్యాలహారాన్ని కానుకగా ఇచ్చారని కూడా మనకర్థమౌతుంది. ఈ విషయం భర్తకు తెలీకూడదని ఆమె తన భర్తకు అది నకిలీదని, 80 డాలర్లకే అది తనకు లభించిందని చెప్పింది. స్త్రీలలో తమ భర్తలను తప్పుదారి పట్టించే చాతుర్యం పుష్కలంగా ఉంటుందని మామ్ ఈ కథలో చెప్పకనే చెప్పాడు.

'కాన్సుల్' అనే మరో కథలో కూడా స్త్రీలలోని ఈ విచిత్ర ప్రవర్తననే మామ్ చిత్రించాడు.

ఒక స్త్రీ తన భర్త ఎన్ని కష్టాలు పెట్టినా అతనికి విడాకులివ్వకుండా, అతనితోటే ఉండిపోతా నంటుంది. ఎందుకని అడిగితే ఆమె సమాధానం : "అతని నుదురుమీద అందంగా వేలాడే జుట్టులో ఏదో చెప్పలేని ఆకర్షణ వుంది" అని.

'లూయిస్' అనే కథలో లూయిస్ అనే ఆమె తనకు గుండెజబ్బుందని తన చుట్టుపక్కల వాళ్ళకు చెప్పి వాళ్ళ సానుభూతిని పొందుతూ ఉంటుంది. పెళ్ళి చేసుకున్నాక భర్తకు కూడా ఇదే విషయం చెప్పినప్పుడు అతడామెను అత్యంత ప్రేమగా, సున్నితంగా చూసుకుంటాడు. అయితే ఆమె క్లబ్బులకు వెళ్ళి డాన్సులు చేస్తూనే వుంటుంది. భర్తతో మీకంటె ముందు నేనే చనిపోతానంటూ వుంటుంది. అయితే ఆమెకంటే ముందు ఆమె భర్తే చనిపోతాడు. ఆ తర్వాత ఆమె మరొకర్ని పెళ్ళి చేసుకుంటుంది. అతనితో కూడా తనకు గుండెజబ్బు వుందని చెప్పి అతని ప్రేమను పొందుతుంది.

ఈ రెండో భర్త కూడా ఆమెకంటే ముందే చనిపోతాడు. ఆమెకో కూతురు – ఆమె పేరు ఐరిస్. ఐరిస్ కూడా తల్లికి గుండెజబ్బుందనుకొని లూయిస్‌ను చాలా ప్రేమగా చూసుకుంటుంది. కొద్ది రోజుల తర్వాత ఐరిస్ ఒకర్ని ప్రేమించి అతన్ని పెళ్ళి చేసుకోవాలనుకుంటుంది. ఏదో కారణం చెప్పి లూయిస్ కూతురు పెళ్ళిని ఆపాలని ప్రయత్నిస్తుంది. అయితే ఐరిస్ తను ప్రేమించిన వాడిని పెళ్ళి చేసుకోగానే లూయిస్ చనిపోతుంది. ఎదుటివాళ్ళ ప్రేమను, సానుభూతిని పొందటానికి ఆమెకు గుండెజబ్బొక సాకుగా మారిందనీ, కూతురు పెళ్ళి చేసుకుంటే తనకు దూరమౌతుందన్న దిగులుతో చనిపోయిందని ఈ కథ సారాంశం.

'లంచ్' అనే కథలో ఒక రచయితతో 'నేను మీకు అభిమాని'నని ఒకామె అతన్ని కలుస్తుంది. ఆ రచయితతో మధ్యాహ్న భోజనం చెయ్యాలన్న కోరిక ఉందని ఆ రచయితకు చెబుతుంది. పోనీయ్‌లే అనుకుని ఆ రచయిత ఆమెను ఒక హోటల్‌కు లంచ్‌కు తీసికెళ్తాడు. "నేను ఒక ఐటమ్‌కంటే ఎక్కువ తినను" అంటూనే ఎన్నో ఐటమ్స్‌కు ఆర్డరిచ్చి ఆ రచయిత జేబులో ఉన్న డబ్బంతా ఆ హోటల్ బిల్లు చెల్లించటానికే ఖర్చయిపోయేలా చూస్తుంది. ఆమె హోటల్ నుండి బయటికొచ్చాక "నాలాగే మీరు కూడా భోజనంలో ఒక ఐటమ్‌కంటే ఎక్కువ తీసుకోకండి" అని అతనికి సలహా ఇస్తుంది. అందుకతడు "ఈ రోజు రాత్రికి నేనసలు ఏమీ తినను" అని సమాధానం చెబుతాడు.

ఇలా సోమర్సెట్ మామ్ కథల్లో కొంత చమత్కారం, కొంత వ్యంగ్యం, స్త్రీల ప్రవర్తనమీద విసుర్లు తరచుగా కనిపిస్తాయి.

ఈ సంకలనంలో 'కలుపుమొక్క' అనే నవలిక కూడా వుంది.

సోమర్సెట్ మామ్ లాంటి గొప్ప కథకుని కొన్ని కథల్ని తెలుగు పాఠకులకు రుచి చూపించినందుకు ఎలనాగ గార్ని అభినందిస్తున్నాను.

# నా మాట

కథలు రాయటంలో రచయితలకుండవలసిన వాటిలో 'చాతుర్యం' ముఖ్యమైనది. ఒకే ఇతి వృత్తాన్ని వేరు వేరు రచయితలు కథగా కాని, నవలగా కాని మలిచినప్పుడు అంతిమ ప్రభావంలో వచ్చే తేడాకు ఈ చాతుర్యమే ప్రధాన కారణం. ఒక ప్రత్యేకమైన ingenuity ని (చతురతను) కనబరచకుండా రాసిన కథలు అంతగా రాణించవని నా అభిప్రాయం. చాసో రాసిన కథలు పైకి సహజంగా, సరళంగా వున్నా జాగ్రత్తగా పరిశీలిస్తే వాటిలో ఈ ingenuity పుష్కలంగా కనిపిస్తుంది. ఆంగ్లంలో అయితే నాకు తెలిసినంత వరకు ఈ finesse ను (ఉపాయంతో కూడిన తంత్రాన్ని) ప్రదర్శిస్తూ రాయటంలో అత్యంత సిద్ధహస్తులైనవారిలో సోమర్సెట్ మామ్ ఒకడు.

పది సంవత్సరాలకన్న ముందు 'కలుపు మొక్క' అనే పేరుతో నేను తెలుగులోనికి అనువదించిన నవలిక అనతగిన మామ్ కథ నా సాహిత్య జీవితంలో మొట్టమొదటి రచన కావటం గమనార్హం. దాన్ని ఈ పుస్తకంలో చేరుస్తున్నాను. మామ్ రచనలను చదవటం ద్వారా నేను నా ఆంగ్లాన్ని మెరుగు పరుచుకున్నానని చెప్పడం ఇక్కడ అసందర్భం కాదనుకుంటాను.

ఇందులోని కథలు ఆంధ్రప్రభ, వాకిలి, సారంగ మొదలైన పత్రికల్లో ఇదివరకే అచ్చయినాయి. వాటిని ప్రచురించినందుకు ఆ పత్రికల సంపాదకులకు నా కృతజ్ఞతలు.

విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ నుంచి వస్తున్న నా రెండవ రచన ఇది. మొదటిది 'ఉత్తమ ఆఫ్రికన్ కథలు', ఇలా నన్ను ప్రోత్సహిస్తున్న విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ ఎడిటర్ గడ్డం కోటేశ్వరరావుగారికి, జనరల్ మేనేజర్ హరనాథరెడ్డిగారికి నా హృదయపూర్వక కృతజ్ఞతలు.

– ఎలనాగ

# కథాక్రమం


| | | |
|---|---|---|
| 1. | ఇల్లు (The Home) | 1 |
| 2. | కవిరాజు (The Poet) | 6 |
| 3. | సంతుష్టుడు (The Happy Man) | 10 |
| 4. | కొలను (The Pool) | 15 |
| 5. | సర్వజ్ఞుడు (Mr. Know All) | 58 |
| 6. | కాన్సుల్ (The Consul) | 65 |
| 7. | లూయిస్ (Louise) | 70 |
| 8. | లంచ్ (Lunch) | 77 |
| 9. | పలాయనం (The Escape) | 82 |
| 10. | పరాయి ప్రాంతంలో (In a Strange Land) | 87 |
| 11. | మూతపడ్డ వ్యాపారం (The Closed Shop) | 92 |
| 12. | వాగ్దానం (The Promise) | 102 |
| 13. | ఆప్త మిత్రుడు (A Friend in Need) | 109 |
| 14. | ముత్యాల హారం (The String of Beads) | 115 |
| 15. | కలుపు మొక్క (The Alien Corn) | 122 |

# 1

# ఇల్లు

**(The Home)**

**పా**తకాలపు రాతిగోడల యిల్లులా కనిపించే ఆ ఫామ్‌హౌస్ కొండల మధ్య వుంది. దానిచుట్టూ గిడ్డంగులూ, కొట్టాలూ, పనివాళ్ల గదులూ వున్నాయి. గేటు దగ్గర గోడమీద రాతిపలక పైన ఆ యిల్లును కట్టించిన సంవత్సరం 1673 అని అందంగా చెక్కబడింది. అద్భుతమైన  ఎల్మ్ చెట్ల వరుస ఒకటి రోడ్డు నుండి ఇంటిముందరి అందమైన తోట దాకా పోతూ వుంది. అటువంటి చెట్ల వరుస నిజానికి జమీందారుల పెద్దపెద్ద బంగళాల ముందు గర్వకారణమై నిలిచి వుంటుంది. ఆ యింట్లో వుండే జార్జ్ యాబయ్యేళ్ల వయస్సున్న వ్యక్తి. అతని భార్య, మిసెస్ జార్జ్ ఆయనకన్న రెండేళ్లు చిన్నది. వాళ్ల సంతానమైన ఇద్దరు కొడుకులు, ముగ్గురు  కూతుళ్లు పుష్టిగా అందంగా వుంటారు. బాగా మర్యాద కలిగిన వ్యక్తులుగా వుండాలనే ఆధునిక కాలపు ప్రత్యేక కోరిక వాళ్లకు లేదు. తమ స్థాయీ, తాహతూ ఏమిటో బాగా తెలుసుకుని, వాటినే తమ గర్వకారణాలుగా తలుస్తారు. ఆ యింట్లోని వాళ్లకన్న యెక్కువగా కలిసిమెలిసి వుండే కుటుంబాన్ని నేను చూడలేదు. వాళ్లందరూ కష్టపడుతూ దయాగుణంతో ఆనందంగా బతుకుతున్నారు. కానీ, ఆ యింటికి యజమాని జార్జ్ తల్లే తప్ప, జార్జ్ కాదు. ఆ వృద్ధురాలు తన కొడుకుకన్న రెండు రెట్లు ఎక్కువ మగాడిలా వుంటుందని అంటారు ఆ వూరివాళ్లు. డెబ్బై ఏళ్ల వయస్సులో వున్న ఆమె పొడుగ్గా, నిటారుగా, ఠీవిగా కనపడుతుంది. వెంట్రుకలు నెరిసినా, ముఖంమీద ముడుతలు యేర్పడ్డా కళ్లు మాత్రం కాంతినీ, చలాకీతనాన్నీ నింపుకుని వుంటాయి. అక్కడ ఆవిడ చెప్పిన మాటే వేదం. కానీ, ఆమెలో హాస్యం వుంది. ఆవిడ నియంతలాగా వ్యవహరిస్తుందంటే దానికి కారణం ఆమెలో దయాగుణం కూడా వుండటమే. ఆ ముసలావిడ చెప్పే జోకులను ఆ వూరి వాళ్లు బాగా ఆనందించటమే కాక, వాటిని

ఇతరులకు చెప్తారు. వ్యాపార దక్షత బాగా వున్న ఆమె, బేరమాడటంలో అందరినీ మించిపోతుంది. ఒక విలక్షణమైన మహిళగానే కాక రాజీతత్వమూ, అసంబద్ధతా అనే రెండు లక్షణాలు కలగలిసి వున్న స్త్రీగా పేరుకెక్కింది ఆమె.

ఒకరోజు నేను మా యింటికి వెళ్తుంటే మిసెస్ జార్జ్ నన్ను ఆపి, "మా మామగారి అన్న చైనాలో వుండేవాడు కదా, ఆయన ఇవ్వాళ్ల వస్తున్నాడు తెలుసా?" అన్నది.

"ఆయన చనిపోయాడనుకున్నాను"

"మేమంతా కూడా అలానే అనుకున్నాం"

టోనీ అనే ఆ ముసలాయన గురించిన కథను నేను ఒక డజను సార్లు విన్నాను. అది ప్రాచీన గాథలా వుండటం వల్ల నాకు ఉత్సాహాన్నీ, వినోదాన్నీ కలిగించింది. అటువంటి గాథను నిజజీవితంలో వినడం కొంచెం విచిత్రంగా వుంటుంది. ఆమె మళ్లీ యిలా అన్నది. "మా అత్తగారు యాభై అరవై ఏళ్ల క్రితం చిన్నదిగా వున్నప్పుడు టోనీ, అతని తమ్ముడైన టామ్ – అంటే నా మామగారు – ఇద్దరూ ఆమెను ప్రేమించారు, పెళ్లి చేసుకోవాలను కున్నారు. ఆమె టామ్‌ను పెళ్లి చేసుకోవడంతో టోనీ ఇల్లు వదిలి, సముద్రాల మీదికి వెళ్ళిపోయాడు.

అతను చైనా సముద్రతీరంలో వున్నాడని తెలిసింది. గత ఇరవై సంవత్సరాలుగా అప్పుడప్పుడు కానుకలు పంపుతున్నాడు. "నా మామగారైన టామ్ చనిపోయిన తర్వాత, మా అత్తగారు ఆ విషయాన్ని తెలుపుతూ టోనీకి ఉత్తరం రాశారు. కానీ ఎట్లాంటి జవాబూ రాలేదు. దాంతో అతను చనిపోయాడనే అభిప్రాయానికి వచ్చాము. కానీ మాకు ఆశ్చర్యాన్ని కలిగిస్తూ రెండు మూడు రోజుల క్రితం సెయిలర్స్ హోమ్ నుండి ఒక ఉత్తరం వచ్చింది. కీళ్లవాతం మూలంగా టోనీ గత పది సంవత్సరాలుగా బాధపడుతుండటం వల్ల అతని జీవితం మంచానికే పరిమితమైంది. తాను ఇక యెక్కువ కాలం బ్రతకనని తెలుసుకున్న ఆయన, తను పుట్టిన యింటిని మరొకసారి చూడాలనుకున్నాడు. వరుసకు అతని మనుమడైన ఆల్బర్ట్ తన తాతను తీసుకురావడం కోసం వెళ్ళాడు. వాళ్లిద్దరూ ఇవ్వాళ్ల మధ్యాహ్నానికి రావలసి వుంది. కేవలం సరదా కోసం ఊహించుకోండి. ఆ ముసలాయన ఈ యింట్లో వుండక యాభై సంవత్సరాలు దాటుతోంది. వచ్చే యేడాదికి యాభై ఒక్క ఏళ్లు నిండబోయే నా భర్తను ఆయన ఇప్పటిదాకా చూడనే లేదు" .

"ఈ విషయం గురించి మీ అత్తగారు యేమనుకుంటున్నారు?" అని అడిగాను.

"ఆమె సంగతి మీకు తెలుసు కదా. తనలో తానే నవ్వుకుంటుంది. 'అతను యిల్లు విడిచి వెళ్లినపుడు అందమైన యువకునిగానే వుండేవాడు కానీ, టామ్ లాగా స్తిమితం వున్న మనిషి కాడు' అంటుంది ఆమె. అందువల్లనే ఆమె టామ్‌ను యెంచుకుంది. 'ఇప్పుడు టోనీకి శాంతగుణం వచ్చివుంటుంది' అంటుంది ఆమె."

మరునాడు జార్జ్ భార్య నన్ను లోపలికి రమ్మనీ, తన అత్తగారిని, ఆ ముసలాయనను చూడమనీ అన్నది. సరేనని లోపలికి పోయి చూస్తే, ఆ కుటుంబ సభ్యులందరూ రాతి పలకల నేల గల పెద్ద వంటగదిలో వున్నారు. జార్జితల్లి పొయ్యి పక్కన తన కుర్చీలో నిటారుగా కూర్చుని వుంది. ఆమె అతి మంచి సిల్కు బట్టలను తొడుక్కుని వుండటం నాకు వినోదాన్ని కలిగించింది. కుటుంబంలోని మిగతా సభ్యులు డైనింగ్ టేబులు దగ్గర కూర్చుని వున్నారు. పొయ్యికి ఆవతలి వైపున ఒక ముసలాయన కుర్చీలో కూలబడి వున్నాడు. అతను చాలా బక్కచిక్కి ఉండటం చేత చర్మం వదులుగా వుండి, వేలాడుతోంది. ముఖం ముడుతలు పడి పసుపుపచ్చ రంగులో వుంది. దాదాపు అన్ని పళ్లూ ఊడిపోయాయి.

అతనికి హ్యాండ్ షేక్ యిచ్చి, “టోనీగారూ! మిమ్మల్ని చూడటం నాకు ఆనందంగా వుంది. మీరు క్షేమంగా యిక్కడికి చేరుకున్నారు” అన్నాను.

“నా పేరుకు ముందర క్యాప్టెన్ అనే పదాన్ని చేర్చాలి” అన్నాడాయన, నా మాటల్ని సరిదిద్దుతున్నట్టుగా.

“ఇక్కడికి రాగానే తాతగారు కారును గేటు దగ్గర ఆపించి, ఇంటి గుమ్మం దాకా నడుస్తానన్నారు. అట్లానే నడిచారు కూడా” అన్నాడు ఆల్బర్ట్.

“ఇక్కడ ఓ విషయాన్ని గుర్తుంచుకోవాలి మీరు. గత రెండేళ్లలో నేను వొక్కసారి కూడా మంచం మీంచి దిగలేదు. అక్కడ సెయిలర్స్ హోమ్ దగ్గర కొందరు మనుషులు నన్ను మోసుకొచ్చి కారులో కూచోబెట్టాల్సి వచ్చింది. మళ్లీ యెప్పుడూ నడవలేననుకున్నాను. కానీ మన ఎల్మ్ చెట్లను చూడగానే, మా నాన్న వాటికి చాలాప్రాధాన్యం ఇవ్వడం జ్ఞాపకమొచ్చి, నడవగలన నిపించింది. ఆచెట్ల మధ్యలోంచి యాభై రెండేళ్ల క్రితం నడిచిన తర్వాత, మళ్లీ ఈ రోజే నడిచాను”.

“దాన్ని వెర్రితనం అంటాను నేను” అన్నది ముసలావిడ.

“అది నాకు మేలునే చేసింది. నేనింత బలంగా వున్నట్టు గత పదేళ్లలో యెప్పుడూ అనిపించలేదు నాకు. నీకన్న నేను ఎక్కువ రోజులు బతుకుతాను ఎమిలీ” అన్నాడు ముసలాయన.

“మరీ అంత నమ్మకంతో వుండొద్దు”

ఆమెను ఎమిలీ అంటూ పెళ్లి కాకముందున్న పేరుతో అంత చనువుగా బహుశా యెవ్వరూ పిలిచి వుండకపోవచ్చు. ముసలాయన ఆమెపట్ల అంత స్వాతంత్ర్యాన్ని తీసుకోవడం నాకు కొంచెం షాక్ లాంటి అనుభవాన్ని కలిగించింది. ఆమె అతణ్ని చురుకైన కళ్లతో చూసింది. అతడేమో ఆమెతో మాట్లాడుతూ తన బోసినోరుతో నవ్వాడు. ఆ యిద్దరు ముసలివాళ్లు యాభై సంవత్సరాల పాటు ఒకరినొకరు చూసుకోకున్నా పరస్పరం ప్రేమించుకున్నట్టు మాట్లాడటం నాకు చిత్రంగా అనిపించింది. అప్పుడు వాళ్లు ఎలా

ఫీలయ్యారో, తాము అంటున్న మాటలు వాళ్లకు జ్ఞాపకం వుంటాయో లేదో తెలియదు నాకు. కానీ, ఆ సంగతిని తల్చుకున్నప్పుడు ఆశ్చర్యం కలిగింది. ఆమెకోసం తాను సొంత యింటిని వదిలి ప్రవాస జీవితాన్ని గడపటం గుర్తుకు వచ్చి, అతనికి చిత్రంగా అనిపించి వుంటుందా అని ఆలోచించాను.

“మీకు పెళ్లైందా క్యాప్టెన్ టోనీ గారూ?” అని అడిగాను.

అతను నవ్వుతూ, వణికే గొంతుతో “కాలేదు. కానీ ఆడవాళ్ల గురించి నాకు చాలా తెలుసు” అన్నాడు.

“అని నువ్వంటున్నావంటే వాస్తవంగా నీకు ఐదారుగురు నీగ్రో స్త్రీలు భార్యలుగా వున్నా ఆశ్చర్యపడను నేను” అని మాటకు మాటగా అన్నది ముసలావిడ.

“చైనాలో మనుషులు నల్లగా వుండరు ఎమిలీ, వాళ్లు పసిమి రంగులో వుంటారని తెలుసుకోవాలి నువ్వు”.

“అందుకే అంత పచ్చగా తయారయ్యావు. నీకు పచ్చకామెర్లు వచ్చాయా అని అనుమానం వచ్చింది నాకు చూడగానే”.

“నిన్ను తప్ప మరెవర్నీ పెళ్లి చేసుకోనని అన్నాను కదా ఎమిలీ. నా మాట ప్రకారం ఎవ్వరినీ పెళ్లాడలేదు నేను”

అతని మాటల్లో దయనీయత కానీ, పశ్చాత్తాపం కానీ ధ్వనించలేదు. ఇరవై మైళ్లు నడుస్తానన్నాను, నడిచాను అని కేవలం ఒక వాస్తవాన్ని చెప్పినట్టుగా అన్నాడు. ఆ మాటల్లో సంతృప్తి చోటు చేసుకుంది.

“ఒకవేళ పెళ్లి చేసుకుని వుంటే విచారించేవాడివి” అన్నదామె.

చైనా దేశం గురించి ఆ ముసలాయనతో కొద్దిగా మాట్లాడాను నేను.

“చైనాలో నేను బాగా యెరుగని ఓడరేవు లేదు. ఓడ పోగలిగిన ప్రతిచోటుకూ వెళ్లాను. ఆరు నెలలపాటు పొద్దంతా నిన్నిక్కడ కూచో బెట్టి చెప్పినా నేను చూసిన ప్రదేశాల గురించి సగం మాత్రమే చెప్పగలను.”

“ఒక్క పని మాత్రం నువ్వు చెయ్యలేదు. అదేమంటే బాగా డబ్బును సంపాదించడం” అన్నది ముసలావిడ నవ్వుతూ, కొంచెం ఎద్దేవా చేస్తున్నట్టుగా. కానీ, ఆమె నవ్విన నవ్వులో కర్కశత్వం లేదు.

“నేను డబ్బును జమ చేసే మనిషిని కాను. సంపాదించు, ఖర్చుపెట్టు అన్నది నా సిద్ధాంతం. కానీ ఒక్కటి మాత్రం చెప్పగలను. మళ్లీ పూర్తి జీవితాన్ని జీవించే అవకాశం వస్తే దాన్ని తీసుకుంటాను. ఇట్లా నాలాగా మాట్లాడేవాళ్లు ఎక్కువ మంది వుండరు”.

“అవును, నిజంగానే ఉండరు” అన్నాను నేను.

అతని వైపు ఆరాధనాభావంతో, గౌరవభావంతో చూశాను. అతడు పళ్లూడిన అవయవాలుడిగిన, డబ్బుల్లేని వృద్ధుడు. కానీ జీవితాన్ని ఆనందంగా గడిపాడు కనుక విజేతగా నిలిచినట్టే. నేను సెలవు తీసుకుని పోతుంటే మరునాడు రమ్మన్నాడాయన. చైనా గురించిన సమాచారాన్ని వినదల్చుకుంటే కావలసినన్ని గాథలు చెప్తానన్నాడు.

మరునాడు ఆయనను కలిసి మాట్లాడుదామనుకున్నాను. ఆ అద్భుతమైన ఎల్మ్ చెట్ల వరుస పక్కనుండి నడుస్తూ తోటదగ్గరికి రాగానే, జార్జ్‌తల్లి పువ్వులను ఏరుతుండటం కనిపించింది. నేనామెకు నమస్కారం చెయ్యగానే ఆమె నిటారుగా నిలబడింది. చేతినిండా తెల్లని పువ్వులున్నాయి. ఇంటివైపు చూస్తే కర్టెన్లు కిందికి దించబడి వున్నాయి. నాకు విస్మయం కలిగింది. ఎందుకంటే, మిసెస్ జార్జ్ ఎప్పుడూ ఎండను కోరుకుంటుంది కనుక, సాధారణంగా కర్టెన్లు పైకి లాగి వుంచుతుంది.

"క్యాప్టెన్ టోనీ ఎలా వున్నారు?" అని అడిగాను.

"ఆయనెప్పుడూ ఓ వెర్రివాడి లాగా వుండే మనిషే. పొద్దున నా మనవరాలు లిజ్జీ అతనికోసం టీ తీసుకుని పోయి చూస్తే చనిపోయి వున్నాడు"

"చనిపోయాడా!"

"అవును, నిద్రలోనే మరణించాడు. నేనేమో ఈ పువ్వుల్ని ఏరుతున్నాను. అతడు ఈ పాత యింట్లో చనిపోయినందుకు నాకు సంతోషంగా వుంది. నా భర్త వైపు వాళ్లకు అట్లా మరణించడం యెంతో ఇష్టమైన విషయం".

రాత్రి అతడు నిద్రపోయేలా చేయడానికి వాళ్లు బాగా యాతన పడాల్సి వచ్చిందట. తన జీవితానుభవాలన్నిటినీ వాళ్లందరికీ చెప్పాడట. తన పాత యింటికి రావడం ఆయనకు యెంతో సంతోషాన్నిచ్చింది. ఎవ్వరి సహాయమూ లేకుండా రోడ్డునుండి తోట దాకా నడిచినందుకు అతడు గర్వపడ్డాడు. మరో ఇరవై ఏళ్లు బతుకుతానని గొప్పగా చెప్పుకున్నాడట. కాని విధి ఆయన పట్ల దయ చూపింది. అది అతని జీవితాన్ని సరైన క్షణంలోనే ముగింపజేసింది.

జార్జ్‌తల్లి తాను ఏరిన పువ్వులను వాసన చూసింది.

"ఆయన తిరిగి రావటం నాకెంతో ఆనందాన్నిచ్చింది. టామ్‌ను పెళ్లాడింతర్వాత, నేను నిజంగా సరైన వ్యక్తినే పెళ్లి చేసుకున్నానా అని అనుమానం కలిగేది నాకు" అన్నదామె.

## 2

# కవిరాజు

**(The Poet)**

**బా**గా పేరు మోసినవాళ్ల పట్ల నాకంతగా ఆసక్తి లేదు. ప్రసిద్ధి చెందినవాళ్లతో హ్యాండ్‌షేక్ చేయాలనే బలమైన కోరిక గల వ్యక్తులంటే నాకు చిరాకు. కాలిస్టటో డి శాంటా అనా బాగా కీర్తిని పొందిన గొప్ప కవి. అతనికి నన్ను పరిచయం చేస్తానని నా మిత్రుడు డియేగో టోర్ అన్నప్పుడు ఆ ప్రతిపాదనను నేను తిరస్కరించాను. స్పానిష్ భాష మాట్లాడే ప్రజలు కాలిస్టోను గొప్ప కవిగా యెంచి గౌరవిస్తారు. ఆ గౌరవానికి అతడు అర్హుడు కూడా. చాలా కాలం క్రితం అతని కవితలు యువకుల నాలుకల మీద నాట్యమాడేవి. అతని ఉద్వేగ పూరితమైన ఉపన్యాసాల గురించి, చురకల్లాంటి వాక్యాలు నిండిన హాస్య చతురత గురించి, అతని ప్రేమకలాపాల గురించి నా స్నేహితులు తెరిపి లేకుండా మాట్లాడేవారు. కాలిస్టో ఒక కవే కాక గొప్ప రాజకీయ వేత్త కూడా. ప్రపంచానికి తాను ఇవ్వాల్సిందంతా రచనల రూపంలో ఇచ్చినట్టు భావించి, గత పాతికేళ్లు గా ఒక రకమైన తిరస్కార భావంతో తన సొంత వూరైన ఎసిజా అనే పట్టణంలో నివసిస్తున్నాడు. ఆ అందమైన పట్టణంలోని నా మిత్రులను కలవటం కోసం నేనక్కడికి వెళ్తున్నానని చెప్పినప్పుడు, డియోగో టోర్ తన ప్రతిపాదనను నా ముందుంచాడు. తనను కలవదల్చుకున్న కొందరు యువ కవులకు, రచయితలకు కాలిస్టో అప్పుడప్పుడు ఆ అవకాశాన్నివ్వటమే కాక, చాలా ఉత్తేజకరంగా వాళ్లతో మాట్లాడుతాడట.

“ఇప్పుడతని రూపం యెలా ఉంటుంది?” అని అడిగాను.

“అద్భుతంగా” అన్నాడు టోర్.

“అతని ఫొటో వుందా నీ దగ్గర?”

“ఉంటే బాగుండేది. తనకు ముప్పై ఐదేళ్ల వయస్సున్నప్పట్నుంచే ఎవరూ ఫొటోలు తీయవద్దంటూ కెమేరాలను తిరస్కరిస్తున్నాడతడు. తనను పడుచువానిగా తప్ప వేరే విధంగా ఈ తరమూ, రాబోయే తరాలూ చూడవద్దని అతని కోరిక .

ఈ రకమైన ఆత్మాభిమానం పట్ల నాకెంత మాత్రం మంచి అభిప్రాయం లేదు. యువకునిగా వున్నప్పుడు కాలిస్టో అద్భుతమైన అందంతో మెరిసిపోయేవాడేని తెలుసు నాకు. యౌవనం తనను శాశ్వతంగా వదలినప్పుడు అతడొక ఆర్ద్రత నిండిన గీతాన్ని రాశాడు. ఒకప్పుడు తనను ఆరాధన నిండిన చూపుతో గమనించిన వాళ్లు తర్వాతి కాలంలో అంతగా ఆసక్తిని కనబరచక పోవటం అతనికి యెంత అవమానకరమైన బాధను కలిగించిందో.

కానీ టోర్ చేసిన ప్రతిపాదనను నిరాకరించాను. నాకు బాగా యిష్టమైన కాలిస్టో కవితలను అక్కడున్నపుడు చదువుకోవాలనీ, మిగతా సమయంలోనేమో సూర్యకాంతి నిండిన నెసిజా పట్టణపు నిశ్శబ్ద వీధుల్లో తిరిగి తృప్తి పడాలనీ నిశ్చయించుకున్నాను. కానీ నేను  ఆ పట్టణం చేరుకోగానే ఆ మహావ్యక్తే నాకు ఉత్తరం రూపంలో సమాచారాన్ని పంపడం కొంత ఆశ్చర్యాన్ని కలిగించింది. డియోగో టోర్ తనకు ఉత్తరం రాశాడనీ, మరునాడు ఉదయం పదకొండు గంటలకు వాళ్ల యింట్లో నేనతణ్ని కలిస్తే తానెంతో సంతోషిస్తాడనీ తెలిపాడు ఆ ఉత్తరంలో. ఆసమయంలో నాకు వేరే ఏ పనీ లేకపోవడం వల్ల కాలిస్టోను కలవటానికే నిశ్చయించుకున్నాను.

మరునాడు ఉదయం నేను హోటల్లోంచి బయటపడగానే మొదట ఆహ్లాదకరంగానే అనిపించింది.కానీ కొద్దిసేపైన తర్వాత ఆ పట్టణం బోసిపోయినట్టుగా తోచింది. నల్ల దుస్తులు తొడుక్కున ఒకామె అడుగుల్ని కొలుస్తూ నడుస్తున్నట్టుగా ముందుకూ వెనుకకూ అంగలు వేస్తూ మనసులోనే దేవుడికి మొక్కుకుంటూ కనిపించడం తప్ప, ఆ తెల్లని వీధులు నిర్మానుష్యంగా ఉన్నాయి. ఎసిజాలో ఎన్నో చర్చిలు ఉంటాయి. చాలాచోట్ల ఒక చర్చి ముందు భాగమో లేక గోపురమో శిథిలమై వుండి, అందులో కొంగల గూళ్లు కనిపిస్తాయి మనకు. ఒకచోట గాడిదపిల్లల వరుస కనపడితే దాన్ని చూట్టానికి ఆగాను. వాటి వీపులమీద అలంకారాలుగా వేసిన గుడ్డలు మాసిపోయి వున్నాయి. వీపులకు  రెండు వైపులా వేలాడుతున్న సంచుల్లో యేముందో తెలియలేదు నాకు. మరికొంత దూరం పోయింతర్వాత, పెద్ద గేట్లతో కూడుకున్న రాతిగోడలున్న తెల్లని భవనాలు కనిపించాయి. అమెరికా మొదలైన దేశాల్లో బాగా డబ్బును గడించిన ధనవంతులు తమ జీవితపు చివరి రోజుల్లో ఆ యిళ్లలో నివసిస్తారు. వాటిలోని ఒక బంగళా ముందు నిల్చుని కాలింగ్ బెల్ నొక్కి, కాలిస్టో తన స్థాయికి తగ్గట్టుగా గొప్ప యింట్లోనే వుంటున్నాడని సంతోషించాను. పాతకాలపు వైభవంతో వున్న ఆ పెద్ద గేటును చూసి అది మహాకవి స్థాయికి తగినట్లుగా వుందనుకున్నాను. కాలింగ్‌బెల్ శబ్దం నాకు కూడా వినిపించింది కానీ, లోపల్నుంచి యెవ్వరూ రాలేదు. రెండవసారి బెల్ నొక్కినా అలికిడి లేకపోవడంతో మూడోసారి నొక్కాను. ఆఖరుకు ఒక ముసలామె వచ్చింది. ఆమెకు మీసాలుండటం గమనించాను.

“ఏం కావాలి?” అని అడిగిందామె.

ఆవిడ అతణ్ని కనిపెట్టుకుని వుండే స్త్రీ కాబోలు అనుకున్నాను.

'మీ సారుగారితో అపాయింట్‌మెంట్ వుంది నాకు" అన్నాను

ఆమె ఇనుపగేటును తెరిచి, నన్ను లోపలికి రమ్మంది. వేచి వుండమని చెప్పి, స్టేర్‌కేస్ మీదుగా పైకి వెళ్లింది. పోర్టికో చల్లగా, హాయిగా వుంది. దాని కొలతలు రాజభవనాల ఠీవిని సూచించే విధంగా వున్నాయి. ఆ భవనాన్ని గొప్ప వాస్తుశిల్పి నిర్మించాడని భావించాను కానీ, గోడల రంగు వెలిసిపోయి అక్కడక్కడా టైల్స్ విరిగిపోవటమే కాక, పెచ్చులూడి పోయాయి. అయినా అపరిశుభ్రత అసలే కనిపించలేదక్కడ. కాలిస్టోకు ఒకప్పుడుండిన ఐశ్వర్యం ఇప్పుడు లేదని తెలుసు నాకు. అతను ధనం బాగా సంపాదించాడు కానీ, దాన్ని అంతగా లక్ష్యపెట్టకపోవడం వల్ల విచ్చలవిడిగా ఖర్చు చేశాడు. ప్రస్తుతం తను బీదతనంలో వున్నా దాన్నతడు లెక్క చేయడు అని స్పష్టంగా తెలుస్తోంది. పోర్టికో మధ్యలో ఒక టేబులూ దానికి రెండు వైపులా ఊగే కుర్చీలూ వున్నాయి. టేబులు మీద పాత వార్తాపత్రికలున్నాయి. ఎండాకాలపు వెచ్చని రాత్రుళ్లలో సిగరెట్ తాగుతూ ఎంత భావుకత నిండిన కలల్ని కంటూ వుంటాడో యీ కాలిస్టో, అని అబ్బురపడ్డాను. ముదురు రంగులో గీయబడిన స్పానిష్ చిత్రపటాలు గోడలకు వేలాడుతున్నాయి. తలుపుకు రెండు వైపులా గోడ మీద పాత పిస్తోళ్లు అమర్చబడి వున్నాయి. తాను వైభవంతో వెలిగిపోయిన పాత రోజుల్లో ఒక అందమైన నర్తకిని పొందటం కోసం ఒక యువరాజును చంపటానికి కాలిస్టో ఆ పిస్తోళ్లలోంచి ఒకదాన్ని వాడి ఉంటాడని ఉద్వేగంతో ఊహించుకున్నాను.

ఆ యింటి వాతావరణం నన్నెంతగా ప్రభావితం చేసిందంటే, నేను లీలగా ఊహించుకున్న ఆ దృశ్యమూ, దాని వివరాలూ ఆ భావకవి విషయంలో చాలా బాగా సరిపోయాయనిపించింది. ఆ యింటి ఉదాత్తమైన సాదాసీదాతనం అతని జీవితపు పాతరోజుల వైభవాన్ని తలపించింది. అతని అవసాన దశ అద్భుతమైన ఆ పాత భవనంలో గడుస్తుండటం చాలా ఔచిత్యంతో కూడుకున్న విషయమనిపించింది. కవి అన్నవాడు తప్పక అట్లాంటి యింట్లోనే జీవితపు చివరి రోజుల్ని గడిపి బ్రతుకును చాలించాలి. ఆయనను కలవటం పట్ల మొదట్లో నేను అనాసక్తిని చూపటమే కాక విసుగును కూడా చూపించాను. కానీ ఇప్పుడు నాలో కొంచెం తడబాటు మొదలవటంతో ఒక సిగరెట్ వెలిగించాను. కవిగారు చెప్పిన సమయానికే వచ్చాను నేను. అయినా అతనింకా పైనుండి ఎందుకు దిగటం లేదా అని ఆలోచించసాగాను. ఆ నిశ్శబ్దం కొంచెం అదోలా విచిత్రంగా వుండి, మనసులో కలవరాన్ని కలిగించింది. ఎప్పుడో చనిపోయినవారి ఆత్మల తాలూకు దెయ్యాలు నిశ్శబ్దం నిండిన ఆ వసారాలో కూచున్నట్టూ, మరణించిన వొక తరం ఆ చీకట్లో ప్రాణం పోసుకున్నట్టూ అనిపించింది. ఆ రోజుల్లోని మనుషులు గతించినవాళ్ళ ఆత్మల ఆర్తినీ, భావతీవ్రతనూ బాగా అనుభూతి చెందుతూ వుండేవాళ్ళు మరి!

మేడపై నుండి శబ్దం రావటంతో నా గుండె వేగం హెచ్చింది. చివరకు మెల్లగా మెట్లు దిగుతూ వస్తున్న అతణ్ని చూసిన నాకు ఉద్రేకంలో శ్వాస ఆగినంత పనైంది. అతని చేతిలో నా కార్డు వుంది. వృద్ధుడైన ఆయన పొడుగ్గా, చాలా బక్కపలుచగా వున్నాడు. చర్మం ఏనుగు దంతపు రంగుతో తెల్లగా నిగనిగలాడుతోంది. వెంట్రుకలు ఒత్తుగా పెరిగి తెల్లగా వున్నాయి కాని, కనుబొమ్మల వెంట్రుకలు మాత్రం గుబురుగా పెరిగి ఇంకా నల్లగానే వున్నాయి. అవి అతని కన్నుల్లో వింత కాంతి మెరిసేలా చేశాయనిపించింది. అంతటి ముసలితనంలో కూడా ఆ కళ్లలో ఇంకా కాంతి మిగిలివుండటం ఆశ్చర్యాన్ని కలిగించింది నాకు. చిలకముక్కునూ, చిన్న నోరునూ కలిగి వున్నాడతడు. కిందికి దిగుతూ గంభీరమైన కళ్లతో నన్ను నిదానంగా బేరీజు వేస్తున్నాడు. నల్లని కోటును తొడుక్కుని నడిచివస్తున్న అతడు, ఒక చేతిలో వెడల్పైన హ్యాటును పట్టుకున్నాడు. ఊపిరి తీసుకునే విధానంలో ఆత్మవిశ్వాసం కనపడింది. నేను ఊహించిన విధంగానే వున్నాడతడు. ఎందరో మనుషుల మెదళ్లను ఊగిసలాడించి, వారి హృదయాలను ఆయన ఎందుకు స్పృశించగలిగాడో అర్థమైంది నాకు. అతని శరీరంలోని ప్రతి అంగుళంలో ఒక కవి మూర్తిత్వం స్ఫురించింది.

పోర్టికోలో అడుగు పెట్టి, మెల్లగా నడుస్తూ నా వైపు వచ్చాడు. అతని కళ్లు చాలా తీక్ష్ణంగా, ప్రకాశవంతంగా ఉన్నాయి. గొప్పగొప్ప స్పానిష్ కవుల కవితా నైపుణ్యాన్ని వారసత్వంగా పుణికిపుచ్చుకున్న ఆ మహా కళాకారుడు నా ముందు నిల్చున్న ఆ క్షణం అద్భుతంగా తోచింది. ఆ కవుల వరుసలో అతను చివరివాడు. వాళ్లు నడిచిన తోవలో నడిచి గొప్పవాడయ్యాడు. ఆయన రాసిన ఒక చక్కని మృదువైన గొప్ప గీతం నా హృదయంలో విచిత్రంగా మోగింది.

నేను తత్తరపాటుకు లోనయ్యాను. అతనితో అనవలసిన మొదటి వాక్యాన్ని ముందే తయారు చేసి పెట్టుకోవడం నా అదృష్టం. "అయ్యా, నా వంటి పరదేశీయునికి తమవంటి గొప్ప కవితో పరిచయ భాగ్యం దొరకటం నా అదృష్టంగా భావిస్తాను" అన్నాను.

నన్ను పరిశీలనగా చూస్తున్న అతని తీక్ష్ణమైన కళ్లలో ఒక ఉల్లాసకరమైన వినోదం తాలూకు వెలుగు మెరిసింది. పెదవుల మీద ఒక్కక్షణం పాటు చిరునవ్వు వెలిగింది.

"అయ్యా, నేను కవిని కాను, వ్యాపారంలో తలమునకలై వున్న వ్యక్తిని. మీరు పొరపాటు పడ్డారు. కాలిస్టోగారు పక్క యింట్లో వుంటారు" అన్నాడాయన.

రావాల్సిన యింటికి రాలేదు నేను.

# 3

# సంతుష్టుడు

**(The Happy Man)**

ఇతరుల జీవితాలను చక్కదిద్దటం ఆపదతో కూడుకున్న పని. తమ మర్యాదలను, అలవాట్లను, అభిప్రాయాలను మార్చుకోవలసిందిగా ఇతరుల మీద ఒత్తిడి తెచ్చే రాజకీయ నాయకుల, సంస్కర్తల ఆత్మవిశ్వాసం పట్ల నేను చాలాసార్లు విస్తుపోతాను. వేరేవాళ్లకు సలహా యివ్వటానికి నేనెప్పుడూ వెనుకాడుతాను. ఎందుకంటే సలహా యిచ్చేవాడూ, తీసుకునేవాడూ తనను తాను బాగా తెలుసుకోనప్పుడు ఫలానా విధంగా చెయ్యి అని ఎలా చెప్పగలం? మనలోని ప్రతివాడూ ఒంటరి మిద్దెలోని ఒక ఖైదీయే. అతడు ఇతర ఖైదీలతో సంజ్ఞలను, మాటలను పంచుకుంటాడు. చెప్పే ఖైదీకీ, వినే ఖైదీకీ వాటి అర్థాలు ఒకేరకంగా తోచవు. ఈ ఖైదీలందరూ కలిస్తే ప్రజానీకం అవుతారు. వేరే వ్యక్తి తనజీవితాన్ని ఫలానా విధంగా గడపాలని చెప్పడానికి నేనెవర్ని? నా జీవితాన్ని పరిపూర్ణమైనదిగా మార్చటం నాకు సులభమైన పని కాదు. జీవితాన్ని ఎట్లా గడపాలనే విషయాన్ని నా పొరుగువానికి బోధించాలని నాకెప్పుడూ అనిపించలేదు. నా బ్రతుకును నేను ఏ విధంగా గడపబోతున్నానో కొందరు నన్ను అడిగినప్పుడు, విధి అనే నల్లని గుడ్డ నన్ను చుట్టివున్నట్టు అనిపించింది నాకు.

కాని ఒకసారి ఒకాయనకు నేను మంచి సలహా యిచ్చాను.

అప్పుడు నేను యువకుణ్ని. లండన్‌లోని విక్టోరియా స్టేషన్ దగ్గరి ఒక సాదాసీదా అపార్ట్‌మెంట్‌లో వుండేవాణ్ని. ఒకరోజు బాగా పనిచేసి వున్నాను. పగటివేళ నా యింటి కాలింగ్ బెల్ మోగింది. తలుపు తెరిచి చూస్తే ఎదురుగా ఒక కొత్త మనిషి కనిపించాడు. అతడు నా పేరేమిటని అడిగితే నా పేరు చెప్పాను. “లోపలికి రావచ్చా?” అని అడిగాడతడు. “తప్పకుండా” అని జవాబిచ్చాను నేను.

ఒక చిన్న సిటింగ్ రూములోకి అతణ్ని తీసుకు వెళ్లి, కూచోవలసిందిగా కోరాను. అతడు కొంచెం తత్తరపాటుకు గురైనట్టు అనిపించింది. తర్వాత ఒక సిగరెట్టును యిచ్చానతనికి. తన హ్యాట్ పడిపోకుండా దాన్ని వెలిగించడం అతనికి కొంచెం కష్టమైంది. అయినా బాగానే వెలిగించుకున్నాడు. "మీ హ్యాట్‌ను కుర్చీ మీద పెట్టనా?" అని అడిగాను. అతడు చప్పున తనే ఆ టోపీని కుర్చీ మీద పెడుతూ, గొడుగును కింద పడగొట్టుకున్నాడు.

"మిమ్మల్ని కలవటానికి నేను ఈ విధంగా రావటం పట్ల మీకు అభ్యంతరం లేదనుకుంటాను. నా పేరు స్టీఫెన్. నేనొక డాక్టరును. మీరు కూడా వైద్యరంగంలో వున్నవారే అనుకుంటాను" అన్నాడు.

"అవును, కానీ నేను ప్రాక్టీసు చేయడం లేదు"

"అది నాకు తెలుసు. స్పెయిన్ గురించి మీరు రాసిన ఒక పుస్తకాన్ని ఈ మధ్యనే చదివాను. దాని గురించి అడగాలనుకుంటున్నాను"

"అది అంత మంచి పుస్తకం కాదేమో"

"వాస్తవమేమిటంటే, స్పెయిన్ గురించి మీకు కొంత తెలుసు. ఆ దేశం గురించి చెప్పగలిగే వాళ్లు యెవరూ తెలియదు నాకు, మీరు తప్ప. కొంత సమాచారాన్నివ్వటానికి మీకు అభ్యంతరం వుండదేమో అనుకుని మీ దగ్గరికి వచ్చాను".

"మీకు సహాయం చేయగలిగితే నేను సంతోషిస్తాను"

ఒక్క క్షణం పాటు అతడు మౌనంగా వున్నాడు. తర్వాత ఒక చేతితో తన హ్యాట్‌ను పట్టుకుని మరొక చేతితో దానిమీద పరధ్యానంగా దరువు వేయటం మొదలు పెట్టాడు. ఆ విధంగా చేయడం అతనికి ఆత్మవిశ్వాసాన్ని ఇస్తుందని ఊహించాను నేను.

"ఒక పూర్తి అపరిచితుడైన కొత్త మనిషి మిమ్మల్ని యిలా అడగటం విడ్డూరంగా అనిపిస్తుందేమో మీకు. అయినా నేను నా జీవిత చరిత్రను చెప్పబోవటం లేదు." క్షమాపణ చెప్పుకుంటున్నట్టుగా నవ్వాడతడు.

ఎవరైనా నాతో ఇలా అన్నారంటే వాళ్లు తప్పక తమ సోదితో సుత్తి వేస్తారని తెలుసు నాకు. అయినా ఫరవాలేదు. నిజానికి నాకు అది యిష్టమైనదే.

"వయసుడిగిన ఇద్దరు చిన్నమ్మలు పెంచారు నన్ను. నేను ఏ యితర ప్రదేశానికీ పోలేదు. ఆరేళ్ల క్రితం నాకు పెళ్లైంది. కానీ పిల్లలు లేరు. కాంబర్‌వెల్ ఆసుపత్రిలో డాక్టరుగా పని చేస్తున్నాను. ఇంకా దాన్నే కొనసాగించలేను" అన్నాడతను.

అతడు మాట్లాడిన నిశితమైన పొట్టి వాక్యాల్లో ఏదో విశేషం ఉన్నట్టనిపించింది. ఎందుకంటే వాటిలో గింగురుమనే శబ్దం వినిపించింది. మొదట ఆయనను యథాలాపంగా చూసిన నేను తర్వాత మాత్రం ఉత్సాహంతో గమనించాను. అతనికి దాదాపు ముప్పై

యేళ్లుంటాయి. పొట్టిగా, లావుగా ఉన్నాడు. ముఖం గుండ్రంగా వుంది. కళ్లు బాగా ప్రకాశిస్తున్నాయి. నీలి రంగు సూటును తొడుక్కున్నాడు.

"ఆసుపత్రిలో డ్యూటీలెలా వుంటాయో మీకు తెలియంది కాదు. ప్రతిరోజు ఒకే విధంగా గడుస్తుంది. నా మిగతా జీవితాన్నంతా అట్లానే గడపాల్సి వుంటుంది. అది బాగుంటుందంటారా?" అన్నాడు.

"జీవించటం కోసం అదొక రకమైన వ్యాపకం" అన్నాను.

"అవును, అది నిజమే. డబ్బులు బాగానే వస్తాయి."

"మీరు నా దగ్గరికి యెందుకు వచ్చారో అర్థం కావటం లేదు నాకు"

"ఇంగ్లండుకు చెందిన ఒక డాక్టరుకు స్పెయిన్ దేశంలో ఏమైనా అవకాశాలుంటాయా అని అడగటం కోసం"

"స్పెయిన్ లోనే యెందుకు?"

"ఎందుకో గాని ఆ దేశమంటే నాకు ఇష్టం"

"అదేం స్వర్గం కాదు కదా"

"కానీ అక్కడ సూర్యరశ్మీ, శుభ్రమైన గాలీ, మంచి మద్యం, సంతోషకరమైన వాతావరణం ఉంటాయి. నేరుగా చెప్పదల్చుకున్నదేమిటంటే, ఆ దేశంలోని సెవిల్ పట్టణంలో ఇంగ్లండుకు చెందిన డాక్టరే లేడట. నేనక్కడికి వెళ్తే ఏదైనా పని దొరుకు తుందంటారా, లేక ఇక్కడి మంచి ఉద్యోగాన్ని వొదులుకోవటం పిచ్చితనమంటారా?"

"ఈ విషయం గురించి మీ భార్య అభిప్రాయమేమిటి?"

"అక్కడికి వెళ్లడం ఆమెకు ఇష్టమే"

"అక్కడికి పోయి ఉండటం రిస్కుతో కూడుకున్న విషయం"

"అంతేనంటారా? అయితే మీరు ఎట్లా చెప్తే అట్లా చేస్తాను."

అతడు తన ప్రకాశవంతమైన కళ్లతో నా మీద తదేక దృష్టిని నిలిపి చూస్తున్నాడు. సీరియస్‌గానే ఆ మాటలంటున్నట్టు అనిపించింది. ఒక్క క్షణం సేపు ఆలోచించాను.

"ఇది మీ మొత్తం భవిష్యత్తుకు సంబంధించిన విషయం కనుక, మీరే నిర్ణయించు కోవాలి. కానీ ఒక్కటి మాత్రం చెప్పగలను. అదేమిటంటే, మీకు బాగా డబ్బు వద్దనుకుంటే కేవలం మామూలు స్థాయిలో జీవించడం మీకు తృప్తినిస్తే వెళ్లండి. అప్పుడు మీరక్కడ అద్భుతమైన జీవితాన్ని గడుపుతారు."

అతడు వెళ్లిపోయాడు. ఒకటి రెండు రోజులు అతని గురించి ఆలోచించి తర్వాత మరచిపోయాను.

చాలా సంవత్సరాల తర్వాత కనీసం పదిహేనేళ్ల అనంతరం – నేను సెవిల్ పట్టణంలో వున్నప్పుడు కొంచెం నలతగా వుంటే, “ఈ పట్టణంలో ఇంగ్లీషు డాక్టరెవరైనా వున్నాడా?” అని హోటల్లోని పోర్టర్ను అడిగాను. ఉన్నాడని చెప్పి, ఆ పోర్టరు ఒక డాక్టరు అడ్రసును ఇచ్చాడు. టాక్సీ తీసుకుని ఆ అడ్రసుకు వెళ్లిన నాకు, పొట్టిగా లావుగా ఉన్న ఒక వ్యక్తి కనిపించాడక్కడ. నేనతణ్ని చూడగానే ఆయన కొంచెం తడబడ్డాడు.

“మీరు నన్ను కలవటం కోసం వచ్చారా? ఇంగ్లీషు డాక్టరును నేనే” అన్నాడు.

నేను ఏ పని మీద వచ్చానో చెప్పాను. నన్ను లోపలికి రమ్మన్నాడు. యిల్లు మామూలుగా వుంది. ఆ యింటికి ఒక వసారా వుంది. అతని కన్సల్టేషన్ గది కాయితాలు, పుస్తకాలు, వైద్య పరికరాలు, కర్రముక్కలు మొదలైన వాటితో నిండి వుంది. నలత వున్న రోగిని ఉలిక్కిపడేట్టు చేస్తుంది ఆ దృశ్యం. ఆయన నన్ను పరీక్షించి మందులు రాసిచ్చింతర్వాత, ఫీజు యెంత ఇవ్వాలని అడిగాను. తలను అడ్డంగా ఊపి, “ఫీజేం లేదు” అన్నాడు నవ్వుతూ.

“అదేంటి? ఫీజు తీసుకోకపోవటమేమిటి?”

“నన్ను మరచిపోయారా? మీ సలహా మీదనే నేనిక్కడ ఉంటున్నాను. నేను స్టీఫెన్ను”

ఆయనేం అంటున్నాడో నాకు బొత్తిగా అర్థం కాలేదు. చాలా సంవత్సరాల క్రితం అతడు నన్ను కలిసిన విషయాన్ని గుర్తు చేశాడు. అప్పుడు ఆ పాత సంఘటన లీలగా గుర్తుకు వచ్చింది.

“మిమ్మల్ని మళ్లీ కలుస్తానో లేదో అనుకున్నాను. మీరు నాకు సహాయం చేసినందుకు కృతజ్ఞతలు తెలుపుకునే అవకాశం దొరుకుతుందా అని ఆలోచించేవాణ్ని.”

“అయితే మీరనుకున్నది జరిగి, విజయం పొందారన్నమాట.”

అతణ్ని పరీక్షగా చూశాను. బాగా లావెక్కి, బట్టతలతో ఉన్నాడు. కానీ, కళ్లు సంతోషంతో మెరిశాయి. ఎర్రని ముఖంలో పూర్తి సంతృప్తి తాండవించింది. అతడు తొడుక్కున్న దుస్తులు మాత్రం ఘోరంగా వున్నాయి. వాటిని ఒక స్పానిష్ దర్జీ కుట్టినట్టున్నాడు. తల మీద పెట్టుకున్న హ్యాట్ చాలా వెడల్పుగా వుంది. అది స్పెయిన్ దేశస్థులు ధరించే సాంబ్రెరో అనే హ్యాట్. ఒక మంచి మద్యం సీసాను చూసినప్పటి సంతోషం, నవ్వు కనిపించాయి ఆ ముఖంలో. అతని ఆకారం దుస్థితిని సూచించే విధంగా వున్నప్పటికీ, అందులో సానుభూతి నిండి వుంది. ఆ డాక్టరు చేత ఆపరేషన్ చేయించుకోవాలంటే జంకు కలగవచ్చు కానీ, కలిసి మద్యం తాగటానికి ఆయన కంటె మంచి వ్యక్తి వేరే యెవరూ వుండరనిపించింది.

“మీకు నిజంగా పెళ్లైందా?” అని అడిగాను.

“అయింది. నా భార్యకు స్పెయిన్ ఎంత మాత్రం నచ్చలేదు. ఆమె ఇంగ్లండుకు తిరిగి వెళ్లింది. ఆమెకు అక్కడే బాగుందట”.

“ఓ... సారీ”

అతని నల్లని కళ్లు తాగుబోతు కళ్లలాగా మెరిశాయి.

“పరిహారాలతో నిండి వుండేదే జీవితమంటే” అని గొణిగాడు.

అంతలోనే తలుపు దగ్గర ఒక స్పానిష్ యువతి ప్రత్యక్షమైంది. ఆమె మరీ అంత పడుచుతనంతో లేకపోయినా భోగాన్ని తలపించే అందాన్ని కలిగి వుంది. అతనితో స్పానిష్ భాషలో మాట్లాడిందామె. ఆ యింటి ఇల్లాలు ఆమేనని నేను గుర్తించకుండా ఉండ లేకపోయాను.

నన్ను సాగనంపటానికి తలుపు దగ్గరికి వచ్చిన ఆయన నాతో యిలా అన్నాడు. “క్రితం సారి నేను మీ దగ్గరికి వచ్చినపుడు మీరేమన్నారో తెలుసా? నేనిక్కడికి వచ్చి ఉండిపోతే మామూలు స్థాయి జీవితం గడిపేందుకు సరిపోయేటంత సంపాదించినా అద్భుతమైన జీవితం గడుపుతానని అన్నారు. మీరన్నది నిజమే అని చెప్పాలనుకుంటున్నాను. నేను అప్పుడూ బీదవానిగానే వున్నాను, ఇప్పుడూ బీదవానిగానే వున్నాను. కాని యిక్కడ చాలా ఆనందంగా వున్నానని మాత్రం సత్యప్రమాణకంగా చెప్తున్నాను. ప్రపంచంలోని ఏ రాజైనా తన జీవితాన్ని యిస్తానన్నా ఈ జీవితాన్ని వొదులుకోలేను.”

4

# కొలను

**(The Pool)**

ఏపియా పట్టణంలోని మెట్రోపోల్ హోటలుకు యజమాని అయిన చాప్లిన్ నన్ను లాసన్‌కు పరిచయం చేసినప్పుడు లాసన్ పట్ల ప్రత్యేకమైన ధ్యాసను పెట్టలేదు నేను. అప్పుడు మేము హోటల్ లాంజ్‌లో కూచుని కాక్టెయిల్ తాగుతున్నాము. ఆ ద్వీపానికి సంబంధించిన విషయాలమీద లోకాభిరామాయణం కొనసాగుతుంటే, వినోదం నిండిన ఉల్లాసంతో దాన్ని వినసాగాను.

చాప్లిన్ తన సంభాషణ ద్వారా నాకు ఉత్సాహాన్నీ ఆనందాన్నీ కలిగించాడు. అతడొక మైనింగ్ ఇంజినీరు. తను సాధించిన వృత్తిపరమైన విజయాలకు అంతగా విలువ లేని ప్రాంతంలో స్థిరపడటాన్ని అతని ప్రత్యేక లక్షణంగా చెప్పుకోవచ్చునేమో. ఆయన చాలా తెలివిగల మైనింగ్ ఇంజినీర్ అని చెప్పుకుంటారు అక్కడి వాళ్లందరూ. అతడు చిన్నగా వుంటాడు. శరీరం లావుగా కాకుండా సన్నగా కాకుండా మధ్యరకంగా వుంటుంది. వెంట్రుకలు నల్లగానే వుంటాయి కానీ, తలమీద మాత్రం అక్కడక్కడ జుట్టు నెరిసిపోయి కొంత పలుచగా వుంటుంది. మీసాలు చిన్నగా, కొంచెం కొక్కిరిబిక్కిరిగా వుంటాయి. ఎన్నో సంవత్సరాలుగా ఎండ తగలడం చేతా, మద్యం తాగడం చేతా అతనిముఖం బాగా ఎరుపు రంగును కలిగి వుంటుంది. ఆ హోటలు పేరులో అట్టహాసం ఉన్నా దాని భవనం కేవలం రెండంతస్తులదే. దాన్ని అతని నలభై ఐదేళ్ల భార్య చక్కని అజమాయిషీతో పర్యవేక్షిస్తుంటుంది. సన్నగా పొడవుగా వుండే ఆమె, ఆస్ట్రేలియా దేశస్థురాలు. చాప్లిన్ తరచుగా ఉద్రేకంతో, నిషాలో భార్యపట్ల భయంతో వుంటాడు. ఆ ద్వీపానికి కొత్తగా వచ్చినవారు కొద్ది రోజులు కాగానే చాప్లిన్‌కూ అతని భార్యకూ మధ్య జరిగే కుటుంబ

కలహాల గురించి వింటారు. భర్తను ఎప్పుడూ తన స్వాధీనంలో ఉంచుకోవటం కోసం ఆమె తన పిడికిలినీ పాదాన్నీ ఉపయోగిస్తుంది. అప్పుడప్పుడు భర్త బాగా తాగి రాత్రి ఆలస్యంగా ఇంటికి వస్తే, ఆమె అతణ్ని ఇరవై నాలుగు గంటలపాటు గదిలో బంధించడం, మరునాడు అతడు వరండాలో దీనాతిదీనంగా భార్యతో వేడుకుంటున్నట్టుగా మాట్లాడుతుంటే చుట్టుపక్కల వాళ్లకు అది వినపడటం మామూలే.

చాప్లిన్ ఒక వింతైన, ఆసక్తికరమైన మనిషి. తన జీవితంలో చాలా ఎత్తుపల్లాలతో కూడిన వైవిధ్యం వుందని చెప్తుంటాడతడు. అది నిజమో అబద్ధమో తెలియదు కానీ, అతడు చెప్పేది వినాలపిస్తుంది. ఒకసారి అట్లా చెప్తున్నప్పుడు మధ్యలో లాసన్ రావడం నాకు అంతరాయం అనిపించి లోలోపలే విసుక్కున్నాను. చాప్లిన్ అప్పటికే బాగా తాగి వున్నాడని స్పష్టంగా తెలుస్తోంది.

నాకు ఇష్టం లేకున్నా అతని బలవంతం మీద మరో పెగ్గును తాగటానికి ఒప్పుకున్నాను నేను. చాప్లిన్ మెదడులో అప్పటికే మందకొడితనం ఆవహించిందని గ్రహించాను. మర్యాద ప్రకారం, ఆనవాయితీ ప్రకారం తరువాతి రౌండులో మద్యానికి నేనే ఆర్డరివ్వాలి, నాకిష్టం ఉన్నా లేకపోయినా. అప్పుడు చాప్లిన్‌లో వదరుబోతుతనం ప్రవేశిస్తుంది. తర్వాత అతని భార్య చూపులు కోపంతో నిండిపోవటం ఖాయం.

చాప్లిన్ ఆకారంలో లాగే లాసన్ ఆకారంలో కూడా ఎటువంటి ఆకర్షణా లేదు. అతడు కూడా సన్నగా చిన్నగా వుంటాడు. ముఖం కోలగా, చుబుకం చిన్నగా, ముక్కు పెద్దగా, కనుబొమ్మల వెంట్రుకలు నల్లగా దట్టంగా వుంటాయి. ఈ ఆకార విశేషాలన్నీ అతని రూపానికి ఒక రకమైన వింత తరహాను ఆపాదించాయి. అతని కళ్ళు చాలా నల్లగా పెద్దగా ఉంటాయి. ఆయన ఉల్లాసంగా కనిపిస్తాడు కానీ, అది నిజమైన ఉల్లాసం కాదనిపిస్తుంది నాకు. అది ప్రపంచాన్ని మోసగించటం కోసం పైపైన అతడు ధరించే ముసుగు. అది అతనిలోని అల్పత్వాన్ని దాస్తున్నదనిపించింది. అతడు ఆహ్లాదంగా కనిపించినప్పటికీ, ఎందుకో కానీ ఆ మనిషిలో కపటత్వం ఉందనుకునేవాణ్ని. తన బొంగురు కంఠంతో చాలా మాట్లాడేవాడు. చాప్లిన్, లాసన్ ఇద్దరూ తమ మందుపార్టీల గురించి చెప్పుకోవడంలో ఒకరినొకరు మించిపోతారు. ఇంగ్లిష్ క్లబ్‌లో బాగా తాగిన రాత్రుల గురించీ, విపరీతంగా విస్కీ తాగుతూ వేటాడటం గురించీ, సిడ్నీకి వెళ్లినపుడు ఆ నగరంలో కాలు మోపిన దగ్గర్నుంచి తిరిగివచ్చే దాకా పూర్తిగా నిషాలో ఉండటం గురించీ వాళ్లు చెప్పుకునే ముచ్చట్లు అందరి నోళ్ళలో గాథలుగా మారిపోయి ఇద్దర్నీ తాగుబోతులుగా మిగిల్చాయి. నాలుగు పెగ్గులు తాగింతర్వాత ఇద్దరికీ నిషా ఎక్కింది. కానీ, ఇద్దరి తీరుల మధ్య చాలా భేదం వుంది. చాప్లిన్‌లో మొరటుతనం నీచత్వం కనిపించగా, లాసన్‌లో నిషా ఉన్నా సభ్యత కనిపించింది.

ఆఖరుకు లాసన్ కొంచెం తూలుతూ కుర్చీలోంచి లేచి, "నేను ఇంటికి వెళ్తున్నాను సాయంత్రం మళ్లీ కలుస్తాను" అన్నాడు.

"మీ ఇంటావిడ బాగుందా?" అని అడిగాడు చాప్లిన్.

"ఆఁ"అని వెళ్లిపోయాడు లాసన్. ఆ ఏకాక్షర సమాధానం కొంచెం వింతగా అనిపించడంతో నేను తలెత్తి చూశాను.

"మంచివాడు, నిజానికి చాలా మంచివాళ్లలో ఒకడు. కానీ, పాపం బాగా తాగుతాడు. అతని మీద జాలి కలుగుతుంది" అన్నాడు చాప్లిన్ ఎటువంటి ఉద్వేగాన్ని కనబరచకుండా.

చాప్లిన్ చేసిన ఈ వ్యాఖ్యలో కొంత హాస్యం లేకపోలేదు. తర్వాత మళ్లీ "తాగిన మత్తులో వున్నప్పుడు లాసన్ ఎదుటివాడితో పోట్లాడాలనుకుంటాడు" అన్నాడు చాప్లిన్.

"అతడు తరచుగా నిషాలో వుంటాడా?" అని అడిగాను.

"విపరీతంగా. వారంలో మూడు నాలుగు రోజులు చిత్తుగా తాగుతాడు. అతడట్లా మారటానికి ఈ ద్వీపమే కాక ఎతెల్ కూడా కారణం".

"ఎతెల్ ఎవరు?"

"ఆమె అతని భార్య. రెండు జాతుల మిశ్రమంగా పుట్టింది. ముసలి బ్రెవాల్డ్ కూతురు. భర్త ఆమెను ఇంగ్లండుకు తీసుకుపోయాడు కానీ, అక్కడి పరిస్థితిని ఆమె తట్టుకోలేక పోయింది. ఇప్పుడు మళ్లీ భార్యాభర్తలిద్దరూ కలిసి వుంటున్నారు. ఏదో వొకరోజు తాగుడు మూలంగా కాకపోయినా మరే ఇతర కారణంచేత ఐనా ఉరేసుకుని చస్తాడు లాసన్. అతడు మంచివాడే కానీ, తాగినప్పుడు మాత్రం భరించలేనంత అరాచకత్వం నిండుతుంది అతన్లో" అని చప్పుడు వచ్చేలా త్రేన్పు తీశాడు చాప్లిన్.

తర్వాత "నేను పైకి వెళ్లి షవర్ కింద స్నానం చేస్తాను. ఆ చివరి పెగ్గును నేను తాగకుండా వుండాల్సింది. ఎప్పుడూ ఆ ఆఖరి పెగ్గే మనను బోల్తా కొట్టిస్తుంది" అన్నాడు. పైన వున్న స్నానాల గదిలోకి పోవాలని నిశ్చయించుకున్న అతడు కొంచెం సంశయిస్తూ మెట్లవైపు చూశాడు. తర్వాత అసహజమైన గాంభీర్యంతో లేచి నిలబడ్డాడు. మళ్లీ, "లాసన్‌తో స్నేహం చేస్తే లాభమే. అతడు చాలా పుస్తకాల్ని చదివాడు. నిషాలో లేనప్పుడు ఎంత నెమ్మదిగావుంటాడో! తల్చుకుంటే అది ఆశ్చర్యంగా వుంటుంది. చాలా తెలివైన వాడు కూడా.. అట్లాంటి వాళ్లతో మాట్లాడితే ఎంతో ఉపయోగంగా వుంటుంది" అన్నాడు.

ఆ విధంగా లాసన్ గురించిన దాదాపు మొత్తం కథను కొన్ని వాక్యాల్లో నాకు చెప్పాడు చాప్లిన్. సాయంత్రం నేను సముద్రతీరం వెంట వాహ్యాళికి పోయి హోటలుకు తిరిగి వచ్చి చూస్తే అక్కడ లాసన్ కనిపించాడు. ఏ ఉద్వేగమూ లేని కళ్లతో లాంజ్ లోని పేముకుర్చీలో బాగా లోపలికి కూరుకుపోయినట్టుగా కూర్చుని వున్నాడు. మధ్యాహ్నం నుండి మద్యం తాగుతూనే వున్నట్టు అనిపించింది అతని వాలకం చూస్తే. అతనిలో

మందకొడితనం కనిపించింది. చూపుల్లో వ్యాకులతా, ప్రతీకారభావంతో కూడిన కోపమూ ఉన్నాయని గ్రహించాను. ఒక్కక్షణం నా మీద దృష్టిని నిలిపాడు. కాని, నన్ను గుర్తు పట్టినట్టు లేదు. అక్కడ పక్కనే డోమినో అనే పాచికల ఆట ఆడుతున్న ఇద్దరు ముగ్గురు పురుషులు అతణ్ని చూడనట్టుగా తమ పనిలో మునిగిపోయారు. అతని వాలకంలోని ఆ సాదాసీదాతనమే అందుకు కారణం. నేను కూడా వాళ్లతో కలిసి ఆ ఆట ఆడటం మొదలు పెట్టాను.

"మీరు చాలా కలుపుగోలు మనిషి" అన్నాడు నా పక్కన కూచున్న లాసన్ అకస్మాత్తుగా. తర్వాత కుర్చీలోంచి లేచి వంగిన మోకాళ్లతో కొంచెం కుంటుతున్నట్టుగా తలుపువైపు నడిచాడు. మా ఆట, ఆ వాతావరణం అతనికి హాస్యాస్పదంగా కనిపించాయా అనిపించింది. లాసన్ అక్కణ్నుంచి కదలగానే, ఆటాడుతున్నవారిలో ఒకడు కిసుక్కున నవ్వి "ఇవ్వాళ్ల బాగా తాగి వున్నాడు ఆయన" అన్నాడు.

మరొకడు "తాగి కూడా అతనిలాగా నింపాదిగా ఉండలేకపోతే అసలు తాగకపోవడమే మంచిదనిపిస్తుంది" అన్నాడు.

ఆ నిర్భాగ్యుడు నిజానికి ఒకరకంగా ప్రేమ నిండినవాడిలాగానే వున్నాడనీ, కానీ విషాదాన్ని తలపింపజేయడానికి అవసరమైన దీనత్వమూ భయమూ అతని జీవితంలో వున్నాయనీ ఎవరూహిస్తారు?

తర్వాత రెండు మూడు రోజుల వరకు లాసన్ కనపడలేదు.

ఒకరోజు సాయంత్రం వేళ నేను హోటల్ మొదటి అంతస్తులోని వరండాలో కూచుని వున్నాను. అక్కణ్నుంచి హోటల్ ముందరి వీధి స్పష్టంగా కనిపిస్తుంది. అప్పుడు లాసన్ వచ్చి నా పక్కన వున్న కుర్చీలో కూర్చున్నాడు. అతనిలో నిషా వంటిది ఎంతమాత్రం లేదు. చాలా నెమ్మదితనం వుంది. యథాలాపంగా నాతో యేదో అన్నాడతడు. నేను కొంచెం ఉపేక్షతో జవాబిచ్చేసరికి సంజాయిషీ ఇచ్చుకుంటున్నట్టుగా నవ్వుతూ "మొన్న నేను విపరీతంగా తాగి నిషాలో వున్నాను" అన్నాడు. నేను జవాబివ్వలేదు. నిజానికి అనటానికి ఏమీ లేదు కూడా. చుట్ట తాగుతున్న నేను దోమల్ని తరమటం కోసం పొగను నోటితో చుట్టూ ఊదాను. అక్కడి స్థానిక కూలీలు పని ముగించుకుని హోటల్ ముందరి రోడ్డు మీదుగా తమ యిళ్లకు తిరిగి వెళ్తుండటం చూశాను. వాళ్లు పెద్ద పెద్ద అంగలతో మెల్లగా, జాగ్రత్తగా, హుందాగా నడుస్తున్నారు. చెప్పులు లేని పాదాలతో వాళ్లు నడుస్తుంటే వింతైన శబ్దం వస్తోంది. వాళ్ళ వెంట్రుకలు సాధారణంగా మెలితిరిగి కానీ, వంపు లేకుండా కాని నల్లగా వుంటాయి. అప్పుడు మాత్రం వాళ్ల వెంట్రుకలు తెల్లని పొడితో నిండి ఒక అసాధారణమైన ప్రత్యేకతను కనబరుస్తున్నాయి. వాళ్లు దృఢమైన శరీరాలతో పొడవుగా

వున్నారు. వాళ్ల తర్వాత సాల్మన్ ద్వీపానికి చెందిన కాంట్రాక్టు కూలీల గుంపొకటి పాటలు పాడుకుంటూ వెళ్లింది. వాళ్లు బొగ్గులాంటి కారు నలుపుతో, ఎర్రరంగు వేసుకున్న వెంట్రుకల్తో, పెద్ద పెద్ద తలలు కలిగిన సమోవా ద్వీపసవాసులకన్న పొట్టిగా, చిన్నగా ఉన్నారు. మధ్యమధ్య తెల్లజాతీయులు తమ గుర్రపు బగ్గీల్లో రోడ్డు మీదుగా పోవటమో లేక హోటలు ప్రాంగణంలోకి రావటమో చేస్తున్నారు. ఎదురుగా ప్రశాంతమైన సముద్రపు నీళ్లలో నిలిచి వున్న రెండు మూడు ఓడలు తమ సొగసును కనబరుస్తున్నాయి.

"ఇట్లాంటి ప్రదేశంలో ఫుల్లుగా తాగటం తప్పు చేయడానికి పనేమి ఉంటుందో తెలియదు నాకు" అన్నాడు ఆఖరుకు లాసన్.

ఏదో అనాలి కదా అనుకుని "సమోవా ద్వీపం మీకు నచ్చలేదా?" అన్నాను

"ఈ ద్వీపం అందంగానే వుంటుంది" అన్నాడతడు.

ఆ వాక్యం సమోవా ద్వీపపు అద్భుతమైన అందాన్ని వర్ణించడానికి ఎంతమాత్రం సరిపోదనిపించింది. నేను నవ్వి అతని వైపు తిరిగాను. అతని కళ్లల్లో భరించలేనంత ఆవేదన కనిపించింది. వాటిలో అనంతమైన విషాదపు లోతులున్నాయి. అటువంటి భావోద్వేగాన్ని అతడు చూపగలడని నేను అసలే ఊహించలేదు. కాని, అతని ముఖంలోని ఆ భావం వెంటనే మాయమై అతడు నవ్వాడు. ఆ నవ్వు సాదాసీదాగా, కొంచెం అమాయకంగా వుంది. దాన్తో ముఖ కవళిక మారింది. దాని మూలంగా మొదటిసారిగా నాలో అతని పట్ల  కొంత విముఖత ఏర్పడింది.

"నేనిక్కడికి వచ్చిన కొత్తలో ఊరంతా తిరిగేవాణ్ని." అని ఒక్కక్షణం సేపు మౌనంగా ఉండిపోయాడు లాసన్. తర్వాత మళ్లీ "మూడు సంవత్సరాల పాటు ఈ ద్వీపాన్ని వదిలి దూరంగా ఉన్నాను. కానీ, తర్వాత తిరిగి వచ్చాను" అన్నాడు. ఆ పైన కొంచెం తటపటాయించి "మళ్లీ ఇక్కడికి రావాలని నా భార్య పట్టుబట్టింది. ఆమె ఇక్కడే పుట్టిందని మీకు తెలుసు కదా" అన్నాడు.

"ఔను, తెలుసు" అన్నాను.

అతడు మళ్లీ మౌనం వహించాడు. తర్వాత రాబర్ట్ లూయీ స్టీవెన్సన్ గురించి ఏదో వ్యాఖ్య చేశాడు. "మీరు వైలిమాకు వెళ్లారా?" అని అడిగాడు. ఏదో విధంగా నాతో కలుపుగోలుగా వుండాలని ప్రయత్నం చేస్తున్నాడతడు. స్టీవెన్సన్ పుస్తకాల గురించి మాట్లాడాడు. తర్వాత సంభాషణ లండన్ నగరం మీదికి మళ్లింది.

"అక్కడి కావెంట్ గార్డెన్స్ ఇంకా అట్లానే ఉత్తేజకరంగా ఉన్నాయనుకుంటాను. ఆ సంగీత నాటకాలను నేనిక్కడ యెంతగానో మిస్సవుతున్నాను. ట్రిస్టాన్ అండ్ ఐలోడ్ అనే నాటకాన్ని చూశారా మీరు?" అని అడిగాడు.

ఆ ప్రశ్నకు జవాబు తనకెంతో ముఖ్యమైనది అన్నట్టుగా అడిగాడు. 'చూశాను' అని నేను ముక్తసరిగా చెప్పగానే సంతోషాన్ని కనబరిచాడు. వాగ్నర్ సంగీతం గురించి మాట్లాడాడు. ఒక సంగీతపరుడిలా కాక, మామూలు మనిషిలా మాట్లాడాడు. వాగ్నర్ సంగీతం ద్వారా ఒక రకమైన మానసిక తృప్తిని పొందాననీ, కాని దాన్ని వివరించలేననీ అన్నాడు.

"నాకు అంతగా డబ్బూ అదృష్టమూ లేవు కానీ, బేర్యూత్ నిజంగా చూడాల్సిన ప్రదేశం. అయితే అది కావెంట్ గార్డెన్సంత బాగా ఉండదనుకోండి. ఆ సంగీత నాటకాలలో అద్భుతమైన తళతళల వెలుతురూ, మెడకింది దాకా దుస్తుల్ని ధరించిన స్త్రీలూ, ఇంకా ఆ శ్రావ్యమైన సంగీతమూ ఎంతో బాగుంటాయి. వాక్యూర్స్ నాటకంలోని మొదటి అంకం చాలా బాగుంటుంది కదా. ఇక ట్రిస్టాన్ నాటకంలోని చివరి ఘట్టమైతే అద్భుతం, ఆహా, ఎంత దివ్యంగా వుంటుందో!" అన్నాడు.

ఈ మాటలు చెప్తుంటే అతని కళ్లలో మెరుపు కనిపించింది. ముఖం దీప్తితో వెలిగిపోయి అతడు అంతకు ముందు కనిపించిన మనిషి కాదనిపించింది. తెల్లని చెక్కిళ్లు ఎరుపు రంగును పులుముకున్నాయి. అంతకు ముందు అతని గొంతు బొంగురుగా, కొంచెం వికృతంగా ఉండిన సంగతి మరిచిపోయాను. కొంత ఆకర్షణీయంగా కూడా కనపడ్డాడతడు.

"దేవుని తోడు, ఈ రాత్రి లండన్లో ఉండానిపిస్తోంది నాకు. అక్కడి పాల్మాల్ రెస్టారెంట్ మీకు తెలుసు కదా. అందులోకి నేను చాలా సార్లు పోయేవాణ్ని. ఇక పికాడిలీ సర్కస్ దగ్గర దుకాణాలన్నీ వెలుగుతో నిండిపోయి, అక్కడ జనం తాలూకు రద్దీతో యెంతో కోలాహలంగా వుంటుంది. అక్కడ నిల్చుని ఒక క్షణం కూడా తెరిపి లేకుండా వచ్చే పోయే బస్సులనూ టాక్సీలనూ చూస్తుంటే ఆనందంతో దిమ్మ తిరిగిపోతుంది. భగవంతుని గురించీ, చేరింగ్ క్రాస్ గురించీ రాయబడిన ఆ పంక్తులు గుర్తున్నాయా మీకు?" అని అడిగాడు లాసన్. నాకు చెప్పరానంత ఆశ్చర్యం కలిగింది.

"థామ్సన్ రాసిన పంక్తులా?" అని అడిగాను. తర్వాత ఆ పంక్తుల్ని చదివాను ఇలా–

'అంతులేని విషాదం నిన్ను ఆవరించినపుడు

అప్పుడు –

స్వర్గానికీ చేరింగ్ క్రాస్కూ మధ్య వున్న జనాల జేకబ్ నిచ్చెన

ఆ ప్రజాసమూహం వెల్తురుతో తళతళా మెరుస్తుంది.'

లాసన్ చిన్నగా నిట్టూర్చాడు.

"ద హౌండ్ ఆఫ్ హెవెన్ చదివాను నేను. అది బాగుంది" అన్నాడు.

"సాధారణంగా అందరూ అట్లానే అంటారు" అని గొణిగాను.

"ఇక్కడ పుస్తకాలు చదివేవాళ్లెవరూ కనపడరు. చదవటం అనేది అట్టహాసం అనుకుంటారు వీళ్లు"

అతని ముఖంలో బెంగ నిండిన చూపు కనపడింది. నా దగ్గరికి రావాలని అతడెందుకనుకున్నాడో ఊహించాను. తాను కోల్పోయిన ప్రపంచాన్ని, మళ్లీ అనుభవించలేని జీవితాన్ని నాకూ తనకూ మధ్య లంకెగా భావించాడు. ఎందుకంటే అప్పటికి కొంత కాలం క్రితమే నేను లండన్లో ఉండి వచ్చాను. అందుకు గాను నాపట్ల సంభ్రమం నిండిన ఆశ్చర్యం, అసూయా కలిగాయి అతనికి. ఐదు నిమిషాల వరకు అతడు ఏమీ మాట్లాడలేదు. తర్వాత ఉద్రేకం నిండిన తీవ్రతతో "నేనిక్కడ విసిగిపోయాను, బాగా విసిగిపోయాను" అన్నాడు. ఆ మాటలకు నేను చలించిపోయాను.

"అయితే మరి నువ్వెందుకు ఇక్కణ్నుంచి వెళ్లిపోవు?" అని అడిగాను.

"నా ఊపిరితిత్తులకు చిన్న వ్యాధి వచ్చింది. ఇంగ్లండులోని చలికాలాన్ని నేనిప్పుడు తట్టుకోలేను"

ఆ సమయంలో మరొక వ్యక్తి ఆ వరండాలోకి రావడంతో లాసన్ మళ్లీ మౌనంలో కూరుకుపోయాడు.

"ఇది మందు తాగాల్సిన సమయం. ఎవరు నాతో కలిసి కొంచెం విస్కీ తాగుతారు? నువ్వేమంటావు లాసన్?" అన్నాడు అపుడే వచ్చిన వ్యక్తి. లాసన్ వేరే లోకంలోంచి బయటికి వచ్చినట్టనిపించాడు. అతడు కుర్చీలోంచి లేచి, "కింద వున్న బార్లోకి పోదాం పద" అన్నాడు. వాళ్లిద్దరూ వెళ్లిపోయారు.

లాసన్ పట్ల నాకు సానుభూతి భావం కలిగింది. అతడంటే ఆసక్తి, కలవరం ఏర్పడ్డాయి. కొన్ని రోజుల తర్వాత నేనతని భార్యను కలిశాను. వాళ్ల పెళ్లి జరిగి ఐదారేళ్లు కావస్తుందని తెలిసింది. కానీ, ఆమె యింకా చాలా చిన్న వయస్సున్న స్త్రీలాగా కనిపించడం నన్ను ఆశ్చర్యానికి గురి చేసింది. లాసన్ ఆమెను పెళ్లి చేసుకున్నపుడు ఆమె వయస్సు పదహారేళ్లకన్న ఎక్కువ లేదు. అప్పుడామె అద్భుతమైన అందంతో వెలిగిపోయేది. చామనచాయతో, చిన్నచిన్న చేతులతో, పాదాలతో, తీగలాంటి అతి సన్నని శరీరంతో చాలా ముద్దొచ్చేది. మిశ్రమ జాతికి చెందిన స్త్రీలు సాధారణంగా లావుగా మోటుగా వుంటారు. కాని, లాసన్ భార్యలోని కోమలత్వం నాకు ఆశ్చర్యాన్ని కలిగించింది. ఆ సౌకుమార్యాన్ని చూస్తుంటే ఊపిరి తీసుకోవడం మానేసి నోరు తెరుస్తాము. చాలా నాగరికంగా కనిపించే ఆమె అటువంటి ప్రాంతంలో ఉండటం ఆశ్చర్యకరమే. మూడవ నెపోలియన్ దర్బారులోని అందాల రాశులు గుర్తుకొస్తారు ఆమెను చూస్తే. ఫ్రాకు, హ్యాటు ధరించే ఆమెలో ఆధునికత స్పష్టంగా కనిపిస్తుంది. లాసన్ ఆమెను మొదటిసారిగా చూసినపుడు ఆమెలో కళ్లు మిరిమిట్లు గొలిపే అందం, మనోహరత్వం ఉండివుంటాయి.

లాసన్ ఈ మధ్యనే సమోవా ద్వీపంలోని ఒక బ్యాంకులో మేనేజరుగా పని చేయడానికి ఇంగ్లండు నుండి వచ్చాడు. అది వేసవి కాలపు ప్రారంభం. అతడు హోటల్లో ఒక గదిలో ఉంటున్నాడు. వచ్చిన కొత్తలో వెంటనే అక్కడి మనుషులందరితో పరిచయం చేసుకున్నాడు. ఆ ద్వీపపు వాతావరణం హాయిగా వుంటుంది. అక్కడి జీవితంలో నెమ్మదితనం ఉండటం ఒక విశేషం. ఆ హోటల్లోని లాంజ్‌లో తీరికగా, బద్ధకంగా సాగే పిచ్చాపాటీ అన్నా, సాయంత్రాల్లో కొందరు వ్యక్తులు ఇంగ్లిష్ క్లబ్‌లో ఆడే బిలియర్డ్స్ ఆటను చూడటమన్నా అతనికి యెంతో ఇష్టం. సముద్రతీరం వెంబడి పొడవుగా వ్యాపించి వున్న ఏపియా పట్టణాన్నీ, అక్కడి బంగళాలనూ, పక్కనే వున్న గ్రామ వాతావరణాన్నీ అతడు ఇష్టపడతాడు. వారాంతపు రోజుల్లో ఊరిబయట కొండల మీద రైతుల ఫామ్‌హౌజులకు పోయి, ఒకటిరెండు రాత్రులు అక్కడ గడిపి వస్తాడు లాసన్. ఇంగ్లండులో వున్నప్పుడు తీరిక, స్వేచ్ఛ అన్నవి తెలియవు అతనికి. సమోవా ద్వీపంలో పుష్కలంగా సోకే సూర్యరశ్మి అతణ్ని ముగ్ధుణ్ని చేసింది. ఊరిబయటి పొదల మధ్యలోంచి పోతున్నప్పుడు చుట్టుపక్కల వున్న ప్రకృతి అందాన్ని చూసి అతని తల ఆనంద పారవశ్యంతో ఊగుతుంది. ఆ ద్వీపంలోని భూమి వర్ణించలేనంత సారవంతమైంది. ఒకదానితో మరొకటి పెనవేసుకున్న రకరకాల వింతవింత చెట్లతో, నేల నిండా దట్టంగా పరచుకున్న చిన్నచిన్న మొక్కలతో తీగలతో అడవి స్వచ్ఛంగా, మనోహరంగా ఉంటుంది. అవన్నీ అగోచరత్వంతో కూడి, హృదయాన్ని కదిలించి ఇబ్బంది పెట్టే దృశ్యాలు.

కానీ, అతణ్ని బాగా మంత్రముగ్ధుణ్ని చేసిన ప్రదేశం ఏపియా పట్టణానికి రెండు మూడు మైళ్ల దూరంలో వున్న ఒక కొలను. స్నానం చేయటం కోసం అతడు తరచుగా సాయంత్రాల్లో అక్కడికి వెళ్తాడు. దాని పక్కనే వున్న రాళ్లగుట్టలో ఒక చిన్నసెలయేరు జన్మించి, గలగలల్తో వేగంగా పరుగెత్తుతుంది. తర్వాత లోతైన కొలనుగా మారి, చిన్న వంతెన కిందుగా ప్రవహించి, పెద్ద పెద్ద బండరాళ్లను సగం ముంచుతూ ముందుకు సాగిపోతుంది. స్థానిక ప్రజలు కొందరు అక్కడికి వచ్చి, తమ బట్టల్ని ఉతుక్కుంటారు. ప్రవాహానికి రెండు వైపులా గట్లమీద కొబ్బరిచెట్లు దట్టంగా పెరిగి, నిర్లక్ష్యంతో కూడిన మనోహరత్వాన్ని వెలయిస్తూ ఉంటాయి. వాటి ప్రతిబింబాలు కింది నీళ్లలో ప్రతిఫలిస్తాయి. ఇంగ్లండులోని డెవాన్‌షైర్లో వున్న రమణీయమైన ప్రకృతి దృశ్యాల్ని పోలి వుంటుంది అదంతా. ఆ కొలనులోని నీళ్లు తాజాగా, తేటగా వుంటాయి కాని, వాటిలో ఇబ్బంది పెట్టే చల్లదనం వుండదు. మధ్యాహ్నపు వేడిమి తర్వాత ఆ నీళ్లలో మునిగితే ఎంతో హాయిగా ఉంటుంది. అందులో స్నానం చేస్తే శరీరమే కాక ఆత్మ కూడా శుభ్రమైనట్టుగా వుంటుంది.

ఒకసారి లాసన్ ఆ కొలనుకు వెళ్లినప్పుడు అక్కడ ఒక్క పురుగైనా లేకుండా ఆ ప్రదేశంలో పూర్తి ఏకాంతం వుంది. అతడు చాలాసేపు నీళ్లమీద బద్ధకంగా తేలుతూ సమయాన్ని గడిపి, తర్వాత సాయంత్రపు ఎండలో తన ఒళ్ళును ఆరబెట్టుకున్నాడు. అక్కడి ఏకాంతాన్నీ, స్నేహపూర్వకమైన నిశ్శబ్దాన్నీ బాగా ఆనందించాడు. లండన్‌నూ, అక్కడి జీవితాన్నీ వదిలి వచ్చినందుకు అతనికెంత మాత్రం విచారం కలగలేదు. ఎందుకంటే ఏపియా పట్టణంలో తను గడుపుతున్న జీవితం కూడా అతనికి సంతృప్తికరంగా తోచింది. ఎతెల్‌ను లాసన్ మొదటిసారిగా చూసింది అక్కడే. మరునాడు పడవ ద్వారా పంపించ వలసిన ఉత్తరాల గురించి ఆలోచిస్తూ, ఒక సాయంత్రం వేళ అతడు గుర్రం మీద కొలను దగ్గరికి వెళ్లాడు. అప్పుడు సూర్యరశ్మి దాదాపు పూర్తిగా మాయమవుతోంది. గుర్రాన్ని ఒకచోట కట్టేసి, నదిఒడ్డు వైపు నడిచాడు. అక్కడ ఒక అమ్మాయి కూర్చుని వుంది. లాసన్ అక్కడికి నడిచివస్తుంటే చూసిన ఆమె, చప్పుడు చేయకుండా నీళ్లలోకి దిగింది. పురాణాల్లో మానవ మాత్రుల్ని చూసి ఉలిక్కిపడే జలకన్య లాగా ఆమె మాయమైంది. లాసన్‌కు ఆశ్చర్యం, వినోదం కలిగాయి. ఆమె ఎక్కడ దాక్కుందా అని అటూ యిటూ చూశాడు. ఏటవాలుగా కొంత దూరం ఈదుకుంటూ పోయి చూస్తే, అక్కడ బండరాళ్ల మీద కూచుని వున్న ఆమె కనిపించిందతనికి. ఎంత మాత్రం కుతూహలం లేని చూపుతో అతణ్ని చూసింది ఆమె. సమోవా భాషలో ఆమెను పలకరించాడు లాసన్.

ఆమె చిన్నగా నవ్వి, వెంటనే మళ్లీ నీళ్లలోకి దిగింది. ఆమె చాలా అవలీలగా ఈదుతుంటే వెంట్రుకలు నీళ్లమీద పరుచుకున్నాయి. ఆ అమ్మాయినే చూస్తూ గట్టు మీదికి చేరుకున్నాడు లాసన్. అందరు స్థానికుల్లాగానే ఆమె కూడా ఒక స్విమ్మింగ్ డ్రెస్ తొడుక్కుని వుంది. నీళ్ళమూలంగా అది శరీరానికి అతుక్కుపోయింది. తన వెంట్రుకల్ని పిండుకుని, ఏమీ పట్టనట్టుగా బండల దగ్గర మొలలోతు నీళ్లలో నిలబడింది. అప్పుడామె మానవమాత్రురాలి లాగా కాక, ఒక జలకన్య లాగా, వనదేవతలాగా కనిపించింది. ఆమె మిశ్రమజాతికి చెందిన స్త్రీ అని గమనించాడు లాసన్. తర్వాత ఈదుకుంటూ అటువైపు దగ్గరగా పోయి "చాలా పొద్దుపోయాక ఈదటానికి వచ్చారు మీరు" అన్నాడు ఆంగ్లంలో. తన వెంట్రుకల్ని వెనక్కి తోసుకుని, వాటిని భుజాలమీద కప్పుకుని, "ఏకాంతంలో యీదటమే ఇష్టం నాకు" అన్నదామె.

"నాకూ అంతే" అన్నాడు లాసన్.

ఆమె చిన్నపిల్లల కలుపుగోలుతనంతో స్థానిక యువతి లాగా నవ్వింది. వెంట్రుకలు తడవకుండా తలమీద పెట్టుకున్న ప్లాస్టిక్ కవరును తీసి, దానిస్థానంలో మరొక పొడి కవర్ను పెట్టుకుంది. నీళ్లలోంచి బయటికి వచ్చి, ఆ తడిసిన కవర్ను పిండి, అక్కణ్నుంచి

వెళ్లిపోవటానికి సిద్ధమైంది. తర్వాత కొంతసేపు తటపటాయించి, నడుచుకుంటూ వెళ్లిపోయింది. అకస్మాత్తుగా చీకటి పడింది.

లాసన్ హోటలుకు పోయి, అక్కడ మద్యం తాగుతూ పాచికలు ఆడుతున్న వ్యక్తులకు ఆమె గురించి చెప్పాడు. వెంటనే ఆమెకు సంబంధించిన సమాచారమంతా తెలిసిపోయిందతనికి. మెట్రోపోల్ హోటలుకు తరుచుగా వచ్చి అక్కడ రమ్ తాగే బ్రెవాల్డ్ అనే వృద్ధుడు ఆమె తండ్రి అట. అతడు పుట్టుక పరంగా నార్వే దేశానికి చెందినవాడు. ముడుతలు పడ్డ అతి పురాతనమైన చెట్టు లాగా ఉంటుంది అతనిరూపం. నలభయ్యేళ్ల క్రితం ఒక ఓడలో ఆ ద్వీపానికి వచ్చాడట. కొంతకాలం కమ్మరిగా పని చేసి, తర్వాత వ్యాపారస్థునిగా, వ్యవసాయదారునిగా, ఇట్లా రకరకాల వృత్తులు చేసిన అతడు ఒకప్పుడు ధనవంతుడే. కాని, అప్పట్లో వచ్చిన తుపాను మూలంగా ఆర్థికంగా చితికిపోయాడు. ఆఖరుకు అతనికి మిగిలింది ఒక చిన్న కొబ్బరితోట మాత్రమే. అతనికి నలుగురు భార్యలుండేవాళ్లు. తనకు పుట్టిన పిల్లల సంఖ్య తెలియదని చిట్లిన గొంతుతో నవ్వుతూ చెప్తాడు.

వాళ్లలో కొందరు చనిపోగా మరి కొందరు వివిధ ప్రాంతాల్లో ఉంటున్నారు. ఎతెల్ ఒక్కతే మిగిలింది.

"ఆమె బలే రంజుగా వుంటుంది. ఒకటిరెండు సార్లు ఆమెతో చూపులు కలిపాను కాని అంతకన్న యెక్కువగా ఏమీ జరగలేదు" అన్నాడు నెల్సన్. అతడు మోనా అనే ఓడను నడుపుతాడు.

మిల్లర్ అనే మరొకతను "బ్రెవాల్డ్ తెలివి మాలిన మూర్ఖుడు కాడు నాయనా. తనను జీవితాంతం కనిపెట్టుకుని వుండే పురుషుడినే అల్లునిగా చేసుకోవాలని అతని కోరిక" అన్నాడు. ఆ అమ్మాయి గురించి వాళ్లు అట్లా మాట్లాడటం లాసన్‌కు నచ్చలేదు. మరునాడు పడవ ద్వారా పంపాల్సిన ఉత్తరాలకు సంబంధించిన పని వుందంటూ వాళ్ళ సంభాషణను మధ్యలోనే తుంచేశాడు. మరుసటి రోజు సాయంత్రం వేళ లాసన్ మళ్లీ ఆ కొలను దగ్గరికి వెళ్లాడు. అక్కడ ఎతెల్ వుంది. మునిమాపు లోని మార్మికత, నిశ్చలమైన నీళ్లశబ్దం, సన్నగా ఊగే కొబ్బరిచెట్ల సోయగం – ఇవన్నీ ఎతెల్ సౌందర్యానికి అదనంగా కలిసి, ఒక మంత్రముగ్ధతతో అతని హృదయంలోని అజ్ఞాత భావోద్వేగాన్ని కదిలించాయి. ఎందుకో గాని అప్పుడు ఆమెతో మాట్లాడవద్దని అనిపించింది లాసన్‌కు. ఆమె కూడా అతని ఉనికిని పట్టించుకోలేదు. అతని వైపు దృష్టిని కూడా సారించలేదు. అక్కడక్కడే యీదింది. కొన్నిసార్లు నీళ్లల్లోకి డైవ్ చేసి, కొంత సేపు గట్టు మీది విశ్రాంతి తీసుకుని తాను ఏకాంతంలో ఉన్నట్టుగా ప్రవర్తించింది. ఆమె తనను చూడకపోవటం అతనికి చిత్రంగా తోచింది.

సగం జ్ఞాపకమున్న కవితా పంక్తులూ, స్కూలు జీవితపు రోజుల్లో నిర్లక్ష్యంగా చదివిన గ్రీస్ దేశపు అందాలూ అతనికి జ్ఞాపకం రాసాగాయి. తడిసిన గుడ్డల్ని తీసి పొడి గుడ్డల్ని తొడుక్కుని తర్వాత ఆమె కొంత దూరం నడిచింది. ఆమె ఆగిన దగ్గర ఒక మందారచెట్టు ఉన్నట్టు గ్రహించాడు లాసన్. నీళ్లల్లోకి దిగక ముందు ఒక పువ్వును తన వెంట్రుకల్లో ధరించింది ఎతెల్. నీళ్లలోకి దిగుతూ ఆ పువ్వును తీసిపారేసిన ఆమె, స్నానం ముగించాక ఆ పువ్వును మళ్లీ పెట్టుకోవడం మరిచిపోయిందో లేక వద్దనుకుందో తెలియదు. లాసన్ ఒక ప్రత్యేకమైన ఉద్వేగంతో ఆ పువ్వును చూశాడు. దాన్ని తన దగ్గరే ఉంచుకోవాలనిపించిందతనికి. కాని తన సెంటిమెంటల్ తత్వానికి తనే విసుక్కుంటూ దాన్ని నీళ్లల్లోకి విసిరేశాడు. ఆ పువ్వు నీళ్లమీద తేలుతూ కొట్టుకుపోతుంటే ఆ దృశ్యాన్ని చూసిన లాసన్‌కు హృదయంలో ఒక చిన్న పరవశత్వపు తీపు అనుభవంలోకి వచ్చింది.

ఎవ్వరూ లేని ఏకాంతంలో యీదాలని ఆమెకు అనిపించడం ఎంత విచిత్రం అని అబ్బురపడ్డాడు లాసన్. అక్కడి స్థానిక ప్రజలు నీళ్లను దేవునిగా కొలుస్తారు. వాళ్లు నీళ్లున్న ఎక్కడో ఒకచోట రోజుకు కనీసం ఒకసారి, అప్పుడప్పుడు రెండు సార్లు స్నానం చేస్తారు. కాని, వాళ్లంతా గుంపులు గుంపులుగా స్నానానికి వెళ్తారు. కుటుంబమంతా కలిసి, అమ్మాయిలంతా గుంపుగా పోయి నవ్వుతూ తుళ్లుతూ స్నానం చేస్తారు. చెట్ల సందుల్లోంచి సూర్యుని వెల్తురు వాళ్ల శరీరాలమీద చిన్నచిన్న వలయాలుగా పడుతుంటే, ఆ నదిలోని నీళ్లను చేతుల్తో ఇతరుల మీదికి కొడుతూ ఆనందిస్తారు. దానికి విరుద్ధంగా ఎతెల్ తన స్నానం కోసం ఒంటరిగా కొలను దగ్గరికి వస్తున్నదంటే అందులో యేదో రహస్య మాంత్రిక శక్తి వుండి వుండాలి అనుకున్నాడు లాసన్.

పూర్తిగా చీకటి పడింది. అతడు మెల్లగా నీటిలో మునిగాడు చప్పుడు రావద్దనే ఉద్దేశంతో బద్ధకంగా మెత్తగా ఆ వెచ్చని చీకటి వేళలో యీదాడు. ఎతెల్ శరీరస్పర్శతో ఆ నీళ్లకు సుగంధం అంటిందనిపించిందతనికి. చుక్కలు పొదిగిన ఆకాశం కిందుగా అతడు ఏపియా పట్టణంలోకి వెళ్లిపోయాడు. అప్పుడు ప్రపంచం పట్ల అతని మనసులో ఎటువంటి అసంతృప్తీ చోటు చేసుకోలేదు. అప్పట్నుంచి లాసన్ ప్రతి సాయంత్రం ఆ కొలను దగ్గరికి వెళ్లి ఎతెల్‌ను చూడసాగాడు. ఆమెపట్ల అతనికున్న బెరుకు కొన్నాళ్ల తర్వాత మాయమైంది. ఆమె కూడా స్నేహంగా, సఖ్యతగా ఉండసాగింది. నీళ్లు వేగంగా పారే చోట ఉన్న బండలమీద, అక్కణ్నుంచి కనపడే వంతెన మీద వాళ్లిద్దరు పక్కపక్కన కూర్చుని మార్మికతను నింపుకున్న సూర్యాస్తమయాన్ని చూశారు. వాళ్లిద్దరు ఒకరినొకరు కలుసుకోవటం అందరికీ తెలియక తప్పలేదు. ఎందుకంటే ఆ ద్వీపంలో అందరి వ్యక్తిగత విషయాలు అందరికీ తెలుస్తాయి. లాసన్ తాను వుంటున్న హోటల్లోని వ్యక్తులచేత చాలా

వ్యంగ్యపూరితమైన పరాచికాన్ని ఎదుర్కోవాల్సి వచ్చింది. వాళ్లు ఏమన్నా అతడు చిన్నగా నవ్వి ఊరుకున్నాడు. వాళ్ల సూటిపోటి మాటల్ని, మోటు సరసాల్ని తిప్పి కొట్టాలనిపించ లేదతనికి. అతని మనసులోని భావాలు చాలా స్వచ్ఛంగా ఉన్నాయి. చంద్రుణ్ని ఒక కవి ఎట్లా ఆరాధిస్తాడో ఎతెల్‌ను అతడు అట్లా ప్రేమించాడు. ఆమెను ఒక మామూలు స్త్రీగా కాక, ఈ ప్రపంచానికి చెందని పరలోక దివ్య సుందరిగా భావించాడు. అతని దృష్టిలో ఆమె ఆ కొలను తాలూకు చైతన్యం.

లాసన్ ఒకరోజు హోటల్లోని బార్‌లోంచి పోతూ ముసలి బ్రెవాల్డ్‌ను చూశాడు. ఆ వృద్ధుడు యెప్పటిలాగే మాసిపోయిన దుస్తుల్లో అక్కడ నిలబడి వున్నాడు. అతడు ఎతెల్‌కు తండ్రి కనుక లాసన్ అతనితో మాట్లాడాలనుకున్నాడు. అతని దగ్గరికి పోయి తలవూపి, మద్యానికి ఆర్డరిచ్చాడు. తర్వాత యథాలాపంగా అన్నట్టుగా అతనివైపు తిరిగి, తనతో కలిసి డ్రింకు తాగవలసిందిగా ఆహ్వానించాడు. కొన్ని నిమిషాల పాటు వాళ్లు స్థానిక విషయాలను చర్చించారు. బ్రెవాల్డ్ తనను మరీ పరిశీలనగా చూస్తుంటే లాసన్ ఇబ్బందికి గురయ్యాడు. అతడు మాట్లాడిన తీరు లాసన్‌కు నచ్చలేదు. అందులో అనవసర ప్రశంస ఉన్నప్పటికీ విధితో పోరాడి చితికిపోయిన ఆ వృద్ధుని నంగిమాటల వెనకాల ఒక వైరుధ్యభావం దాగి వుంది. బ్రెవాల్డ్ ఒకప్పుడు బానిసలను తరలించే వ్యాపారంలో ఓడలోని క్యాప్టెన్‌గా పనిచేశాడనీ, సాల్మన్ ద్వీపవాసులతో జరిగిన పోరాటంలో తగిలిన గాయం కారణంగా అతని ఛాతీలో ఒక పెద్ద హెర్నియా ఏర్పడిందనీ గుర్తుకు తెచ్చుకున్నాడు లాసన్. అంతలోనే లంచ్ కోసం గంట మోగింది.

"ఇక నేను వెళ్ళాలి" అన్నాడు లాసన్.

"ఒకసారి మా యింటికి రావాలి మీరు. నా యిల్లు అంత గొప్పగా యేం ఉండదు. అయినా మీకు ఇదే నా స్వాగతం. ఎతెల్ మీకు తెలుసు కదా" అన్నాడు బ్రెవాల్డ్.

"సంతోషంగా వస్తాను"

"ఆదివారం మధ్యాహ్నమైతే బాగుంటుందేమో"

ఆ వృద్ధుని బంగళా వైలిమాకు పోయే రోడ్డునుండి కొంచెం లోపలికి, కొబ్బరితోటల మధ్య మట్టికొట్టుకుని పోయి, మాసిపోయి వుంది. ఆ యింటి చుట్టూ చెట్లు దట్టంగా పెరిగి వున్నాయి. చిరిగిపోయిన ఆకులతో ఆ చెట్లు చింపిరి గుడ్డల్లో ఉన్న అందమైన స్త్రీ తాలూకు విషాదాన్ని తలపింపజేస్తున్నాయి. ప్రతిదీ అపరిశుభ్రంగా, పట్టించుకోకుండా వదిలిపెట్టినట్టుగా వుంది. చిన్నచిన్న నల్లని పందులు మట్టిని పెళ్లగిస్తున్నాయి. చెత్తా చెదారాన్ని కెలుకుతున్న కోడిపిల్లలు చప్పుడు చేస్తూ తిరుగుతున్నాయి. ముగ్గురు నలుగురు స్థానిక వ్యక్తులు వరండాలో విశ్రాంతి తీసుకుంటున్నారు.

బ్రెవాల్డ్ గురించి అడగ్గానే ఆ ముసలాయన ఇంటి లోపల్నుంచే బొంగురు గొంతుతో సమాధానమిచ్చాడు. సిటింగ్ రూమ్‌లోకి పోయిన లాసన్‌కు అక్కడ బ్రెవాల్డ్ కూచుని చుట్ట తాగుతుండటం కనిపించింది.

"కూర్చోండి. ఎతెల్ మేకప్ చేసుకుంటోంది" అన్నాడు బ్రెవాల్డ్.

అంతలోనే ఎతెల్ ఆ గదిలోకి వచ్చింది. ఆమె బ్లౌజూ స్కర్టూ తొడుక్కుని వుంది. తల వెంట్రుకల్ని యూరోపియన్ తరహాలో దువ్వుకుంది. కొలను దగ్గర కనిపించిన వనదేవత లాగా కాక కొంచెం సాదాసీదాగా ఉండటంవల్ల, ఆమెను చూసినవాళ్లకు ఇప్పుడు బెరుకు అనిపించదు. లాసన్‌తో చేయి కలిపింది ఎతెల్. అతనికి అది ఆమెను తాకిన మొదటి సందర్భం.

"మీరు మాతో కలిసి టీ తాగుతారని ఆశిస్తున్నాను." అన్నదామె. ఆమె మిషనరీ స్కూల్లో చదివిందని లాసన్‌కు తెలుసు. కాబట్టి ఆమె తనకోసం మర్యాదగా ప్రవర్తిస్తున్నందుకు పొంగిపోయాడు. టేబులుమీద టీ కప్పులూ సాసర్లూ పెట్టి వున్నాయి. అంతలోనే బ్రెవాల్డ్ నాలుగో భార్య ఒక పెద్ద టీ పాత్రను తీసుకొచ్చింది. ఆమె స్థానిక జాతికి చెందిన అందమైన స్త్రీ. నడి వయసులో ఉంది. కొంచెం కొంచెం ఆంగ్లభాషను మాట్లాడింది. పడీపడీ నవ్వింది. పుష్కలమైన బ్రెడ్డూ, వెన్నా, రకరకాల కేకులూ ఇచ్చారు వాళ్లు. సంభాషణ మామూలుగా సాగింది. అంతలోనే ఒక ముసలావిడ ఆ గదిలోకి వచ్చింది. ఆమె చర్మం ముడతలు పడి వుంది.

"ఈమె ఎతెల్‌కు నాయనమ్మ" అని కాండ్రించి తుపుక్కున నేలమీద ఉమ్మివేశాడు బ్రెవాల్డ్. ఆమె ఒక కుర్చీ అంచు మీద ఇబ్బందిగా కూచుంది. నేలమీద కూచోవటమే ఆమెకు సౌకర్యంగా వుంటుందని లాసన్‌కు తెలిసిపోయింది. వంటగది వెనకాల ఒకతను పాశ్చాత్య సంగీత వాద్యాన్ని వాయిస్తుంటే ఇద్దరు ముగ్గురు మనుషులు ప్రార్థనా గీతాన్ని పాడుతున్నారు. కాని వాళ్లు భక్తిభావంతో కాక, కేవలం స్వరాలకోసమే పాడుతున్నారు.

లాసన్ తన హోటలుకు తిరిగి వెళ్లాక అతని మనసులో విచిత్రమైన సంతోషం కదలాడింది. వాళ్ల అస్తవ్యస్తమైన జీవన విధానం అతడిని కదిలించింది. బ్రెవాల్డ్ తన జీవితంలో సాధించిన విజయాలు, అతని భార్య నవ్వులోని మంచి స్వభావం, ముసలావిడ కళ్లలోని మార్మికత ఇవన్నీ అతనికి అసాధారణమైన విషయాలుగా, సమ్మోహనకరంగా తోచాయి. వాళ్లది చాలా సహజమైన జీవితం అనీ, అది స్నేహం నిండిన సారవంతమైన భూమిని తలపిస్తోందనీ సంతోషించాడతడు. ఆ క్షణంలో అతనికి నాగరికత పట్ల విముఖత కలిగింది. అనాదితత్వం గల ఆ మనుషులతో కేవలం కొంతసేపు గడిపినందుకే అతడు యెంతో స్వేచ్ఛను అనుభవించాడు.

తనకు విసుగు తెప్పించిన ఆ హోటలును వదిలినట్టూ, సముద్ర తీరానికెదురుగా వున్న రోడ్డు పక్కన ఒక చిన్న తెల్లని అందమైన యింట్లో భార్యతో ఉంటున్నట్టూ ఊహించుకున్నాడు. ఆ సముద్రపు నీళ్లలోని రంగు వైవిధ్యం అతనికెంతగానో నచ్చుతుంది. ఆ ద్వీపాన్ని అతడు చాలా ప్రేమించాడు. లండన్ పట్లా, ఇంగ్లండ్ పట్లా బాంధవ్యం తగ్గినట్టనిపించింది. తన శేషజీవితాన్ని ఆ మారుమూల ప్రాంతంలో హాయిగా గడపటం తృప్తినిస్తుందనుకున్నాడు. ఎన్ని అడ్డంకులొచ్చినా ఎతెల్‌ను వివాహం చేసుకోవాలనుకున్నాడు.

కాని, ఏ అడ్డంకులూ రాలేదు. బ్రెవాల్డ్ యింటికి ఎప్పుడు పోయినా లాసన్‌కు స్వాగతం దొరికింది. ఆ వృద్ధుడు ఎప్పుడూ వినయంగా, మర్యాదగా మాట్లాడాడు. అతని భార్య ఆగకుండా నవ్వింది. ఆ యింట్లో ఆ జాతికి చెందిన కొందరు మనుషులు ఉండటం గమనించాడు లాసన్. ఒకసారి ఒక ఎత్తయిన యువకుడు కనిపించాడు. లావాలావా అనే డ్రెస్సును తొడుక్కున్నాడతడు. అతని శరీరం మీద పచ్చబొట్లున్నాయి. వెంట్రుకల మీద తెల్లని సున్నంపొడి ఉండటంతో అవి తెల్లగా వున్నాయి. అతడు బ్రెవాల్డ్ పక్కన కూచుని ఉండటం లాసన్ గమనించాడు. ఆ యువకుడు బ్రెవాల్డ్ అన్న కొడుకని లాసన్‌కు చెప్పారు వాళ్లు. కాని ఆ మనుషులు చాలావరకు లాసన్‌కు కనిపించకుండా ఉండటానికే ప్రయత్నించారు. లాసన్‌తో ఎతెల్ ఆహ్లాదంగా వుంది. తనను చూసినప్పుడు ఆమె కళ్లలో కనిపించిన మెరుపు అతనికి పారవశ్యాన్ని కలిగించింది. ఆమె చాలా ఆకర్షణీయంగా, అమాయకంగా ఉందనుకున్నాడు. తనూ తన అక్కచెల్లెళ్లూ చదివిన మిషనరీ స్కూలు గురించి ఎతెల్ చెప్పినప్పుడు అతడు మంత్రముగ్ధుడై విన్నాడు. అతడు ఎతెల్‌తో కలిసి ప్రతి పదిహేను రోజులకొకసారి ఆ వూళ్లో ఆడే సినిమాకు వెళ్లి, దాని తర్వాత జరిగే డాన్సు కార్యక్రమంలో ఎతెల్‌తో పాటు నృత్యం చేశాడు. ఆ ఉత్సవానికి ద్వీపంలోని అన్ని ప్రాంతాలనుంచి ప్రజలు వస్తారు. స్థానిక జనం పాశ్చాత్య దేశాల దుస్తుల్ని, బూట్లను తొడుక్కుని వస్తారు. అక్కడంతా హాయిగా, ఆహ్లాదకరంగా ఉంటుంది. తనను వదలకుండా ఎప్పుడూ వెంట తిరిగే తెల్లజాతీయుడైన లాసన్‌ను ఎతెల్ తన స్నేహితురాళ్లకు పరిచయం చేస్తూ ఎంతో ఆనందించింది. లాసన్ త్వరలోనే ఎతెల్‌ను పెళ్లి చేసుకుంటాడనే వార్త అంతటా పాకింది. ఎతెల్ పట్ల ఆమె స్నేహితురాళ్లు అసూయను చూపారు. ఎందుకంటే ఒక స్థానిక సంకరజాతి స్త్రీ తెల్ల జాతీయుణ్ని పెళ్ళాడటం వాళ్ళకు గొప్ప విషయం. పెళ్లి చేసుకోకున్నా అతనితో కలిసి తిరగటమన్నది ఏమీ లేనిదాని కంటే నయమే అనుకున్నారు వాళ్లు. కాని అట్లా చేస్తే ఎటువంటి పర్యవసానం ఏర్పడుతుందోననే భయం కూడా ఉంది వాళ్లకు. లాసన్ చేస్తున్న ఉద్యోగం బ్యాంకు మేనేజరు కావటం వల్ల, పెళ్లి చేసుకోవటానికి అతణ్ని మంచి అర్హత ఉన్న వ్యక్తిగా ఎంచారు వాళ్లు. ఎతెల్‌ను

తాను పెళ్లి చేసుకోవాలనుకోకపోతే ఎందరో ఇతర యువతులు తన పట్ల ఆసక్తిని చూపేవారని లాసన్‌కు తప్పక తెలిసేది. అప్పుడు తెల్ల జాతీయులైన స్త్రీలు గుమిగూడి తన గురించి ఎంతగా మాట్లాడుకునే వారో తెలిసేది అతనికి. తర్వాత ఒకరోజు హోటల్లో కొందరు విస్కీ తాగుతుంటే "లాసన్ ఆ అమ్మాయిని పెళ్లి చేసుకోబోతున్నాడట" అన్నాడు నెల్సన్.

"అయితే అతడొక అవివేకి" అన్నాడు మిల్లర్

మిల్లర్ నిజానికి జర్మన్ తండ్రికీ అమెరికన్ తల్లికీ పుట్టినవాడు. ముల్లర్ అనే తన చిన్నప్పటి పేరును మిల్లర్‌గా మార్చుకున్నాడు. అతడు పెద్ద శరీరంతో లావుగా వుంటాడు. బట్టతలా, నున్నగా షేవింగ్ చేసుకున్న గెడ్డమూ వుంటాయతనికి. పెద్ద గోల్డ్ రిమ్డ్ కళ్లద్దాలు పెట్టుకుంటాడు. అవి అతడిని కొంచెం సాత్వికుడుగా కనిపింపజేస్తాయి. అతడు తొడుక్కనే ప్యాంట్లు ఎప్పుడూ తెల్లగా, శుభ్రంగా వుంటాయి. మిల్లర్ విపరీతంగా మద్యం తాగుతాడు. ఇతరులతో కలిసి రాత్రంతా తాగటానికి అతడు యెప్పుడూ సిద్ధమే. కాని ఎంతగా తాగినా ఎప్పుడూ ఔటవడు. అతడు ఉల్లాసంగా స్నేహంగా ఉంటాడు. కానీ, చాలా తెలివైనవాడు. అతని వ్యాపారాన్ని ఏదీ అడ్డుకోజాలదు. సాన్ ఫ్రాన్సిస్కోలోని ఒక కంపెనీ తరపున స్టాక్ బ్రోకర్‌గా వుంటూ ఆ ద్వీపంలో గుడ్డలు, యంత్రాలు మొదలైన ఎన్నో వస్తువుల్ని అమ్మే వ్యాపారం చేస్తాడు. ఆ వ్యాపారంలో ఉండటం వల్లనే అతడొక కలుపుగోలు మనిషి అయ్యాడు.

"తానేం చేస్తున్నాడో లాసన్‌కు తెలియటం లేదు. ఎవరైనా అతనికి నచ్చజెప్పి, సరైన మార్గంలో పెట్టాలి" అన్నాడు నెల్సన్.

"నీది కాని వ్యవహారంలో తల దూర్చవద్దని నా సలహా. ఒక వ్యక్తి మూర్ఖమైన గట్టి నిర్ణయం తీసుకున్నాక అతడిని యెవరూ ఆపలేరు అమ్మాయిలతో సరదాగా తిరగటం నాకూ యిష్టమే. కాని పెళ్లి చేసుకోవడం మంచి విషయం కాదు. లాసన్ తీసుకున్న నిర్ణయం సరైనది కాదు. ఈ మాటను లోకానికంతటికీ బాహాటంగా చెప్పగలను నేను" అన్నాడు మిల్లర్.

అంతలోనే చాప్లిన్ వచ్చి "చాలా మంది ఆ విధంగా చేయడం చూశాను నేను. అదేమంత మంచిది కాదు" అన్నాడు.

"చాప్లిన్, నువ్వు లాసన్‌తో మాట్లాడాలి. మా అందరి కన్నా నీకే అతడు ఎక్కువ తెలుసు" అన్నాడు నెల్సన్.

ఆ విషయాన్ని వదిలేయాలని చాప్లిన్‌కు నా సలహా" అన్నాడు మిల్లర్.

లాసన్ ఎవరో ఆ రోజుల్లో ఆ ద్వీపంలోని ఎక్కువ మందికి తెలియదు కాబట్టి, యెవరూ అతని గురించి పట్టించుకోలేదు. చాప్లిన్ భార్య ఆ విషయం గురించి ఇద్దరు ముగ్గురు పాశ్చాత్య స్త్రీలతో ఫోన్ మీద మాట్లాడింది. వాళ్లు పాపం అని జాలి చూపారే తప్ప ఇంకేమీ చేయలేదు. ఎతెల్, లాసన్‌ల పెళ్లి జరగటం ఖాయం అని చాప్లిన్ తన భార్యతో చెప్పేసరికి అప్పటికే చాలా ఆలస్యమై, ఏమీ చేయలేని  పరిస్థితి ఏర్పడింది.

పెళ్లయ్యాక ఒక సంవత్సరం దాకా లాసన్ ఆనందంగా వున్నాడు. ఏపియా పట్టణ శివారులో సముద్రతీరానికి ఆనుకుని వున్న ఒక గ్రామంలో బంగళా తీసుకున్నాడతడు. అది కొబ్బరి చెట్ల మధ్య ఆహ్లాదకరంగా నక్కి వుంది. దానికెదురుగా నీలంరంగు నీళ్లతో పసిఫిక్ మహా సముద్రం. ఆ చిన్న యింట్లోకి వెళ్లిన ఎతెల్ చాలా ఆనందాన్ని అనుభవించింది. వాళ్లిద్దరూ రోజూ హాయిగా నవ్వుకున్నారు. లోకాభిరామాయణం మాట్లాడుకున్నారు. అప్పుడప్పుడు హోటల్లోని ఒకరిద్దరు మిత్రులు ఆ యింటికి వస్తారు. ఆదివారాల్లో తరచుగా లాసన్ ఎతెల్ కలిసి ఊరవతల ఉన్న స్నేహితుల ఫామ్ హౌస్‌కు వెళ్లి, ఒక రోజు గడిపి వస్తారు. ఆ స్నేహితులు స్థానిక యువతులను పెళ్లిచేసుకున్న వాళ్లే అయి వుంటారు. మధ్యమధ్య, ఏపియాలో దుకాణాన్ని కలిగిన మిత్రులు – ఎతెల్ జాతికి చెందినవాళ్లు – యిచ్చే విందుకు ఇద్దరూ కలిసి వెళ్తారు. ఆ మిశ్రమ జాతీయులు లాసన్‌తో మునుపటికన్న పూర్తి భిన్నంగా వ్యవహరించసాగారు. ఎతెల్‌ను పెళ్లి చేసుకున్నందుకు అతడిని తమలో ఒకడిగా భావించడమే కాక, బెట్టీ అనే పేరును యిచ్చారతనికి. అతని చంకల్లోంచి చేతుల్ని దూర్చి వీపు మీద చేతితో చిన్నగా కొట్టడం మొదలు పెట్టారు. అటువంటి విందుల్లో ఎతెల్ వుండాలని లాసన్ కోరిక. ఎందుకంటే ఆ సందర్భాల్లో ఆమె కళ్లు మెరుస్తాయి. ఆమె హాయిగా నవ్వుతుంది. ఆమె అట్లా ఆహ్లాదంగా ఉండటం లాసన్‌కు చాలా తృప్తిని కలిగిస్తుంది. అప్పుడప్పుడు ముసలి బ్రెవాల్డ్, అతని తల్లి, అతని అన్న కొడుకు మొదలైన ఎతెల్ తరఫువాళ్లు లావాలావాలు తొడుక్కుని, ఎర్రరంగు వేసుకున్న వెంట్రుకల్తో ఒళ్లంతా పొడిపించుకున్న పచ్చబొట్లతో వస్తారు. అతడు బ్యాంకు నుండి తిరిగొచ్చే వరకు కూడా వాళ్లు తన యింట్లోనే సమయాన్ని గడుపుతారు. అతడు సహనంతో నవ్వుతాడు.

“వాళ్లకు ఎక్కువగా భోజనాలుపెట్టకు” అన్నాడొకసారి లాసన్.

“వాళ్లు నా వాళ్లు. వాళ్లు అడిగినప్పుడు నేను తిండి పెట్టకుండా వుండలేను” అన్నది ఎతెల్.

ఒక తెల్ల జాతీయుడు స్థానిక జాతికి చెందిన యువతిని పెళ్లి చేసుకుంటే ఆమె బంధువులు అతని డబ్బును బాగా ఆశిస్తారని లాసన్‌కు తెలుసు. అతడు ఎతెల్ ముఖాన్ని

చేతుల్లోకి తీసుకుని ఎర్రగా వున్న ఆమె పెదవుల్ని ముద్దుపెట్టుకున్నాడు. తనకు పెళ్ళి కాకముందు బొటాబొటిగా కన్న కొంచెం యెక్కువగా వచ్చిన జీతంతో ఇప్పుడు భార్యాభర్తలిద్దరికీ ఇంకా ఇల్లు నడపడానికీ సరిపెట్టుకోవాలనే సంగతి పాపం ఎతెల్‌కు తెలియదు అని అనుకున్నాడేమో. తర్వాత కొన్నాళ్లకు ఎతెల్ ఒక కొడుకును కన్నది.

మొదటిసారిగా బాబును తన చేతుల్లోకి తీసుకున్నప్పుడు లాసన్ హృదయంలో అకస్మాత్తుగా ఒక బాధాకరమైన తీపు కదలాడింది. బాబు మరీ అంత నల్లగా పుడతాడనుకోలేదతడు. ఆ బాబులో కొంత మాత్రమే స్థానిక జాతి రక్తం వుంటుంది కనుక, పిల్లవాడు ఇంగ్లిష్ వాళ్ల లాగా పుట్టే అవకాశం కూడా ఉంటుంది కదా అనుకున్నాడు. కానీ, తన చేతుల్లో ఒదిగివున్న ఆ శిశువు నల్లని తలవెంట్రుకల్తో, నల్లని పెద్ద కళ్లతో కనిపించడం వల్ల అతడు స్థానిక జాతికి చెందిన పిల్లవాడే అనిపించాడు. తన పెళ్లి తర్వాత ఆ వూళ్లోని తెల్లజాతి స్త్రీలు తనతో ముభావంగా వున్నారు. తన మిత్రులైన తెల్లజాతి పురుషుల్ని కలిసినప్పుడు వాళ్లు తమ తత్తరపాటును కప్పిపుచ్చుకోవటం కోసం మరీ సహృదయతతో మెలగసాగారు.

“మిసెస్ లాసన్ బాగుందా? నువ్వు చాలా అదృష్టవంతుడివి. ఎతెల్ చాలా అందంగా వుంటుంది” అనేవారు వాళ్లు.

కాని, వాళ్లు తమ భార్యలతో తన యింటికి వచ్చినప్పుడు ఆ స్త్రీలు ఎతెల్‌ను ఆరాధనగా చూసి ఎబ్బెట్టుగా ఫీలయ్యేవాళ్లు. అప్పుడు లాసన్ నవ్వేవాడు.

“వాళ్ళందరూ మురుగునీళ్ల వంటి వారు. రోత పుట్టించే తమ విందులకు నన్ను పిలవకపోతే నేనేం పెద్దగా బాధపడిపోను” అనేవాడు లాసన్.

కాని ఇప్పుడతనికి కొంచెం చిరాకు కలుగుతోంది. తన కొడుకు కళ్లు చికిలించి చూసినపుడు, ‘వీడు నా కొడుకు’ అనుకున్నాడు లాసన్. ఏపియా పట్టణంలో వున్న సంకరజాతి పిల్లల్ని తల్చుకున్నాడు లాసన్. వాళ్లందరూ పాలిపోయిన ముఖాలతో జబ్బుపడ్డ మనుషుల్లాగా వుంటారు. చిన్నతనంలోనే వయసు ముదిరిన లక్షణాలు కనిపిస్తాయి వాళ్ల ముఖాల్లో. ఒకసారి అటువంటి పిల్లలంతా న్యూజీలాండ్‌కు వెళ్లే పడవ యెక్కి బడికి పోతుంటే చూశాడతను. వాళ్లు ఒకరిమీద ఒకరు పడిపోతూ సిగ్గుమాలిన వారిలాగా కనిపించారు. కానీ మళ్లీ భయస్తుల్లాగా కూడా ఉన్నారు. వాళ్లలోని లక్షణాలు తెల్లజాతి వాళ్ల లక్షణాలకు పూర్తిగా భిన్నంగా వున్నాయి. తమ మాతృభాషలోనే మాట్లాడుకున్నారు వాళ్లు. పెరిగి పెద్దయ్యాక వాళ్ల జీతాలు తెల్లవాళ్ల జీతాలతో పోల్చి చూస్తే తక్కువగా వుంటాయి. అమ్మాయిలను తెల్లవాళ్లెవరైనా పెళ్లి చేసుకుంటారేమో కాని అబ్బాయిలకు మాత్రం అటువంటి అవకాశం ఉండదు. తన కొడుకును అటువంటి అవమానకరమైన

జీవితానికి దూరంగా తీసుకుని పోవాలని నిశ్చయించుకున్నాడు లాసన్. ఎట్టి పరిస్థితిలోనైనా తను ఇంగ్లండుకు వెళ్లిపోవాలనుకున్నాడు. మంచంలో బలహీనంగా పడివున్న ఎతెల్ చుట్టూ మూగిన స్థానిక జాతి స్త్రీలను చూసినప్పుడు అతని దృఢసంకల్పం మరింత బలపడింది. ఆమెను ఇంగ్లండులోని తనవాళ్ల మధ్య వుంచితే అప్పుడు ఎతెల్ పూర్తిగా తనదైపోతుంది అనుకున్నాడు. అతడామెను యెంతగా ప్రేమించాడంటే, తమ యిద్దరి దేహాలూ ఆత్మలూ ఒకటైపోవాలని కోరుకున్నాడు. ఆమె ఇక్కడే స్థానిక జాతి ప్రజల మధ్య వుంటే, ఆ జీవనవిధానపు వేర్లు గట్టిగా పాతుకునిపోయి ఆమె తనది కాకుండా పోతుందని భయపడ్డాడు.

ఇంగ్లండులో ఉన్న తన దాయాదికి లాసన్ ఉత్తరం రాశాడు. అతడు అక్కడి ఒక షిప్పింగ్ కంపెనీలో భాగస్వామి. తన ఆరోగ్యం ఇప్పుడు కొంచెం కుదుట పడ్డది కనుక తాను ఇంగ్లండుకు తిరిగి రావాలనుకుంటున్నట్టు ఆ ఉత్తరంలో తెలిపాడు లాసన్. తనకున్న పలుకుబడినంతా ఉపయోగించి యెంత చిన్న జీతమున్న ఉద్యోగమైనా సరే చూడమనీ, అది డీసైడ్ అనే ప్రదేశంలో వుంటే బాగుంటుందనీ, ఎందుకంటే అక్కడి వాతావరణం ఊపిరితిత్తుల జబ్బు వున్న తనకు ఎక్కువగా నష్టం చేయదనీ ఆ ఉత్తరంలో పేర్కొన్నాడు. ఆ ఉత్తరం చేరడానికి ఐదు వారాల కాలం పడుతుంది కనుక ఎతెల్‌ను మానసికంగా సిద్ధం చేయటం కోసం అది సరిపోతుందని భావించాడు. ఆ విషయం తెలియగానే ఎతెల్ చిన్నపిల్లలాగా ఆనందపడింది. తాను ఇంగ్లండుకు పోతున్నట్టు ఎతెల్ తన స్నేహితురాళ్లతో బడాయిగా చెప్పుకోవడం చూసి లాసన్ ఎంతో సంబరపడి పోయాడు. ఆ అవకాశం తన జీవితంలో పైమెట్టు వంటిదనీ, అక్కడికి పోయింతర్వాత తాను పూర్తిగా ఆంగ్లేయురాలి లాగా మారిపోతుందనీ సంతోషిస్తూ, ప్రయాణం చేసే రోజు కోసం ఆతృతతో ఎదురు చూసింది ఎతెల్. ఆఖరుకు అతనికి కింకార్డిన్‌షైర్ అనే ప్రదేశంలోని బ్యాంకులో ఉద్యోగం దొరికినట్టు టెలిగ్రామ్ రాగానే ఆమె యెంతో సంతోషించింది.

సుదీర్ఘమైన ప్రయాణం తర్వాత ఇంగ్లండులోని ఆ చిన్న పట్టణానికి చేరుకుని, అక్కడ స్థిరపడ్డ తర్వాత మళ్లీ తన సొంత దేశస్థుల మధ్య జీవించడం తనకు యెంత ఆనందాన్నిస్తుందో తెలుసుకున్నాడు లాసన్. గత మూడు సంవత్సరాల కాలంలో ఏపియా పట్టణంలోని తన జీవితాన్ని తల్చుకుని, ఇప్పుడు మళ్లీ ఇంగ్లండులో బతకడం సబబైన విషయంగా భావిస్తూ హాయిగా నిట్టూర్చాడు. చాన్నాళ్ల తర్వాత మళ్లీ గోల్ఫ్ ఆడటం, గాలంతో చేపలు పట్టడం అతనికి ఆనందాన్నిచ్చాయి. సమోవా ద్వీపంలో చేపలు పట్టడం అతనికి ఉత్సాహాన్నివ్వలేదు. బాగా జనసమ్మర్దం వున్న అక్కడి నీళ్లలో గాలం వేయగానే ఒకటి తర్వాత ఒకటి పెద్ద పెద్ద మందకొడి చేపలు పడేవి. ఇక్కడ పేపర్లో తాజా వార్తల్ని

చదవడం, తన జాతీయులను కలిసి వాళ్లతో ప్రతిరోజూ మాట్లాడటం, తాజా మాంసాన్ని తినడం, తాజా పాలను తాగడం, ఇవన్నీ అతనికి బాగా ఆనందాన్నీ, సంతృప్తినీ ఇచ్చాయి. సమోవాలోని పరిస్థితికి విరుద్ధంగా యిక్కడ సొంత వనరుల మీదనే ఎక్కువగా ఆధారపడటం, ఎతెల్ పూర్తిగా తనదే కావటం అతనికి ఆహ్లాదాన్ని కలిగించాయి. రెండు సంవత్సరాలు గడిచింతర్వాత చూసుకుంటే, ఎతెల్ పట్ల లాసన్ బాగా గాఢమైన ప్రేమతో ఉన్నాడు. ఆమె తన కళ్లముందు లేకపోతే భరించలేకపోయాడు. ఆమెతో మరింత ప్రేమగా, చనువుగా మాట్లాడాలనిపించడం మొదలైంది. కాని ఎతెల్ మాత్రం వచ్చిన మొదట్లో మాత్రమే ఉత్సాహాన్ని చూపినట్టూ, రానురాను ఆమెలో ఉత్సాహం తగ్గిపోయినట్టూ గమనించాడు లాసన్. పరిసరాలకు ఆమె అలవాటు పడలేదు. ఆమెలో కొంత మందకొడితనం ప్రవేశించింది. ఆకురాలే కాలం పోయి శీతాకాలం రాగానే తనకు బాగా చలిగా వుందని అన్నదామె. మధ్యాహ్నం దాకా మంచంలోనే పడివుండి, పగలు నుండి సాయంత్రం దాకా సోఫామీద కూర్చుని నవలలు చదివింది. మిగతా సమయాల్లో ఏమీ చేయకుండా బద్ధకంతో వుంది. ఆమె సన్నబడిపోయి, పాలిపోయింది.

"ఫరవాలేదు డార్లింగ్, త్వరలోనే ఇక్కడి పరిసరాలకు, జీవితానికి అలవాటు పడిపోతావు నువ్వు. వేసవి కాలం రానీ, అప్పుడిక్కడ దాదాపు ఏపియాలో ఉన్నంత వేడిగా వుంటుంది" అన్నాడు. లాసన్‌కు ఒంట్లో బలం చేకూరినట్లయింది. మునుపటి కన్న బాగయ్యాడు. సమోవాలో ఉన్నప్పుడు ఎతెల్ తన యిల్లును సరిగ్గా పెట్టుకోకపోయినా అక్కడ దాన్నెవరూ పట్టించుకోలేదు. కానీ ఇక్కడ ఇంగ్లండులో అది కుదరదు. తెలిసిన వాళ్లెవరైనా వచ్చినప్పుడు తమ యిల్లు అపరిశుభ్రంగా ఉండటం లాసన్‌కు నచ్చలేదు. అప్పుడతడు నవ్వుతూ ఎతెల్‌తో పరాచికాలాడుతూ తనే అన్నీ సర్దుతుంటే ఆమె బద్ధకంతో చూసింది. గంటల తరబడి ఆమె తన కొడుకుతో ఆడుతూ సమయాన్ని గడిపింది. తన సొంత భాషలో చిన్నపిల్ల లాగా వాడితో మాట్లాడింది. ఆమెకు ఉల్లాసాన్ని కలిగించాలనే ఉద్దేశంతో ఇరుగుపొరుగు వాళ్లతో లాసన్ స్నేహం చేశాడు. అప్పుడప్పుడు వాళ్లు చిన్నచిన్న పార్టీలకు పోయేవాళ్లు. అక్కడ ఆడవాళ్లు పాటలు పాడుతుంటే మగవాళ్లు కూర్చుని బుద్ధిమంతుల్లాగా మౌనంగా ఉండటం గమనించింది ఎతెల్. ఆమెకు బిడియం ఎక్కువ కాబట్టి వాళ్లకు దూరంగా కూర్చుంది. ఒక్కోసారి లాసన్ అకస్మాత్తుగా ఆందోళన చెంది "సంతోషంగా వున్నావా ఎతెల్?" అని అడిగేవాడు. ఆమె "సంతోషంగా ఉన్నాను" అని జవాబిచ్చేది.

కానీ, ఆమె కళ్ల వెనుక ఏ విధమైన భావన దాగివుందో గుర్తించలేకపోయాడు లాసన్. ఆమె తనలోకి తాను కుచించుకుపోతున్నట్టు అనిపించిందతనికి. కొలనులో

స్నానం చేస్తున్న ఎతెల్‌ను మొదటిసారిగా చూసినప్పుడు తనకు ఆమె ఎంత తెలిసిందో ఇప్పుడు అంతకన్న ఎక్కువగా ఏమీ తెలియలేదనుకున్నాడు. ఆమె తననుండి ఏదో దాస్తున్నదని ఊహించి బాధపడ్డాడు. ఆమెను తను ఆరాధిస్తాడు కనుక అది అతణ్ని మానసిక చిత్రవధకు గురి చేసింది.

"ఏపియాను వదిలి ఇక్కడికి వచ్చిందుకు నువ్వు పశ్చాత్తాప పడుతున్నావా?" అని అడిగాడు.

"లేదు లేదు. ఇక్కడ బాగానే వున్నట్టుంది" అన్నది ఎతెల్.

ఒక అస్పష్టమైన సందేహం మనసులో మెదిలి, పరీక్షించటం కోసం సమోవా ద్వీపం గురించి అక్కడి మనుషుల గురించి కొంచెం తక్కువ చేస్తూ రెండు మూడు సార్లు మాట్లాడాడు. ఆమె నవ్వి ఊరుకుంది. చాలా అరుదుగా ఆమెకు సమోవా నుండి ఉత్తరాల కట్ట వచ్చేది. అప్పుడు ఒకటి రెండు రోజుల పాటు ఆమె ముఖం బాగా పాలిపోయేది.

"ఏం జరిగినా తిరిగి ఆ ద్వీపానికి పోను నేను. అది తెల్లజాతి వాళ్లు ఉండతగిన ప్రదేశం కాదు" అన్నాడొకసారి. కాని తాను ఆఫీసుకు పోయినప్పుడు ఎతెల్ ఏడుస్తున్నదని అనుమానించాడు లాసన్. ఏపియాలో వున్నప్పుడు ఆమె చాలా ఉత్సాహంతో ఉల్లాసంతో గలగలా మాట్లాడేది. కాని ఇప్పుడు రానురాను మౌనం వహిస్తోంది. లాసన్ ఎంత ప్రయత్నించినా ఆమెలోని ముభావం పోలేదు. సమోవా ద్వీపంలోని జీవితపు జ్ఞాపకాల మూలంగా ఎతెల్ తనకు దూరమౌతోందని గ్రహించిన లాసన్‌కు ఆ ద్వీపం పట్ల, నలుపురంగులో వుండే ఆ స్థానిక ప్రజల పట్ల పిచ్చి అసూయ కలిగింది. ఆమె సమోవా ద్వీపం గురించి మాట్లాడినప్పుడల్లా అతడు ద్వేషంతో రగిలిపోయాడు. ఒకనాడు సాయంత్రం అతడు గోల్ఫ్ ఆడి ఇంటికి రాగానే ఆమె సోఫాలో పడుకుని కాక తలుపు దగ్గర నిలబడి వుండటం చూశాడు. ఆమె తనకోసమే వేచిచూస్తోందని తెలుసుకున్నాడు. లాసన్ లోపలికి రాగానే ఎతెల్ సమోవా భాషలో మాట్లాడడం అతనికి ఆశ్చర్యాన్ని కలిగించింది.

"ఇక నా వల్ల కాదు. నేనిక్కడ ఉండలేను. ఈ జీవితమంటే నాకసహ్యం కలుగుతోంది" అన్నది ఎతెల్.

"నీకు పుణ్యముంటుంది. కొంచెం నాగరికమైన భాషలో మాట్లాడు" అన్నాడు లాసన్ చిరచిరలాడుతూ. ఆమె అతని దగ్గరికి నడిచి తన చేతుల్ని అతని చుట్టూ వేసి వెటకారంగా, గేలి చేస్తున్నట్టుగా ముఖంలో భావాన్ని కనబరిచింది. ఆ చర్యలో అనాగరికత కనిపించింది. తర్వాత "మనం ఇక్కణ్నుంచి వెళ్లిపోదాం. సమోవాకు పోదాం. నన్నిక్కడే వుంచితే నేను చచ్చిపోతాను. మా యింటికి పోవాలని వుంది నాకు" అన్నది.

బాధ విపరీతంగా పెరిగి వెంటనే కన్నీళ్లు కార్చింది. తన కోపం చల్లారటంతో ఆమెను దగ్గరకు తీసుకున్నాడు లాసన్. తాను ఉద్యోగం వదలటం ఎంతమాత్రం కుదిరే పని కాదని, ఎందుకంటే అది లేకుంటే పొట్ట గడవదనీ ఆమెకు వివరించాడు. ఏపియాలోని బ్యాంకులో తన స్థానంలో వేరొకతను చేరినట్టూ, అక్కడ తనకెటువంటి జీవనాధారం లేనట్టూ చెప్పాడు. అక్కడ యెంత అసౌకర్యంగా వుండేదీ, ఎంత అవమానాన్ని ఎదుర్కోవాల్సి వచ్చేదీ, దాంతో తమ కొడుకు హృదయంలో ఎటువంటి ద్వేషభావం నెలకొనేదీ అంతా నెమ్మదిగా సమంజసంగా వివరించాడు.

"ఇది మన బాబు చదువు కోసం చాలా అనువైన, అద్భుతమైన ప్రదేశం. ఇక్కడ స్కూళ్లు చవకగా, మంచి ప్రమాణాలతో వుంటాయి. తర్వాత మన కొడుకు ఇక్కడి అబర్డీన్ విశ్వవిద్యాలయంలో పెద్ద చదువులు చదవవచ్చు. వాణ్ని అసలైన ఆంగ్లేయునిగా తయారు చేస్తాను నేను" అన్నాడు. ఆ పిల్లవాడి పేరు ఆండ్ర్యూ. లాసన్ వాణ్ని డాక్టరును చేయాలనుకున్నాడు. తర్వాత వాడు తెల్లజాతి అమ్మాయిని పెళ్లి చేసుకోవాలని ఆశించాడు.

"నేను సంకరజాతికి చెందినదాన్ని కావటం ఎంతమాత్రం సిగ్గుగా లేదు నాకు" అన్నది ఎతెల్ బాధనిండిన గొంతుతో.

"అవును, నిజమే డార్లింగ్. అందులో సిగ్గుపడాల్సిందేమీ లేదు. నా హృదయంలో నీకు ఎంత గొప్ప స్థానం ఉందో తెలియదు నీకు" అన్నాడతను. ఆమె చెక్కిలిని తన చెక్కిలికి ఆనించుకున్న అతడిని నీరసం ఆవహించింది. ఆమె పెదవుల్ని తన పెదవుల్తో అందుకున్నాడు.

వేసవి కాలం వచ్చింది. ఊరి చివర్న వున్న లోయ పచ్చదనం, పూల సుగంధంతో నిండిపోయింది. లోయ అంచున వున్న కొండలమీద పొదలు పెరిగి హాయిని కలిగిస్తున్నాయి. ఎతెల్ ఇక ఆ తర్వాత సమోవా ద్వీపం గురించి మాట్లాడలేదు. లాసన్‌లో ఆందోళన పెరిగింది. ఆమె దిగులుగా ఉన్నదని ఊహించాడతడు. ఒకరోజు వీధిలో అతనికి స్థానిక డాక్టరు కలిశాడు. అతడు "మిస్టర్ లాసన్, నీ భార్య ఆ కొండలమీది కొలనులో స్నానం చేస్తోందట. అది చాలా ప్రమాదకరం. ఇక్కడి నదులు పసిఫిక్ మహాసముద్రం వంటివి కాదు కదా" అన్నాడు. లాసన్ అతనితో ఉద్వేగంగా మాట్లాడుతూ, సొంత యింటి విషయాన్ని దాచాలనే స్పృహలేకుండా "నిజమే కావచ్చు. విషయం తెలియదు నాకు" అన్నాడు.

డాక్టరు నవ్వి, "చాలా మంది అక్కడ చూశారామెను. ఆ విషయం గురించి ఒకరితో ఒకరు చెప్పుకుంటున్నారు. ఎందుకంటే అక్కడ స్నానం చేయడమన్నది విచిత్రమైన సంగతి. ఆ స్థలం నిజానికి నిషేధింపబడింది. అయినా అధికారులతో పెద్దగా ఇబ్బంది ఉండక

పోవచ్చుననుకో. కాని ఆమె ఆ నీళ్లను ఎట్లా తట్టుకోగలుగుతుందా అని ఆశ్చర్యం కలుగుతుంది" అన్నాడు.

డాక్టరు చెప్పిన ప్రదేశం లాసన్‌కు తెలుసు. అది సమోవా ద్వీపంలో ఎతెల్ ప్రతి సాయంత్రం స్నానం చేసే కొలను లాంటిదేనని అతనికి అకస్మాత్తుగా అనిపించింది. ఇది కూడా ఎత్తయిన రాళ్ళ ప్రదేశంలో పుట్టి పారిన సెలయేరు కారణంగా ఏర్పడ్డ కొలను వంటిదే. దీని గట్లమీద కూడా దట్టంగా పెరిగిన చెట్లున్నాయి. కాని అవి కొబ్బరిచెట్లు కావు. వేరే రకానికి చెందినవి. ఈ కొత్త ప్రదేశానికి ఎతెల్ ప్రతిరోజూ పోయి, గట్టుమీద తన పైపై గుడ్డల్ని విడిచి అతి చల్లని నీళ్ళలోకి దిగి స్నానం చేయడం తన మనోనేత్రం ద్వారా చూసి, ఆ దృశ్యాన్ని ఊహించుకున్నాడు లాసన్. ఆ మధ్యాహ్నమే ఆ నది దగ్గరికి వెళ్లాడు. చెట్ల మధ్య నుండి జాగ్రత్తగా నడుస్తూ గడ్డి పెరిగిన బాట మీంచి పోతుంటే అతని అడుగులు ఎంతమాత్రం చప్పుడు చేయలేదు. నది దగ్గరి ఒక ప్రదేశానికి వచ్చాడతడు. అక్కణ్నుంచి చూస్తే గట్టుమీద కూర్చుని కింది నీళ్లలోకి చూస్తున్న ఎతెల్ కనిపించిందతనికి. ఆమె నిశ్చలంగా కూర్చుని వుంది. నీళ్ల ఆకర్షణ ఆమెను అక్కడికి రప్పించిందనుకున్నాడు. అప్పుడామె మనసులో ఎటువంటి భావం కలుగుతుందా అని ఊహించుకున్నాడు. ఆఖరుకు ఆమె లేచింది. కాని కొన్ని క్షణాల పాటు అతని దృష్టిలోంచి మాయమైంది. వెంటనే మళ్లీ కనబడింది. ఆమె చిన్న పాదాలతో, తడిగా వున్న గట్టు మీదకి చేరింది. మెల్లగా చప్పుడు కాకుండా నీళ్లలోకి దిగింది. నీళ్లలో కదిలే ఎతెల్‌ను చూస్తుంటే ఒక మానవేతర ప్రాణి ఈదుతున్నట్టనిపించింది. ఆమె గట్టుమీదికి వచ్చేదాకా వేచి వున్నాడు లాసన్. తడిగుడ్డలు శరీరానికి అతుక్కుపోయి ఆమె ఒంటి వంపులు స్పష్టంగా కనిపించాయి. తర్వాత తన చేతుల్ని మెల్లగా రొమ్ముల మీంచి కదిపి ఆనందంతో ఒక చిన్న నిట్టూర్పును విడిచింది. లాసన్ వెనుతిరిగి ఇంటికి చేరుకున్నాడు. అతని హృదయంలో చిన్న నొప్పి బయల్దేరింది. ఆమె తనకింకా అపరిచితురాలైనట్టూ, ఆమె పట్ల తన అమితమైన ప్రేమను తాను పూర్తిగా అనుభవించనట్టూ ఫీలయ్యాడు.

లాసన్ ఆ సంఘటన గురించి అసలే మాట్లాడలేదు. దాన్ని పూర్తిగా మరిచిపోయాడు. కానీ, ఆమె మనసులో ఎటువంటి ఊహ కదుల్తోందా అని ఆలోచిస్తూ ఆమె ముఖాన్ని చూశాడు. ఒకరోజు అతడు యింటికి వచ్చేసరికి ఎతెల్ ఇంట్లో లేకపోవడం చూసి ఆశ్చర్యానికి లోనయ్యాడు.

"మేడమ్ ఎక్కడుంది?" అని అడిగాడు పనమ్మాయిని.

"ఆమె బాబును తీసుకుని అబర్డీన్‌కు పోయింది. ఆఖరి రైలుకు తిరిగి వస్తానన్నది" అన్నది ఆ అమ్మాయి కొంచెం ఆశ్చర్యపోతూ.

"ఓ, సరేలే" అన్నాడు.

తనకు చెప్పకుండా ఎతెల్ అట్లా చాలా దూరం చాలా సేపటికోసం వెళ్లటం లాసన్‌కు చిరాకును తెప్పించింది. కానీ అతనికి ఆందోళన కలుగలేదు. అబర్డీన్‌లోని మంచి మంచి దుకాణాలను ఎతెల్ చూసి వస్తే ఆమెకు మనోల్లాసం కలుగుతుందని సంతోషించాడు. ఆఖరి ట్రెయిన్లో రావాల్సిన ఆమె కోసం స్టేషన్‌కు వెళ్లాడు. కానీ ఆమె అందులో రాకపోవడంతో అకస్మాత్తుగా భయానికి లోనయ్యాడు. పడకగదిలోకి పోయి చూస్తే ఎతెల్ వాడే మేకప్ సామాను అక్కడ లేదు. వార్డ్‌రోబ్‌ను తెరిచి చూశాడు. అది పూర్తిగా ఖాళీగా వుంది. ఆమె చెక్కేసింది!

లాసన్‌కు విపరీతమైన కోపం వచ్చింది. వివిధ ప్రదేశాలకు, మనుషులకు ఫోన్ ద్వారా వాకబు చేద్దామంటే అప్పటికే మధ్యరాత్రి దాటిపోయి కొన్ని గంటలైంది. అయినా ఎన్ని వాకబులు చేసినా ఎతెల్ జాడ దొరకదని అనుమానం కలిగింది. తన బ్యాంకులో ఆడిట్ టీమ్ ఇన్స్పెక్షన్‌కు వచ్చే సమయంలో ఎతెల్ ఇట్లా ఇల్లు వదలటం ఆమెలోని వంచనను సూచిస్తున్నదని భావించాడు. ఆ పరిస్థితిలో ఆఫీసు పనిని వదిలి ఎతెల్ కోసం గాలించటానికి అవకాశం లేకపోయింది. తన పనిచేత బంధింపబడ్డాడతడు. ఒక వార్తాపత్రికను చూస్తే మరుసటి రోజు ఉదయం ఒక పడవ ఆస్ట్రేలియాకు బయలుదేరబోతున్నదని తెలిసిందతనికి. ఇప్పుడామె లండన్ వైపు వెళ్తూ వుండవచ్చునని భావించాడు. లోపల్నుంచి వస్తున్న వెక్కిళ్లను ఆపుకోలేకపోయాడు.

'తన సంతోషం కోసం ప్రపంచంలో ఉన్న ప్రయత్నమంతా చేశాను నేను. కాని ఆమె ఈ విధంగా నన్ను మానసిక క్షోభకు గురిచేస్తోంది. ఎంత క్రూరత్వం!' అనుకున్నాడు.

రెండు రోజుల దుర్భర క్షోభ తర్వాత ఎతెల్ దగ్గరి నుండి లాసన్‌కు ఒక ఉత్తరం వచ్చింది. ఆ ఉత్తరాన్ని ఆమె సమోవా ద్వీపానికి చేరుకోక ముందు ఇంగ్లండు లోంచే రాసింది. అందులో ఎతెల్ స్కూలు రోజుల నాటి దస్తూరి కనిపించింది. రాయటం ఆమెకెప్పుడూ సులభమైన పని కాదు.

ప్రియమైన బెట్టీ,

పరిస్థితుల్నీ, వాతావరణాన్నీ తట్టుకోవడం నావల్ల కాలేదు. నేను నా యింటికి పోతున్నాను. సెలవు. – ఎతెల్ అని వుంది ఆ ఉత్తరంలో.

పశ్చాత్తాపాన్ని సూచించే ఒక్క మాట కూడా ఉత్తరంలో రాయలేదు ఎతెల్. కనీసం లాసన్‌ను రమ్మని కూడా రాయలేదు. అకస్మాత్తుగా అతనిలో బలహీనత ఆవహించింది. ఆమె తిరిగి రాదని తెలిసినా మరలి రమ్మని వేడుకుంటూ పడవ ఆగే మొట్టమొదటి స్టేషనులోని సిబ్బంది అడ్రెను పేరిట టెలిగ్రామ్ యిచ్చాడు. దయనీయమైన ఆందోళనతో

జవాబు కోసం ఎదురు చూశాడు. ఒక్క ప్రేమ పూర్వకమైన మాటనైనా ఆమెనుండి అందుకోవాలని ఆశపడ్డాడు. కాని ఆమె నుండి సమాధానమే రాలేదు. ఒక దుర్భర మానసిక వేదన నుండి మరొక అటువంటి వేదనకు చేరుకున్నాడు. ఆమె తనను వదిలి పోవటం మంచిదనుకున్నాడు. ఆమెకు డబ్బు అసలే పంపకుంటే ఆమే తిరిగి వస్తుందనుకున్నాడు ఒక సందర్భంలో. మరోసారి అతడు పూర్తి ఏకాకిగా మారి దుర్భర వేదనను అనుభవించాడు. తన కొడుకునూ, భార్యనూ తిరిగి పొందాలని కోరుకున్నాడు. పరిస్థితి చేయిదాటిపోయినట్టు, తాను యెంతగా నటించినా ఆఖరుకు ఆమెకోసం సమోవాకు పోవాల్సిందే అని భావించాడు. ఎతెల్ లేకుండా తను అసలు బతకలేనని అనుకున్నాడు లాసన్. భవిష్యత్తు గురించి తను కట్టుకున్న ఆశాసౌధాలన్నీ కుప్ప కూలినట్టయిందతనికి. కాని ఇప్పుడు ఆ ఆశలన్నిటినీ మనసులోంచి పక్కకు పెట్టి అయినా ఎతెల్ దగ్గరికి పోవాలనుకున్నాడు. వెంటనే తన బ్యాంకుకు వెళ్లి తాను అర్జెంటుగా ఊరును వదలాల్సి వస్తున్నదని మేనేజరుకు చెప్పాడు. మేనేజరు బాగా కోప్పడ్డాడు. ఎందుకంటే అంత తక్కువ సమయమిచ్చి సెలవు అడిగితే బ్యాంకు వారికి చాలా యిబ్బంది ఎదురవుతుంది. కానీ లాసన్ వినలేదు. తర్వాతి పడవలోనే వెళ్లాలని నిశ్చయించుకున్నాడు. తనకున్నదంతా అమ్ముకుని పడవ యెక్కిన తర్వాతనే అతనికి మనశ్శాంతి దొరికింది. అప్పటివరకు తనను కలిసేందుకు వచ్చిన వాళ్లందరికీ అతడు దాదాపు పిచ్చివాడిలా కనిపించాడు. లండన్ చేరుకోగానే  ఏపియాలోని ఎతెల్ అడ్రస్‌కు టెలిగ్రామ్ పంపాడు తాను వస్తున్నానని తెలియజేస్తూ.

సిడ్నీ నుంచి అటువంటిదే మరో టెలిగ్రామ్ పంపాడు. ఆఖరుకు పడవ ఏపియా పట్టణానికి చేరుకున్న తర్వాత, అక్కడ పరచుకుని వున్న ఆ యిళ్లు కనపడగానే చాలా ఊరటను, మనశ్శాంతిని పొందాడు. తనకు తెలిసిన డాక్టరూ మరొకతనూ పడవపైకి వచ్చారు. వాళ్లిద్దరూ అతనికి పాత పరిచయస్థులు కావటం వల్ల వాళ్లతో కలిసి ఒకటి రెండు పెగ్గుల మద్యాన్ని తాగాడు.  అతడు చాలా ఆందోళనతో ఉండటం కూడా మద్యం తాగటానికి ఒక కారణం. తనను చూస్తే ఎతెల్ సంతోషపడుతుందో లేదో అనే అనుమానం వచ్చిందతనికి. బయటికి వస్తుంటే ఒక చిన్న గుంపు తమ ప్రియమైన వాళ్ల కోసం ఎదురు చూస్తూ కనిపించింది. అతడు ఉత్కంఠగా ఆ ముఖాలను పరీక్షగా చూశాడు. వారిలో ఎతెల్ లేకపోవడంతో అతని గుండె కూలినట్లయింది. కానీ, నీలంరంగు దుస్తుల్లో వున్న ముసలి బ్రెవాల్డ్ కనిపించడంతో కొంచెం ధైర్యం వచ్చిందతనికి.

గట్టు మీదికి చేరుతూ “ఎతెల్ ఎక్కడుంది?” అని అడిగాడు.

"ఆమె మా బంగళాలో మాతోనే వుంది" అన్నాడు బ్రెవాల్డ్.

లాసన్‌కు నిరాశ కలిగింది. కానీ మేకపోతు గాంభీర్యాన్ని నటించాడు.

"నాకోసం ఏదైనా గదిని సిద్ధంగా వుంచారా? వ్యవహారాన్ని చక్కబరిచేందుకు నాకు ఒకటిరెండు వారాలు పట్టవచ్చు".

"ఓ, ఫరవాలేదు. గదిని అమర్చగలను"

కస్టమ్స్ క్లియరెన్స్ అయింతర్వాత లాసన్ తన పాత హోటలుకు పోయాడు. అతని స్నేహితులు అతనికి స్వాగతం పలికారు. వీలైనన్ని పెగ్గుల మద్యం తాగిన తర్వాత ఇద్దరూ బ్రెవాల్డ్ యింటికి చేరేసరికి వాళ్ల మనసులలో హుషారు నెలకొంది. ఎతెల్‌ను తన చేతులతో పొదివి పట్టుకున్నాడు. ఆమెను మళ్లీ చూసేసరికి అతనిలోని పాత కచ్చతనమంతా ఎగిరిపోయింది. ఎతెల్ తల్లీ, నాయనమ్మా సంతోషించారు. స్థానిక ప్రజలు, సంకరజాతి మనుషులు అక్కడ చేరి, చుట్టూ కూర్చున్నారు. వాళ్లు అతనివైపు ఆనందంగా చూశారు. లాసన్ తాను తెచ్చిన విస్కీ సీసాలోంచి అందరికీ ఒక్కొక్క పెగ్గూ పోశాడు. తన చిన్నికొడుకును కాళ్లమీద పెట్టుకుని కూచున్నాడు. ఆ బాబుకు అంతకు ముందు తొడిగిన ఇంగ్లిష్ గుడ్డల్ని తీసేసి స్థానిక రకం దుస్తుల్ని తొడగటంతో అతడు మరీ నల్లగా కనిపించాడు. బయటి దేశానికి పోయి బాగా డబ్బు సంపాదించుకుని స్వంత ఊరికి తిరిగి వచ్చినవాడిలా ఫీలయ్యాడు లాసన్. మధ్యాహ్నం మళ్లీ హోటలుకుపోయి మద్యం తాగాడు. ఇంటికి తిరిగొచ్చేసరికి బాగా హుషారుగా వున్నాడు. పాశ్చాత్యులు తరచుగా మద్యం సేవిస్తారనీ, అది మామూలు విషయమేనని ఎతెల్‌కూ ఆమె తల్లికీ తెలుసు. అందుకే వాళ్లు సహృదయతతో నవ్వి అతణ్ని పడక మీదికి చేర్చారు.

ఒకటి రెండు రోజుల తర్వాత అతడు ఉద్యోగం కోసం వేటలో పడ్డాడు. ఇంగ్లండులో తాను వదిలిన ఉద్యోగమంత మంచి ఉద్యోగం ఇక్కడ దొరికే అవకాశం లేదని అతనికి తెలుసు. ఆఖరుకు ఒక చిన్న వ్యాపార కంపెనీలో చిన్న ఉద్యోగిగా చేరాడు. బ్యాంకులో అంతగా సంపాదించలేమనీ, వ్యాపార కంపెనీలోనే ఎక్కువగా సంపాదించవచ్చునని సరిపెట్టుకున్నాడు. త్వరలోనే ఆ కంపెనీకి తాను చాలా అవసరమైన వ్యక్తిగా మారి, తర్వాత దానిలో భాగస్వామి అవ్వాలనుకున్నాడు. కొన్ని సంవత్సరాల తర్వాత తనెందుకు ధనవంతుడు కాకూడదు అనుకున్నాడు.

"మనం ఈ యింట్లో వుండలేము. కొంచెం కుదురుకున్న తర్వాత ఒక చిన్న మట్టిగోడల కచ్చా ఇల్లును కొనుక్కుందాం" అన్నాడు ఎతెల్‌తో.

బ్రెవాల్డ్ ఇల్లు సరిపోయేంత పెద్దగా లేదు. అక్కడ జాగా ఎక్కువగా లేకపోవటమే కాక ఏకాంతం కూడా కరువైందతనికి.

"అయినా తొందరలేదు. చిన్న యిల్లు దొరికే వరకు ఇక్కడే ఉండవచ్చు" అన్నాడు ఎతెల్‌తో.

అతను కుదురుకోవటానికి ఒక వారం రోజులు పట్టింది. ఆ వ్యాపార కంపెనీ యజమాని పేరు బెయిన్. ఇల్లు మారుదాం అని లాసన్ అడిగితే తాను మళ్లీ నెల తప్పినట్టూ, ప్రసవం వరకు తండ్రి యింట్లోనే వుండదల్చుకున్నట్టూ చెప్పింది ఎతెల్. లాసన్ ఆమెకు నచ్చజెప్పడానికి ప్రయత్నించాడు.

"ఇక్కడ వుండటం నీకిష్టం లేకపోతే నువ్వు పోయి హోటల్లో వుండు" అన్నదామె హఠాత్తుగా. అతని ముఖం పాలిపోయింది.

"ఎతెల్, నువ్వట్లా ఎలా అనగలవు?"

ఆమె నిర్లక్ష్యంగా భుజలెగరేసి "మనం ఇక్కడ వుండగలిగినప్పుడు వేరే యింట్లో వుండటమెందుకు?" అన్నది. అప్పుడు లాసనే తగ్గాడు.

ఒకరోజు అతడు ఉద్యోగపు పని ముగించుకుని ఇంటికి వచ్చేసరికి అక్కడ స్థానిక జాతీయులు నిండిపోయారు. వాళ్లందరూ పొగ తాగుతూ, కవా అనే మత్తు పానీయాన్ని కూడా తాగుతూ అదేపనిగా గోలగోలగా మాట్లాడుతున్నారు. కొందరేమో పడుకుని వున్నారు. ఆ యిల్లంతా చాలా గలీజుగా వుంది. తన కొడుకు నేలమీద పాకుతూ, చుట్టూ మిగతా స్థానిక జాతి పిల్లలతో వున్నాడు. వాడికి సమోవా భాష తప్ప ఒక్క ముక్క కూడా వేరే భాష వినపడే అవకాశం లేదు. ఎందుకంటే వాళ్లందరూ సమోవా భాషలోనే మాట్లాడు తున్నారు. అటువంటి దృశ్యాలను ఎదుర్కొనే ధైర్యాన్ని పొందటంకోసం లాసన్ పనినుండి యింటికి తిరిగి వస్తూ హోటల్ దగ్గర ఆగి కొన్ని పెగ్గుల మద్యాన్ని తాగటం అలవాటు చేసుకున్నాడు. ఎతెల్‌ను తాను అన్నివేళలా అత్యంత ప్రాణప్రదంగా ప్రేమిస్తున్నప్పటికీ ఆమె తననుండి చేజారిపోతున్నదని గ్రహించాడు. బయట ఒక చిన్న యిల్లును ఏర్పరచుకుని అందులోకి మారుదామని లాసన్ చేసిన ప్రతిపాదనను ఎతెల్ తిరస్కరించింది. ఇంగ్లండులో వున్నప్పుడు కలిగిన బెంగ ఆమెను మళ్లీ తనవాళ్లతో కలిసేలా చేసిందనీ, ఇప్పుడు వాళ్లతో గడుపుతూ తన జాతి సంప్రదాయాలను తీవ్రమైన ఆరాటంతో పాటిస్తూ ఆనందిస్తున్నదనీ అనుకున్నాడు లాసన్. అతడు మరింత ఎక్కువగా తాగటం మొదలు పెట్టాడు. ప్రతి శనివారం నాడు ఇంగ్లిష్ క్లబ్‌కు వెళ్లి, ఔటయ్యేలా విపరీతంగా తాగాడు.

లాసన్‌లో ఒక అసాధారణమైన చెడ్డగుణం వుంది. అదేమిటంటే అతడు తాగినప్పుడల్లా తన యజమాని అయిన బెయిన్‌తో పెద్ద పోట్లాట పెట్టుకుంటాడు. దాంతో బెయిన్ అతణ్ని ఉద్యోగంలోంచి తీసేశాడు. మళ్లీ ఉద్యోగాన్ని వెతుక్కోవాల్సి రావటం లాసన్ వంతైంది. రెండు వారాల పాటు ఏ పనీ లేక బేకారుగా వున్నప్పుడు, మామగారి యింట్లో

కూర్చోలేక హోటలుకో ఇంగిష్ క్లబ్బుకో పోయి పూటుగా తాగటం ప్రారంభించాడు. లాసన్ మీద సానుభూతి కలిగిన మిల్లర్ అతనికి ఉద్యోగమిచ్చాడు. లాసన్‌లో ప్రతిభ వుంది. కాని మిల్లర్ చతురత వున్న వ్యాపారస్థుడు. పరిస్థితుల ప్రభావం మూలంగా లాసన్ తక్కువ జీతానికి ఆ ఉద్యోగంలో చేరక తప్పలేదు. ఎతెల్, బ్రెవాల్డ్ అతణ్ని నిందించారు. ఎందుకంటే పెడర్సన్ అనే స్థానిక జాతీయుడు అంతకంటె ఎక్కువ జీతంతో ఉద్యోగమిస్తానన్నా లాసన్ అందులో చేరలేదు. ఒక స్థానిక జాతీయుని కింద పనిచేస్తూ అతని ఆజ్ఞలను పాటించడం లాసన్‌కు ఇష్టం లేదు. ఈ విషయం గురించి ఎతెల్ గొణుగుతూ నస పెట్టినప్పుడల్లా లాసన్ కోపంతో చెలరేగిపోతూ "స్థానికుల కింద పనిచేస్తే నా బతుకు చట్టుబండలవుతుంది" అని అరిచాడు.

"అట్లానే కావాలి నీకు" అన్నది ఎతెల్.

ఆరు నెలల్లో అతడు పూర్తి పరాభవానికి గురయ్యాడు. మద్యం పట్ల అతని ఆసక్తి పెరుగుతూ పోసాగింది. దాంతో మరింత విపరీతంగా తాగటం మొదలు పెట్టాడు. దాని ఫలితంగా అతని పనితీరు చెడిపోయింది. మిల్లర్ అతణ్ని ఒకటిరెండు సార్లు హెచ్చరించాడు. కాని లాసన్ ఆ హెచ్చరికలను సీరియస్‌గా తీసుకోలేదు. ఒకసారి వాళ్లిద్దరి మధ్య గొడవ జరిగింది. అప్పుడు లాసన్ ఆ ఉద్యోగాన్ని వదులుతున్నానని చెప్పి బయటికి నడిచాడు. అతని తీరు గురించి అందరికీ తెలిసిపోవటంతో ఉద్యోగమిచ్చేవాళ్లు కరువైపోయారు. కొంత కాలం అతడు ఏ పనీ చేయకుండా బేకారుగా వున్నాడు. తర్వాత డెలీరియమ్ ట్రెమెన్స్ అనే మెదడు నరాల వ్యాధికి గురయ్యాడు. దాన్నుండి తేరుకుని అవమానంతో క్రుంగిపోయి, శారీరకంగా చాలా బలహీనుడయ్యాడు. పరిస్థితికి తలవొగ్గి పెడర్సన్ దగ్గరికి వెళ్లి ఉద్యోగం అడిగాడు. తన దగ్గర ఒక తెల్లజాతీయుడు పని చేస్తాననడం పెడర్సన్‌కు సంతోషాన్ని కలిగించింది. పైగా లెక్కల్లో లాసన్ నిపుణుడు. కనుక అతనికి ఉద్యోగమిచ్చాడు పెడర్సన్.

అప్పట్నుంచి అతని పతనం వేగంగా సాగింది. తెల్ల జాతీయులు అతడిని నిరాదరణకు గురి చేశారు. లాసన్ తాగినప్పుడు అదుపు లేని కోపంతో నిస్సహాయుడవటం గమనించి వాళ్లు అతని మీద జాలి చూపి పూర్తిగా బహిష్కరించక వదిలేశారు. పరిస్థితుల మూలంగా అతడు పూర్తిగా నిర్వీర్యుడయ్యాడు. ఏ చిన్న అవకాశం వచ్చినా ఇతరులతో పోట్లాడటం మొదలుపెట్టాడు లాసన్. పూర్తిగా స్థానిక జాతీయులతోనే బతకడం వల్ల ఒక తెల్ల జాతీయునికుండే గౌరవాన్ని కోల్పోయాడు. వాళ్లపట్ల అతడు చూపే ద్వేషాన్ని ఆ స్థానిక జాతీయులు భరించలేక పోయారు. వాళ్ళకన్న తనే గొప్ప అన్నట్టుండే లాసన్ ప్రవర్తనను వాళ్లు నిరసించారు. తమలో ఒకనిగా బతుకుతూ కూడా అతడు యెందుకు ఆధిక్య

భావనను కలిగి వుండాలని మనసులోనే ప్రశ్నించుకున్నారు. అంతకు ముందు లాసన్‌తో సౌమ్యంగా, కొంచెం నంగిగా ప్రవర్తించిన బ్రెవాల్డ్ ఇప్పుడు చీదరించుకోవటం మొదలుపెట్టాడు. ఎతెల్ వాళ్లిద్దరి మధ్య సయోధ్యను కుదర్చటానికి ప్రయత్నించలేదు. ఒకటిరెండు సార్లు హేయమైన గొడవలు రావటంతో వాళ్లిద్దరూ ఒకరినొకరు కొట్టుకున్నారు. ఎప్పుడైనా అట్లాంటి కొట్లాటలు వచ్చినపుడు ఎతెల్ తనవాళ్ల వైపు చేరటం మొదలు పెట్టింది. భర్త వైపున ఎంత మాత్రం నిలబడలేదు. లాసన్ మామూలు సమయాల్లో కన్నా తాగినపుడే కొంచెం బాగా వుంటాడని అనుకునే వారు ఎతెల్ తరఫు వాళ్లు. ఎందుకంటే తాగినప్పుడు లాసన్ మంచం మీదనో, నేలమీదనో బాగా గురక పెడుతూ పడుకుంటాడు. తర్వాత, ఏదో విషయాన్ని వాళ్లు తన నుంచి దాచిపెడుతున్నారని తెలుసుకున్నాడు లాసన్. వాళ్లు పెట్టే కూడు కోసం సాయంత్రం యింటికి వచ్చినప్పుడు ఎతెల్ ఇంట్లో వుండటం లేదు. ఆమె యెక్కడికి పోయిందని బ్రెవాల్డ్‌ను అడిగితే సాయంత్రాన్ని తన స్నేహితురాళ్లతో గడపడం కోసం పోయిందని చెప్పాడతడు. కాని ఎతెల్ తిరిగి వచ్చింతర్వాత ఆమెను అడిగితే తన తండ్రి తప్పుగా చెప్పాడనీ, నిజానికి తాను ఫలానా వాళ్లింటికి పోయాననీ చెప్పిందామె. కాని ఆమె అబద్ధం చెప్తున్నదని లాసన్‌కు తెలిసిపోయింది. అట్లాంటి సమయాల్లో ఆమె తొడుక్కున్న దుస్తులు చాలా ఆకర్షణీయంగా వుండేవి. ఆమె కళ్లల్లో ఉత్సాహం, ఉల్లాసం తొణికిసలాడుతూ ఆమె చాలా ఆనందంగా కనిపించేది.

"నా దగ్గర తిక్క వేషాలు వేయకు ఎతెల్. వేస్తే నీ ఒక్కొక్క ఎముకను ముక్కలు చేస్తాను" అన్నాడొకసారి లాసన్.

"పోరా తాగుబోతు ముండాకొడకా" అని తిరస్కారంగా అన్నది ఎతెల్.

ఎతెల్ తల్లీ, నాయనమ్మా తనను క్రూరత్వం నిండిన భావనతో చూస్తున్నారని ఊహించాడు లాసన్. బ్రెవాల్డ్ మాత్రం ఈ మధ్య కొంచెం సహృదయతను కనబరచడం లాసన్‌లో అనుమానం కలగడానికి తావిచ్చింది. తోటి తెల్ల జాతీయులు తనను అదోరకంగా విచిత్రంగా చూస్తుండటంతో లాసన్‌కు ఏదో అనుమానం కలిగింది. తాను హోటల్లోని లాంజ్‌లోకి పోగానే అంతకుముందు వరకు మాట్లాడుకుంటున్న వాళ్లంతా అకస్మాత్తుగా మౌనం వహించడంతో వాళ్లు అప్పటిదాకా తన గురించే మాట్లాడుకుంటున్నారని అతనికి నిశ్చయంగా తెలిసిపోయింది. తన వెనుక ఏదో జరుగుతోందనీ, అదేమిటో తనకు తప్ప ఇతరులందరికీ తెలుసుననీ అనుకున్నాడు. విపరీతమైన అసూయతో రగిలిపోయాడు. ఎతెల్ ఎవరో తెల్ల జాతీయునితో రహస్యంగా రంకు వ్యవహారం నడుపుతోందని ఊహించి, ఒక్కొక్కసారి కళ్లలోకి పరిశీలనగా చూడసాగాడు. కాని, అతనికి ఎటువంటి సూచనా దొరకలేదు. అతడు పూర్తిగా నిస్సహాయుడయ్యాడు. ఎవరినీ కచ్చితంగా అనుమానించలేక,

ఎవరిమీద కసిని తీర్చుకుందామా అని పిచ్చివాడిలాగా వెతకసాగాడు. ఆఖరుకు ఒక నిరపరాధి మీద దాడి చేసేట్టు చేసింది ఒక సందర్భం. ఒకసారి హోటల్లో లాసన్ చిరాకుగా వున్నప్పుడు చాప్లిన్ వచ్చి పక్కసీట్లో కూచున్నాడు. లాసన్ పట్ల సానుభూతి కలవాళ్లలో చాప్లిన్ బహుశా మొదటివాడు. వాళ్లు మద్యానికి ఆర్డరిచ్చి, రాబోయే గుర్రపు పందాల గురించి కొన్ని నిమిషాలసేపు మాట్లాడుకున్నారు. అప్పుడు చాప్లిన్ "బహుశా మనమంతా కొత్త బట్టలకోసం డబ్బును సమకూర్చుకోవాలేమో" అన్నాడు.

లాసన్ కిసుక్కున నవ్వాడు. చాప్లిన్ డబ్బును ఖర్చుచేసే అధికారం భార్య చేతుల్లోనే ఉండటం చేత, ఆమెకు ఏ వస్తువు కావాలనిపించినా భర్తను అడిగే అవసరమే లేదు.

"నీ భార్య ఎలావుంది?" అని అడిగాడు చాప్లిన్, స్నేహంగా వుండాలని ప్రయత్నిస్తూ.

లాసన్ తన కనుబొమ్మల్ని ముడి వేస్తూ "ఆ విషయం నీకెందుకు?" అన్నాడు.

"మర్యాద కోసం అడిగాను" అన్నాడు చాప్లిన్.

"అటువంటి ప్రశ్నల్ని నీకోసమే దాచిపెట్టుకో".

చాప్లిన్ ఓపిక వున్న మనిషి కాదు. చాలా సంవత్సరాల పాటు ఉష్ణ ప్రదేశాల్లో జీవితాన్ని గడపటం, బాగా విస్కీ తాగే అలవాటు ఉండటం, ఇంట్లో భార్యతో గొడవల మూలంగా పరిస్థితి అధ్వాన్నంగా ఉండటం – ఇవన్నీ అతడిని లాసన్ కన్న ఎక్కువ తిక్కమనిషిగా మార్చాయి.

"చూడు లాసన్, నువ్వు నా హోటల్లో వుంటున్నావు కనుక మర్యాదస్తునిలా బుద్ధిగా వుండు, లేకపోతే నడివీధిలోకి పోవాల్సి వస్తుంది" అన్నాడు చాప్లిన్. లాసన్ ముఖం ఎర్రబడింది. "నీకూ మిగతా వాళ్లకూ ఒక విషయాన్ని అంతిమంగా చెప్తున్నాను. నా భార్య గురించి ఎవడైనా చెడ్డగా మాట్లాడితే మర్యాద దక్కదు. జాగ్రత్త" అన్నాడు కోపంతో ఒగరుస్తూ.

"నీ భార్యతో రంకు చేయాలని ఎవడికుంటుంది?" అన్నాడు చాప్లిన్.

"నువ్వనుకుంటున్నంత పిచ్చివాణ్నికాను నేను. మీ అందరితో నాకు విభేదం వస్తోందని తెలుసు నాకు. అందరికీ నేరుగా చెప్పేస్తున్నాను. లోపాయికారీ వ్యవహారం ఎవడు నడిపినా డొక్క చీలుస్తాను".

"చూడు నువ్విక్కడణ్నుంచి వెళ్ళిపోయి నిషా దిగింతర్వాత మళ్లీ రా".

"సమయమొచ్చినపుడే పని పడతాను. అంతే తప్ప ఒక్క నిమిషం ముందు కూడా ఆ పని చేయను".

లాసన్ అనవసరంగా నోరు చేసుకున్నాడు. అటువంటి కస్టమర్లతో ఎలా వ్యవహరించాలో చాప్లిన్‌కు అనుభవపూర్వకంగా తెలుసు కనుక, లాసన్ కాలరునూ చేతుల్నీ

పట్టుకుని వీధిలోకి నెట్టేశాడు. లాసన్ తూలిపోయి, బయట ఎర్రని ఎండలో పడిపోయాడు. ఈ సంఘటన పర్యవసానం గానే లాసన్ తన భార్య అయిన ఎతెల్‌తో ఉధృతంగా గొడవపడ్డాడు ఒకరోజు. పరాభవం అతనికి వేదనను కలిగించింది. హోటలుకు పోవటం ఇష్టం లేక రోజుకన్న ముందుగా ఇంటికి పోయాడు. ఎతెల్ బయటికి పోవడం కోసం తయారవుతోంది. సాధారణంగా ఆమె తన నల్లని కురుల్లో పువ్వును పెట్టుకుంటుంది. కానీ ఈసారి అట్లా చేయలేదు. పైగా స్టాకింగులు తొడుక్కుని ఎత్తు మడమల చెప్పుల్ని వేసుకుంది. తనకున్న దుస్తుల్లో అతి కొత్తదైన గులాబీ రంగు డ్రెస్‌ను తొడుక్కుంటోంది.

"బాగా సింగారించుకుంటున్నావు. ఎక్కడికి పోతున్నావేంటి?" అని అడిగాడు లాసన్.

"క్రాస్లీ దంపతుల యింటికి పోతున్నాను"

"నేను కూడా నీతో వస్తాను"

"ఎందుకు?" అని అడిగింది ఎతెల్ మెల్లగా.

"నువ్వు ఒంటరిగా అక్కడా యిక్కడా తిరగటం నాకిష్టం లేదు"

"నిన్ను రమ్మని అడగలేదు నేను".

"నువ్వు అడగకపోతే దాన్ని లెక్క చేయను నేను. నేను లేకుండా నువ్వు పోబోవటం లేదు".

"నేను పూర్తిగా తయారయ్యే దాకా నువ్వు మంచంమీద ఒరుగు"

లాసన్ తాగి వున్నాడనీ, మంచం మీద ఒరగగానే నిద్రలోకి జారిపోతాడనీ ఊహించింది ఆమె. అతడు కుర్చీలో కూర్చుని సిగరెట్ తాగటం మొదలుపెట్టాడు. పెరుగుతున్న చిరాకుతో అతణ్ని చూసింది ఆమె. ఎతెల్ పూర్తిగా తయారవగానే లాసన్ కుర్చీలోంచి లేచాడు. అనుకోకుండా అప్పుడు ఆ యింట్లో వాళ్లిద్దరు తప్ప వేరే యెవరూ లేరు. బ్రెవాల్డ్ పొలంలో పని చేస్తున్నాడు. అతని భార్యేమో ఏపియా పట్టణంలోకి వెళ్లింది. ఎతెల్ అప్పుడు లాసన్‌ను ఎదుర్కొంది.

"నేను నీతో రావటం లేదు. యెందుకంటే నువ్వు తాగి వున్నావు" అన్నది.

"నువ్వు అబద్ధమాడుతున్నావు. నేను నీ పక్కన లేకుండా నిన్ను పోనివ్వను"

ఆమె బుజాలెగరేసి అతణ్ని దాటుకుంటూ పోవడానికి ప్రయత్నించింది. కాని లాసన్ ఆమె చేయి పట్టుకుని ఆపాడు.

"నన్ను పోనివ్వు రాక్షసుడా" అన్నదామె సమోవా భాషలో

"నేను లేకుండా ఒంటరిగా ఎందుకు పోవాలనుకుంటున్నావు? పిచ్చిచేష్టలు చేయవద్దని ఇంతకు ముందే హెచ్చరించాను కదా"

ఎతెల్ తన పిడికిలి బిగించి లాసన్ ముఖం మీద గుద్దింది. అతడు తూలిపడబోయాడు.

అతనిలోని ప్రేమా ద్వేషమూ అన్నీ ఒక్కసారిగా విజృంభించాయి. తనను తాను నియంత్రించుకోలేక పోయాడు.

"నీకు మంచి గుణపాఠం చెప్తాను చూడు" అని దగ్గరే వున్న కొరడాను చేతికి తీసుకుని దానితో ఆమెను కొట్టాడు. ఆమె అరిచింది. ఆ అరుపు అతడిని పిచ్చివాణ్ని చేసింది. దాంతో ఆమెను కొరడాతో మళ్లీ మళ్లీ బాదటం మొదలు పెట్టాడు. ఇల్లంతా ప్రతిధ్వనించేలా ఎతెల్ అరుస్తుంటే ఆమెను తిడుతూ కొరడాతో కొట్టాడు. ఆమెను యెత్తి మంచం మీద పడేశాడు. ఎతెల్ నొప్పితో భయంతో వెక్కివెక్కి ఏడ్చింది. తర్వాత కొరడాను పారేసి బయటికి వెళ్లిపోయాడు. అతడు పోవటం చూసిన ఎతెల్ తన ఏడుపును ఆపింది. జాగ్రత్తగా చుట్టూ చూసి, మంచం మీంచి లేచింది. ఒళ్ళంతా పుండులా ఉంది. కాని, గాయం కాలేదు. తన డ్రెస్సు పాడయిందా అని పరీక్షగా చూసుకుంది. అక్కడి స్థానిక స్త్రీలు అట్లా దెబ్బలు తినటం మామూలు విషయమే. అతడు కొట్టడం ఆమె హృదయాన్ని గాయపరచలేదు. అద్దంలో చూసుకుని తలవెంట్రుకల్ని సరి చేసుకుంది ఆమె. కళ్లు మరీ ఆనందంతో వెలిగాయి. ఆ కళ్లలో ఒక విచిత్రమైన తీరు కనిపించింది. బహుశా అప్పుడామెకు అతనిపట్ల ప్రేమభావం కలిగిందేమో.

కానీ, లాసన్ చెట్ల మధ్య లోంచి వడివడిగా నడుస్తూ అకస్మాత్తుగా అలసిపోయి బలహీనుడైన చిన్నపిల్లవాడిలాగా ఒక చెట్టు మొదలు దగ్గర విసురుగా పడిపోయాడు. అతనికి భరించరానంత నిస్పృహ, అవమానం కలిగాయి. ఎతెల్ గురించి ఆలోచిస్తుంటే అతని ప్రేమలోని మృదుత్వం కారణంగా తన ఎముకలన్నీ మెత్తబడ్డట్టనిపించాయి. గతం గురించీ, జీవితం మీద తను పెట్టుకున్న ఆశల గురించీ ఆలోచించాడు. తాను యేం చేశాడో తల్చుకుని నిర్ఘాంతపోయాడు. ఎతెల్‌ను ఎప్పటికన్న యెక్కువగా కోరుకున్నాడు. ఆమెను తన చేతుల్లోకి తీసుకోవాలనుకున్నాడు. వెంటనే ఆమె దగ్గరికి పోవాలనుకుని లేచాడు. అప్పుడతడు యెంతగా బలహీనపడిపోయాడంటే, నడుస్తుంటే తూలి పడబోయాడు. అతడు యిల్లు చేరుకునే సరికి ఎతెల్ తమ పడకగదిలో అద్దం ముందు కూచుని వుంది.

"ఎతెల్ నన్ను క్షమించు, నేను సిగ్గుతో చితికిపోతున్నాను. కోపంలో ఏం చేస్తున్నదీ నాకు తెలీయలేదు" అని ఆమె ముందర మోకాళ్ల దగ్గర కూర్చుని భయంభయంగా ఆమె ఫ్రాకును చేయితో తాకాడు. తర్వాత మళ్లీ "నేనేం చేశానో తల్చుకుంటే భరించలేక పోతున్నాను. అది భయంకరంగా తోస్తోంది నాకు. నేను పిచ్చివాడిలా ప్రవర్తించా ననుకుంటా. నేను నిన్ను ప్రేమించినంతగా ప్రపంచంలో మరెవ్వరినీ ప్రేమించలేదు. తర్వాత ఏర్పడబోయే బాధనూ అవమానాన్నీ ఆపటం కోసమే నిన్ను కొట్టాల్సి వచ్చింది. నన్ను నేను ఎప్పటికీ క్షమించుకోలేను. నువ్వైనా నన్ను క్షమించు" అన్నాడు.

అంతకు ముందు ఆమె అరిచిన అరుపులు అతని చెవుల్లో ఇంకా గింగురుమంటూనే వున్నాయి. ఆ దృశ్యాన్ని అతడు భరించలేకపోతున్నాడు. ఎతెల్ మాత్రం అతడిని నిశ్శబ్దంగా చూస్తోంది. ఆమె చేతుల్ని తన చేతుల్లోకి తీసుకోవడానికి ప్రయత్నిస్తుంటే అతని కళ్లలోంచి కన్నీళ్లు కారాయి. పెరిగిన మానసిక క్షోభతో, అవమానంతో అతడు తన ముఖాన్ని ఎతెల్ ఒడిలో పెట్టి వెక్కివెక్కి ఏడుస్తుంటే నిస్సత్తువ నిండిన అతని దేహం వణికింది. ఎతెల్ ముఖం విపరీతమైన ద్వేషంతో నిండిపోయింది. మగాడు ఒక స్త్రీ ముందు మోకరిల్లితే స్థానిక జాతి యువతులు ఎట్లా అసహ్యించుకుంటారో అట్లా అసహ్యించుకుంది ఆమె తన మనసులో. అతడు మానసికంగా దుర్బలుడు అనుకుంది. తన ప్రవర్తనలో ఏదో చెప్పరాని విషయం వున్నట్టనిపించింది లాసన్‌కు. లాసన్ ఒక కుక్కలాగా ఆమె ముందు తన మోకాళ్ల మీద వంగాడు. ఆమె తిరస్కారంగా అతడిని చిన్నగా తన్నింది.

"ఇక్కడినుండి వెళ్లిపో. నువ్వంటే నాకసహ్యం" అన్నది. ఎతెల్‌ను పట్టుకోవడానికి ప్రయత్నించాడు లాసన్. కాని ఆమె అతణ్ని పక్కకి తోసింది. నిలబడి తన దుస్తుల్ని విడవసాగింది. చెప్పుల్ని దూరంగా తన్ని పారేసి స్టాకింగ్స్‌ను తీసేసింది. తర్వాత నైటీలోకి మారింది.

"ఎక్కడికి పోతున్నావు?" అని అడిగాడు లాసన్.

"నీకెందుకు? స్నానం చేయటం కోసం కొలనుకు పోతున్నాను".

"నన్ను కూడా నీతో రానీ " చిన్న పిల్లవాడిలాగా అడిగాడు.

"నన్ను కనీసం ఒంటరిగా స్నానమైనా చెయ్యనివ్వవా?"

ముఖాన్ని అరచేతుల్లో పెట్టుకుని ఘోరంగా ఏడ్చాడు లాసన్. కర్కశత్వం, ఉదాసీనత నిండిన కళ్లతో ఎతెల్ అతడిని దాటుకుంటూ బయటికి వెళ్ళిపోయింది. అప్పట్నుంచి ఆమె లాసన్‌ను చాలా అసహ్యించుకుంటూ వచ్చింది. ఆ చిన్న బంగళాలో లాసన్, ఎతెల్, వాళ్ల ఇద్దరు పిల్లలు, బ్రెవాల్డ్, అతని భార్య, తల్లి, ఎప్పుడూ ఆ యింట్లో తచ్చాడే దూరపు బంధువులు – అందరూ ఒక గుంపులాగా పైకి సఖ్యతతో బతుకుతున్నప్పటికీ, లాసన్ ఏ ప్రాధాన్యమూ లేని జీవితాన్ని సాగించాడు. అతణ్ని ఎవరూ అంతగా పట్టించుకోలేదు. అతడు పొద్దున టిఫిన్ తిన్న తర్వాత యింట్లోంచి బయటికి పోయి మళ్లీ రాత్రి భోజనానికి తిరిగి రాసాగాడు. అతడు తన పోరాటాన్ని వదులుకున్నాడు. డబ్బులు లేకపోవటం కారణంగా ఇంగ్లిష్ క్లబ్‌కు పోలేక ప్రతిసారీ ఇంట్లోనే బ్రెవాల్డ్‌తో, స్థానిక జాతీయులతో పేకాట ఆడాడు. తాగినప్పుడు తప్ప మిగతా సమయాల్లో నిస్సత్తువతో, ఒకరకమైన బెరుకుతో వున్నాడు. ఎతెల్ అతణ్ని ఒక కుక్కలాగా చూసింది. లాసన్ అప్పుడప్పుడు కనబరిచే ఉన్మాదం లాంటి ఉద్వేగాన్ని భరించింది. అటువంటి సందర్భాల్లో వాళ్లిద్దరి మధ్య చెలరేగే

ద్వేషం ఆమెను భయపెట్టింది. కాని తర్వాత అతడు కన్నీళ్లు కారుస్తూ నంగినంగిగా మాట్లాడుతుంటే అతని ముఖం మీద ఉమ్మి వేయాలన్నంత అసహ్యం కలిగిందామెకు. ఒక్కోసారి లాసన్ కోపంతో విజృంభించేవాడు. ఆమె దానికి సిద్ధమై వుండేది. లాసన్ ఆమెమీద చేయి చేసుకున్నప్పుడు ఆమె అతడిని కాళ్లతో తన్నడం, గోళ్లతో రక్కడం, పళ్లతో కొరకడం చేసేది. ఆ విధంగా వాళ్లిద్దరి మధ్య భయంకరమైన కొట్లాటలు జరిగేవి. లాసన్ కొన్నిసార్లు వాటిలో గెలవలేకపోయేవాడు. వాళ్లిద్దరి మధ్య పోట్లాటలు జరుగుతున్నాయనే విషయం కొద్ది కాలంలోనే ఏపియా పట్టణ ప్రజలందరికీ తెలిసి పోయింది. లాసన్ పట్ల వాళ్లు కొంచెం సానుభూతిని చూపేవారు. ముసలి బ్రెవాల్డ్ యెందుకు లాసన్‌ను తన యింట్లోంచి బయటికి గెంటివేయటం లేదా అని ఆశ్చర్యాన్ని వెలిబుచ్చారు హోటల్లో వుండే మనుషులు.

"బ్రెవాల్డ్ నికృష్టుడు. అతడు ఏదో ఒకరోజున లాసన్‌కు తన తడాఖా చూపిస్తాడు" అన్నాడు హోటల్లోని ఒకడు.

నిస్తబ్ధమైన ఆ కొలనులో స్నానం చేయడం కోసం ఎతెల్ యింకా అట్లానే వెళ్లసాగింది. మానవులు అనుభవించే ఆకర్షణకు భిన్నమైన ఆకర్షణను కొలను పట్ల ఆమె కలిగి వుందా అనిపించేట్టుగా వుంది ఆమె విధానం. అది ఒక జలకన్య ఎవరి హృదయాన్నైనా గెల్చుకున్నపుడు సముద్రంలోని చల్లని అలల పట్ల కలిగే ఆకర్షణ వంటిది. కొన్నిసార్లు లాసన్ కూడా ఆమెతో వెళ్లేవాడు.

అటువంటి సమయాల్లో లాసన్‌ను ఆమె యెంతగానో చీదరించుకునేది. అయినా అతడు ఎతెల్‌తో యెందుకు కొలనుకు పోవాలనుకునేవాడో అర్థం కాదు. బహుశా ఆ కొలను దగ్గరే తాను ఆమెను మొదటిసారిగా కలుసుకున్నాడు కనుక అక్కడే పారవశ్యాన్ని అనుభవించాలను కున్నాడో ఏమో. లేదా బహుశా తమను ప్రేమించిన వాళ్ల పట్ల ప్రేమను చూపే మనుషులకుండే పిచ్చితనం వల్లనేమో. తన మొండి పట్టుదలతో ప్రేమను కనబరచాలనే ఉద్దేశంతో కూడా కావచ్చును. ఒకరోజు తన హృదయంలో అరుదైన భావన కదలాడుతుంటే లాసన్ ఆ కొలను దగ్గరికి నడిచాడు. అతని హృదయంలో అకస్మాత్తుగా ప్రశాంతత చోటు చేసుకుంది. సాయంత్రం ముగుస్తుంటే సూర్యాస్తమయం ఒక చిన్న మబ్బులాగా కొబ్బరిచెట్ల ఆకులను అంటుకుని ఉన్న స్ఫురణ కలిగిందతనికి. ఒక చిన్న పిల్లతెమ్మెర వాళ్ళిద్దరి హృదయాలను నిశ్శబ్దంగా కదిలించింది. చంద్రవంక ఆ చెట్లమీద అలవోకగా కూచున్నట్లుంది ఆ దృశ్యం. లాసన్ గట్టుమీదికి నడిచాడు. ఎతెల్ నీళ్లలో వెల్లకిలా యీదుతోంది.

పొడవాటి వెంట్రుకలు నీళ్లమీద తేలుతుంటే ఒక చేయిలో పెద్ద మందారపువ్వును పట్టుకుంది ఆమె. ఒక్కక్షణం ఆ అందాన్ని ఆరాధించాడు లాసన్. ఎతెల్ ఒక దేవతలాగా కనిపించిందతనికి.

"హలో ఎతెల్" అని ఆనందంగా అరిచాడు లాసన్.

ఆమె అకస్మాత్తుగా అటు తిరిగి చేతిలోంచి పువ్వును జారవిడిచింది. అది నీళ్లమీద తేలుతూ కదలాడింది. ఆమె కొంత దూరం యీది, కింద వున్న నేల కాళ్ళకు తగలగానే నిలబడింది. "వెళ్లిపో, యిక్కణ్ణుంచి వెళ్లిపో" అన్నదామె.

లాసన్ నవ్వి, "అంత స్వార్థం పనికిరాదు నీకు. మనమిద్దరం కలిసి యీదటానికి ఎంతో జాగా వుంది" అన్నాడు ఉల్లాసంతో.

"ఆ వంతెన దగ్గరికి పో. నువ్విక్కడ ఉండటం నాకిష్టం లేదు."

"నువ్వట్లా అనడం విచారకరం" అన్నాడు ఇంకా నవ్వుతూనే. అతనిలో ఎంత మాత్రం కోపం లేదు. ఆమెలో ప్రేమ అన్నది అతనికి మచ్చుకైనా కనిపించలేదు. అయినా తన కోటును విడవసాగాడు.

"వెళ్లిపో ఇక్కణ్ణుంచి. నువ్విక్కడ ఉండొద్దు. కనీసం ఇక్కడైనా నన్ను ఒంటరిగా ఉండనివ్వవా? వెంటనే వెళ్లిపో" అన్నది ఎతెల్.

"అంత అవివేకం వద్దు నా ప్రియమైన ఎతెల్" అన్నాడు లాసన్.

ఆమె వంగి ఒక పదునైన రాయిని తీసుకుని లాసన్ మీదికి విసిరింది. దాన్నుండి తప్పించుకోవటానికి లాసన్‌కు సమయం లేకపోయింది. అది వచ్చి అతని కణతలో తగిలింది. బాధతో అరుస్తూ అతడు తన చేయిని కణతమీద వుంచాడు. తర్వాత చేయిని చూసుకుంటే అది రక్తంతో తడిసిపోయి వుంది. ఎతెల్ కోపంతో ఒగరుస్తూ ఇంకా నిలబడే వుంది. లాసన్ బాగా పాలిపోయాడు. ఒక్కమాట కూడా మాట్లాడకుండా తన కోటును తీసుకుని వెళ్లిపోయాడు. ఎతెల్ మళ్లీ నీళ్లమీద వెల్లకిలా యీదుతూ కొంచెం దూరాన వున్న చిన్న వంతెన దాకా పోయింది.

ఆ రాయి చిన్న రంధ్రం గల గాయాన్ని ఏర్పరచింది. లాసన్ దానిమీద ఒక బ్యాండేజీని వేయించుకుని కొన్నిదినాల పాటు దాంతోనే తిరిగాడు. క్లబ్బు దగ్గర మిత్రులెవరైనా దాని గురించి అడిగితే చెప్పటం కోసం ఒక కట్టుకథను సిద్ధంగా వుంచుకున్నాడు. కానీ ఎవరికీ దాన్ని చెప్పాల్సిన అవసరం రాలేదు. దెబ్బ ఎలా తగిలిందని ఎవ్వరూ అడగలేదు. వాళ్లు అనుమానం నిండిన చూపులతో మాత్రమే చూస్తూ ఒక్క ప్రశ్నను కూడా అడగటం లేదని గ్రహించాడు లాసన్. వాళ్ల మౌనం అతడిని ఇబ్బంది పెట్టింది. ఎందుకంటే వాళ్లకు అసలు విషయం తెలిసిపోయినందువల్లనే ఏమీ అడగటం లేదనుకున్నాడు. ఎతెల్‌కు ఒక

ప్రేమికుడున్నాడనీ, అతడెవరో వాళ్లందరికీ తెలుసుననీ కచ్చితమైన నిర్ధారణకు వచ్చాడు లాసన్. కానీ, ఆ వ్యక్తి ఎవరో తెలుసుకునేందుకు ఒక చిన్న ఆధారం కూడా దొరకలేదతనికి. ఎతెల్ పక్కన ఎప్పుడూ ఏ వ్యక్తినీ చూడలేదతడు. ఎవ్వరూ ఆమెతో ఎక్కడికైనా వెళ్లేందుకు ఆసక్తిని చూపలేదు. అటువంటి అనుమానాన్ని కలిగించే విధంగా ఎవరి ప్రవర్తనా వింతగా కనిపించలేదు. అతని మనసులో విపరీతమైన విద్వేషం చెలరేగింది. తన బాధను చెప్పటం కోసం యెవ్వరూ లేకపోవడంతో అతడు మరింత ఎక్కువగా మద్యం తాగటం మొదలు పెట్టాడు. నేను మరికొన్ని రోజుల తర్వాత ఆ ద్వీపానికి వస్తాననగా లాసన్‌కు మద్యపాన ప్రభావం తాలూకు డెలీరియమ్ ట్రెమెన్స్ అనే వ్యాధి వచ్చిందట.

ఏపియా పట్టణానికి మూడు మైళ్ల దూరంలో వుండే ఒక ఊర్లోని కాస్టర్ అనే ఆంగ్లేయుని ఇంట్లో ఎతెల్‌ను కలిశాను నేను. కాస్టర్ ఆ ద్వీపానికి చెందిన ఒక స్థానిక యువతిని పెళ్లి చేసుకున్నాడు. అతడూ నేనూ ఒకసారి టెన్నిస్ ఆడుతూ అలసిపోయినప్పుడు టీ తాగుదామన్నాడు కాస్టర్. ఇంట్లోని ఒక గదిలోపలికి పోయాము. ఆ గది అపరి శుభ్రంగా వుంది. అందులో కాస్టర్ భార్యతో ఎతెల్ మాట్లాడుతూ ఉండటం కనిపించింది.

"హలో ఎతెల్, నువ్వొచ్చినట్టు నాకు తెలియదు" అన్నాడు కాస్టర్.

ఆమెను ఆసక్తిగా చూడకుండా ఉండలేకపోయాను. లాసన్‌లో అంత పిచ్చి మోహాన్ని కలిగించే విషయం ఎతెల్‌లో ఏముందా అని పరిశీలించడానికి ప్రయత్నించాను. కాని ఇటువంటి విషయాలను ఎవరు స్పష్టంగా వివరించగలరు? ఆమె ఆకర్షణీయంగా ఉన్న దనటంలో అనుమానం లేదు. ఆ ద్వీపంలో చాలాచోట్ల కనపడే ఎర్రమందారంలాగా సొగసుగా ఉన్నదామె. కాని, ఆమెను గురించిన వృత్తాంతం అప్పటికే నాకు కొంచెం తెలిసివున్న నేపథ్యంలో నన్ను బాగా ఆశ్చర్యపరచిన విషయమేమంటే ఆమెలోని తాజాదనం, సాదాసీదాతనం ఎంతో ముద్దు గొలిపేలా ఉన్నాయి. ఆమె మౌనంగా వుండటమే కాక కొంచెం బిడియాన్ని ప్రదర్శించింది. ఆమెలో యెటువంటి మోటుతనం, అనవసరపు మాటకారితనం లేవు. మిశ్రమజాతి మనుషుల్లో సాధారణంగా కనిపించే అతిశయం, ఉత్సాహం ఆమెలో కనిపించలేదు. తన భర్తతో ఎతెల్ ఘోరంగా పోట్లాడుతుందని నేను విని ఉన్నప్పటికీ ప్రవర్తనలో దార్ష్టికం ఉన్న ఆడదానిలా ఆమె యెంతమాత్రం అగుపించలేదు.

ఎత్తు మడమల చెప్పుల్ని వేసుకుని అందమైన గులాబిరంగు ఫ్రాకును తొడుక్కున్న ఎతెల్ అచ్చం ఒక యూరోపియన్ స్త్రీలాగా వుంది.

సమోవా ద్వీపానికి కొత్తగా వచ్చినవాళ్లతో అక్కడివాళ్లు ఏం మాట్లాడుతారో అదే నాతో మాట్లాడింది. ప్రయాణం ఎలా సాగిందనీ, పాపాసియా అనే బండరాళ్ల దగ్గరి ప్రవాహపు నీళ్లలో మునిగారా అనీ, పట్టణంలో కాక పల్లెటూరులో వుంటారా అనీ ప్రశ్నలు వేసింది. స్కాట్లండు గురించి అడిగింది. తాను స్కాట్లండులో ఉండి వచ్చిన విషయాన్నీ,

అక్కడి తన యింటి పరిసరాల్నీ వివరించాలనే ఉద్దేశంతో ఆమె అలా అడిగిందా అని అనుమానం వచ్చింది నాకు. స్కాట్లండులో తనకు తెలిసిన కొందరు ఆంగ్లేయ స్త్రీల పేర్లను చెప్పి, వాళ్లు మీకు తెలుసా అని అమాయకంగా అడిగింది.

జర్మనీ, అమెరికా వారసత్వాలను కలిగిన లావుపాటి మిల్లర్ అంతలోనే అక్కడికి వచ్చాడు. సహృదయతను కనబరుస్తూ అందరి వైపూ చేయి ఊపి కూర్చుంటూ తనకు విస్కీ సోడా కావాలని ఉల్లాసంగా, బిగ్గరగా అడిగాడు. అతడు ఎంతో లావుగా వుండటం చేత బాగా చెమటలు కక్కుతున్నాడు. గోల్డ్ రిమ్ ఉన్న కళ్లద్దాలను తీసి వాటిని జేబురుమాలుతో తుడిచాడు. ఆ పెద్ద కళ్లద్దాల వెనుక కరుణరసాన్ని ఒలికించే అతని చిన్నకళ్లు కనిపించాయి. కాని వాటిలో చలాకీతనం, కపటత్వం ఉన్నట్లు తెలిసిపోతుంది చూసేవాళ్లకు. అతడు రాకముందరి దాకా అక్కడ కొంత మందకొడితనం చోటు చేసుకుంది. కాని మిల్లర్ ఉత్సాహం ఉన్న వ్యక్తే కాక, మంచిమంచి విషయాలను చెప్తాడు. కొంత సమయం గడవగానే మిల్లర్ చెప్పిన హాస్యపూరిత విషయాలను విని ఎతెల్, కాస్టర్ భార్యా హాయిగా నవ్వారు. మిల్లర్‌కు ఆ ద్వీపంలో ఆడవాళ్లను మాటల ద్వారా రంజింపచేసే మనిషి అని పేరు వుంది. లావుగా అసహ్యంగా ఉండే అటువంటి వ్యక్తి పట్ల కూడా ఆకర్షణ కలిగే అవకాశముందని తెలుస్తుంది అతని మాటల్ని వింటే. అతని హాస్యం తన చుట్టూ వున్న మనుషుల అవగాహనా స్థాయిని బట్టి మారుతుంటుంది. అందులో ఒక రకమైన శక్తీ, నిబ్బరమూ కనిపిస్తాయి. పాశ్చాత్య దేశాల భాష తాలూకు ఉచ్చారణ అతడు చెప్పే విషయానికి ఒక విచిత్రమైన గాంభీర్యాన్ని సమకూరుస్తుంది. ఆఖరుకు మిల్లర్ నావైపు తిరిగి, "రాత్రి భోజనం కోసం మనం ఏపియా పట్టణానికి తిరిగి వెళ్లి పోవాలనుకుంటే నా కారులో నేను మిమ్మల్ని తీసుకుపోతాను, ఒకవేళ అందుకు మీరు ఇష్టపడితే" అన్నాడు.

నేను కృతజ్ఞతలు చెప్పి లేచాను. అతడు మిగతావాళ్లతో చేతులు కలిపి గది బయటికి నడిచాడు. తర్వాత కారులో కూర్చున్నాడు.

"లాసన్ భార్య చిన్నగా యెంతో ముద్దొస్తూ వుంది కదా" అన్నాను మేం కారులో పోతుంటే

"లాసన్ ఆమెతో ఘోరంగా ప్రవర్తిస్తాడు. బాగా కొడతాడట. మగాడు స్త్రీని కొడతాడనే విషయాన్ని వింటే కోపంతో నా రోమాలు నిక్కబొడుస్తాయి" అన్నాడు మిల్లర్.

ఆ విషయం గురించి మేము కొంచెం మాట్లాడుకున్నాము. "ఆమెను పెళ్లి చేసుకోవడం అన్నది అతని మూర్ఖత్వం" అన్నాడు మిల్లర్.

అవి ఆ సంవత్సరపు ఆఖరిరోజులు. నేను సమోవా ద్వీపాన్ని వదిలి పోవాల్సిన

సమయం ఆసన్నమైంది. జనవరి నాలుగవ తేదీన నా పడవ సిడ్నీకి ప్రయాణం కావలసి వుంది. హోటల్లో క్రిస్మస్ వేడుకలు జరిగాయి. కాని, అవి కొత్త సంవత్సర ఉత్సవానికి నాంది లాగా జరిగాయే తప్ప వాటిలో విశేషం ఏమీ లేదు. హోటల్ లాంజ్‌లో గుమిగూడే అలవాటున్న వ్యక్తులు క్రిస్మస్ ఈవ్‌ను రాత్రంతా ఉల్లాసంగా గడపాలని నిశ్చయించు కున్నారు. ఆ రాత్రివేళ సందడీ, ఆర్భాటం నిండిన విందు తర్వాత అందరూ మెల్లగా నడుచుకుంటూ ఇంగ్లిష్ క్లబ్ వైపు వెళ్ళారు. అక్కడ బిలియర్డ్స్ ఆడాలని అనుకున్నారు. ఆ క్లబ్‌లో ఎన్నో మాటలు, నవ్వులు, బెట్టింగులు మొదలైన విషయాలతో వాతావరణం కోలాహలంతో నిండిపోయింది. అంతే తప్ప బిలియర్డ్స్ ఆట యెక్కువగా సాగలేదు. మిల్లర్ మాత్రం ఎక్కువగానే ఆడాడు. అక్కడ ఉన్న అందరూ అతని కన్న చిన్నవాళ్లే అయినా అతడు వాళ్ళతో సమానంగా తాగాడు. పైగా తాగివున్నా కూడా తన కన్నునూ చేయినీ చక్కగా ఉపయోగిస్తూ ఆటను సాగించాడు. హాస్యాన్నీ మర్యాదనూ కనబరుస్తూ, ఆ యువకుల డబ్బును గెలిచి తన జేబులో వేసుకున్నాడు. ఒక గంట సమయం గడిచింతర్వాత నాకు విసుగొచ్చి బయటకు నడిచాను. రోడ్డును దాటి బీచిమీదికి చేరుకున్నాను. అక్కడ మూడు కొబ్బరిచెట్లు తమ ప్రియుల కోసం వేచిచూస్తున్న నెలవంకల లాగా పెరిగి వున్నాయి. వాటిలోని ఒక కొబ్బరిచెట్టు మొదలు దగ్గర కూర్చుని, ఎదురుగా ఉన్న సముద్రపు నీటినీ, పైన ఆకాశంలో వున్న నక్షత్రాలనూ చూడటం మొదలు పెట్టాను.

సాయంత్రం పూట లాసన్ ఎక్కడున్నాడో నాకు తెలియదు. కాని, రాత్రి పది పదకొండు గంటల మధ్య అతడు క్లబుకు వచ్చాడు. మట్టికొట్టుకుపోయిన తోవ మీదుగా కాళ్లీడ్చుకుంటూ అనాసక్తతతో, విసుగుతో క్లబ్‌కు చేరుకుని మద్యం తాగటం కోసం బార్‌లోకి వెళ్లాడు. అక్కడ వున్న తెల్లవాళ్లలో కలిసిపోవాలంటే అతనికి సిగ్గనిపించింది. దాన్ని పోగొట్టుకోవడం కోసం మంచి విస్కీని తాగాలనుకున్నాడు.చేతిలో విస్కీ గ్లాసును పట్టుకుని నిల్చున్న లాసన్ దగ్గరికి మిల్లర్ వచ్చాడు. అతడు టీషర్ట్ తొడుక్కుని వున్నాడు. చేతిలో బిలియర్డ్స్ ఆట తాలూకు పొడుగాటి కర్ర వుంది. ఒక వెయిటర్ వైపు చూపును విసిరి “నువ్విక్కణ్ణుంచి వెళ్లిపో” అన్నాడతనితో.

తెల్ల షర్టు తొడుక్కుని వున్న ఆ వెయిటర్ ఒక్క మాట కూడా మాట్లాడకుండా బయటికి వెళ్లిపోయాడు.

“చూడు లాసన్. నీతో కొన్ని మాటలు మాట్లాడాలని అనుకుంటున్నాను” అన్నాడు మిల్లర్.

“ఈ ద్వీపంలో ఒక్క పైసా కూడా ఖర్చు లేకుండా చేయగలిగిన పని అదొక్కటే” అన్నాడు లాసన్.

మిల్లర్ తన కళ్లద్దాలను ముక్కుమీద నొక్కిపెట్టి, లాసన్‌మీద తదేక దృష్టిని నిలిపాడు. ఆ చూపులో ఎంత మాత్రం సహృదయత లేదు.

"చూడు బాబూ, నువ్వు ఎతెల్‌ను ఇంకా కొడుతున్నావట, దాన్ని నేను భరించలేను. అటువంటి పనిని నువ్వు తక్షణమే మానుకోకపోతే నీ ఎముకల్ని ముక్కలు చేస్తాను".

చాలా రోజులుగా తన మనసులో మెదులుతున్న ప్రశ్నకు సమాధానం దొరికినట్లయింది లాసన్‌కు. ఎవరా అని తను ప్రశ్నించుకుంటున్న వ్యక్తి మిల్లరే అన్నమాట అనుకున్నాడు. బట్టతలతో బాగా లావుగా ఉండి, బంగారు అంచు కళ్లద్దాలను పెట్టుకునే మిల్లరునూ, సన్నగా తీగలా ఉండే కన్య వంటి ఎతెల్‌నూ తల్చుకోగానే అతని మనసులో అకస్మాత్తుగా ఉద్వేగం, కోపం చోటు చేసుకున్నాయి. లాసన్ పిరికివాడు కాడు. అతడు ఒక్క మాట కూడా మాట్లాడకుండా మిల్లర్‌ను బలంగా కొట్టాడు. మిల్లర్ తాను కర్రను పట్టుకున్న ఎడమ చేత్తో ఆ దెబ్బను తట్టుకుని, బలమైన కుడిచేత్తో పిడికిలి బిగించి, అతి వేగంగా లాసన్ చెవిమీద పిడిగుద్దును వేశాడు. మిల్లర్ కన్న లాసన్ నాలుగంగుళాలు పొట్టిగా వుంటాడు. అతని శరీరం కూడా చిన్నదే. అది జబ్బు మూలంగా కాక తాగుడు కారణంగా బలహీనమై వుంది. అతడు కర్రదుంగలాగా కింద పడిపోయాడు. బార్ ద్వారం దగ్గర సగం స్పృహ తప్పి నేలమీద పడివున్నాడు. మిల్లర్ తన కళ్లద్దాలను జేబు రుమాలుతో తుడుచుకుంటూ "నీకు తెలుసనుకుంటాను. నిన్ను ముందే హెచ్చరించాను. దాన్ని నువ్వు పాటించడం మంచిది" అన్నాడు.

అతడు ఆ పొడుగాటి కర్రను తీసుకుని బిలియర్డ్స్ గదిలోకి పోయాడు. అప్పుడక్కడ చాలా గందరగోళం నెలకొనడంతో అసలేం జరిగింది ఎవ్వరికీ వెంటనే తెలియలేదు. లాసన్ లేచి నిలబడ్డాడు. నొప్పితో మండుతున్న చెవిమీద చేయిని పెట్టుకుని క్లబ్‌లోంచి బయటికి వెళ్లిపోయాడు. ఇదంతా చాలా సేపటి క్రితం జరిగింది. ఇప్పుడొక వ్యక్తి చీకట్లో రోడ్డును దాటుతూ నావైపు వస్తున్నాడు. కాని అతడు లాసనే అని తెలియలేదు. అతడు బీచ్ దగ్గరికి వచ్చి చెట్టు మొదట్లో కూచున్న నన్ను దాటుకుంటూ పోయాడు. అప్పుడు లాసన్‌ను గుర్తు పట్టాను. కాని అతడు తాగి వున్నాడనటంలో ఎలాంటి అనుమానం లేదు. కనుక నేనతనితో మాట్లాడలేదు. అతడు అనిశ్చయంగా రెండు మూడడుగులు ముందుకు వేసి, వెనుతిరిగాడు. నాదగ్గరికి వచ్చి వంగి, నాముఖంలోకి చూశాడు.

"లాసన్, వచ్చింది నువ్వే అని తెలుసు నాకు" అన్నాను. లాసన్ కింద కూచుని పొగాకు నిండిన పైపును బయటికి తీశాడు.

"క్లబ్బులో చాలా గోలగా, వేడిగా వుండింది" అంటూ మాట కలిపాను.

"ఇక్కడెందుకు కూచున్నావు?" అని అడిగాడు లాసన్.

"చర్చిలో అర్ధరాత్రి జరిగే ప్రార్థనలను వినడానికి పోవాలనుకుంటున్నాను".

"నీకిష్టమైతే నేను కూడా నీతో వస్తాను".

లాసన్ నిషాలో లేడు. మేమిద్దరం కొంతసేపు చీకట్లో నిశ్శబ్దంగా కూచుని పొగ తాగాము. ఎదురుగా వున్న సముద్రపు నీళ్లలో అప్పుడొకటి ఇప్పుడొకటీ పెద్ద చేప వేగంగా కదలటంతో శబ్దం వినపడుతోంది. ఇంకొంచెం దూరంలో సముద్రపుటొడ్డున వున్న ఓడలోంచి వెల్తురు బయటికి వస్తూ కనపడుతోంది.

"వచ్చే వారం మీరు పడవలో వెళ్లిపోతున్నారు కదా" అని అడిగాడు లాసన్

"ఔను" అన్నాను.

"మన సొంత యింటికి పోవడం ఎంతో ఆనందాన్నిస్తుంది. కాని అక్కడి చలికాలాన్ని నేను తట్టుకోలేను".

"ఇంగ్లండులో మనుషులిప్పుడు వణుకుతూ చలిమంట చుట్టూ చేరుతారని ఊహించడం విడ్డూరమే" అన్నాను.

ఒక్క గాలికెరటం కూడా వీచడంలేదు. వెచ్చని, ప్రశాంతమైన, ఆహ్లాదకరమైన ఆ రాత్రి మంత్రముగ్ధకరంగా వుంది. నేను సన్నని చొక్కా, మందమైన నిక్కరూ తప్ప మరేమీ వేసుకోలేదు. బద్ధకాన్ని అనుభవంలోకి తెస్తున్న ఆ రాత్రిని నేను ఆనందించాను. కాళ్లనూ, చేతులనూ బార్లా చాపుకున్నాను.

"భవిష్యత్తు కోసం చక్కని నిర్ణయాలు తీసుకునేట్టు చేసేలాగా లేదు ఈ క్రిస్మస్ ఈవ్" అని నవ్వాను.

లాసన్ సమాధానమివ్వలేదు. సరదా కోసం నేను అన్న వాక్యం అతని మనసులో ఎటువంటి ఊహలను రేపిందోకాని, అతడు మాట్లాడసాగాడు. మంద్రమైన స్వరంలో, ఎటువంటి ఉద్వేగాన్నీ కనబరచకుండా మాట్లాడాడు. కాని అసలైన విద్యావంతుని మాటల్లాగా వున్నాయి అతని వాక్యాలు. అసభ్యతను నింపుకున్న సొంపు లేని ఉచ్చారణలను వినీ వినీ విసిగిపోయిన నా చెవులకు ఒక పెద్ద ఉపశమనం దొరికినట్లైంది.

"నేను నా జీవితాన్ని చెడగొట్టుకున్నాననేది స్పష్టం. అవునా? ఒక లోతైన గుంత అడుగు భాగాన వున్నాను నేను. దాంట్లోంచి బయటికి రావడమంటూ ఉండదనుకుంటా. ఒక ధ్రువం నుండి మరొక ధ్రువం దాకా విస్తరించిన నల్లని చీకటి గుంత అది" అన్నాడు. ఆ కొటేషన్‌ను చెప్తూ లాసన్ నవ్వటం నేను గమనించాను. తర్వాత "ఇక్కడ చిత్రమైన విషయమేమిటంటే, నేనెక్కడ తప్పటడుగు వేశానో తెలియటం లేదు" అన్నాడు.

నేను ఊపిరి బిగపట్టాను. ఎందుకంటే ఒక వ్యక్తి నగ్నమైన తన ఆత్మను మరొకరి ముందుంచటం కన్న యెక్కువ అద్భుతమైన విషయం నాకు వేరొకటి ఉండదు. సానుభూతిని రగిలింపజేసే వెలుగురవ్వ ఉంటుంది అటువంటి మనసులో.

"తప్పంతా నాదేనని గుర్తిస్తే నా జీవితం ఇంత చండాలంగా ఉండకపోయేది. నేను తాగుబోతుగా మారానన్నది నిజమే. కాని పరిస్థితులు వేరే విధంగా వుంటే నేను తాగుడుకు బానిస అయ్యేవాణ్ని కాదు. నిజానికి మద్యం పట్ల నాకు అంతగా ఇష్టం వుండదు. నేను ఎతెల్‌ను పెళ్లి చేసుకోవాల్సింది కాదనుకుంటాను. ఆమెను ఉంపుడుకత్తెగా ఉంచుకుంటే అంతా సవ్యంగా ఉండేది. కాని నేనామెను అంత గాఢంగా ప్రేమించాను" అన్నాడు లాసన్. అతనిగొంతు తడబడింది. మళ్లీ ఇట్లా అన్నాడు. "నిజానికి ఎతెల్ అంత చెడ్డదేం కాదు. మొత్తం నా దురదృష్టం వల్లనే జరిగింది, అంతే. మేము దొరల్లాగా హాయిగా ఉండేవాళ్లమే. ఇంగ్లండులోని మా యింట్లోంచి ఎతెల్ పారిపోయినప్పుడు నేను ఊరుకోవాల్సిందేమో. కాని ఊరుకోలేక పోయాను. ఆమెను వదులుకోవద్దని గట్టిగా నిర్ణయించుకున్నాను. అప్పటికే మాకు ఒక బాబు కూడా ఉన్నాడాయె".

"ఆ బాబుపట్ల నీకు బాగా ప్రేమ వుందా?" అడిగాను.

"ఉండింది. తర్వాత ఒకరు పోయి ఇద్దరు పిల్లలయ్యారు. కాని ఇప్పుడు వాళ్లపట్ల నాకు అంతగా ప్రేమ లేదు. వాళ్లు ఎంత స్థానికుల్లాగా తయారయ్యారంటే, సమోవా భాషలోనే మాట్లాడాలి వాళ్లతో".

"జీవితాన్ని మళ్లీ కొత్తగా ప్రారంభించడానికి నీకు ఆలస్యమైందంటావా? ఈ జీవితాన్ని వదిలి కొత్త జీవితాన్ని నెలకొల్పుకోలేవా?"

"అంత ఆత్మబలం లేదు నాలో. నా బతుకు చట్టుబండలైంది".

"నీ భార్య పట్ల ఇంకా ప్రేమ వుందా నీకు?"

"ఇప్పుడు లేదు. ఇప్పుడు లేదు" గొంతులో ఒక రకమైన భయం ధ్వనిస్తుంటే ఆ పదాలను రెట్టించాడతడు. తర్వాత, "నేను పూర్తిగా ముక్కలయ్యాను" అన్నాడు.

చర్చిలో గంటలు మోగాయి.

"నువ్వు కూడా నాతో చర్చికి రావాలనుకుంటే రావచ్చు" అన్నాను

"సరే పదండి" అన్నాడు లాసన్.

మేము లేచి రోడ్డు వెంట నడిచాము. తెల్లగా, గంభీరంగా, ఆకర్షణీయంగా వున్న ఆ చర్చి సముద్రానికి ఎదురుగా వుంది. దానికెదురుగా వున్న చిన్నచిన్న గుడుల వంటి భవనాలు సమావేశ మందిరాల్లాగా కనపడుతున్నాయి. రోడ్డు మీద రెండు మూడు కార్లు, ఎన్నో బగ్గీలు వున్నాయి. చర్చి గోడ పక్కన మరెన్నో బగ్గీలు నిలబడి వున్నాయి. ఆ ప్రార్థన కోసం ద్వీపంలోని అన్ని చోట్లనుండి ప్రజలు వచ్చారు. ప్రధాన ద్వారంలోంచి చూస్తే లోపల చాలా మంది కిక్కిరిసి వున్న దృశ్యం కనిపించింది. ఎత్తైన వేదిక మీద కాంతి సమృద్ధిగా కురుస్తోంది. అక్కడ కొందరు తెల్లజాతీయులు, మరికొందరు మిశ్రమజాతి

వాళ్లు వున్నారు. కాని, స్థానిక జాతులవాళ్లే ఎక్కువగా ఉన్నారు. అందరూ ప్యాంట్లు తొడుక్కున్నారు. వెనుకాల ఉన్న కుర్చీల మీద కూర్చున్నాం మేము. లాసన్ దృష్టి సారిస్తున్న వైపు చూసి, అక్కడ ఎతెల్ తన జాతివాళ్ల గుంపులో వుండటం గమనించాను. వాళ్లందరూ అట్టహాసంగా కనిపించే దుస్తులు తొడుక్కున్నారు. బిరుసైన, పెద్ద పెద్ద కాలర్లతో వుండే షర్టులు తొడుక్కుని, తళతళ మెరిసే నల్లని బూట్లను వేసుకున్నారు. ఆడవాళ్లేమో పెద్దపెద్ద హ్యాట్లను తలమీద పెట్టుకున్నారు. ఎతెల్ ముందుకు నడుస్తూ తన స్నేహితురాళ్లను చూసి నవ్వింది. ముందర వున్న వేదిక దగ్గిరికి ఆమె నడిచి వెళ్ళింది. ప్రార్థన మొదలైంది.

ప్రార్థన ముగిసింతర్వాత జనం బయటికి వస్తుంటే నేనూ లాసనూ పక్కకు జరిగి నిలబడ్డాము. పోతూపోతూ లాసన్ తన చేయిని పైకెత్తి ఊపుతూ “గుడ్‌నైట్. మీ ప్రయాణం సుఖంగా సాగాలని కోరుకుంటున్నాను” అన్నాడు.

“ఓ, సరే కాని, వెళ్లే ముందు మళ్లీ కలుస్తాను కదా” అన్నాను.

అతడు నవ్వి, “కాని, అప్పుడు నేను తాగిన మైకంలో వుంటానా లేక నిషా లేకుండా వుంటానా అన్నదే ప్రశ్న” అన్నాడు.

అతడు వెనుతిరిగి వెళ్లిపోయాడు. దట్టంగా పెరిగిన కనుబొమ్మల కింద నల్లగా మెరిసే అతని పెద్ద కళ్లు మనసులో మెదిలాయి. కొంచెం తటపటాయించి ఆగాను. నాకు ఇంకా నిద్ర రావటం లేదు.కనుక క్లబ్బులో ఒక గంటసేపు గడిపి హోటలుకు పోవాలనుకున్నాను. క్లబ్బును చేరుకోగానే బిలియర్డ్స్ గది ఖాళీగా కనిపించింది.కాని ఐదారుగురు మనుషులు ఒక టేబులు చుట్టూ కూచుని పోకర్ అనే పేకాట ఆడుకుంటున్నారు. నేను లోపలికి వెళ్ళగానే మిల్లర్ నన్ను చూసి “కూర్చుని ఒక గేమ్ పోకర్ ఆడండి” అన్నాడు.

“సరే” అని కూచున్నాను.

కొన్ని చిప్స్ కొనుక్కుని పోకర్ ఆడటం మొదలు పెట్టాను. అది అత్యంత ఆహ్లాదాన్నిచ్చే ఆట కనుక ఒక గంటకు బదులు మరోగంట, ఆతర్వాత మరో గంట సేపు ఆడాను. బారులో పనిచేసే స్థానికుడైన వెయిటర్ ఒకడు బాగా రాత్రైపోయినా ఆ విషయాన్ని లెక్క చేయక మా పక్కనే వుండి మాకు కావలసిన మద్యాన్నీ, తినుబండారాలనూ సప్లై చేశాడు. ఆ విధంగా బ్రెడ్డూ, మటన్ కర్రీ దొరికాయి మాకు. మేము ఆడుతూ పోయాము. ఆడేవాళ్లలో చాలా మంది మరీ ఎక్కువగా తాగటంతో ఆట గందరగోళంగా సాగింది. నేను ఓ మోస్తరుగా ఆడాను. తప్పక గెలవాలనే పట్టుదల కానీ, ఓడిపోతానేమోనని భయం కానీ కలుగలేదు నాకు. కాని ఒక ప్రత్యేకమైన ఆసక్తితో మిల్లర్‌ను గమనించాను. తక్కినవాళ్లు ఎంత తాగితే మిల్లర్ వాళ్లతో సమానంగా తాగాడు. అయినా అతడు నిషా తలకెక్కి ఔటవలేదు. అతని ముందర చిప్స్ గుట్టగా పేరుకుని పోయాయి. ఎవరికి ఎంతెంత డబ్బు అరువిచ్చిందీ ఒక

చిన్నతెల్లని కాగితం మీద రాసుకున్నాడు. ఎవరి డబ్బునైతే తాను గెల్చుకుంటున్నాడో ఆ యువకులవైపు సౌహార్దం నిండిన చూపును విసురుతున్నాడు. ఎడతెరిపి లేకుండా చిన్న చిన్న పిట్టకథలనూ నవ్వు తెప్పించే వృత్తాంతాలనూ చెప్తున్నా ఒక గేములో కూడా ఓడిపోలేదతడు. ఆఖరుకు కిటికీల్లోంచి సూర్యకిరణాలు హెచ్చరించే బిడియంతో లోపలికి దూరి 'ఇక తెల్లారిపోయింది కనుక ఆటను ఆపేయండి' అన్నాయి.

"పోయిన సంవత్సరాన్ని చాలా బాగా గడిపాము మనం. ఇప్పుడు చివరగా ఒక ఆటను వేసుకుని దాంతర్వాత ఆపేద్దాం. నేను దోమతెరను వేసుకుని పడుకోవాలి. నా వయసు యాభై అనే విషయాన్ని మీరు మరిచిపోవద్దు. రాత్రంతా మేలుకొని వుంటే మరునాడు పొద్దు చాలా సేపు పడుకోకుండా ఉండలేను నేను" అన్నాడు మిల్లర్.

అందంగా, తాజాగా వున్న ఆ ఉదయాన మేము వరండాలో నిల్చుని చూస్తే ఎదురుగా వున్న సముద్రపు నీటి తలం ఒక రంగురంగుల గాజుదిమ్మలాగా కనిపించింది. పడుకోబోయే ముందు ఆ నీళ్లలో స్నానం చేసి వద్దామని ఎవరో అన్నారు. కాని, పాదాలను జారేట్టు చేసే ఆ ఉప్పునీళ్లలో స్నానం చేయడం పట్ల ఎవ్వరూ ఆసక్తిని చూపలేదు. ద్వారం దగ్గర వున్న తన కారులో మమ్మల్ని కొలను దాకా తీసుకుపోతానన్నాడు మిల్లర్. మేమందులోకి దూరి, నిర్మానుష్యంగా వున్న రోడ్డు మీదుగా ప్రయాణించాము. కొలను దగ్గరికి చేరుకుని చూస్తే అక్కడ ఇంకా సూర్యోదయమైనట్టు లేదు. ఎక్కువ లోతు లేని నీళ్లలో చెట్లు మొలిచివున్నాయి. రాత్రి తాలూకు చీకటి ఇంకా కొంచెం మిగిలిపోయి దాక్కుని వున్నట్టనిపించింది. మేమంతా చాలా ఉత్సాహంగా ఉన్నాం. టవళ్లు తెచ్చుకోలేదు కనుక స్నానం చేసిం తర్వాత శరీరాన్ని ఎట్లా తుడుచుకోవాలి అని ఆలోచించాను నేను. అందరం పొట్టిపొట్టి దుస్తుల్ని వేసుకున్నాం కనుక వాటిని విప్పటానికి మాకు ఆలస్యం కాలేదు. ఓడమీద పని చేసే నెల్సన్ మొదటగా బట్టల్ని విడిచాడు.

"నేను నీటి అడుగు భాగాన్ని తాకబోతున్నాను" అన్నాడతడు. అతడూ, అతని వెనుక మరొకడూ నీళ్లలోకి దూకారు. కాని లోతు యెక్కువగా లేకపోవడంతో నెల్సన్ వెంటనే నీటి ఉపరితలం మీదికి వచ్చాడు. ఇంకా పైకి పక్కకు ఒరిగిపోతున్నాడు.

"నన్ను బయటికి లాగండి" అన్నాడు నెల్సన్.

"ఏమైంది?"

ఏదో విచిత్రమైన సంగతి వున్నట్టనిపించింది. అతని ముఖంలో భయం కనిపించింది. ఇద్దరు మనుషులు తమ చేతుల్ని అందించి నెల్సన్‌ను బయటికి లాగారు.

"నీళ్ల అడుగున ఒక వ్యక్తి వున్నాడు" అన్నాడు నెల్సన్.

"పిచ్చివానిలా మాట్లాడకు. నీకు నిషా ఎక్కువైంది".

"నేనన్నది తప్పు అయితే నిజంగా నేను పిచ్చివాణ్నే అనుకోండి. కాని నేను చెప్తున్నది వాస్తవం. విపరీతమైన భయం కలిగింది నాకు" అన్నాడతడు.

మిల్లర్ వచ్చి నెల్సన్‌ని చూశాడు. నెల్సన్ ముఖం పూర్తిగా పాలిపోయి వుంది. అతడు భయంతో వణుకుతున్నాడు.

"కాస్టర్, ఇటురా. మనమిద్దరం నీళ్లలోకి పోయి సంగతేమిటో చూద్దాం" అన్నాడు మిల్లర్.

"అతడు నిలబడి వున్నాడు. డ్రెస్సు తొడుక్కునే వున్నాడు. నన్ను పట్టుకోవడానికి ప్రయత్నించాడు కూడా" అన్నాడు నెల్సన్.

"నీ గోల ఆపు. కాస్టర్, నువ్వు సిద్ధమేనా?" అని అడిగాడు మిల్లర్.

వాళ్లిద్దరూ నీళ్లలోకి దిగారు. మేము ఒడ్డున నిలబడి వేచి చూశాం. ఏ మనిషి ఐనా శ్వాసను ఆ ఎంత సేపు ఆపివుంచగలడో అంతకన్న ఎక్కువ సేపే వాళ్లిద్దరూ నీటిలోపల ఉన్నట్టనిపించింది మాకు. మొదట కాస్టర్ బయటికి వచ్చాడు. వెనువెంటనే మూర్ఛిల్లబోతున్నాడా అనిపించే ఎర్రని ముఖంతో మిల్లర్ వచ్చాడు. వాళ్లిద్దరూ నీళ్లలోంచి దేన్నో లాగుతున్నారు. మాలోంచి మరొకడు వెళ్లి వాళ్లకు సాయం చేశాడు. ముగ్గురూ కలిసి భారంగా లాగారు. అది లాసన్ శవమని అప్పుడు తెలిసింది మాకు. రెండు కాళ్లనూ తాడుతో కట్టుకోవడమే కాక, కోటును కూడా తాడుతో ఒక పెద్ద బండకు కట్టుకున్నాడు లాసన్.

"ఈ పని చేయాలని లాసన్ గట్టిగా నిర్ణయించుకున్నాడు" అన్నాడు మిల్లర్ తన కళ్లమీది నీళ్లను తుడుచుకుంటూ.

## 5

# సర్వజ్ఞుడు

**(Mr. Know All)**

**మా**క్స్ కెలాడాను ఇష్టపడకపోవడానికి నేను ముందే సిద్ధపడి వున్నాను. యుద్ధం అప్పుడే ముగియటంతో, ఓడలపై ప్రయాణించే మనుషుల రద్దీ చాలా ఎక్కువగా ఉంది. ఓడల్లో మంచి వసతి దొరకటం కష్టంగా వుండటం వల్ల ట్రావెల్ ఏజెంట్లు ఏది యిస్తే దాన్నే తీసుకోవాల్సిన పరిస్థితి. విడిగా ఒక క్యాబిన్ దొరకదు కనుక, రెండు పడకలున్న ఓ క్యాబిన్ దొరికినందుకు సంతోషించాను. కాని, నా సహప్రయాణికుని పేరు తెలుసుకోగానే నా హృదయం నీరసంగా మూల్గింది. కిటికీలు మూసివేయబడి కొత్తగాలి రాక ఊపిరాడనట్టుంటుందా పరిస్థితి, అని భయపడ్డాను. పద్నాలుగు రోజులుపాటు నాతో కలిసి ప్రయాణం చేసే వ్యక్తి పేరు స్మిత్ కాని బ్రౌన్ కాని అయివుంటే బాగుండేదనుకున్నాను.

ఓడలోని క్యాబిన్‌లోకి వెళ్లింతర్వాత చూస్తే, అప్పటికే మిస్టర్ కెలాడా గారి సరంజామా వుందక్కడ. ఆ దృశ్యం నాకెంత మాత్రం నచ్చలేదు. ఒక్కో సూట్‌కేస్ మీద ఎన్నో లేబుళ్లున్నాయి. వార్డ్‌రోబులో పెట్టబోయే ట్రంకు పెట్టె మరీ పెద్దదిగా వుంది. టాయిలెట్లో వున్న సెంటు సీసా, షాంపూబాటిలూ మొదలైన అతని వస్తువుల్ని చూశాక, మాన్సియర్ కోటీ అనే కంపెనీ ఉత్పత్తులకు అతడొక పెద్ద అభిమాని అని అర్థమైంది నాకు. మిస్టర్ కెలాడా వాడే బ్రష్షులు ఎబోనీ అనే చెక్కతో చేయబడి వాటిమీద బంగారు రంగు అక్షరాలున్నాయి. కాని అవి దంతాలను కాక, వేరే ఏదైనా వస్తువును శుభ్రం చేయడానికి పనికొస్తాయని అనిపించింది. మిస్టర్ కెలాడాను నేనెంత మాత్రం యిష్టపడలేదు. సిగరెట్ తాగడానికి కేటాయించబడిన గదిలోకి వెళ్లాను. ఒక పేకముక్కల సెట్టును తెప్పించి,

నాతో నేనే పేషెన్స్ అనే ఆటను ఆడటం ప్రారంభించాను. అంతలోనే ఒక వ్యక్తి లోపలికి వచ్చి, నా పేరును అడిగాడు.

"నా పేరు మిస్టర్ కెలాడా" అంటూ అతడు నవ్వినపుడు ఒక మెరిసే దంతాల వరుస కనపడింది. అతడు కూర్చున్నాడు.

"మనమిద్దరం ఈ క్యాబిన్ను షేర్ చేసుకోబోతున్నామనుకుంటా" అన్నాను.

"దీన్నే అదృష్టం అంటాను. మీరు ఆంగ్లేయులని తెలియగానే నాకు సంతోషమైంది. విదేశాలకు పోతున్నప్పుడు ఇంగ్లిష్ వాళ్లతో కలిసి ప్రయాణం చేయడం బాగుంటుంది. నాఉద్దేశం మీకు అర్థమైందనుకుంటాను"

నేను కళ్లు మిటకరించాను.

"మీరు ఆంగ్లేయులా?" అని అడిగాను, బహుశా యుక్తిని కోల్పోయి.

"అవును. నేనొక అమెరికన్ లాగా కనిపించడం లేదు కదా. సంపూర్ణంగా ఇంగ్లిష్ వాణ్నే" అన్నాడు.

తాను చెప్పిన విషయాన్ని నిరూపించడం కోసం కెలాడా తన జేబులోంచి పాస్‌పోర్టును తీసి, నా ముఖం దగ్గరికి తెచ్చి, ఉల్లాసంగా ఊపాడు దాన్ని.

కెలాడా పొట్టిగా, లావుగా వుంటాడు. అతడు ఇంగ్లిష్‌లో మాట్లాడాడు. కాని, ఆ మాట్లాడ్డంలో ఇంగ్లిష్ తనమేదీ కనిపించలేదు.

"ఏం తీసుకుంటారు?" అని అడిగాడు.

అతని వైపు అనుమానంగా చూశాను. మద్యనిషేధం అమలులో వున్న రోజులు అవి. ఓడ వాలకం చూస్తే అక్కడ ఒక్క మద్యపు చుక్క కూడా దొరకదనిపించే విధంగా వుంది. దాహంగా లేనప్పుడు నేను ఏ డ్రింకును కోరుకోనో కచ్చితంగా చెప్పలేను. కెలాడా తూర్పుదేశాల తాలూకు ఒక నవ్వును నా వైపు విసిరాడు.

"విస్కీతో సోడా, డ్రై మార్టినీ – ఈ రెండే వున్నాయి. ఏది కావాలో చెప్పాలి మీరు" అన్నాడు. తన రెండు ప్యాంటు జేబుల్లోంచి రెండు సీసాలను తీసి, వాటిని టేబులు మీద పెట్టాడు. మార్టిని కావాలన్నాను నేను. అతడు ఓడ సిబ్బందిలోని ఒకణ్ని పిలిచి, ఓ రెండు గ్లాసులనూ కొన్ని ఐసు ముక్కలన్నీ తీసుకురమ్మని చెప్పాడు.

"చాలా మంచి కాక్‌టెయిల్" అన్నాను.

"ఇవి దొరికిన చోట ఇంకా చాలా రకాల మద్యం సీసాలున్నాయి. ఓడలో మీ స్నేహితులెవరైనా వుంటే, ప్రపంచంలోని మద్యాన్నంతా తెచ్చిపెట్టగలిగే మిత్రుడొకడు మీకు వున్నాడని చెప్పండి."

కెలాడా వదరుబోతు లాగా మాట్లాడుతున్నాడు. అతడు న్యూయార్కు గురించీ, శాన్ ఫ్రాన్సిస్కో గురించీ మాట్లాడాడు. ఆటలనూ, సినిమాలనూ, రాజకీయాలనూ చర్చించాడు. అతనికి దేశభక్తి బాగా వుందని నాకు అర్థమైంది. ఇంగ్లండ్ దేశపు జెండా పవిత్రమైనదే కాని, ఇతర దేశస్థులెవరైనా దాని గురించి మాట్లాడితే అది కొంచెం అవమానకరంగా వుంటుందని నా అభిప్రాయం. మిస్టర్ కెలాడాతో నాక్కొంచెం పరిచయమేర్పడిన మాట వాస్తవమే కాని, అంతకుముందు నాకు బాగా తెలియనివాడు నా పేరును పలుకుతున్నప్పుడు దాని ముందు మిస్టర్ అనేపదాన్ని పెడితేనే బాగుంటుందని అనుకున్నాను. నాకు బెరుకు లేకుండా చేయటం కోసం కెలాడా అటువంటి మర్యాదను పాటించలేదేమో. అయినా కెలాడా పట్ల నాకెంత మాత్రం సదభిప్రాయం కలుగలేదు. అతడు క్యాబిన్‌లోకి రాగానే పేకముక్కల్ని పక్కన పడేశాను కాని, కెలాడా నిరంతరంగా మాట్లాడటం గమనించి, నా ఆటను మళ్లీ కొనసాగించాను. నేను ఆడుకుంటుంటే "ఫలానా ముక్కను తీసుకోండి" అంటూ పదే పదే అతడు నాకు సూచన లివ్వడం చిరాకును తెప్పించింది. కోపంతో అసహ్యంతో నాహృదయం సహనాన్ని కోల్పోవడంతో ఆటను మూసేశాను. అతడు ఆ కార్డు ముక్కల్ని చేతిలోకి తీసుకుని, "మీకు పేకముక్కలతో చేసే ట్రిక్కులు ఇష్టమేనా?" అని అడిగాడు.

"ఉహూ, అవంటే నా కసహ్యం" అన్నాను.

"ఒక్కటే చూపిస్తాను మీకు"

మూడు ట్రిక్కుల్ని చూపించాడు. సీటు దొరికించుకోవడం కోసం కింద వున్న డైనింగ్ రూములోకి పోతానని అన్నాను అతనితో.

"సరే, కాని మీకోసం నేను ముందే ఒక సీటును రిజర్వు చేశాను. మనమిద్దరం కలిసి ప్రయాణిస్తున్నాం కనుక, ఒకే టేబులు మీద తింటే బాగుంటుందని అనిపించింది".

కెలాడా పట్ల నాకెంత మాత్రం ఇష్టం కలుగలేదు. అతని తీరు వల్ల నేను ఓడలో ఏకాంతంగా తిరగలేకపోయాను. అతణ్ని నిరాకరించలేకపోయాను. అతడు మన సొంత యింట్లోకి వచ్చి ఇట్లా ప్రవర్తిస్తే, బహుశా మెట్లమీంచి తోసేసి తలుపు పెట్టుకుంటాము. మంచి కలుపుగోలు మనిషి కావటం చేత, మూడు రోజుల్లోనే అతడు ఓడలోని అందరితో పరిచయం చేసుకున్నాడు. ఓడలో జరిగే ఆటలు, పాటకచేరీలు మొదలైన అన్ని వ్యవహారాల్లో పాలు పంచుకున్నాడు. మేమంతా అతనికి 'సర్వజ్ఞుడు' అని పేరు పెట్టి, అలానే పిలిచాము. కాని, దాన్ని అభినందనగా తీసుకున్నాడతడు. భోజనాల దగ్గర మరీ భరించరాని వాడయ్యాడు. అతనికి ఓడలోని ప్రతి విషయం గురించి ఇతరులకన్నా ఎక్కువగా తెలుసు.

ఈ విషయంలో ఎవరైనా విభేదిస్తే దాన్ని పొగరుగా భావిస్తాడు. ప్రతి విషయం గురించి ధారాళంగా మాట్లాడి, తన ఆలోచనా విధానంలోకి మనను తేవడానికి ప్రయత్నిస్తాడు. తన అభిప్రాయం తప్పు అయ్యే అవకాశం ఉందని అతనికెప్పుడూ అనిపించదు. మేము ఒక డాక్టరుగారి టేబులు దగ్గర కూచున్నాం. ఆ డాక్టరు ఎక్కువగా మాట్లాడే ఓపిక లేని సోమరి. నేనేమో మొండిగా అతణ్ని పట్టించుకోకుండా కూచున్నాను. రామ్సే అనే ఒక వ్యక్తి మాత్రం మాకు భిన్నంగా కనిపించాడు. కెలాడాతో సమానంగా మొండిగా వుండి, మాటలతో అతణ్ని గట్టిగా ఎదుర్కొంటున్నాడు. వాళ్లిద్దరి మధ్య ఎడతెగని విద్వేషపూరితమైన చర్చలు జరిగాయి.

కోబే పట్టణంలోని అమెరికన్ కాన్స్యులేటులో పనిచేస్తున్నాడు రామ్సే. అతడు న్యూయార్కుకు వెళ్లి, ఒక సంవత్సరం నుండి అక్కడ ఒంటరిగా వుంటున్న తన భార్యను తీసుకుని తిరిగి కోబేకు పోతున్నాడు. ఆమె చాలా అందంగా వుండటమే కాక, అందరితో మర్యాదగా ప్రవర్తిస్తోంది.ఆమెలో వినయం కూడా కనిపించింది.

ఒక సాయంత్రం భోజనాల దగ్గర చర్చ ముత్యాల మీదికి వెళ్లింది. జపాను వారు నకిలీ ముత్యాలను తయారు చేయడంవల్ల ధరను తగ్గించక తప్పింది కాదని డాక్టరు ఒక వ్యాఖ్య చేశాడు. తన అలవాటు ప్రకారం కెలాడా వెంటనే చర్చలోకి దూరాడు.అతడు మా అందరినీ ఉద్దేశించి ముత్యాల గురించి పెద్ద ప్రసంగం చేశాడు. రామ్సేకు ముత్యాల గురించి పెద్దగా తెలుసునని నేననుకోను. కాని అదే అవకాశమనుకుని, అతడు రెచ్చిపోయి వాదించాడు. ఐదు నిమిషాల్లో పెద్ద రగడ ఏర్పడింది. కెలాడా ముందరి కన్న యెక్కువగా విజృంభించి, తన తీవ్రమైన వాదనను వినిపించాడు. ఆఖరుకు రామ్సే మాట్లాడిన ఒక వాక్యంతో ఉగ్రుడై, బల్లమీద చేత్తో గట్టిగా గుద్ది ఇలా అన్నాడు "నేనేం మాట్లాడుతున్నానో నాకు బాగా తెలుసు. ఈ ముత్యాల వ్యాపారం పని మీదనే జపానుకు వెళ్తున్నాను. ముత్యాల గురించి నేను చెప్పేది ఏదీ తప్పు కాదనే విషయాన్ని ఈ వ్యాపారంలో వున్న ప్రతివాడూ ఒప్పుకుంటాడనేది నిజం. ప్రపంచంలో ఉన్న అన్ని రకాల ముత్యాల గురించి నాకు బాగా తెలుసు. ఒకవేళ తెలియనిదేమైనా వుంటే అది తెలుసుకో తగింది కాదు, అంతే". తర్వాత కెలాడా విజయగర్వంతో చుట్టూచూసి, "ముత్యాలకు సంబంధించి నంత వరకు వాటి విషయంలో నేను నిపుణుణ్ని" అన్నాడు.

"ఒంటి కంటితో చూసి ముత్యాల నాణ్యతను గుర్తించగలిగే నావంటి ప్రవీణుడు మరొకడు లేడు" అని, రామ్సే భార్య ధరించిన ముత్యాల హారం వైపు వేలును చూపిస్తూ, "మిసెస్ రామ్సే, మీరు మెడలో వేసుకున్న ఆ ముత్యాలహారం చాలా విలువైనది" అన్నాడు.

ఆమె కొంచెం అణకువను కనబరుస్తూ ఆ హారాన్ని తన డ్రెస్సు లోపలికి తోసింది. రామ్సే కొంచెం ముందుకు వంగి, మెరిసే కళ్లతో అందరివైపు ఒక చూపును విసిరి, "ఆ హారం ముద్దొచ్చే విధంగా వుంది కదా" అన్నాడు.

"నేను దాన్ని వెంటనే గుర్తించాను. అవి నిజమైన ముత్యాలు అని మనసులోనే అనుకున్నాను" అన్నాడు కెలాడా.

"ఆ హారాన్ని నేను కొనలేదు. మీ బేరీజు ప్రకారం దాని విలువ ఎంత వుంటుందో తెలుసుకోవాలని ఉంది" అన్నది మిసెస్ రామ్సే.

"మామూలు దుకాణాల్లో అయితే పదిహేను వేల డాలర్లకు కొంచెం అటు ఇటుగా వుండొచ్చు. కాని అధునాతనమైన పెద్ద దుకాణంలో అయితే ముప్పైవేల డాలర్లదాకా వుంటుంది"

రామ్సే చిన్నగా నవ్వాడు.

"రెండు మూడు రోజుల క్రితమే నా భార్య దాన్ని ఒక సూపర్ మార్కెట్లో పద్దెనిమిది డాలర్లకు కొన్నది. ఈ సంగతి మీకు ఆశ్చర్యాన్ని కలిగించవచ్చు."

మిస్టర్ కెలాడా తడబాటుతో, "శుద్ధ అబద్ధం. అది నిజమైందే కాక, అంత మంచి సైజులో ఉన్న ముత్యాలను నేనింత వరకు చూడలేదు" అన్నాడు.

"పందెం కడతారా? అది నకిలీ ముత్యాల హారమని నేను వంద డాలర్ల పందెం కాస్తాను" అన్నాడు రామ్సే.

"ఓకే.పందెం" అన్నాడు కెలాడా.

"అది వాస్తవమైనప్పుడు పందెం కట్టే అవసరమే లేదు" అన్నది రామ్సే భార్య.

ఆమె పెదవుల మీద చిన్న నవ్వు నెలకొంది. కంఠస్వరం వారించే విధంగా ఉన్నది.

"పందెం కాయొద్దా? సులభంగా డబ్బును సంపాదించే అవకాశం వచ్చినప్పుడు దాన్ని పోగొట్టుకోవడం మూర్ఖత్వమే" అన్నాడు రామ్సే.

"కాని ఎలా రుజువు చేస్తాం? కెలాడా అన్నదానికి నేను కేవలం వ్యతిరేకంగా మాట్లాడుతున్నానంతే".

"నేను దాన్ని పరీక్షగా చూడాలి. ఒకవేళ అది నకిలీదైతే వెంటనే చెప్పేస్తాను. వంద డాలర్లను పోగొట్టుకోవడం నాకు పెద్ద సమస్యేమీ కాదు.

"డార్లింగ్, తీసివ్వు. దాన్ని ఆయన ఎంతసేపైనా పరీక్షించుకోనీ".

మిసెస్ రామ్సే ఒక్క క్షణం సేపు తటపటాయించింది. ఆమె ఆ హారం మీద చేయిని పెట్టి, నొక్కి పట్టుకుంది.

"దాన్ని తీయలేను. మిస్టర్ కెలాడా నా మాటని నమ్మాలి, అంతే".

ఏదో దురదృష్టకరమైన సంఘటన జరగబోతున్నదని అకస్మాత్తుగా అనిపించింది నాకు. కాని సరిగ్గా ఏమీ అనలేకపోయాను.

రామ్సే ఒక్క ఉదుటన ఎగిరి, "నేను తీస్తాను" అన్నాడు.

ఆ హారాన్ని తీసి యిచ్చాడు. ముత్యాల నిపుణుడైన కెలాడా తన జేబులోంచి ఒక భూతద్దాన్ని తీసి, దాని సహాయంతో ఆ హారాన్ని జాగ్రత్తగా పరిశీలించాడు. అతని నున్నని, నల్లని ముఖం మీద గెలుపు తాలూకు నవ్వు మెరిసింది. దాన్ని తిరిగి యిస్తూ ఏదో మాట్లాడబోయాడు. అకస్మాత్తుగా అతడు రామ్సే భార్య ముఖాన్ని చూశాడు. ఆమె ముఖం యెంతగా పాలిపోయిందంటే, స్పృహ తప్పి పడిపోతుందా అనిపించిందతనికి. కెలాడా వైపు భయం నిండిన కళ్లతో చూసింది ఆమె. ఆ కళ్లల్లో నిరాశతో కూడిన ఒక వేడికోలు వున్నట్లు స్పష్టంగా కనబడుతున్నా రామ్సే దాన్ని యెందుకు గమనించడం లేదని ఆశ్చర్యపోయాను నేను.

కెలాడా నోరు తెరిచి ఆగిపోయాడు. అతని ముఖం మీద బాగా చెమట ఏర్పడింది. తనను తాను సంబాళించుకోవడానికి యెంతగా యాతన పడ్డాడో స్పష్టంగా తెలిసింది.

"అవును, నేనే పొరపాటు పడ్డాను. గుర్తించలేనంతగా బాగా అనుకరించి ఈ ముత్యాలను తయారు చేశారు. భూతద్దంలోంచి చూడగానే అది నకిలీదని అర్థమైంది. దాని విలువ నిజంగానే పద్దెనిమిది డాలర్లే అయి వుంటుంది" అన్నాడు కెలాడా. జేబులోంచి పర్సు తీసి, ఏం మాట్లాడకుండా అందులోంచి ఒక వంద డాలర్ల నోటును తీసిచ్చాడు రామ్సేకు.

దాన్ని తీసుకుంటూ, "ఇకముందు మళ్లీ యిలా అతినమ్మకంతో ప్రవర్తించవద్దని తెలుసుకుని వుంటావు" అన్నాడు రామ్సే.

కెలాడా చేతులు వణుకుతుండటం గమనించాను నేను.

ఈ కథ ఓడ అంతటికీ పాకిపోయింది. ఆ సాయంత్రం అందరూ అతణ్ని ఆటపట్టిస్తుంటే అదంతా భరించాల్సి వచ్చింది కెలాడాకు. అతడు అలా పట్టుబడటం నిజంగా ఒక జోకే. తలనొప్పిగా వుందంటూ రామ్సే తన గదికి వెళ్లిపోయాడు.

మరునాడు ఉదయం నేను నిద్రలేచి, షేవింగ్ చేసుకుంటున్నాను. కెలాడా మంచం మీద వెల్లకిలా పడుకుని సిగరెట్ తాగుతున్నాడు. అకస్మాత్తుగా తలుపు దగ్గర బర్ మని చిన్న శబ్దం వినపడింది. అటు చూస్తే తలుపు కింద నుండి ఒక కవరును గదిలోపలికి

తోస్తున్నారెవరో. తలుపు తెరిచి చూశాను. అక్కడెవరూ లేరు. ఆ కవర్ను అందుకుని చూస్తే, అది కెలాడాకు రాయబడినట్టుగా దానిమీద అతని పేరు నల్ల అక్షరాల్లో వుంది. దాన్ని కెలాడాకు ఇచ్చాను.

"ఎవరి దగ్గర్నుంచి యిది?" అంటూ దాన్ని తెరిచాడాయన. తర్వాత "ఓ" అన్నాడు.

కవర్లోని ఉత్తరాన్ని కాక, అందులోని వందడాలర్ల నోటును తీసుకున్నాడు. ఎర్రబడిన ముఖంతో నా వైపు చూశాడు. కవరును చిన్నచిన్న ముక్కలుగా చించి నాకు యిచ్చాడు.

"వీటిని కిటికీలోంచి బయటకు పారేస్తారా" అన్నాడు.

వాటిని పారేసి, నవ్వుముఖంతో అతనివైపు చూశాను.

"బుద్ధిలేనివాడిగా కనిపించడం యెవరికైనా బాధగానే వుంటుంది" అన్నాడతడు.

"ఆ ముత్యాలు అచ్చమైనవేనా?

"నాకొక అందమైన భార్యవుంటే, ఆమెను ఒక సంవత్సరం పాటు న్యూయార్కులో వుంచి నేను కోబేలో వుండటం మంచిపని కాదు" అన్నాడు.

అప్పుడు కెలాడా పట్ల నాకెంత మాత్రం అయిష్టం కలుగలేదు. అతడు ఆ వందడాలర్ల నోటును జాగ్రత్తగా తన పర్సులో పెట్టుకున్నాడు.

# 6

# కాన్సుల్

**(The Consul)**

మిస్టర్ పీట్ చాలా అలజడి నిండిన చిరాకుతో వున్నాడు. ఆయన ఇరవై సంవత్సరాలకు పైగా రాయబార కార్యాలయంలో పనిచేస్తున్నాడు. స్తిమితంగా ఆలోచించడానికి ఒప్పుకోని అధికారులూ బ్రిటిష్ ప్రభుత్వం అంటే కేవలం పన్నుల్ని సేకరించే ఒక ఏజెన్సీ అని భావించే వ్యాపారస్థులూ, అమలులో వున్న విధానాన్ని మార్చే ఏ ప్రయత్నమైనా తమకు అన్యాయాన్ని కలిగించేదే అని నిరసించే మత బోధకులూ – ఇబ్బందిని కలిగించే ఇటువంటి యెందరో వ్యక్తుల్ని ఎదుర్కొన్న అనుభవం ఆయనకు వుంది. కాని, తనను పూర్తిగా డీలా పడగొట్టిన వ్యక్తి ఒక్కడు కూడా ఉన్నట్టు అతనికి జ్ఞాపకం లేదు. అతడు నెమ్మది మనిషే కాని, కారణం లేకుండానే తన సహాయకుని పట్ల బాగా కోపాన్ని ప్రదర్శిస్తాడు. ఒకసారి సంతకం కోసం ఆ ఉద్యోగి ఒక ఉత్తరాన్ని తన ముందు పెట్టినప్పుడు అందులో రెండు అక్షర దోషాలున్నందుకు అతణ్ని దాదాపు ఉద్యోగంలోంచి తీసేసినంత పని చేశాడు. మిస్టర్ పీట్ వివేకం, ఆత్మవిశ్వాసం ఉన్న మనిషి. గడియారం నాలుగు గంటలు కొట్టకముందు ఆఫీసును ఎట్టి పరిస్థితుల్లోనూ వదిలిపోడు. కాని నాలుగు కాగానే టంచనుగా కుర్చీలోంచి లేచి,తన హ్యాట్నూ చేతి కర్రనూ తెమ్మని చప్రాసీకి చెప్తాడు. ఒకవేళ తేకపోతే వాణ్ని పుల్లుగా తిడతాడు. కాన్సుల్ పదవిలో ఉండే ప్రతివాడూ అట్లానే కొంచెం తిక్కగా వ్యవహరిస్తాడని ప్రజలు అనుకుంటూ వుంటారు. మిస్టర్ పీట్ తిక్కమనిషి అనేదాంట్లో అనుమానం లేదు. అతడు బ్రహ్మచారి కనుక, కొన్ని ప్రత్యేకమైన ఊళ్లల్లో అతణ్ని నియమించారు పై అధికారులు. ఎందుకంటే పెళ్లైన వాళ్లు అటువంటి మారుమూల ప్రాంతాల్లో నివసించలేరు. సంవత్సరాల తరబడి పూర్తిగా ఒంటరిగా నివసించడం వల్ల అతని చాదస్తం బాగా ముదిరింది. ఆయనలోని

కొన్ని అలవాట్లను చూస్తే కొత్తవాళ్లకు ఆశ్చర్యం కలుగుతుంది. అతనికి మతిమరుపు మరీ ఎక్కువ. తన ఇల్లు గురించి, ఆహారం గురించి అసలే పట్టించుకోడు. ఇల్లు ఎప్పుడూ చాలా చిందరవందరగా వుంటుంది. పనివాడు వాడికి నచ్చిన కూరలే వండిపెట్టినా ఆయన దాన్ని పెద్దగా పట్టించుకోడు. తిండి ఖర్చు విపరీతంగా అయ్యేలా చూసేవాడు ఆ పనివాడు. నల్లమందు రవాణాను నియంత్రించడానికి పీట్ అలుపు లేకుండా ప్రయత్నించాడు. కాని, పనివాళ్లు తన ఆఫీసులోనే నల్లమందును దాచారన్న విషయం అతనికి తప్ప మిగిలిన వాళ్లందరికీ తెలుసు. ఆఫీసు వెనకాలే నల్లమందు అమ్మకాలు బాహాటంగా జరిగేవి. పన్నుల్ని సేకరించడంలో అతడు చాలా చురుకుగా ఉండేవాడు. ప్రభుత్వం అతనికి కేటాయించిన ఇల్లు ఆయన సేకరించిన సత్తు, ఇత్తడి, చెక్క సామాను మొదలైన రకరకాల వస్తువులతో నిండివుండేది. ఇవి కేవలం అతని ఉద్యోగపరమైన సేకరణలు. కాని పోస్టల్ స్టాంపులనూ, పక్షుల గుడ్లనూ, హోటళ్ల లేబుళ్లనూ, పోస్టు ముద్రలనూ కూడా సేకరించే అలవాటు వుందతనికి. ఆ ప్రాంతం మొత్తంలో తాను జమ చేసినన్ని పోస్టల్ ముద్రలను మరెవ్వరూ జమ చేయలేదని బడాయిగా చెప్పుకుంటాడు. మారుమూల ప్రాంతాల్లో పని చేస్తూ వున్నప్పుడు, ఆయన చాలా పుస్తకాలను చదివాడు. చైనా మీద పరిశోధన చేసినవాడు కాకపోయినా, ఆ దేశం గురించీ, దాని చరిత్ర గురించీ సాహిత్యం గురించీ, ప్రజల గురించీ, తన సహోద్యోగుల కన్న యెక్కువగా తెలుసు ఆయనకు. కాని, ఎంత విస్తారంగా చదివినా ఉత్త దురభిమానం తప్ప సహనాన్ని అలవర్చుకోలేదు. అతని రూపం విలక్షణంగా వుంటుంది. బక్కపలుచని దేహంతో ఆయన నడుస్తుంటే, గాలిలో ఎండుటాకు నాట్యం చేస్తున్నట్లుగా ఉంటుంది. తలమీద పెట్టుకునే ప్రత్యేకమైన చిన్న టోపి చాలా అసాధారణంగా వుంటుంది. మురికిపట్టిన ఒక పాత కోడి ఈక ఆ టోపీకి తగిలించబడి వుంటుంది. దాన్ని తన తలమీద ఏటవాలుగా పెట్టుకుంటాడు. బట్టతల కూడా అతని రూపంలోని ఒక అంశం.

ఆఫీసు పనిని ఆయన చాలా కష్టపడి చేస్తాడు. ప్రతి చిన్న విషయం గురించి శ్రద్ధ చూపుతూ అలసట తెచ్చుకుంటాడు. కాని, ఆఫీసు ఆవరణలో నడిచిన ప్రతిసారీ అతనికి ఊరట కలిగి, విశ్రాంతి దొరుకుతుంది. ఆ నగరం ఒక విశాలమైన మైదాన ప్రాంతం మధ్యన వుంటుంది. సూర్యుడస్తమించే సమయంలో దూరాన మంచు కప్పివున్న టిబెట్ పర్వత శిఖరాలు కిటికీలోంచి కనిపిస్తాయి. పీట్ అటూ యిటూ చూడకుండా వేగంగా నడుస్తున్నాడు. స్పానియెల్ జాతికి చెందిన కుక్క తుళ్లుతూ, గెంతుతూ అతని పక్కనే నడుస్తోంది. చిన్న చిన్న పదాలను త్వరత్వరగా పలుకుతూ తనలో తానే మంద్రస్వరంలో గొణుక్కుంటున్నాడు. ఆ రోజున మిసెస్ యు అనే ఆవిడ దగ్గరకు పోవాల్సి వుండటమే అతని చికాకుకు కారణం. ఆమె అతణ్ని తన యింటికి పిలిచింది. కాని, భాషా సవ్యత

పట్ల బాగా పట్టింపు వున్న అతడు, ఆమె పేరును మిసెస్ యుకు బదులుగా మిస్ లాంబర్ట్ అని ఖరారు చేశాడు. ఈ సంగతి వాళ్లిద్దరి మధ్య కలుపుగోలుతనాన్ని తగ్గించినట్టయింది. ఆమె ఒక చైనా దేశస్థుణ్ని పెళ్లి చేసుకున్న ఆంగ్లేయ స్త్రీ. రెండు సంవత్సరాల క్రితం తన భర్తతో ఆ ప్రాంతానికి వచ్చింది. ఆ చైనీయుడు లండన్ విశ్వవిద్యాలయంలో విద్యార్థిగా వుండేవాడు. తన దేశంలో తానొక గొప్పవ్యక్తినని ఆమెచేత నమ్మించాడు. పెద్ద బంగళాలో మంచి హోదా గల స్థానంలో తాను ఉండబోతున్నానని ఊహించింది ఆమె. కాని, చిల్లర మనుషుల గోల నిండిన ప్రదేశంలోని చవకబారు మురికి యింట్లోకి రాగానే విపరీతమైన నిరాశ నిండిన విస్మయానికి గురైంది. ఆ యింట్లో విదేశీ తరహాకు చెందిన మంచి మంచం ఒక్కటి కూడా లేదు. భోజనం చేస్తున్నప్పుడు యూరోపియన్లు ఉపయోగించే నైఫ్ కానీ, ఫోర్క్ కానీ లేవు. ప్రతిదీ మురికిగా వుండటమే కాక, అక్కడ ఒక పాడు వాసన వస్తోంది. ఆ యింట్లో తాను అత్తామామలతో కలిసి జీవించాలని తెలిసి నిర్ఘాంతపోయింది. తన తల్లి చెప్పిన మాటల్ని తు.చ. తప్పకుండా పాటించాలని భర్త చెప్పడంతో హతాశు రాలైంది. అతనికి ఆ యింట్లోనే మరో భార్య వుందని తెలుసుకోవడానికి రెండు మూడు రోజులు పట్టిందామెకు. దానికి కారణం తనకు చైనీస్ భాష సరిగ్గా రాకపోవటమే. విద్యకోసం సొంత వూరును వదలక ముందు పిల్లవానిగా ఉన్నప్పుడే అతనికి పెళ్లైంది. తనను మోసం చేసినందుకు ఆమె బాగా చీవాట్లు పెట్టినప్పుడు అతడు నిర్లక్ష్యంగా భుజాలెగరేశాడు. చైనీయుడెవడైనా ఇద్దరు స్త్రీలను పెళ్లి చేసుకోదల్చుకుంటే అతణ్ని ఆపగలిగేది ఏదీ లేదనీ, అటువంటి పరిస్థితిలో ఏ చైనీయురాలూ దాన్ని కష్టంగా భావించదనీ చెప్పాడు. నిజానికి ఆ వాక్యంలోని రెండవ భాగంలో పూర్తి వాస్తవం లేదు. పరిస్థితి పూర్తిగా అర్థం కాగానే కాన్సుల్‌ను కలిసింది ఆమె. కాని, చైనాలో అందరికీ అందరి విషయాలు తెలుస్తాయి కనుక, ఆ విషయాన్ని అప్పటికే విని వున్నాడతడు. కాబట్టి ఆమె తనను కలవడానికి రావడం అతనికి ఆశ్చర్యాన్ని కలిగించలేదు. ఆమెపట్ల అంతగా సానుభూతిని కూడా చూపించలేదు. విదేశీయురాలైన ఒక స్త్రీ చైనా దేశస్థుణ్ని పెళ్లి చేసుకోవడం అతనికి బాగా కోపాన్ని తెప్పించింది. వివాహం చేసుకునే ముందు ఆ వ్యక్తి గురించిన సమాచారాన్ని ఆమె క్షుణ్ణంగా తెలుసుకోకపోవడంతో తననే తిరస్కరించినట్టుగా చిరాకు పడ్డాడు. నిజానికి అంత మూర్ఖమైన నిర్ణయం తీసుకునే స్త్రీలాగా కనిపించదు ఆమె. మాయామర్మం తెలియని సాధువురాలు అనుకుంటాం ఆమెను చూస్తే. దర్జీ చేత కుట్టించుకున్న అతి సాదా సూటును తొడుక్కుంది. పళ్లు పాడైపోయాయి. అలవాటు లేని గొడ్డు చాకిరిచేసినందుకేమో చేతులు గరుకుగావున్నాయి. ఆమె మాట్లాడే ఆంగ్లభాషలో ఒక రకమైన యాస వుంది.

“మిస్టర్ యు ను మొదటిసారి ఎలా కలుసుకున్నారు మీరు?” అనిఅడిగాడు కాన్సుల్ బిగుసుకుపోతూ.

"నా తండ్రి పెద్ద హోదాలో వుండేవాడు. ఆయన చనిపోగానే మా యింట్లోనే ఒక భాగాన్ని అద్దెకివ్వాలని నిశ్చయించింది మా అమ్మ."

"మీ యింట్లోని ఒక పోర్షన్లో అద్దెకున్నాడా?"

"నిజానికి అది పోర్షనంత పెద్దగా లేదు".

"పోనీ, రెండు మూడు గదులు అందామా?"

ఒక్కోసారి అటువంటి పరిస్థితి పెళ్లికి దారి తీస్తుంది. ఆమెను చాలా మూర్ఖమైన, అల్పురాలైన స్త్రీగా భావించి, ఆంగ్లేయుల చట్ట ప్రకారం ఆమెకు యు తో వివాహం కాలేదనీ, అందువల్ల వెంటనే తిరిగి ఇంగ్లండుకు వెళ్లిపోవడం ఉత్తమమనీ మొహం మీద గుద్దినట్లు చెప్పాడు కాన్సుల్. ఆమె ఏడ్వటం మొదలు పెట్టింది. దాంతో అతడు కొంచెం మెత్తబడ్డాడు. ఇంగ్లండుకు చేరే ఓడ ప్రయాణం చాలా రోజులపాటు వుంటుంది కనుక, కొందరు మిషనరీ స్త్రీలను తోడుగా పంపుతానని వాగ్దానం చేశాడు. కావాలంటే అంతవరకు ఏ మిషనరీ భవనంలో నైనా ఉంచుతానన్నాడు. కాని ఆమె కళ్లు తుడుచుకుంది, "ఇంగ్లండుకు పోతే ఏం ప్రయోజనం? నేనెక్కడికీ పోలేను" అన్నది.

"మీ అమ్మ దగ్గరికి పోవచ్చు గదా"

"నేను యు ను పెళ్లి చేసుకోవడం ఆమెకు అస్సలే ఇష్టం లేదు. ఆ విషయాన్ని మనం మరిచిపోకూడదు"

కాన్సుల్ ఆమెకు నచ్చజెప్పి ఒప్పించడానికి ప్రయత్నం చేశాడు. కాని ఆమె మరింత మొండిగా ఆ ప్రతిపాదనను తిరస్కరించడంతో ఆయన సహనాన్ని కోల్పోయి, "వాస్తవంగా నీ భర్త కాని వ్యక్తితో ఇక్కడే వుండిపోవాలనుకుంటే అది నీ యిష్టం. కాని తర్వాత నా బాధ్యత ఏమీ ఉండదు" అన్నాడు.

"అయితే మీరు విచారపడే అవసరం లేదు" అన్నదామె. ఇదంతా జరిగి రెండు సంవత్సరాలైంది. మధ్యలో ఆమె ఒకటి రెండు సార్లు వచ్చి కలిసింది. అత్తా సవతుల కారణంగా చాలా యిబ్బందిని ఎదుర్కొన్నట్టుంది. చైనాలోని చట్ట ప్రకారం తనకు ఎటువంటి హక్కులు దొరుకుతాయి అని మూర్ఖంగా ప్రశ్నించింది. ఇంగ్లండుకు వెళ్లిపొమ్మని మునుపటి లాగానే సలహా యిచ్చాడు కాన్సుల్. ఆమె ప్రతిసారీ ఆ సలహాను మొండిగా తిరస్కరించడంతో అతడు విపరీతమైన కోపాన్ని ప్రదర్శించాడు. కలహించే ముగ్గురు స్త్రీల నడుమ జీవితాన్ని సాగిస్తున్న మిస్టర్ యు పట్ల అతనికి జాలి కలిగింది. మిస్టర్ యు తన పట్ల నిర్దయను చూపించలేదని చెప్పింది ఆమె. ఇద్దరు భార్యలతోనూ న్యాయంగా ఉండటానికి ప్రయత్నించాడతడు. అయినా మిస్ లాంబర్ట్ విధానం మారలేదు. ఆమె సాధారణ సమయాల్లో చైనీస్ దుస్తులు తొడుగుతూ, తనను కలవడానికి వచ్చినపుడు మాత్రం యూరోపియన్ దుస్తుల్ని ధరిస్తుందని కాన్సుల్‌కు తెలుసు. ఆమె లావుగా,

అసహ్యంగా తయారైంది. చైనీస్ ఆహారం వల్ల ఆరోగ్యం చెడిపోయి రానురాను దీర్ఘకాలిక రోగిలాగా కనపడసాగింది. కాని ఆరోజు మాత్రం ఆమె ఆకారాన్ని చూసి ఆయన అదిరిపోయాడు. తలమీద ఏ టోపీ పెట్టుకోలేదామె. వెంట్రుకలు చింపిరి చింపిరిగా వున్నాయి. దాదాపు పిచ్చిదాని లాగా కనిపించింది.

"వాళ్లు నాకు విషం పెట్టాలని ప్రయత్నిస్తున్నారు" అని పెద్దగా అరిచి, పాడువాసన గల ఆహారమున్న ఒక గిన్నెను ఆయన ముందు పెట్టింది. తర్వాత మళ్లీ "ఇందులో విషం కలిపారు. గత పదిరోజులుగా నేను అనారోగ్యంతో వున్నాను. చావును తప్పించుకుని యింకా బతికి వున్నానంటే దానికి కారణం ఏదో అద్భుతమైన మహిమ నిండిన శక్తే" అన్నది.

కాన్సుల్ను నమ్మించే విధంగా పరిస్థితులను వివరిస్తూ ఒక పెద్ద కథను చెప్పింది. తమ యింట్లోకి కొత్తగా వచ్చిన హేయమైన స్త్రీని వదిలించుకోవడానికి అత్తా సవతీ తమకు తెలిసిన పద్ధతులను అవలంబించారేమో అనిపించింది ఆయనకు.

"నువ్వు నా దగ్గరికి వస్తున్నట్లు వాళ్లకు తెలుసా?"

"తెలుసు. వాళ్ల పని పడతానని చెప్పి వచ్చాను" అంతిమ నిర్ణయం తీసుకునే సమయం వచ్చింది. ఆమె వైపు అత్యంత అధికారికమైన చూపును సారించాడు కాన్సుల్.

"నువ్వు మళ్లీ ఆ యింటి దిక్కుకే పోవద్దు. నీ మూర్ఖత్వాన్ని ఇంక నేనెంత మాత్రం భరించలేను. నిజంగా నీ భర్త కానట్టి మిస్టర్ యును నువ్వు వదిలేయాలి" అన్నాడు. కాని ఉన్మాద స్థాయికి చేరిన ఆమె మొండితనాన్ని చూసి, తాను నిస్సహాయుడని తెలుసుకున్నాడు. అంతకుముందు తాను చేసిన వాదనలన్నింటనీ మళ్లీ వినిపించాడు. ఆమె ఒప్పుకోలేదు. దాంతో ఎప్పటిలాగే సహనాన్ని కోల్పోయి చెడ్డ కోపాన్ని ప్రదర్శించాడు.

"ఇంకా అతనితోనే వుండాలని యెందుకనుకుంటున్నావు?" అని కోపంగా అరిచాడు. అప్పుడు ఆమె యిచ్చిన చివరి సమాధానం అతనిలోని శాంతగుణాన్ని పూర్తిగా హరించింది.

"అతని నుదురు మీద అందంగా వేలాడే జుట్టులో ఏదో చెప్పలేని ఆకర్షణ వుంది. దాన్ని ఇష్టపడకుండా ఉండలేను."

అంత మూర్ఖత్వం, అవివేకం నిండిన మాటల్ని ఆయన ఎప్పుడూ వినలేదు. తెలివితక్కువతనానికి అది పరాకాష్ఠ అనిపించిందతనికి. కోపాన్ని తగ్గించుకోవటం కోసం నడక సాగిస్తున్న అతడు, తనకు చెడ్డ వాక్యాల్ని ఉపయోగించే అలవాటు లేకపోయినా అసహనాన్నీ చిరాకునూ ఆపుకోలేక, "ఈ ఆడవాళ్లు దుర్మార్గపు ముండలు" అన్నాడు అరిచినట్టుగా.

# 7

# లూయీస్

**(Louise)**

**నే**నంటే లూయీస్‌కు ఎందుకు ఇబ్బందిగా వుంటుందో అర్థం కాదు నాకు. ఆమె నన్ను ఇష్టపడకపోవటమే కాక, అవకాశం దొరికినప్పుడల్లా నా వెనకాల నా గురించి చెడ్డగా మాట్లాడుతుందని తెలుసు నాకు. నేరుగా వ్యాఖ్యానించడం ఇష్టం లేక ఒక చిన్న నిట్టూర్పు ద్వారానో, చేతుల్ని తిప్పడం ద్వారానో, తన మనసులోని ఉద్దేశాన్ని స్పష్టం చేస్తుంది. కపట ప్రశంసలు కురిపించటంలో ఆమె దిట్ట. పాతికేళ్ళుగా మేమిద్దరం ఒకర్నొకరం బాగా ఎరిగివున్నా, మనుషులతో పరిచయమన్నది ఆమె మీద ఎటువంటి ప్రభావాన్నీ చూపదని నేను నమ్ముతాను. ఆమె నన్నొక కఠినాత్ముడైన మొరటు, క్రూర, నీచ వ్యక్తిగా తలుస్తుంది. అయినా నా స్నేహాన్ని వదులుకోక, నాకు విస్మయం నిండిన తడబాటును కలిగిస్తుంది. నన్ను మళ్ళీ మళ్ళీ కలుస్తూ, తరచుగా భోజనానికి ఆహ్వానించడమే కాక, ఒకటి రెండు సార్లు ఊరవతలి తన యింట్లో వీకెండ్ రోజులు గడపడానికి ఆహ్వానించింది. ఆమె ఉద్దేశమేమిటో ఆఖరుకు నాకు తెలిసింది. నేనామెను నమ్మటం లేదనే అనుమానం వల్ల నాతో మరింత స్నేహంగా వుండసాగింది. నేనొక్కణ్నే ఆమెను పరిహాస దృష్టితో చూడటం వలన తన మనసు గాయపడిందనుకుంటాను. నేనే పొరపాటు పడ్డానని, ఓడిపోయానని నా అంతట నేనే ఒప్పుకునే దాకా తనకు విశ్రాంతి దొరకదని అనుకున్నట్టుంది. ముసుగు వెనుకాల వున్న తన నిజమైన ముఖాన్ని నేను గుర్తించినట్టు ఆమెకు సూచనప్రాయంగా తెలిసినట్టుంది. నేనొక్కణ్నే తన గురించి అపనమ్మకంగా వున్నాను కనుక నేను కూడా ముఖానికి ఒక ముసుగును తగిలించుకోవాలన్నది ఆమె ఉద్దేశం కావచ్చు. ఆమె పూర్తిగా నిజాయితీ లేని మనిషి అని నేనెప్పుడూ అనుకోలేదు. ప్రపంచాన్ని బోల్తా కొట్టించినట్టుగానే

తనను తాను పూర్తిగా మోసగించుకుంటోందా, లేక తన హృదయపు లోతుల్లో వినోదం తాలూకు చిలిపి నవ్వు దాగి వుందా అని ఆశ్చర్యం కలుగుతుంది నాకు. ఇద్దరు మోస గాళ్లు ఒకరిపట్ల మరొకరు ఆకర్షితులైనట్టే ఆమె నా పట్ల ఆకర్షితురాలైంది. ఇతరులకెవ్వరికీ తెలియని ఒక రహస్య పరస్పర అవగాహన మా యిద్దరి మధ్య నెలకొని వుందనిపించింది.

లూయిస్‌కు పెళ్లి కాకముందు నుండి ఆమె నాకు తెలుసు. అప్పుడామె కలత నిండిన కళ్లతో పీలగా, సున్నితంగా వుండేది. చిన్నతనంలో ఆమె మశూచి వంటి ఒక వ్యాధి బారిన పడి బలహీనమైన గుండెతో మిగిలిపోవటం వలన, తల్లిదండ్రులు ఆమెను ఆదుర్దా నిండిన ఆరాధనతో పూజించారు. టామ్ మేట్లాండ్ ఆమెను పెళ్లి చేసుకుంటానని అడిగినపుడు, వాళ్లు ఆశ్చర్యంతో కూడిన నిరాశకు గురయ్యారు. ఎందుకంటే లూయిస్ వైవాహిక జీవితపు భారాన్ని తట్టుకోలేనంత సున్నితమైన అమ్మాయి అని వాళ్ల గట్టి నమ్మకం. కాని, తమకు అంతగా డబ్బు లేదనీ, టామ్ మేట్లాండ్ ధనవంతుడనీ వాళ్లకు తెలుసు. లూయిస్ కోసం ఏదైనా చేస్తానని అతడు వాగ్దానం చేయడంతో వాళ్లు తమ కూతురు పెళ్లిని శాస్త్రోక్తంగా జరిపించారు. టామ్ మేట్లాండ్ బలమైన పెద్ద శరీరంతో చాలా అందంగా వుంటాడు. అతడొక మంచి ఆటగాడు కూడా. లూయిస్ మీద విపరీతమైన ప్రేమను కురిపించాడు. ఆమె గుండె బలహీనంగా ఉన్నందుకు ప్రపంచంలోని ఆనందాన్నంతా ఆమెకు ఇవ్వాలని నిశ్చయించుకున్నాడు. ఆటల్లో తాను బాగా రాణిస్తున్నా వాటిని మానుకున్నాడు. లూయిస్ ఆ విధంగా కోరుకోలేదు. తన భర్త గోల్ఫ్ ఆడుతూ వుండటం, వేటను కొనసాగించడం ఆమెకు సంతోషాన్నిస్తాయి. కానీ, ఎప్పుడైనా ఒకరోజు కోసం ఆమెను వదిలి వెళ్తానని అన్నప్పుడు యాదృచ్ఛికంగా లూయిస్‌కు గుండెనొప్పి రాసాగింది. ఎన్నడైనా వాళ్లమధ్య అభిప్రాయభేదం తలెత్తినప్పుడు లూయిసే తగ్గేది. ఆ విధంగా ఆమె చాలా అనుకూలవతి అయిన భార్యగా నడుచుకుంది. కాని, గుండె బలహీనపడిపోయి వారం రోజులు దాకా మంచం మీదనే పడి వుండేది. అట్లాంటి సమయాల్లో ఏ విధమైన ఫిర్యాదు చేయకుండా ప్రసన్నంగా వుంటుంది ఆమె. భార్య కోరికను తిరస్కరించలేనంత మూర్ఖుడు కాలేకపోయాడు టామ్. ఎవరి మాటకు ఎవరు లోబడి వుండాలి అన్న విషయం గురించి ఎప్పుడైనా చిన్న గొడవ తలెత్తినపుడు, ఆఖరుకు లూయిస్ చెప్పినట్టుగానే జరగనీ అని ఒప్పుకునేవాడు టామ్. ఒకసారి లూయిస్ ప్రత్యేకమైన గట్టి నిర్ణయంతో ఎనిమిది మైళ్ల దూరం నడవటం చూసి, అందరూ ఊహించిన దానికి భిన్నంగా ఆమె గుండె చాలా బలంగా వుందని టామ్ మేట్లాండ్‌తో అన్నాను. అతడు తల ఊపి నిట్టూరుస్తూ “లేదు లేదు. ఆమె చాలా సుకుమారమైన మనిషి. గుండె వ్యాధుల నిపుణులైన పెద్ద పెద్ద డాక్టరు ఆమె ప్రమాదస్థితిలో వుందని చెప్పారు. కాని ఆమెకు అజేయమైన ధైర్యం వుంది” అన్నాడు.

లూయిస్ గుండెకు తట్టుకునే శక్తి బాగా వున్నదని నేనన్నట్టు టామ్ ఆమెకు చెప్పాడట.

"అట్లా చాలా దూరం నడిచినందుకు రేపు నాకు తగిన శాస్తి జరుగుతుంది లెండి. నేను మృత్యుద్వారం దగ్గర వుంటాను" అన్నది లూయిస్.

"నువ్వు చేయాలనుకున్న పనులను చేసేందుకు నీలో చాలా బలం వుందని అనిపించింది నాకు" అన్నాను గొణుగుతున్నట్టుగా.

తనకు బాగా ఇష్టమైన పార్టీలో ఆమె రాత్రంతా డాన్సు చేయడం గమనించాను. కానీ, ఒకవేళ ఏ ఫంక్షనైనా ఆమెకు విసుగు తెప్పించేదిగా ఉంటే లూయిస్ తనకు నలతగా వుందని చెప్పటం టామ్ ఆమెను వెంటనే ఇంటికి తీసుకుపోవటం జరిగేవి. నేనిచ్చిన సమాధానం ఆమెకు నచ్చలేదని ఊహించాను. ఎందుకంటే నా వైపు ఒక దీనమైన చూపును విసిరిన ఆమె కళ్లలో నిస్తేజం చోటు చేసుకుంది.

"నా పరిస్థితిని మీకు పూర్తిగా తెలియజేయడం కోసం నేను ధామ్మని కింద పడిపోలేను కదా" అని జవాబిచ్చింది లూయిస్. లూయిస్ తన భర్తకన్న ఎక్కువ కాలం బతికింది. ఒకసారి వాతావరణం బాగా చల్లగా వున్నప్పుడు వాళ్లిద్దరూ నావలో వెళ్తుంటే, ఉన్న రగ్గులన్నీ ఆమెకే కావలసి వచ్చాయి. ఫలితంగా చలికి తట్టుకోలేక టామ్ చనిపోయాడు. భార్యకోసం పెద్ద మొత్తంలో ధనాన్ని వదిలిపోయాడతడు. వాళ్ళకు ఒక కూతురు కూడా వుంది. లూయిస్ విపరీతంగా యేడ్చింది. ఆ దెబ్బను తట్టుకుని ఆమె బతకడం ఆశ్చర్యకరమే. త్వరలోనే లూయిస్ తన భర్తను చేరుకుంటుందని భావించారు స్నేహితులు. లూయిస్ కూతురైన ఐరిస్ అప్పుడు అనాథగా మిగిలిపోతుందని వాళ్ళు చాలా బాధ పడ్డారు. వాళ్లందరూ లూయిస్ మీద రెట్టింపు ధ్యాసను పెట్టారు. అట్లా చేయక తప్పింది కాదు. ఎందుకంటే తనకు నచ్చిన పని కాక కష్టమైన పని చేయాల్సి వచ్చినపుడు ఆమె మృత్యుద్వారం దగ్గరికి పోయేది. తనను కనిపెట్టుకుని వుండే మగాడెవడూ లేదు కనుక, ఆరోగ్యం కూడా బాగా క్షీణించి వుంది కనుక, తన కూతురైన ఐరిస్‌ను ఎట్లా పెంచి పెద్ద చేయాలో తెలియడం లేదని వాపోయింది లూయిస్. మళ్లీ ఎందుకు పెళ్లి చేసుకోకూడదు అని అడిగారు స్నేహితులు. తన గుండె పరిస్థితి అట్లా వుండగా అది కుదిరే పని కాదన్నది ఆమె. టామ్ కోరిక కూడా అదేవిధంగా ఉంటుందనీ, మళ్లీ పెళ్లి చేసుకోవటం ఐరిస్‌కు మేలు కలిగించే మాట వాస్తవమేననీ, కానీ మంచం పాలైన తనవంటి దౌర్భాగ్యురాలిని పెళ్లి చేసుకోవటానికి ఎవరు ముందుకు వస్తారనీ అన్నది ఆమె. చిత్రంగా ఒకరు కాదు, ఇంకా యెక్కువ మందే ఆమెను పెళ్లిచేసుకోవడానికి సిద్ధపడ్డారు. టామ్ చనిపోయి ఒక సంవత్సరం గడిచాక, జార్జ్ హాబ్‌హౌస్‌ను పెళ్లాడింది లూయిస్. అతడు సంస్కారవంతుడే కాక, ఆర్థికంగా కూడా మంచి పరిస్థితిలో వున్న వ్యక్తి. అందమైన బక్కపలుచని లూయిస్‌కు జీవిత భాగస్వామిగా

ఉండే అవకాశం దొరికినందుకు అతడు చూపినంత కృతజ్ఞతా భావాన్ని మరెవ్వరూ చూపించరని అనిపించింది నాకు.

"నిన్ను కష్టపెట్టడం కోసం నేనెంతో కాలం బతకను" అన్నదామె. హాబ్‌హౌస్ చాలా బలమైన తపన గల సైనికుడు. కాని, పెళ్లయ్యాక ఆ ఉద్యోగాన్ని వదిలాడు. లూయిస్ ఆరోగ్య పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని, వాళ్ళు చలికాలాన్ని మాంటేకార్లో పట్టణంలో, వేసవిని డ్యూవిల్ నగరంలో గడపక తప్పింది కాదు. సైనిక ఉద్యోగాన్ని వదులుకోవడానికి అతడు కొంచెం సందేహించాడు. లూయిస్ కూడా మొదట్లో అందుకు ఒప్పుకోలేదు. కాని, యెప్పట్లాగే చివరకు ఒప్పుకుంది. జీవితపు ఆఖరి సంవత్సరాలను తన భార్య సాధ్యమైనంత ఆనందంగా గడిపేలా చెయ్యాలని నిశ్చయించుకున్నాడు హాబ్‌హౌస్.

"ఇంకా యెంతో కాలం బతకను నేను. నిన్ను కష్టపెట్టకుండా ఉండటానికి ప్రయత్నిస్తాను" అన్నది.

తర్వాత రెండు మూడు సంవత్సరాల పాటు అందంగా అలంకరించుకుని హుషారైన పార్టీలన్నిటికీ పోయి, గ్యాంబ్లింగ్‌లో విపరీతంగా డబ్బును ఖర్చుచేసి, డాన్సు చేస్తూ ఆనందించటమే కాక, అందమైన యువకులతో సరసాలాడింది కూడా. హాబ్‌హౌస్‌కు టామ్ మేట్లాండ్ వంటి దృఢమైన శరీరం లేదు కనుక, అప్పుడప్పుడు మద్యాన్ని నీట్‌గా తాగాల్సి వచ్చింది. ఆ అలవాటు బాగా ముదిరిపోయేదే కాని, (ఆమె) అదృష్టం కొద్దీ యుద్ధం మొదలైంది. అతడు మళ్లీ సైన్యంలో చేరి మూడు నెలల తర్వాత యుద్ధంలో చనిపోయాడు. లూయిస్‌కు అది పెద్ద దెబ్బ అయింది. కాని, అటువంటి విషమ పరిస్థితిలో తాను వ్యక్తిగత దుఃఖానికి లోను కాకూడదని భావించింది. గుండె కొంచెం యిబ్బంది పెట్టినా ఆ విషయాన్ని ఎవరికీ చెప్పలేదు. మనసును వేరే వైపుకు మళ్లించదలచి మాంటేకార్లో లోని తన భవనాన్ని యుద్ధంలో గాయపడ్డ సైనికాధికారుల కోసం ఆసుపత్రిగా మార్చింది. ఆ వొత్తిడిని తట్టుకోలేవని స్నేహితులు ఆమెను హెచ్చరించారు.

"అది నన్నెట్లాగూ చంపేస్తుందని నాకు తెలుసు. అయినా ఫరవాలేదు. నేను చేయాల్సింది చేస్తాను" అన్నది లూయిస్.

ఆమె చావలేదు. అత్యంత ఉత్సాహం నిండిన జీవితాన్ని అనుభవించింది. తన ఇల్లు ఫ్రాన్స్ దేశంలోని అత్యంత పేరెన్నికగన్న ఆసుపత్రి అయింది. అనుకోని పరిస్థితిలో నేనామెను పారిస్‌లో కలిశాను. అప్పుడామె రిట్జ్ హోటల్లో ఒక చాలా అందమైన ఫ్రెంచ్ యువకునితో లంచ్ చేస్తోంది. ఆసుపత్రికి సంబంధించిన వ్యాపారపు పని మీద పారిస్‌కు వచ్చినట్టు తెలిపింది ఆమె. సైనికాధికారులు తనపట్ల చాలా సానుభూతిని కనబరిచారని చెప్పింది. తను యెంతో సున్నితమైన శరీరం వున్న స్త్రీ కనుక తనను చిన్నపని కూడా చెయ్యనివ్వరు

అన్నది. "వాళ్లందరూ నా భర్తల లాగా నన్ను కనిపెట్టుకుని వున్నారు" అంటూ నిట్టూర్చింది. తర్వాత మళ్లీ "పాపం హాబ్‌హౌస్. అతడు చనిపోతాడనీ, గుండెవ్యాధి వున్న నేను మాత్రం బతికి వుంటాననీ ఎవరు మాత్రం ఊహించారు" అన్నది.

"అవును. పాపం హాబ్‌హౌస్" అన్నాను.

నేనట్లా అనడం ఆమెకెందుకు నచ్చలేదో తెలియలేదు. విచారంగా నవ్వింది. అందమైన ఆమె కళ్లల్లో కన్నీళ్లు నిండాయి.

"నేను మరికొన్ని సంవత్సరాలు బతకడం ఇష్టం లేనట్టుగా మాట్లాడుతున్నారు మీరు".

"నీ గుండె పరిస్థితి చాలా బాగుంది కదా"

"అదెప్పుడూ బాగుండదు. ఇవ్వాళ ఒక స్పెషలిస్టును సంప్రదించాను. ఎప్పుడైనా ఏదైనా జరగవచ్చు కనుక, దేనికైనా సిద్ధంగా వుండాలన్నాడు ఆయన".

"దాదాపు ఇరవై సంవత్సరాలుగా నువ్వు ఆవిధంగా సిద్ధంగా వుంటూనే వస్తున్నావాయె" యుద్ధం ముగిసిన తర్వాత లండన్లో స్థిరపడింది లూయిస్. అప్పుడామె వయసు నలభై దాటింది. ఇంకా అట్లానే బక్కపలుచగా, సున్నితంగా, పెద్ద కళ్లతో, తెల్లని చెక్కిళ్లతో చూడటానికి ఆకర్షణీయంగా వుంది. కాని, వయసు ఇరవై ఐదేళ్ల కంటే ఒక్కరోజు కూడా ఎక్కువ లేనట్టుగా వుంది. అప్పటిదాకా స్కూలు విద్యార్థినిగా వున్న ఐరిస్ మరికొంచెం పెద్దదైంది కనుక, తల్లితో కలిసి జీవించడానికి లండన్‌కు వచ్చింది.

"ఇక ఐరిస్ నన్ను చూసుకుంటుంది. నాలాంటి రోగిష్ఠితో కలిసి వుండటం కష్టమే అనుకోండి. కాని, నేను ఇంకెంతో కాలం బతకను కనుక, ఆమెకు పెద్దగా కష్టం కలగదని నా నమ్మకం". ఐరిస్ చాలా మంచి పిల్ల. తన తల్లి ఆరోగ్యం ప్రమాదంలో వుందనే అవగాహనతో పెంచబడింది. చిన్నపిల్లగా ఉన్నప్పుడు ఆమెను కొంచెం అల్లరి కూడా చేయనివ్వలేదెవ్వరూ. తన తల్లికి ఎట్టి పరిస్థితిలోనూ ఎంత మాత్రం నిరాశ కలగకూడదని ఆమెకు తెలుసు. తన కోసం జీవితానందాన్ని త్యాగం చేయవద్దని లూయిస్ ఎంత చెప్పినా ఐరిస్ వినలేదు. అది త్యాగం కాదు. ప్రియమైన తల్లికి సేవ చేయడం ఆనందకరమైన విషయం అన్నదామె. లూయిస్ నిట్టూర్చి, "సరే కానీ" అన్నది.

"తనను తాను నా సేవలో వినియోగించుకుంటున్నందుకు ఐరిస్‌కు ఆనందంగా వుంది" అన్నది లూయిస్.

"ఆమె బయటి ప్రపంచంలోకి పోయి హాయిని అనుభవించాలని నీకు అనిపించదా?" అని అడిగాను.

"నేనెప్పుడూ అదే చెప్తుంటాను. ఆ పిల్ల ఆహ్లాదంగా ఉండేలా చేయలేను నేను. నా వల్ల యెవ్వరికీ కష్టం కలగటం నాకిష్టం లేదనే విషయం ఆ భగవంతునికే తెలుసు."

తను చేస్తున్న దానికి ఐరిస్‌ను నేను కోప్పడినప్పుడు "పాపం, నేను పార్టీలకు పోయి స్నేహితులతో వుంటూ ఆనందించాలని అమ్మ కోరిక. కాని, అందుకోసం నేనెప్పుడైనా బయల్దేరుతుంటే వెంటనే ఆమెకు గుండెపోటు వస్తుంది. కాబట్టి ఇంట్లో వుండిపోవడానికే ఇష్టపడతాను" అన్నది. కాని ఇప్పుడామె ప్రేమలో పడింది. నా స్నేహితుడైన ఒక చాలా మంచి అబ్బాయి తనను పెళ్లి చేసుకోమని ఐరిస్‌ను అడిగితే ఆమె దానికి ఒప్పుకుందట. ఐరిస్ అంటే నాకెంతో యిష్టం కనుక ఆఖరుకు ఆమెకు సొంత జీవితాన్ని గడిపే అవకాశం వచ్చినందుకు సంతోషించాను. అటువంటి అవకాశం వస్తుందని ఆమె యెప్పుడూ ఊహించలేదు. కాని, ఒకరోజు ఆ అబ్బాయి చాలా మనస్తాపంతో నా దగ్గరికి వచ్చి, ఐరిస్‌తో తన పెళ్లి నిరవధికంగా వాయిదా పడిందని చెప్పి వాపోయాడు. తన తల్లిని వదలకూడదని ఐరిస్ నిశ్చయించుకుందట. ఆ విషయంలో కల్పించుకోవడం నిజానికి నా పని కాకపోయినా, సందర్భం వచ్చిందని వెళ్లి లూయిస్‌ను కలిశాను. టీ తాగే సమయంలో స్నేహితులెవరైనా వస్తే వాళ్లను స్వాగతించడం ఆమెకు ఎప్పుడూ యిష్టమే. ఇప్పుడామె నడివయసులోకి అడుగిడింది కనుక రచయితలతో, చిత్రకారులతో స్నేహాన్ని ఏర్పరచుకుంది. నేను వెళ్లిన కొద్దిసేపటి తర్వాత "ఐరిస్ పెళ్లి ఆగిపోయిందట కదా" అన్నాను.

"నాకా విషయం తెలియదు. నా కోరిక ప్రకారం తను త్వరగా పెళ్లి చేసుకునేట్టు లేదు. నాకోసం తన ఆనందాన్ని త్యాగం చేయవద్దని మోకాళ్ల మీద వంగి వేడుకున్నాను. కాని నన్ను వదిలి వెళ్లడానికి ససేమిరా ఒప్పుకోవడం లేదు."

"నా ప్రియమైన లూయిస్! ఇప్పటికే నీ భర్తలిద్దరూ చనిపోయారు. కనీసం మరో యిద్దరు నిన్ను పెళ్లాడి మరణిస్తారేమో అనిపిస్తోంది నాకు." స్వరంలో సాధ్యమైనంత కోపాన్ని ధ్వనింపజేస్తూ "ఏం, మీకు నవ్వులాటగా వుందా?" అన్నది.

"నీకు ఇష్టమైన పనులు చేయాలనుకున్నపుడు నీ గుండె బలంగా వుంటూ, బోర్ కొట్టించే పనులప్పుడు మాత్రం అది బలహీన పడుతుండటం ఎప్పుడూ నీకు విచిత్రంగా తోచదనుకుంటాను."

"ఆఁ, ఇప్పుడు తెలిసింది. నా గురించి ప్రతిసారీ మీరేమనుకుంటారో ఇప్పుడర్థమైంది. నాకు ఏ జబ్బూ లేదని మీరనుకుంటున్నారు కదా?"

నేనప్పుడు పూర్తి నిజాయితీ నిండిన చూపును సారించి, "ఊహుఁ, అదికాదు కాని పాతిక సంవత్సరాల పాటు అద్భుతంగా జీవించావు నువ్వు. నాకు తెలిసిన స్త్రీ లందరిలో కల్లా అత్యంత స్వార్థపరురాలివి, క్రూరురాలివి నువ్వే అని నా ఉద్దేశం. నువ్వు పెళ్లాడిన ఇద్దరు పురుషుల జీవితాల్ని నాశనం చేశావు. ఇక ఇప్పుడు నీ కూతురు జీవితాన్ని నాశనం చేయబోతున్నావు" అన్నాను.

అప్పుడు లూయిస్‌కు గుండెపోటు వచ్చినా నాకు ఆశ్చర్యం కలిగేది కాదు. ఆమె కోపంతో ఊగిపోయి పెద్ద యాగీ చేస్తుందని ఊహించాను. కాని కేవలం ఒక చిరునవ్వునే నవ్వింది.

"నా ప్రియమైన మిత్రుడా! ఇటువంటి మాటలంటున్నందుకు ఏదో ఒక రోజు నువ్వు పశ్చాత్తాపపడతావు"

"ఐరిస్‌కు ఆ అబ్బాయితో పెళ్లి జరగదని నిర్ణయం చేసుకున్నావా?"

"అట్లా అనేలా చేసింది మరి"

"నువ్వొద్దనుకున్నదాన్ని ఎవ్వరైనా చేయించగలిగారా?'

"తను కోరుకుంటే ఐరిస్ రేపే ఆ అబ్బాయిని పెళ్లి చేసుకోవచ్చు. దాని వల్ల నేను చనిపోతే చనిపోనీయండి".

"అయితే రిస్క్ తీసుకుని వాళ్ళ పెళ్లి చేసేద్దాం. సరేనా?"

"నాపట్ల మీకు సానుభూతి లేదా?"

"నన్ను వినోదానికి గురిచేసే నీ వంటి వారి పట్ల సానుభూతి చూపటమనేది వుండదు" లూయిస్ చెక్కిలి మీద తేలికపాటి మచ్చ కదలాడింది. ఆమె నవ్వింది కాని, కన్నుల్లో కోపం, కర్కశత్వం కనిపించాయి.

"ఒక నెలరోజుల్లో ఐరిస్ అతణ్ని పెళ్లాడుతుంది. ఇది నా నిర్ణయం. కాని నాకేమైనా జరిగితే మిమ్మల్ని మీరు క్షమించుకోలేరు".

లూయిస్ తన మాటను నిలబెట్టుకుంది. పెళ్లి తేదీని నిర్ణయించి, ఐరిస్ కోసం అద్భుతమైన పెళ్లి డ్రెస్సును కొని, అందరికీ ఆహ్వాన పత్రాలను పంపించింది. ఐరిస్, ఆ అబ్బాయి ఇద్దరూ సంతోషంతో వెలిగిపోయారు. పెళ్లిరోజున ఉదయం పది గంటలకు ఆ ముదనష్టపు లూయిస్‌కు గుండెపోటు వచ్చి చనిపోయింది. తనను చంపినందుకు ఐరిస్‌ను మృదువుగా క్షమిస్తూ ఆమె మరణించింది.

8

# లంచ్

**(Lunch)**

**ఒ**క నాటకం దగ్గర నేనామెను చూశాను. ఇంటర్వెల్‌లో ఆమె నన్ను పిలిస్తే వెళ్లి పక్కసీట్లో కూచున్నాను. అంతకు ముందు ఆమెను చూసి చాలా కాలమైంది. ఎవరో ఆమె పేరు చెప్పారు. లేకుంటే గుర్తించేవాణ్నే కాదేమో. ఆమె నన్ను ఆత్మీయంగా పలకరించింది.

"ఎంత కాలమైంది మనం కలుసుకుని? కాలం యెంత వేగంగా పరుగెత్తుతుందో కదా. మనం మొదటిసారి కలుసుకున్నప్పటి దృశ్యం మీకు జ్ఞాపకముందా? మీరు నన్ను లంచ్‌కు ఆహ్వానించారు" అన్నదామె. నాకు జ్ఞాపకముందా?

ఇరవయ్యేళ్ల క్రితం నేను పారిస్‌లో నివసించేవాణ్ని. శ్మశానం పక్కన ఒక చిన్న అపార్ట్‌మెంట్లో వుంటూ, బొటాబొటి సంపాదనతో బ్రతుకును వెళ్లదీస్తున్నాను. ఆమె నా పుస్తకమొకటి చదివి, నాకు ఉత్తరం రాసింది. నేను కృతజ్ఞతలు తెలుపుకుంటూ జవాబు రాశాను. తాను పారిస్ మీదుగా వెళ్తున్నట్టూ నన్ను కలిసి మాట్లాడదల్చుకున్నట్టూ మరో ఉత్తరం రాసిందామె. కాని, ఆ తర్వాత రాబోయే గురువారం నాడు మాత్రమే ఆమె ఖాళీగా వుంటుందట. ఆ రోజున హోటల్ ఫోయాట్‌లో నేనామెకు చిన్న లంచ్ యివ్వాలని నిర్ణయించబడింది. ఆ హోటల్ చాలా ఖరీదైనది. అందులో ఫ్రెంచ్ సెనేటర్లు మొదలైన ధనవంతులు భోంచేస్తారు. కనుక, అక్కడికి పోవాలని నేనెప్పుడూ కనీసం ఊహలో కూడా అనుకోలేదు. కాని, ఆమె అట్లా కోరడంతో సంతోషంతో పొంగిపోయాను. పైగా నేనప్పుడు యువకుణ్ని కనుక, ఒక స్త్రీ అడిగితే కాదనే పరిస్థితిలో లేను. ఆ నెలంతా గడపడానికి నా దగ్గర ఎనభై ఫ్రాంకులున్నాయి. ఆ హోటల్లో మా ఇద్దరి భోజనానికి

పదిహేను ఫ్రాంకులకన్న యెక్కువ ఖర్చు కాకపోవచ్చు. రాబోయే రెండు వారాల పాటు కాఫీని మానుకుంటే ఆ నెలంతా గడపవచ్చుననుకున్నాను.

ఫోయాట్ హోటల్లో గురువారం నాడు ఆమెను కలుస్తున్నానని ఉత్తరం ద్వారా తెలిపాను. నేను ఊహించినట్టుగానే ఆమె వయస్సు తక్కువగా లేదు. ఇక ఆమెరూపంలో ఆకర్షణ కన్న గాంభీర్యం ఎక్కువగా వుంది. దాదాపు నలభై ఏళ్ల వయసుంటుంది ఆమెకు. నోటిలోపల అవసరమైన దానికంటె ఎక్కువ సంఖ్యలో తెల్లని పెద్దపెద్ద కుదురైన పళ్లున్నట్టు కనిపించింది. ఆమె అతిగా మాట్లాడుతోంది. కాని, అది నా గురించే కాబట్టి శ్రద్ధగా వినటానికి నేను సిద్ధమై వున్నాను. మెనూ కార్డును చూసి గతుక్కుమన్నాను. ఎందుకంటే ధరలు నేను ఊహించిన దానికంటె చాలా ఎక్కువగా వున్నాయి. కాని, "నేను లంచ్ ఎప్పుడూ యెక్కువగా తినను" అన్నదామె నాకు భరోసా యిస్తున్నట్టుగా.

"అట్లా అనకండి" అన్నాను మర్యాద కోసం, వినయంగా. సాల్మన్ చేపలు ఆ నెలలో బాగా దొరకనందుకేమో, వాటి ధర మెనూ కార్డులో లేదు. అయినా ఒకవేళ ఉన్నాయేమోనని వెయిటర్ను అడిగాను. "ఇన్ని రోజుల పాటు లేవు కాని, ఇవ్వాళ్లే మంచి సాల్మన్ చేప ఒకటి వచ్చింది" అన్నాడు వెయిటర్. నా అతిథికోసం దాన్ని ఆర్డర్ చేశాను. "దాన్ని వండేలోగా వేరే యేమైనా తింటారా?" అని అడిగాడు వెయిటర్.

"వద్దు. నేను ఒకటి కన్న యెక్కువ ఐటమ్స్ తినను. కాని, జెన వుంటే కొంచెం తినడానికి ఇబ్బంది లేదు" అన్నదామె. నా గుండె గుబగుబలాడింది. జెనకు అయ్యే ఖర్చును భరించలేను. కాని ఆ మాటను పైకి అనలేకపోయాను. జెన తెమ్మని వెయిటర్కు చెప్పాను. ఇక నా కోసమేమో మెనూ కార్డులో వున్న ఐటమ్స్లో అన్నిటి కన్న చవకదైన మటన్ చాప్స్ యెంచుకుని ఆర్డరిచ్చాను.

"మటన్ తినటం అంత మంచిది కాదేమో. అటువంటి బరువైన ఐటమ్ తిన్నాక రోజంతా పని చేయడం కష్టం. కడుపును పూర్తిగా నింపడం నాకిష్టం వుండదు" అన్నదామె. తర్వాత, డ్రింక్ విషయం వచ్చింది.

"లంచ్లో నేను యే డ్రింకూ తాగను" అన్నదామె.

"నేనూ అంతే" అన్నాను తక్షణమే.

"కాని వైట్ వైన్స్కు మినహాయింపు వుంది. వాటిని తాగితే బాగా జీర్ణమవుతుంది. ఎందుకంటే అవి లైట్గా వుంటాయి."

"వాటిలో ఏది కావాలి మీకు?" అని అడిగాను మర్యాదను ప్రదర్శిస్తూ. కాని నా మాటల్లో ఉత్సాహం లేదు.

“షాంపేన్ తప్ప మరేదీ తాగవద్దని చెప్పాడు నా డాక్టరు”. అప్పుడు నేను బహుశా కొంచెం పాలిపోయి వుంటాను. చిన్న సీసాకు ఆర్డరిచ్చాను. నా డాక్టరు మాత్రం నన్ను షాంపేన్ అసలే తాగవద్దన్నాడని చెప్పాను.

“అయితే మరి మీరేం తాగుతారిప్పుడు?”

“మంచి నీళ్లు”

ఆమె సాల్మన్ చేపను, జెనను తింటూ సాహిత్యం గురించీ, సంగీతం గురించీ ఆహ్లాదంగా మాట్లాడింది. నేనేమో బిల్లు యెంత అవుతుందోనని లోపల్లోపల భయపడ్డాను. నా మటన్ చాప్స్ రాగానే నన్ను మందలిస్తున్నట్టుగా “మీరు లంచ్ హెవీగా తీసుకుంటారనుకుంటాను. అదంత మంచిది కాదు. నా లాగా ఒక్క ఐటమ్‌నే యెందుకు తినరు? అలా చేస్తే చాలా బాగుంటుంది మీకు” అన్నదామె.

“నేను ఇదొక్కటే తినబోతున్నాను” అని అంటుండగా వెయిటర్ మళ్లీ మెనూ కార్డు తెచ్చాడు.

ఆమె చేయిని అడ్డంగా వూపి “నేను లంచ్‌లో ఒక్క ఐటమ్ కన్న ఎక్కువ యెప్పుడూ తినను, ఒక్క ముద్దకన్న ఎక్కువ అవసరం లేదు నాకు. అది కూడా మాట్లాడుతూ ఏదో తినాలని తినడం కోసం. అంతే. కాబట్టి, బహుశా మరేదీ తినను. కానీ, ఆస్పరాగస్ అనే ఆకుకూర వుంది చూశారూ. దాన్ని కొంచెం తినకుండా పారిస్‌ను వదిలి వెళ్తే అసంతృప్తిగా వుంటుంది” అన్నది.

“ఆస్పరాగస్ వుందా అని మేడమ్ అడుగుతున్నారు” అన్నాను వెయిటర్‌తో.

“లేదు” అంటాడని, అనాలని మనసారా కోరుకున్నాను. కాని చాటంత మొహంతో నవ్వుతూ “దివ్యమైన, రుచికరమైన ఆస్పరాగస్ వుంది” అన్నాడతడు.

“నిజానికి అంత ఆకలిగా లేదు నాకు. కాని, మీరు బలవంత పెడితే ఇక తప్పుతుందా” అన్నది నా అతిథి. ఆస్పరాగస్‌కు ఆర్డరిచ్చాను.

“మీరు కూడా కొంచెం తినరా?”

“ఊహుఁ, దాన్ని నేనెప్పుడూ తినను”.

“కొంత మంది దాన్ని ఇష్టపడతారని తెలుసు నాకు. నిజానికి మటన్ చాప్స్ తిన్న తర్వాత నోరంతా అదోలా అవుతుంది”.

ఆస్పరాగస్ కోసం వేచి వున్నాం. నాలో గాభరా యెక్కువైంది. బిల్లు కట్టింతర్వాత నెలంతా ఎట్లా గడపాలి అనే భయం కాక, అసలు బిల్లు కట్టేందుకు నా దగ్గర వున్న డబ్బు సరిపోతుందా అన్నది పెద్ద ప్రశ్న అయి కూచుంది. ఒకవేళ ఓ పది ఫ్రాంకులు తక్కువ పడి నా అతిథి దగ్గరే అరువు తీసుకోవాల్సి వస్తే ఎంత అవమానకరంగా వుంటుంది

అని భయమేసింది. నేనట్లా అరువు తీసుకోలేను కూడా. నా జేబులో సరిగ్గా ఎంత డబ్బుందో నాకు తెలుసు కనుక, బిల్లు అంతకన్న యెక్కువగా వస్తే పర్సు తెరిచి, ఎవడో డబ్బు కొట్టేశాడని అద్భుతంగా నటిస్తూ అరవాలని నిశ్చయించుకున్నాను. ఆమె దగ్గర కూడా సరిపడేంత డబ్బు లేకపోతే అప్పుడు పరిస్థితి మరింత ఘోరంగా వుంటుంది. ఒకవేళ అట్లాంటి పరిస్థితి వస్తే నా చేతి గడియారాన్ని కౌంటర్లో వదిలి, తర్వాత దాన్ని విడిపించుకోవటం తప్ప వేరే గత్యంతరం కనిపించలేదు.

అస్పరాగస్ వచ్చింది. ఆకలిని పెంచే విధంగా ఘుమఘుమల్ని వెదజల్లుతోంది ఆ ఆకుకూర. భక్తులైన యూదులు రుచికరమైన వంటకాల్ని నైవేద్యంగా సమర్పించినప్పుడు యెహోవా ముక్కు రంధ్రాలకు అవి ఎటువంటి గిలిగింతలు పెడతాయో, నా ముక్కు రంధ్రాలకు ఆ ఆకుకూర అటువంటి గిలిగింతలనే పెట్టింది. సంతోషంతో తుళ్లిపడుతున్న ఆమె, తన పెద్ద నోట్లోకి ఆస్పరాగస్‌ను తోస్తుంటే నాటకాల గురించి నేను చిన్న ఉపన్యాసమిచ్చాను.

“కాఫీ?” అని అడిగాను.

“ఓ.కే. కొంచెం ఐస్ క్రీమూ, కొంచెం కాఫీ” అన్నది. ఇక తెగింపుతో వున్నాను. నాకోసం కేవలం కాఫీ, ఆమె కోసం ఐస్‌క్రీమూ, కాఫీ ఆర్డరిచ్చాను. ఐస్‌క్రీమును తింటూ “ఒక్క విషయాన్ని మాత్రం బాగా నమ్ముతాను నేను. అదేమిటంటే, భోజనం చేసింతర్వాత కడుపులో కొంత ఖాళీ వుంచుకోవాలి” అన్నది ఆమె.

“ఇంకా ఆకలిగా వుందా మీకు?” అని అడిగాను మూర్ఛ వచ్చినట్టవుతుంటే.

“అదేం లేదు.నేను లంచ్ ఎక్కువగా తినను. ఉదయం పూట కాఫీ తాగి, రాత్రి భోజనం చేస్తాను. కాని లంచ్‌లో మాత్రం ఒక్క ఐటమ్ కన్న ఎక్కువగా తినను”.

“ఓహో. అలాగా”. అప్పుడొక దారుణమైన సంఘటన జరిగింది. మేము కాఫీ కోసం ఎదురు చూస్తుంటే హెడ్ వెయిటర్ చాటంత మొహంతో నవ్వుతూ వచ్చి, పెద్ద పెద్ద పీచ్ పండ్లు నిండిన ఒక పెద్ద బుట్టను మా ముందు పెట్టాడు. ఆ పండ్లలో సిగ్గుపడే అందమైన, అమాయకురాలైన అమ్మాయి బుగ్గలు కనిపించాయి నాకు. ఇటాలియన్ ప్రకృతి దృశ్యం కూడా వాటిలో దర్శనమిచ్చింది. అసలు ఆ నెలలో సాధారణంగా పీచ్ పండ్లు దొరకవు. వాటి ధర యెంత వుంటుందో ఆ భగవంతునికే తెలియాలి. కాని, తర్వాత ఆ ధర నాకు తెలియక తప్పింది కాదు. ఎందుకంటే నా అతిథి తన మాటల్ని కొనసాగిస్తూనే పరధ్యానంగా ఒక పండును తీసుకుంది.

“మీరు కడుపును మటన్‌తో నింపేశారు కనుక, మరేదీ తినలేరు. కాని నేను కొంచెమే తిన్నాను కాబట్టి, ఒక పీచ్ పండును తినగలను” అన్నది ఆమె.

బిల్లు వచ్చింది. దానికి డబ్బు యిచ్చింతర్వాత వెయిటర్‌కు టిప్ ఇవ్వడంకోసం నా దగ్గర చాలా తక్కువ డబ్బు మిగిలింది. నేను వదిలిన మూడే మూడు ఫ్రాంకులను ఆమె చూస్తుంటే నాకు తల కొట్టేసినట్టనిపించింది. రెస్టారెంట్ లోంచి బయటకు వచ్చాము. ఇంకా నెలంతా గడపాల్సి వున్నా నా జేబులో ఒక్క పెన్నీ కూడా మిగలలేదు.

నాతో చేయి కలుపుతూ "నా విధానాన్ని పాటించండి. లంచ్‌లో ఒక్క ఐటమ్ కన్న ఎప్పుడూ యెక్కువ తినకండి" అన్నది నా అతిథి.

"అంతకన్న మంచి విషయమే పాటిస్తాను. ఈ రోజు రాత్రి అసలేమీ తినను" అన్నాను మాటకు మాటతో దెబ్బ తీస్తున్నట్టుగా.

"మీలో మంచి హాస్య ప్రియత్వం వుంది" అంటూ సంతోషంగా టాక్సీలోకి దూకింది ఆమె. కాని నేను ప్రతీకారం తీర్చుకున్నట్టైంది. నిజానికి ప్రతీకారం తీర్చుకోవడం నా తత్వం కాదు. అయితే అమరులైన దేవుళ్లు కల్పించుకుంటే ఏర్పడే ఫలితాన్ని మనం తృప్తిగా ఆనందించాలి. ఇప్పుడామె బరువు నూటా ముప్పై కిలోలకు పైనే.

9

# పలాయనం

**(The Escape)**

**ఒ**క స్త్రీ ఓ పురుషుణ్ని పెళ్లి చేసుకోవాలని ఒక్కసారి గట్టిగా నిర్ణయించుకున్నదంటే, వెంటనే పలాయనం చిత్తగించడం తప్ప, వేరే యేదీ ఆ మగాణ్ని కాపాడదని నా బలమైన నమ్మకం. కాని, అందరు మగవాళ్ళ విషయంలో అదేవిధంగా జరగదు. ఎందుకంటే, ఒకసారి నా మిత్రుడొకనికి అలాంటి తప్పించుకోలేని గడ్డు సమస్య ముంచుకొచ్చినప్పుడు తనను ప్రేమించిన స్త్రీ నుండి పారిపోయి, పన్నెండు నెలలపాటు ఓడమీద ప్రయాణించి, తిరిగి వచ్చాడు. కాని, ఇంతకాలం పాటు ఇంకా నన్నామె గుర్తు పెట్టుకుని వుండదులే అని ఊహించుకుని రేవులో ఓడ దిగుతుంటే, సంతోషంగా చేయి ఊపుతూ అతనికి కనిపించిన మొట్టమొదటి వ్యక్తి తనను ప్రేమించిన ఆ స్త్రీయే! నాకు తెలిసిన వాళ్లలో అటువంటి పరిస్థితిలో తప్పించుకున్నవాడు అతడొక్కడే. అతనిపేరు రోజర్ చేరింగ్. రూత్ బార్లో అనే ఆ స్త్రీ ప్రేమలో పడ్డప్పుడు రోజర్ చేరింగ్ యువకుడు కాడు. జాగ్రత్తగాఎలా వుండాలో తెలుసుకునేందుకు సరిపోయేటంత అనుభవం ఉందతనికి. కాని, రూత్ బార్లోలో ఒక సమర్థత వుంది (దాన్ని లక్షణం అనాలేమో) ఆ లక్షణమే చాలా మంది మగాళ్లను నిస్సహాయుల్ని చేస్తుంది. దానివల్లనే అతడు తన వివేకాన్నీ లోకజ్ఞానాన్నీ కోల్పోయి, చొప్పబెండ్ల భవనం లాగా కుప్ప కూలిపోయాడు. దయనీయత అంటే అదే మరి. రూత్‌బార్లో అప్పటికే రెండుసార్లు విడాకులు తీసుకుంది. ఆమె కళ్లు నల్లగా, అద్భుతంగా ఉండి ఎప్పుడూ కదుల్తూ వుంటాయి. వాటిలో దుఃఖం దాగి వున్నట్టు అనిపిస్తుంది మనకు. రోజర్ చేరింగ్ లాగా మనం బాగా డబ్బున్న గట్టి మనుషులమైతే, ఆ అసహాయురాలికి అండగా నిలిచి, అందమైన ఆ కళ్లలోంచి దుఃఖాన్ని లాగిపారేస్తే ఎంత బాగుండును అని

తప్పక అనిపిస్తుంది మనకు. రూత్ బార్లోతో అందరూ చాలా అన్యాయంగా ప్రవర్తించారని రోజర్ చేరింగ్ ద్వారా తెలిసింది నాకు. పొరపాటున ఐనా ఎప్పుడూ శుభం జరగని దురదృష్టవంతుల్లో ఆమె ఒకతి అనిపిస్తుంది. పెళ్లి చేసుకున్న భర్త ఆమెను బాదాడు. ఒక బ్రోకర్ను పెట్టుకుంటే వాడు మోసం చేశాడు. వంట మనిషిని పెట్టుకుంటే వాడు తాగి తందనాలాడాడు. అమెకొక చిన్న మేకపిల్ల లేదు కానీ, ఒకవేళ ఉంటే అది తప్పక చచ్చిపోయేది.

ఆఖరుకు ఆమెను పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకున్నట్టు రోజర్ నాకు చెప్పినపుడు, అతణ్ని అభినందించాను.

"ఆమెకు నువ్వొక మంచి స్నేహితునిగా వుంటావని ఆశిస్తాను. నువ్వంటే ఆమెకు కొంచెం భయం. నువ్వు నిర్దయుడివని ఆమె అభిప్రాయం" అన్నాడు రోజర్.

"అయ్యో, ఆమె అట్లా యెందుకనుకుంటుందో నాకు తెలియదు".

"ఆమె అంటే నీకిష్టమే కదా?"

"బాగా యిష్టం".

"పాపం, ఆమె చాలా కష్టాల్ని అనుభవించింది. అది తల్చుకున్నప్పుడు ఎంతో బాధ కలుగుతుంది".

"అవును, నిజం"

అంతకన్న వేరే మాట్లాడలేకపోయాను. ఆమె ఒక తెలివిమాలిన స్త్రీ అని తెలుసు నాకు. ఆమె పన్నాగం రచిస్తున్నదని ఊహించాను. కరుణ, సానుభూతి, భయం అన్నవి ఆమెలో లేవని నా అభిప్రాయం.

నేనామెను మొదటిసారి కలిసినప్పుడు కొందరు మిత్రులం కలిసి బ్రిడ్జ్ ఆట ఆడాము. ఆ ఆటలో నా పార్టనర్గా వుంటూనే రెండుసార్లు తప్పు కార్డు వేసి నన్ను మోసగించింది. నేను యెంతో సహనంతో ప్రవర్తించాను. కాని అప్పుడు కళ్లల్లో కన్నీళ్లు ఉబికే విధంగా ఉండింది నా పరిస్థితి. సాయంత్రమయ్యే సరికి ఆమె ఓడిపోయి, నాకు చాలా డబ్బు బాకీ పడింది. ఆ డబ్బును చెక్కు రూపంలో తర్వాత పంపిస్తానన్నది. కాని పంపనే లేదు. మరుసటిసారి మేము కలుసుకున్నపుడు ఆమెకన్న నేనే ఎక్కువ దీనత్వాన్ని కనబరచాల్సి వచ్చింది.

రోజర్ చేరింగ్ ఆమెను తన స్నేహితులకు పరిచయంచేశాడు. అందమైన నగల్ని కొనిచ్చాడు. చాలా చోట్లకు తీసుకుపోయాడు. వాళ్ల పెళ్లి త్వరలోనే జరగబోతోందని అందరికీ చెప్పాడు. అతడు చాలా సంతోషపడ్డాడు. తాను యెంతగానో కోరుకున్న విధంగానే

ఆ పెళ్లి జరుగుతున్నట్లుగా భావించాడు. కొన్నాళ్ల తర్వాత అతడు ఆ ప్రేమను మానుకుని, దాన్నుండి బయటికి వచ్చాడు. అందుకు కారణం బహుశా ఆమె సంభాషణ తీరు కావచ్చు. ఎందుకంటే ఆమె అస్సలే మాట్లాడదు. దయనీయమైన ఆ సంగతే అతని హృదయాన్ని వికలం చేసి వుండొచ్చు. అతనికి జ్ఞానోదయమై, మళ్లీ మునుపటిలాగా లోక వ్యవహారం తెలిసిన మనిషిగా మారాడు. రూత్ బార్లో తమ పెళ్లి పట్ల కృతనిశ్చయంతో వున్నట్లు గ్రహించాడు. తాను మాత్రం ఎట్టి పరిస్థితిలోనూ ఆమెను పెళ్లాడనని ఒట్టు వేసుకున్నాడు. అయితే ఇరకాటంలో పడ్డాడతడు. ఆమెను వివాహం చేసుకుంటే ఎటువంటి స్త్రీతో తాను కాపురం చేయాల్సి వుంటుందో తెలిసిందతనికి. కాని, తనను వదిలెయ్యమని అడిగితే ఆమె తన మనసు అపారంగా గాయపడిందని చెప్పి గొడవ పెట్టే సూచనలు కనిపించాయతనికి. పైగా, ప్రేమించిన స్త్రీని వదిలేయటం అసహ్యంగా వుంటుందని తలచాడు. తాను ఘోరంగా ప్రవర్తించినట్టు లోకం భావిస్తుందని భయపడ్డాడు.

రోజర్ తన మనోభావాలను రహస్యంగా వుంచాడు. రూత్ బార్లో పట్ల తన అభిప్రాయం మారినట్టు చూచాయగానైనా తెలియనివ్వలేదు. ఆమెకున్న కోరికలన్నింటినీ శ్రద్ధగా విన్నాడు. ఆవిడను రెస్టారెంట్లకు, నాటకాలకు తీసుకుపోయాడు. రోజా పువ్వుల్ని పంపి సంతోషపెట్టాడు. మునుపటిలాగానే సానుభూతినీ, సౌహార్ద్రాన్నీ కనబరచాడు. వాళ్లిద్దరూ విడివిడిగా అద్దె గదుల్లో వుంటున్నారు కనుక, ఒక మంచి యిల్లును కొనుక్కున్న తర్వాత పెళ్లి చేసుకుందామని నిర్ణయించుకుని, ఇల్లుకోసం వేటను ప్రారంభించారు. రియల్ ఎస్టేట్ ఏజెంట్లు సూచించిన యెన్నో ఇళ్లను అతడు రూత్ బార్లోకు చూపించాడు. కాని, పూర్తిగా నచ్చిన యిల్లు దొరకలేదు. రోజర్ మరికొందరు ఏజెంట్లను సంప్రదించాడు. ఒకటి తర్వాత వొకటి వరుసగా లెక్కలేనన్ని ఇళ్ళను వాళ్లిద్దరూ కలిసి చూశారు. ప్రతి ఇంటినీ సెల్లార్ దగ్గర్నుంచి పెంట్ హౌస్ దాకా చాలా జాగ్రత్తగా పరిశీలించారు. అవి కొన్నిసార్లు చాలా చిన్నగా వుంటే, మరికొన్ని సార్లు చాలా పెద్దగా వున్నాయి. కొన్ని చౌరాస్తాకు చాలా దూరంగా వుంటే, ఇంకొన్ని మరీ చౌరాస్తా మీదనే వున్నాయి. కొన్ని యిళ్ల ఖరీదు చాలా యెక్కువగా వుంటే, కొన్నింటికేమో చాలా మరమ్మతులు చేయాల్సి వుంది. కొన్ని గాలి ఆడనట్టుంటే, ఇంకొన్నిటిలోకి గాలి మరీ ఉధృతంగా వీస్తోంది. కొన్ని యిళ్లేమో మరీ చీకటిగా వున్నాయి. ప్రతి యింట్లో ఏదో వొక లోటును సూచించి, దాంట్లో నివసించలేమన్నాడు రోజర్. రూత్ బార్లోకు బాగా నచ్చిన యింట్లో తప్ప వేరే దాంట్లో ఆమెను ఉంచటం తనకు నచ్చదన్నాడు. కాని, అన్ని విధాలా బాగున్న ఇల్లు దొరకలేదు

వాళ్లకు. ఇళ్ల వేట అన్నది చాలా అలసట కలిగించే విషయం. కనుక, రూత్‌బార్లో అసహనాన్ని చూపింది. ఓపిక పట్టాలని ఆమెను వేడుకున్నాడు రోజర్. తమకు పూర్తిగా నచ్చిన యిల్లు తప్పక యెక్కడో వుండి వుంటుందనీ, కొంచెం పట్టుదల, సహనం కలిగి వుండాలనీ కోరాడు. కొన్ని వందల యిళ్లను చూశారు వాళ్లు. వేల స్టేర్‌కేస్‌లను ఎక్కారు. లెక్కలేనన్ని కిచెన్లను పరిశీలించారు. రూత్ బార్లో పూర్తిగా అలసిపోయి, ఒకటిరెండు సార్లు కోపాన్ని ప్రదర్శించింది.

"త్వరలోనే నువ్వొక యిల్లును నిశ్చయించకపోతే, నేను నా అభిప్రాయాన్ని మార్చుకోవాల్సి వుంటుంది. అంతేకాదు, ఇట్లా ఆలస్యం చేస్తే ఎన్ని సంవత్సరాలైనా మన పెళ్లి జరగదు" అన్నదామె.

"అట్లా అనకు రూత్. నువ్వు కొంచెం ఓపిక పట్టాలని వేడుకుంటున్నాను. ఏజెంట్లు కొన్ని కొత్త యిళ్లను చూపిస్తామంటున్నారు. అటువంటి ఇళ్లు కనీసం అరవై ఉన్నాయట వాళ్ల దగ్గర" అన్నాడు రోజర్. వాళ్లు మళ్లీ ఇళ్లవేటలో పడ్డారు. అది రెండు సంవత్సరాల పాటు కొనసాగింది. రూత్‌లో మౌనంతో కూడిన తిరస్కార భావం చోటు చేసుకుంది. నిరాశ నిండిన ఆమె అందమైన కళ్లు చిరాకును కనబరిచాయి. మనుషుల సహనానికి ఒక హద్దు వుంటుంది కదా. రూత్ బార్లోకు సహనం లేదని కాదు కాని, బాగా ఆలస్యం అవుతూ కాలం గడిచిపోతుండటంతో విసిగిపోయి, ఆఖరుకు ఆమె ఎదురు తిరిగింది.

"అసలు నువ్వు నన్ను పెళ్లిచేసుకుంటావా లేదా?" అని అడిగిందామె. ఆ గొంతులో ఒక కొత్త కరుకుదనం వుంది, కాని, అది రోజర్ యిచ్చిన సమాధానంలోని మెత్తదనాన్ని తక్కువ చేయలేకపోయింది.

"తప్పకుండా చేసుకుంటాను. మనకు సరైన ఇల్లు దొరకగానే వెంటనే పెళ్లి చేసుకుందాం. మన అభిరుచికి తగిన ఇల్లొకటి ఉన్నట్టు ఒక ఏజెంట్ చెప్పాడు నాకు"

"ఇంక మరే యిల్లునూ చూసే ఓపిక లేదు నాకు"

"నా ప్రియతమా! పాపం నువ్వు బాగా అలసిపోయినట్టున్నావు".

రూత్ బార్లో మంచం పట్టింది. రోజర్ను కలవడానికి నిరాకరించిందామె. అతడు ఆమెకు పువ్వుల్ని పంపటంతోనే సంతృప్తి పడాల్సి వచ్చింది. అయినా చాలా పట్టుదలనూ, చాకచక్యాన్నీ, ధైర్యాన్నీ చూపాడు. మంచి కొత్త యిల్లొకటి వుందంటూ ప్రతిరోజూ ఆమెకు ఉత్తరం రాశాడు. వారం రోజులు గడిచాక, రూత్ నుండి ఒక ఉత్తరం వచ్చిందతనికి. అందులో యిట్లావుంది.

రోజర్ !

నువ్వు నన్ను ప్రేమిస్తున్నావని అనుకోవడం లేదు నేను. నేను మరొక వ్యక్తిని చూసుకున్నాను. ఈరోజే అతనితో నా పెళ్ళి.

రూత్

రోజర్ ఈ విధంగా జవాబు రాసి పంపాడు

రూత్ !

నీ ఉత్తరం నా హృదయాన్ని ముక్కలు చేసింది. ఈ దెబ్బనుండి నేనసలే కోలుకోలేను. కాని, నేను మొదట కోరుకునేది నీ సంతోషాన్నే. ఈ ఉదయం ఏజెంట్లు ప్రతిపాదనలు తెచ్చిన ఏడు యిండ్ల గురించిన వివరాలు రాసి పంపిస్తున్నాను. వీటిలో ఏదో వొకటి నీకు బాగా నచ్చుతుందని ఆశిస్తున్నాను.

రోజర్..

# 10

# పరాయి ప్రాంతంలో

**(In a Strange Land)**

**నే**ను ప్రయాణాలు ఎక్కువగా చేసే ప్రవృత్తి ఉన్నవాణ్ని. కాని అందమైన పెద్ద కట్టడాలను చూడటం కోసం ప్రయాణాలు చేయను. నిజానికి అవి నాకు బోర్ కొట్టిస్తాయి. ఆకర్షణీయమైన దృశ్యాలను చూడటం కూడా అంతగా ఇష్టం వుండదు నాకు. ఎందుకంటే వాటిని చూస్తూ తిరుగుతుంటే అలసట కలుగుతుంది. మనుషులను చూడటం కోసం ప్రయాణిస్తాను. పేరున్న గొప్పవాళ్లను కలవటం పట్ల నాకు ఆసక్తి లేదు. రోడ్డుకు ఆవలివైపున వున్న దేశాధ్యక్షుణ్నో, రాజునో కలవడానికి ఆ రోడ్డును దాటే ప్రయత్నం చేయను. ఒక రచయితను అతడు రాసిన పుస్తకపు పేజీల్లో, ఒక చిత్రకారుణ్ని అతడు గీసిన చిత్రంలో దర్శించటంతోనే తృప్తి పడతాను. కాని, ఎక్కడో దూరప్రాంతంలో ఉన్న వొక మతబోధకుని గురించి ఆసక్తికరమైన కథను వింటే, అతణ్ని కలవటానికి వంద మైళ్ల దూరమైనా ప్రయాణిస్తాను. అదేవిధంగా ఒక మంచి బిలియర్డ్స్ ఆటగాడితో పరిచయం పెంచుకోవడానికి చవకబారు హోటల్లో పదిహేను రోజులుండవల్సి వస్తే వుంటాను. ఒక రకమైన దిగ్భ్రాంతినీ, వినోదాన్నీ కలిగించే ఎవరినైనా కలవటం నాకు సంతృప్తిని కలిగిస్తుందని చెప్పవచ్చు. ఈ కథలో నేను చెప్పబోయేది వయసు మీరిన ఆంగ్లేయ స్త్రీల గురించి. వాళ్లకు డబ్బు వెసులుబాటు వుంటుంది. ప్రపంచంలో వివిధ ప్రాంతాలకు తిరుగుతూ, ఊహించని ప్రాంతాల్లో ఒంటరిగా నివసిస్తుంటారు వాళ్లు. ఇటలీ దేశంలోని ఒక పట్టణంలో ఊరవతలి కొండమీద ఏకైక ఆంగ్లేయ స్త్రీగా నివసించే వ్యక్తిని కాని, అండ్యూలేషియాలో ఎన్నో సంవత్సరాలుగా తోడు లేకుండా మనుగడ సాగిస్తున్న ఆంగ్లేయురాలి గురించి కాని తెలిసినప్పుడు మనకు ఎక్కువ ఆశ్చర్యం కలగకపోవచ్చు.

కాని మత బోధకురాలు కానటువంటి ఒక ఇంగ్లిష్ స్త్రీ చైనాలోని ఒక పట్టణంలో ఒంటరిగా బ్రతుకును గడుపుతున్నదంటే, పైగా ఆప్రాంతంలో అటువంటి స్త్రీలు ఇంకొకరో యిద్దరో తప్ప యెక్కువ మంది లేకుంటే, మనకు తప్పక ఆశ్చర్యం కలుగుతుంది.

నేను చూసిన అటువంటి స్త్రీలందరిలో నాకు బాగా స్పష్టంగా జ్ఞాపకమున్న స్త్రీపేరు నికోలిని. ఆమె అప్పుడు పశ్చిమ ఆసియాలో నివసిస్తుండేది. ఒకసారి బాగా అటసట కలిగించే ప్రయాణం చేసి, ఆ ప్రాంతంలోని చిన్న పట్టణానికి చేరుకున్నాను. అక్కడ బస చేసి, దగ్గర్లో వున్న ఒక పేరు మోసిన పర్వతాన్ని యెక్కాలని ప్రణాళిక వేసుకున్నాను. ఆ వూరును చేరుకునే సరికి బాగా రాత్రయింది. అక్కడ వున్న టూరిజం హోటల్‌కు వెళ్లి, రిజిస్టర్లో నా పేరూ, చిరునామా రాశాను. చలి ఉధృతంగా వుంది. బట్టలు మార్చుకుంటుంటే గజగజ వణికాను. అంతలోనే తలుపు కొట్టిన చప్పుడు వినపడింది. తలుపు తీయగానే ఒక పనివాడు లోపలికి వచ్చి, "మేడమ్ నికోలిని గారు దీన్ని పంపించారు" అంటూ ఒక వేడినీళ్ల సీసాను యిచ్చాడు.

ఆశ్చర్యంతో, కృతజ్ఞతతో దాన్ని తీసుకున్నాను.

"మేడమ్ నికోలిని యెవరు?" అని అడిగాను.

"ఆమె ఈ హోటలుకు యజమానురాలు" అన్నాడు వాడు.

ఆమెకు నా కృతజ్ఞతలు తెలుపమన్నాను. వాడు వెళ్లిపోయాడు. అంతగా అభివృద్ధి చెందని ఆ ప్రాంతంలోని చవకబారు హోటల్లో వేడినీళ్ల సీసా దొరుకుతుందని నేనసలే ఊహించలేదు. మేడమ్ నికోలినిని కలిసి, వ్యక్తిగతంగా కృతజ్ఞతలు తెలుపుకోవటం కోసం మరునాడు ఉదయాన కిందికి దిగాను.

ఆమె కోసం ఎదురు చూస్తుంటే, వేడినీళ్ల సీసాను ఇటాలియన్ భాషలో ఏమంటారా అని తెగ ఆలోచించాను. కొంచెం సేపటి తర్వాత ఆమె వచ్చింది. చిన్నగా, పొట్టిగా, లావుగా వున్నదామె. రూపంలో కొంత హుందాతనం ఉట్టిపడుతోంది. ఒక నల్లని కోటునూ, లేస్‌వున్న ఓ నల్లని చిన్నహ్యాటునూ ధరించింది. చేతుల్ని మడుచుకుని నిల్చుంది. ఇంగ్లండులోని ధనవంతుల బంగళాల్లో ఇంటి వ్యవహారాలన్నింటినీ పర్యవేక్షించే స్త్రీలాగా కనిపించింది ఆమె. కొంచెం ఆశ్చర్యానికి లోనయ్యాను.

"మీరు నాతో మాట్లాడాలనుకున్నారా సర్?" అని అడిగింది.

మాట తీరును బట్టి ఆమె ఆంగ్లేయురాలని గుర్తించాను. ఆమె మాట్లాడిన ఆ నాలుగు మాటల్లోనే ఇంగ్లండ్ దేశస్థుల యాస స్పష్టంగా తెలిసిపోయింది.

"వేడినీళ్ల సీసా పంపినందుకు మీకు కృతజ్ఞతలు తెలుపుకోవాలనుకున్నాను." అన్నాను కొంచెం తికమకగా.

"రిజిష్టర్లో పేరు చూసి మీరు ఆంగ్లేయులని తెలుసుకున్నాను. ఇంగ్లండుకు చెందిన పెద్ద మనిషి ఎవరైనా నా హోటలుకు వస్తే, అతనికి తప్పక వేడినీళ్ల సీసాను పంపుతాను".

"అంతకంటే బాగా స్వాగతించడం మరేదీ ఉండదంటే నమ్మండి."

"లార్డ్ ఓమ్స్‌కిర్క్ గారి దగ్గర నేను చాలా సంవత్సరాల పాటు పనిచేశాను. ఆయన ఎప్పుడు ప్రయాణం చేసినా ఒక వేడినీళ్ల సీసాను తప్పక వెంట తీసుకువెళ్లేవాడు. నాతో ఇంకేమైనా మాట్లాడాల్సి వుందా సర్" అని అడిగింది.

"ప్రస్తుతానికి లేదు. థాంక్స్"

మర్యాదపూర్వకంగా చిన్నగా తలను వంచి ఆమె వెళ్లిపోయింది. ఇంగ్లండులో పుట్టిన ఒక వింతైన, పొట్టి స్త్రీ పశ్చిమాసియాలోని హోటలుకు యజమానురాలెలా అయిందా అని ఆశ్చర్యపోయాను. ఆమెతో బాగా చనువుగా మాట్లాడ్డం అంత సులభమైన విషయం కాదని తెలిసిపోయింది. ఎందుకంటే తన స్థానమేమిటో ఆమెకు తెలుసు. అందుకని ముక్తసరిగానే మాట్లాడింది. అయినా నేను పట్టుదలతో కలుపుగోలుగా మాట్లాడి, ఆమె నన్ను టీకి ఆహ్వానించేలా చేశాను. లార్డ్ ఓమ్స్‌కిర్క్ దగ్గర ఆమె ఇంటి పనుల పర్యవేక్షకురాలి లాగా పని చేసినప్పుడు మిస్టర్ నికోలిని అదే యింట్లో హెడ్ కుక్‌గా పని చేశాడట. వాళ్లిద్దరి మధ్య చక్కని అరమరిక వుండేదట. కొన్ని సంవత్సరాల పాటు ఆ యింట్లో పని చేసి కొంత డబ్బును గడించాక, వాళ్లు పెళ్లి చేసుకుని తర్వాత ఆ ఉద్యోగాలను మానుకుని, ఒక హోటల్ పెట్టుకోవాలనుకున్నారు. ప్రపంచంలోని ఇతర ప్రాంతాల పట్ల మిస్టర్ నికోలినికి ఆసక్తి ఉండటం వల్ల, ముప్పయ్యేళ్ల క్రితం ఆ హోటల్‌ను కొన్నారు వాళ్లు. అయితే పదిహేను సంవత్సరాల క్రితం ఆయన చనిపోయాడు. ఆ తర్వాత మిసెస్ నికోలిని ఒక్కసారి కూడా ఇంగ్లండ్‌కు వెళ్లలేదు. "స్వదేశం పట్ల బెంగ అనిపించదా?" అని అడిగాను.

"స్వదేశానికి పోయి రావటం నాకిష్టం లేదని కాదు. కాని నేనొక పరాయి దేశస్థుణ్ని పెళ్లి చేసుకోవటం నా వాళ్ళకు యిష్టం లేదు. కనుక అప్పట్నుంచి వాళ్లు నాతో మాటలు మానేశారు. ఇక్కడ చాలా విషయాలు మనదేశంలో లాగా వుండవన్నది నిజమే కాని, కొత్త విషయాలకు మనం ఎట్లా అలవాటు పడతామో తల్చుకుంటే ఆశ్చర్యం కలుగుతుంది. ఇక్కడ కూడా ఎంతో జీవితం వుంది. లండన్ వంటి మహానగరాల్లోని గడబిడలో, గందరగోళంలో జీవించాలని అనిపించదు నాకు."

నేను నవ్వాను. ఎందుకంటే ఆమె అన్న మాటలు తన వ్యవహార శైలికి భిన్నంగా వున్నాయి. ఆ శైలిలో మర్యాద వుంది. ఆ క్రొత్త ప్రాంతపు ఆటవికత, అనాగరికత తనకు అంటకుండా ముప్పై సంవత్సరాలుగా ఆమె అక్కడ జీవిస్తూ వుండటం అసాధారణంగా

కనిపించింది. నాకు టర్కిష్ భాష రాకపోయినా, ఆమె ఆ భాషను అలవోకగా మాట్లాడినా, దాన్ని ఒక రకమైన యాసతో చాలా భాషాదోషాలతో మాట్లాడినట్టు గ్రహించాను. కొత్త ప్రాంతంలో తన జీవితపు ఎత్తుపల్లాలను తట్టుకుంటూ కూడా, ఒక సొగసైన ఆంగ్లేయ స్త్రీగా వుంటూ కూడా ఆమె తన స్థాయిని మరచిపోలేదనుకుంటాను. జీవితంలో ఏది ఎట్లా వస్తే అదే మహాభాగ్యం అన్నట్టుగా దాన్ని అట్లానే స్వీకరించింది ఆమె. ఆంగ్లేయులు కాని వారందరినీ ఆమె పరాయి దేశస్థుల్లాగా చూసింది. వాళ్లకు తెలివితేటలు తక్కువగా ఉంటాయి కనుక, కొంత సానుభూతితో ప్రవర్తించాలన్నది ఆమె అభిప్రాయం. బాగా ధనవంతులకు చెందిన గొప్ప యింట్లో పైస్థాయి ఉద్యోగిగా పనిచేసింది కనుక, తన కింద పని చేసే మనుషుల మీద  అధికారం ఎట్లా చలాయించాలో ఆమెకు బాగా తెలుసు. అందుకే ఆ హోటల్లో కూడా కింది ఉద్యోగుల పట్ల నిరంకుశత్వాన్ని కనబరిచింది. ఆ కారణం చేతనే ఆ హోటల్లో ప్రతిదీ చాలా శుభ్రంగా, సవ్యంగా, దివ్యంగా వుంది.

ఇదే విషయాన్ని చెప్పి ఆమెను అభినందించినప్పుడు "నేను చేయగలిగినంత చేయడానికి ప్రయత్నిస్తాను. మనకున్నటువంటి ఆలోచనలే పరాయి దేశస్థులకు కూడా వుండాలని ఆశించలేము కదా. కాని మనలో వున్న గుణాలతో ఎంత బాగా పనిచేయగలమో అంత బాగా చేయాలి అనేవాడు నాతో లార్డ్ ఓమ్స్‌కిర్క్" అన్నది చేతుల్నిమడుచుకుని నిటారుగా నిలబడుతూ. నా వీడ్కోలు సమయంలో తెలియజేయటం కోసం అత్యంత ఆశ్చర్యకరమైన విషయాన్నొక దాన్ని దాచి వుంచింది ఆమె.

"మీరు నా కొడుకుల్ని చూడకుండా వెళ్లకపోవటం నాకు సంతోషంగా వుంది" అన్నది.

"మీకు కొడుకులున్నారని తెలియదు నాకు"

"వాళ్లు పనిమీద వేరే ఊళ్లకు వెళ్లారు. కాని, ఈ ఉదయాన్నే తిరిగి వచ్చారు. వాళ్లను చూస్తే మీరు ఆశ్చర్యపోతారు. నేనే స్వయంగా శిక్షణ యిచ్చాను వాళ్లకు. ఎందుకంటే నేను పోయాక వాళ్లిద్దరూ కలిసి ఈ హోటల్‌ను నడుపుతారు." అంతలోనే చామనచాయ కలిగిన ఇద్దరు యువకులు హాల్లోకి ప్రవేశించారు. ఆమె కళ్లు ఆనందంతో మెరిశాయి. వాళ్లిద్దరూ తమ తల్లి దగ్గరికి పోయి ఆమెను చేతుల్లోకి తీసుకుని, పెద్ద చప్పుడు వచ్చేలా ముద్దు పెట్టుకున్నారు.

"సర్, వీళ్లు ఇంగ్లీష్ భాష మాట్లాడలేరు. కాని, వీళ్లకు ఆ భాష కొంచెం తెలుసు. టర్కిష్ భాషను స్థానికుల్లాగా మాట్లాడగలరు. గ్రీక్, ఇటాలియన్ భాషలు కూడా వస్తాయి.".

నేను వాళ్లిద్దరితో హ్యాండ్ షేక్ చేశాను. మిసెస్ నికోలిని వాళ్లతో యేదో మాట్లాడింతర్వాత వాళ్లు వెళ్లిపోయారు.

"మీ కొడుకులు చాలా ఆకర్షణీయంగా వున్నారు. వాళ్ల పట్ల మీకు గర్వంగా ఉండి వుండాలి" అన్నాను.

"నేను వాళ్ల నిజమైన తల్లిని కాను"

కొంచెం తికమక పడటం నా వంతయింది.

"వాళ్లు మిస్టర్ నికోలినికీ, ఈ హోటల్లో పనిచేస్తూ వుండిన ఒక గ్రీకు అమ్మాయికీ పుట్టారు. నాకు సొంత కొడుకులు లేకపోవడం వల్ల వాళ్లిద్దర్నీ పెంచుకున్నాను". మరికొంత వివరణ కోరాను.

"మిస్టర్ నికోలిని గారి ఆత్మ గౌరవానికి మచ్చ వుందని మీరు భావించవద్దు. మీరట్లా అనుకోవడం నాకెంత మాత్రం ఇష్టంగా ఉండదు సర్" అని, మళ్లీ తన రెండు చేతుల్ని మడుచుకుని గర్వమూ, సొగసూ, తృప్తీ నిండిన గొంతుతో, "మిస్టర్ నికోలిని గారిలో ఎంతో ఉత్సాహమూ, శక్తీ నిండి వుండేవి" అన్నది.

11

# మూతపడ్డ వ్యాపారం

**(The Closed Shop)**

**నే**ను వివరించకుండా ఉండలేని ఈ సంఘటనలు ఏ ఆనందమయ దేశంలో జరిగాయో ఆ దేశం పేరును చెప్పేలా నన్ను ఏదీ చెయ్యజాలదు. కాని అది అమెరికా ఖండంలోని ఒక స్వతంత్ర దేశం అన్న విషయాన్ని చెప్తే ఏ హానీ ఉండదని తెలుసు నాకు. ఈ రకంగా చెప్పడంలో సరిపోయినంత అస్పష్టత వుంది కనుక, దీంతో ఏ విధమైన రాజకీయ సమస్యా తలెత్తే ఇబ్బంది వుండదు. ఆ దేశ అధ్యక్షుడు ఒక అందమైన స్త్రీ మీద కన్నేశాడు. ఆ అధ్యక్షులవారి రాజధాని సూర్యకాంతి పుష్కలంగా ప్రసరించే ఒక విశాలమైన నగరం. అక్కడ ఒక దుకాణాల సముదాయం వుంది. ఒక పచ్చని చర్చి భవనమూ కొన్ని పురాతన స్పానిష్ గృహాలు కూడా వున్నాయి. మనసుల్ని రంజింపజేసే గుణం ఉన్న ఒక యువకుడు మిషిగాన్ నుంచి ఆ నగరానికి వచ్చి అదే స్త్రీ మీద మనసు పారేసుకున్నాడు. ఆమె కూడా అతని పట్ల తన ప్రేమను వ్యక్తపరచడంతో సంతుష్టుడయ్యాడు. కాని ఆ యువకునికి ఒక భార్య, ఆ స్త్రీకి ఒక భర్త అవసరం కావటమన్నది తాను ఆమెను పొందడానికి అడ్డంకిగా మారిందని తెలుసుకుని మానసిక క్షోభకు గురయ్యాడు. పెళ్లి చేసుకోవాలనే స్త్రీసహజమైన కోర్కె ఉన్నదామెకు. అది అతనికి అసమంజసం అనిపించినా ఒక అందమైన స్త్రీ తనను కోరుకున్నప్పుడు ఆ అవకాశాన్ని కోల్పోయే అమాయకుడు కాడతడు. ఆమెకు పెళ్లి అయ్యేందుకు అనువైన పరిస్థితులు నెలకొనేలా చేస్తానని ఆ అధ్యక్షుడు వాగ్దానం చేశాడు. అతడు తన ఆస్థానంలోని న్యాయ కోవిదులను పిలిచించి విషయాన్ని వాళ్ళ ముందుంచాడు. తన దేశంలోని వివాహచట్టాలు చాలా పాతబడిపోవడం వల్ల అవి ఎంతమాత్రం సవ్యంగా లేవని తాను యెప్పట్నుంచో అనుకుంటున్నట్టూ, దేశం

అభివృద్ధిపథంలో పయనించాలంటే ఆ చట్టాలలో సమూలమైన మార్పుల్ని తేవాలని తాను భావిస్తున్నట్టూ తెలిపాడు వాళ్లకు. ఆ న్యాయకోవిదులు అధ్యక్షుల వారి నుండి సెలవు తీసుకుని పోయి, ఎక్కువ సమయం తీసుకోకుండా కొన్ని రోజులకే ఒక విడాకుల చట్టాన్ని తయారు చేసుకుని తెచ్చారు. దాన్ని రూపొందించేటప్పుడు అది అధ్యక్షునికి నచ్చేట్టు ఉండేలా జాగ్రత్త పడ్డారు వాళ్లు. కాని నేను చెబుతున్న దేశం ఎంతో నాగరికత, ప్రజాస్వామ్యం ఉన్నదే కాక గొప్ప ప్రతిష్ఠ వున్నది కావడం వల్ల, అక్కడ ఏం చెయ్యాలన్నా చాలా జాగ్రత్తగా, చట్టబద్ధంగా చేయాలి. అక్కడ దేశాధ్యక్షునిగా పదవీ ప్రమాణ స్వీకారం చేసిన వ్యక్తికి ఎంత గొప్ప గౌరవం ఉన్నా కొన్ని సూత్రాలను పాటించకుండా అతడు ఏ చట్టాన్నీ ప్రవేశపెట్టలేడు– ఆ చట్టం తనకోసం చేసుకున్నదైనా! కాబట్టి ఆ పనికి కొంత కాలం పట్టింది. కొత్త విడాకుల చట్టాన్ని ప్రవేశపెట్టిన కొద్ది కాలంలోనే ఆ దేశంలో విప్లవం మొదలైంది. దురదృష్టవశాత్తు ఆ దేశాధ్యక్షుణ్ని రాజధానిలోని ప్రధాన కూడలిలో చర్చి ముందర ఒక స్తంభానికి ఉరి తీశారు. హృదయాలను రంజింపజేసే యువకుడు ఆదరాబాదరాగా ఆ నగరాన్ని విడిచి వెళ్లిపోయాడు. కాని ఆ చట్టం అట్లాగే వుండిపోయింది. దాని నిబంధనలు సరళంగా ఉన్నాయి. ముప్పై రోజులపాటు భార్యాభర్తలిద్దరూ విడిగా బతికింతర్వాత వంద డాలర్లకు సమానమైన బంగారాన్ని ఇస్తే భర్త కాని భార్య కాని తన జీవిత భాగస్వామికి విడాకులివ్వవచ్చు. – అదీ ఏ రకమైన సమాచారాన్నీ ముందుగా ఇవ్వకుండానే. ఉదాహరణకు ఒక భార్య తాను తన ముసలి తల్లితో ఓ నెలరోజుల పాటు ఉండబోతున్నట్టు భర్తతో చెప్పి వెళ్లిపోవచ్చు. తర్వాత ఒకరోజు ఉదయాన అల్పాహారం అనంతరం భర్త తనకు వచ్చిన ఉత్తరాలను చూసుకుంటున్నప్పుడు, తాను విడాకులిచ్చి వేరే పురుషుణ్ని పెళ్లి చేసుకున్నట్టు భార్య రాసిన ఉత్తరం అతనికి కనపడవచ్చు.

ఈ సంతోషకర వార్త స్వల్పకాలంలోనే అంతటా వ్యాపించింది. న్యూయార్క్ నుండి మరీ ఎక్కువ దూరంలో లేనటువంటి ఒక దేశ రాజధానిలో సమశీతోష్ణ వాతావరణంతో పాటు మరీ అంత ఇబ్బందికరం కాని వసతి సౌకర్యం ఉన్నదనీ, అక్కడ స్త్రీలు తమకు చిరాకును కలిగించే వివాహబంధం నుండి తక్కువ సమయంలో తక్కువ డబ్బు ఖర్చుతో విముక్తిని పొందవచ్చుననీ తెలిసిపోయింది ప్రజలకు. భర్తకు తెలియకుండానే అటువంటి తతంగాన్ని నడుపుకోగలగడం అన్నది కేసు నడుస్తున్నప్పుడు మనసుకు క్షోభను కలిగించే వాద ప్రతివాదాల నుండి తప్పించుకునే అవకాశాన్ని ఇస్తుంది. ఒక ప్రతిపాదనకు వ్యతిరేకంగా పురుషుడు ఎంతగానైనా వాదించవచ్చును. కాని చివరకు ఆ వాదాన్ని వదిలి తోకాడిస్తాడని ప్రతి స్త్రీకీ తెలుసు. తనకొక రోల్స్ రాయిస్ కారు కావాలని భార్య అడిగితే భర్త తన దగ్గర అంత డబ్బు లేదనవచ్చు. కాని ముందు చెప్పకుండా ఆమె ఆ కారును

కొన్నదనుకోండి. అప్పుడతడు పిల్లిలాగా చెక్కు మీద సంతకం పెట్టి ఇస్తాడు. అందువల్ల కొద్ది కాలంలోనే అందమైన స్త్రీలు పెద్ద సంఖ్యలో ఆ నగరానికి తరలి వచ్చారు. వ్యాపార వ్యవహారాలతో అలసిపోయిన స్త్రీలు, ఫ్యాషన్ ప్రపంచంలో వెలిగిపోయిన స్త్రీలు, ఖుషీయే జీవన విధానం అయిన స్త్రీలు, ఏ పనీపాటా లేక రికామీగా ఉండే స్త్రీలు – ఇటువంటి వాళ్ళంతా న్యూయార్క్, షికాగో, శాన్‌ఫ్రాన్సిస్కో, జార్జియా, డకోటా మొదలైన అన్ని రాష్ట్రాలనుండి వచ్చారు. దాంతో ఆ నగరానికి వచ్చే ఓడల్లో వసతి బొటాబొటిగా మాత్రమే సరిపోయే పరిస్థితి ఏర్పడింది. ఇక ఓడలో ప్రత్యేకమైన గది కావాలంటే ఆరు నెలల ముందుగానే రిజర్వు చేసుకోవాలి. ఆ నగరం అలా సంపదతో వర్థిల్లిపోయింది. కొద్ది కాలంలోనే అక్కడి న్యాయవాదులకు గిరాకీ బాగా పెరిగి, ప్రతి లాయరూ ఫోర్డ్ కారును కొనుక్కోగలిగే స్థాయికి చేరుకున్నాడు. గ్రాండ్ హోటల్‌కు యజమాని అయిన డాన్ ఆగస్టో ఎంతో ఖర్చు పెట్టి అదనంగా చాలా బాత్‌రూమ్‌లను కట్టించాడు. అయితే అలా చేసినందుకు అతడు విచారించలేదు. ఎందుకంటే ఎంతో లాభం వచ్చిందతనికి. పూర్వ దేశాధ్యక్షుణ్ని ఉరి తీసిన స్తంభం ముందు నుండి పోయిన ప్రతిసారీ అతడు హుషారుగా దానికి వందనం చేశాడు.

ఒకసారి "అతడు మహానుభావుడు. ఏదో ఒకరోజు అతనికోసం శిలావిగ్రహాన్ని కట్టించి నిలబెడతారు" అన్నాడు డాన్ ఆగస్టో.

సౌకర్యవంతమైన, సమంజమైన ఆ చట్టం ద్వారా కేవలం స్త్రీలే లాభపడ్డారని చెప్పాను నేను. కాని అమెరికాలో పవిత్ర వివాహబంధం అనే జంజాటం నుండి విముక్తిని కోరుకునేవారు స్త్రీలు మాత్రమేనని, పురుషులు కాదనీ సూచిస్తాయి నా మాటలు. అయితే నా ఉద్దేశం అది కాదని నా నమ్మకం. ఆ దేశానికి ఎక్కువగా స్త్రీలే ప్రయాణించినప్పటికీ అట్లా ఆరు వారాల పాటు సొంత వూరు వదిలి వెళ్లటం (పోవడానికీ రావడానికీ ప్రయాణం కోసం ఒక్కొక్కవారం, ఆ దేశవాసిగా గుర్తింపు కోసం నాలుగు వారాలు) ఆడవాళ్ళకే సులభం కావటమే అందుకు కారణం అంటాను నేను. మగవాళ్లకైతే అంతకాలం పాటు తమ వ్యవహారాలన్నిటినీ వదిలేసి పోవటం కష్టం కదా. వేసవి సెలవుల్లో అక్కడికి పోవచ్చునన్నది నిజమే కాని, ఆ వేడిమి కలిగించే బాధను అనుభవించాల్సి వస్తుంది. పైగా అక్కడ గోల్ఫ్ మైదానాలు లేవు. ఒక నెలపాటు గోల్ఫ్ ఆడే అవకాశాన్ని వదులుకునే బదులు, భార్యకు విడాకులివ్వకపోవటం వైపే ఎక్కువమంది పురుషులు మొగ్గు చూపుతారని మనం అనుకోవచ్చు. గ్రాండ్ హోటల్లో ఇద్దరు ముగ్గురు మగవాళ్లు నెలరోజుల పాటు మకాం వేశారన్నది నిజమే. కాని వాళ్లు వ్యాపారపరమైన పనిమీద వచ్చారట. అసలు

కారణం అంత స్పష్టంగా బోధపడటం లేదు. వాళ్ల వ్యాపకాలను దృష్టిలో పెట్టుకుని ఆలోచిస్తే నా ఊహ ప్రకారం వాళ్లు ఒకే దెబ్బకు రెండు పిట్టలన్నట్టు ఏకకాలంలో అటు మజా చేసే స్వాతంత్ర్యాన్నీ, ఇటు వ్యాపారంలో లాభాన్నీ పొందారనిపిస్తుంది.

ఈ గొడవనట్లా వుంచుదాం. అసలు వాస్తవమేమంటే, గ్రాండ్ హోటల్లో చాలా వరకు ఆడవాళ్లే బస చేశారు. లంచ్ తర్వాత, డిన్నర్ తర్వాత వాళ్లు వరండాలో కమాను ఆకారంలో వున్న పైకప్పుల కింద వున్న చతురస్రాకారపు బల్లలచుట్టూ కూచుని షాంపేన్ తాగుతూ తమ వైవాహిక ఇబ్బందుల గురించి చర్చించుకుంటూ సమయాన్ని ఆనందంగా గడిపారు. డాన్ ఆగస్టోకు మిలిటరీ అధికారులు, న్యాయవాదులు, బ్యాంక్ అధికారులు, వర్తకులు, స్థానిక యువకులు–వీళ్లందరి ద్వారా బోలెడంత వ్యాపారం జరిగి, పిచ్చిగా లాభాలు వచ్చాయి. ఎందుకంటే, తన హోటల్లో బస చేసిన అందమైన స్త్రీలను చూడటం కోసం వీళ్లందరూ వచ్చేవారు.కాని పూర్తిగా సవ్యమైనది ఈ ప్రపంచంలో ఎప్పుడూ దొరకదు కదా! ప్రతిదాంట్లో ఏదో ఒక అపసవ్యత వుంటుంది. భర్తలను వదిలించుకోవాలనుకునే ఆ స్త్రీలు చాలా మట్టుకు ఆందోళనగా వుండేవారు. వాళ్లవైపు నుండి ఆలోచించినప్పుడు మరి అది సమంజసమే. వాళ్లను సంతోషపెట్టడం కొన్నిసార్లు కష్టంగా వుంటుంది. ఆహ్లాదకరమైన ఆ చిన్న నగరంలో ఎన్నో మంచి అంశాలున్నా వినోదకర ప్రదేశాలు మాత్రం కొంచెం తక్కువగానే వున్నాయని ఒప్పుకోవాల్సి వుంటుంది. అక్కడ వున్న ఒకే ఒక్క సినిమా టాకీసులో ఆడే చిత్రాలు చాలా కాలం క్రితం హాలీవుడ్‌లో వెలువడినవై ఉంటాయి. పగటి వేళల్లో ఆ స్త్రీలు తమ లాయర్లతో మంతనాలు జరుపవచ్చు. గోళ్లకు పాలిష్ వేసుకోవచ్చు. కొంచెం షాపింగ్ కూడా చేసుకోవచ్చు. కాని సాయంత్రాలను గడపటం దుర్భరంగా వుంటుంది. నిబంధనలో వున్న నెలరోజుల బస అన్నది ఎక్కువ అని చాలా మంది ఫిర్యాదు చేశారు. సహనం కొరవడిన ఒకరిద్దరైతే ఆ వ్యవధిని నలభై ఎనిమిది గంటలకు కుదించి చట్టంలో బలాన్నీ ఉత్సాహాన్నీ కొంచెం పెంచవచ్చును కదా అని తమ లాయర్లను అడిగారు. డాన్ ఆగస్టో శక్తియుక్తులున్న మనిషి. ఆయన ఆ విషయంలో స్ఫూర్తిని పొంది, మారింబా అనే వాద్యాన్ని వాయించే గ్వాటెమాలా దేశపు కళాకారుల బృందాన్ని తన హోటల్లో నియమించాడు. ఆ సంగీతం ఎట్లా వుంటుందంటే, దానికన్న ఎక్కువగా కాళ్లలో చలనాన్నీ ఆపుకోలేనంత ఉత్సాహాన్నీ కలిగించేది ప్రపంచంలో మరొకటి వుండదు. హాల్లో ఉన్న ప్రతి ఒక్కడూ దాన్ని వినగానే వెంటనే నిలబడి డాన్సు చేయడం మొదలెట్టాడు. ఆ ఇరవై ఐదుగురు స్త్రీలు డాన్సు చేయాలనుకున్నప్పుడు తమతో పాటు ఆ హోటల్లో బస చేసిన కేవలం ముగ్గురు పురుషులు మాత్రమే సరిపోరన్నది స్పష్టం. కాబట్టి, సైనికాధికారులూ స్థానిక యువకులూ వచ్చి ఆ డాన్సులో చేరుతారు.

అప్పుడు వాళ్ల నల్లని కళ్లు ఆనందంతో మెరుస్తాయి. గంటలూ రోజులూ ఎంత వేగంగా గడిచాయంటే, అప్పుడే నెలరోజుల వ్యవధి ముగిసిందా అని ఆశ్చర్యం కలిగింది వాళ్లకు. ఒకావిడైతే వెళ్లిపోయేటప్పుడు తనకు మరికొన్ని రోజులపాటు ఆ హోటల్లో ఉండాలనిపించిందని చెప్పింది. డాన్ ఆగస్టో ముఖం ఆనందంతో విజయగర్వంతో వెలిగిపోయింది. తన కస్టమర్లు సంతోషంగా ఉండటం అతనికి ఇష్టం. తాను చెల్లించిన డబ్బుకన్న రెండు రెట్లు ఎక్కువ విలువ చేసింది మారింబా బ్యాండు – అనుకున్నాడతడు. డాన్ ఆగస్టో పొదుపరి కనుక, రాత్రి పది కాగానే తన హోటల్లోని మెట్లమీదా, వరండాల్లో లైట్లను కట్టేయించాడు. దాంతో సైనికాధికారులూ, స్థానిక యువకులూ మాట్లాడే ఆంగ్లభాష అద్భుతంగా మెరుగైపోయింది.

పెళ్లివారి బ్యాండు మేళంలాగా అంతా సజావుగా సంతోషంగా గడిచిపోయింది. ఈ వాక్యంలోని మొదటి పదాలు ఎంత అరిగిపోయినవైనా వాటిని ఉపయోగించాలనే కోరికను ఆపుకోవటం కష్టం కనుక, వాటిని వాడుతాను నేను. అంతా బాగా జరుగుతోందను కుంటున్న సమయంలో ఒకరోజు మేడం కొరాలీ అనే ఆవిడ తాను భరించిన దుర్భర పరిస్థితి ఇక చాలు అనే నిర్ణయానికి వచ్చింది. ఆమె డ్రెస్ తొడుక్కుని, తన స్నేహితురాలైన కార్మెన్సిటాను కలవటం కోసం వెళ్ళింది. తాను యెందుకు వచ్చిందో మేడం కొరాలీ కొన్ని పదాల్లో బిగ్గరగా చెప్పగానే కార్మెన్సిటా ఒక పనిమనిషిని పిలిచి, లా గోర్డా అనే మరో ఆవిడను ఉన్నపళంగా తీసుకురమ్మని పురమాయించింది. ఒక ముఖ్యమైన విషయాన్ని లా గోర్డాతో చర్చించాలని అనుకున్నారు వాళ్లిద్దరూ. భారీ శరీరంతో పాటు పుష్కలంగా మీసాలను కలిగివున్న లా గోర్డా వచ్చి వాళ్లతో చేరింది. ఆ ముగ్గురు మలాగా అనే మద్యాన్ని తాగుతూ గంభీరమైన చర్చలను జరిపారు. తద్వారా ఏర్పడ్డ పరిణామమేమంటే, తాము మాట్లాడేందుకు సమయం ఇవ్వాలని కోరుతూ వాళ్లు దేశాధ్యక్షునికి ఒక ఉత్తరం రాశారు. భారీ శరీరం కలిగిన కొత్త అధ్యక్షుని వయస్సు ముప్పై ఏళ్ల కన్న కొంచెం ఎక్కువగా వుంటుంది. కొన్ని సంవత్సరాల క్రితం అతడు ఒక అమెరికన్ షిప్పింగ్ కంపెనీలో సామాన్లను మోసేవాడిగా పనిచేశాడు. తన మనసులోని ఉద్దేశాన్ని నొక్కి చెప్పాలను కున్నప్పుడల్లా అతడు తన వాగ్ధాటినీ, తుపాకీనీ ప్రభావవంతంగా ఉపయోగిస్తూ ప్రస్తుత ఉన్నత హోదాకు చేరుకున్నాడు. తన కింది అధికారి ఒకతను ఆ ఉత్తరాన్ని తన ముందుంచినప్పుడు అతడు నవ్వి, “ఈ ముగ్గురు వృద్ధ స్త్రీలకు నా నుండి ఏం కావాలట?” అన్నాడు.

కాని అతడు మంచీ మర్యాదా ఉన్న మనిషే కాక, అందరికీ అందుబాటులో వుండే వ్యక్తి. తను కూడా ప్రజల్లో ఒకడు అనీ, ప్రజలను సంరక్షించడం కోసం తను ప్రజల చేత

ఎన్నుకోబడ్డాడనీ అతడు మరచిపోలేదు. పైగా అతడు తన యవ్వనదశలో మేడం కొరాలీ దగ్గర చిన్నచిన్న పనుల మీద బయట తిరిగే ఉద్యోగం చేశాడు. ఆ ముగ్గురు స్త్రీలను తాను మరుసటి రోజు ఉదయం పది గంటలకు కలుస్తానని తన సెక్రటరీకి చెప్పాడు దేశాధ్యక్షుడు. వాళ్లు సరైన సమయానికి అధ్యక్ష భవనాన్ని చేరుకున్నారు. అక్కడి ఉద్యోగి ఒకతను వాళ్లను వెంట తీసుకుని దివ్యమైన మెట్లదారి మీదుగా సందర్శకుల హాలు వైపు నడిచి, అక్కడికి చేరుకోగానే తలుపును చిన్నగా తట్టాడు. ఇనుప కమ్మీలున్న లావుపాటి లోహపు ద్వారం తెరచుకుని, అనుమానపు చూపులున్న ఒక వ్యక్తి ప్రత్యక్షమయ్యాడు. ఈ అధ్యక్షుడు మునుపటి అధ్యక్షునిలాగా ప్రాణాంతక దుష్ట పరిస్థితిని ఎదుర్కోదల్చుకోలేదు కనుక, వచ్చిన సందర్శకులు ఎంతటి వారైనా సరే జాగ్రత్త పడకుండా వాళ్ళ ముందుకు రాకూడదనే నియమం పెట్టుకున్నాడు. వాళ్లను తీసుకువచ్చిన ఉద్యోగి ఆ ముగ్గురు స్త్రీల పేర్లను చెప్పగానే అసలైన లోపలి తలుపు తెరుచుకుంది. కాని లోపలికి వెళ్లే తోవ కొంచెం ఇరుకుగా వుంది. వాళ్లు లోపలికి పోయారు. ఆ హాలులో హుందాతనం, దర్జా కనిపించాయి. అక్కడ చిన్నచిన్న టేబుళ్ల దగ్గర పొట్టిచేతుల చొక్కాలనూ, ప్యాంటు వెనుక జేబులో పిస్తోళ్లనూ కలిగిన సెక్రెటరీలు తీరిక లేకుండా టైపింగ్ చేస్తున్నారు. భారీ తుపాకులతో, బులెట్లతో ఒకరిద్దరు యువకులు సోఫా మీద కూర్చుని సిగరెట్టు తాగుతున్నారు. అధ్యక్షుడు కూడా పొట్టి చేతుల కోటు తొడుక్కున్నాడు. బెల్టులో ఒక పిస్తోలు వుంది. తన రెండు చేతుల అంగుష్ఠాలను కోటు జేబుల్లోకి దూర్చి నిలుచున్నాడు. అతడు పొడుగ్గా బలిష్ఠంగానే కాక, హుందాగా కూడా కనిపించాడు.

"ఏం కావాలి? దేనికోసం వచ్చారు మీరు?" అని అడిగాడతడు. అతని తెల్లని దంతాలు తళతళ మెరుస్తుంటే, "ఎంత దివ్యంగా కనిపిస్తున్నారు డాన్ మాన్యుయేల్ గారూ! చక్కని దేహపుష్టి వున్న పురుషుని లాగా వున్నారు మీరు" అన్నది లా గోర్డా.

అతడు వాళ్లకు హ్యాండ్ షేక్ ఇచ్చాడు. అతని సిబ్బంది తాము చేస్తున్న క్రమపూరితమైన పనిని ఆపి వెనక్కి ఒరిగి, ఆ ముగ్గురు స్త్రీల వైపు స్నేహపూర్వకంగా చేతులు ఊపారు. నిజానికి వాళ్లందరు ఒకరికొకరు పాత మిత్రులే. అందుకే వాళ్ల స్వాగతం పైకి కొంచెం మామూలుగా కనిపించినా అందులో సుహృద్భావం వుంది. ఆ ముగ్గురు స్త్రీలు ఆ నగరంలోని ముఖ్యమైన వేశ్యాగృహాలకు యజమానురాళ్లు అని నేనిక్కడ చెప్పాల్సి వుంది. వినేవాళ్లు నిస్సందేహంగా నన్ను అపార్థం చేసుకోని విధంగా జాగరూకత నిండిన వివేకంతో ఈ విషయాన్ని చెప్పగలను నేను. అయినా మీరేమైనా అనదల్చుకుంటే నిస్సంకోచంగా అనవచ్చు. లాగోర్డా, కార్మెన్సిటా స్పెయిన్ దేశపు మూలాలున్న స్త్రీలు.

వాళ్లు తమ తలలమీద నల్లని శాలువాలను కప్పుకుని, అందమైన నల్లని దుస్తుల్లో వున్నారు. కాని మేడమ్ కొరాలి ఫ్రెంచ్ స్త్రీ. ఆమె తన తలమీద ఒక హ్యాట్‌ను పెట్టుకుంది. వాళ్లు ముగ్గురూ నడివయస్సులో వున్నారు. వాళ్ల ప్రవర్తనలో వినయం కనపడుతోంది.

అధ్యక్షుడు వాళ్లను కూచోమన్నాడు. ఆ తర్వాత వాళ్లకు మదీరా అనే మద్యాన్నీ, సిగరెట్లనూ ఇవ్వబోయాడు. కాని వాళ్లు వాటిని తీసుకోలేదు.

"మీ ఔదార్యానికి కృతజ్ఞతలు మాన్యుయెల్ గారూ! కాని మేము సొంత వ్యాపారపు పని మీద వచ్చాము కనుక వాటిని స్వీకరించలేము" అన్నది మేడమ్ కొరాలీ.

"సరే, అయితే నేను మీకెలాంటి సహాయం చెయ్యగలను?"

లా గోర్డా, కార్మెన్సిటా మేడమ్ కొరాలీ వైపు చూశారు. మేడమ్ కొరాలీ వాళ్లిద్దరి వైపు చూసింది. ఆ యిద్దరు స్త్రీలు అంగీకారాన్ని సూచిస్తూ తలలు ఊపడంతో, తనే మాట్లాడాలని వాళ్ళు ఆశిస్తున్నారని గ్రహించి ఇలా అన్నది మేడమ్ కొరాలీ.

"డాన్ మాన్యుయెల్ గారూ! అసలు సంగతేమిటంటే, మేం ముగ్గురం ఎన్నో సంవత్సరాల పాటు చాలా కష్టపడ్డాము. ఈ దీర్ఘకాల వ్యవధిలో మా పరువుకు మచ్చ తెచ్చే పని ఒక్కటి కూడా చెయ్యలేదు మేము. మేము నడుపుతున్న వేశ్యాగృహాలంత పేరెన్నిక గన్న గృహాలు మొత్తం అమెరికా ఖండంలో మరెక్కడా లేవు. అవి ఈ అందమైన నగరానికి గర్వకారణాలుగా నిలుస్తాయి. అంతెందుకు? నేను నిర్వహిస్తున్న వేశ్యాగృహానికి హంగుల్ని సమకూర్చడం కోసం గత సంవత్సరమే ఐదు వందల డాలర్లను ఖర్చుపెట్టి అధునాతనమైన అద్దాలను అమర్చాను. మేమెప్పుడూ మర్యాదగానే, గౌరవప్రదంగానే ఉన్నాము. ప్రతి సంవత్సరం పన్నులను సకాలంలో కట్టాము. ఇన్నేళ్లు మేమెంతో శ్రమపడ్డాక దాని ఫలాలను మా నుండి లాక్కోవడం బాధాకరంగా వుంది. ఇంత కాలంగా మేము నిజాయితీతో, వ్యాపారం పట్ల విచక్షణాత్మకమైన ధ్యాసతో కృషి చేశాక మమ్మల్ని ఈ విధంగా ఇబ్బంది పెట్టడం అన్యాయమని చెప్పడానికి నేను సందేహించను".

అధ్యక్షుడు ఆశ్చర్యానికి లోనయ్యాడు.

"కాని నా ప్రియమైన కొరాలీ! నువ్వు దేని గురించి మాట్లాడుతున్నావో అర్థం కావడం లేదు నాకు. చట్టానికి వ్యతిరేకంగా కాని లేక నా కన్నుగప్పి కాని మీ డబ్బును ఎవరైనా గుంజుకున్నారా?"

అతడు ఒక అనుమానం నిండిన చూపును తన సెక్రటరీల వైపు విసిరాడు. వాళ్లు తమకేమీ తెలియదన్నట్టు అమాయకంగా కనిపించే ప్రయత్నం చేశారు. వాస్తవంలో వాళ్లు అమాయకులే అయినా తమ ముఖాల్లోని ఇబ్బందిని దాచలేకపోయారు.

"మేము కొత్త చట్టం గురించి మాట్లాడుతున్నాము. మేము సర్వనాశనం కాబోతున్నాము"

"ఏంటీ? సర్వనాశనమా?"

"కొత్త విడాకుల చట్టం అమలులో ఉన్నంత వరకు మేము మా వ్యాపారాలను చేసుకోలేం. మేము నిర్వహిస్తున్న అద్భుతమైన వేశ్యాగృహాలను మూసుకోవాల్సి వస్తుంది"

తర్వాత మేడమ్ కొరాలీ తమ ఇబ్బందిని ఎంత నిర్మొహమాటంగా వివరించిందంటే ఆమె అన్న మాటలను నేను కొద్దిగా మార్చి చెబుతున్నాను. ఆమె వెళ్లబోసుకున్న గోడు సారాంశమేమంటే, పరాయి ప్రాంతాల నుండి అందమైన స్త్రీలు ఆ నగరానికి రావడంతో, హుందాతనం నిండిన తమ మూడు బంగళాలు పూర్తిగా దిక్కుమాలినవి అయిపోయాయి. వాటిమీద తాము ముగ్గురూ అన్ని పన్నుల్ని సక్రమంగా కడుతున్నా కూడా, నాగరికతను అవలంబించే యువకులు తమ సాయంత్రాలను గ్రాండ్ హోటల్లో గడపటం వైపే మొగ్గు చూపుతున్నారు. డబ్బు చెల్లిస్తే మాత్రమే వేశ్యాగృహాల్లో లభించే సరసమైన వినోదం ఆ హోటల్లో ఉచితంగా దొరుకుతోంది.

"హోటలువాళ్లను మనం నిందించలేం" అన్నాడు అధ్యక్షుడు.

"నేనేం వాళ్లను నిందించడం లేదు. కాని ఆ స్త్రీలను తప్పు పడుతున్నాను. ఇక్కడికి వచ్చి మా పొట్టలమీద కొట్టే హక్కు వాళ్లకు లేదు. డాన్ మాన్యుయెల్ గారూ, మీరు ప్రజల్లోని ఒక మనిషే తప్ప రాచరికంలో ఉన్నవారు కారు. ఈ దుష్ట వ్యాపారస్థుల చేత మేం తరిమి కొట్టబడితే మీ దేశం దాన్ని ఎట్లా వ్యాఖ్యానిస్తుంది? వాళ్లు చేస్తున్నదాంట్లో న్యాయం వుందా? నిజాయితీ ఉందా?"

"కాని నేనేం చేయగలను? హోటల్లో బస చేసిన ఆ అందమైన స్త్రీలను ముప్పై రోజుల పాటు గదుల్లో బంధించి వుంచలేను కదా. ఈ విదేశీ స్త్రీలకు మర్యాద లేకుంటే దానికి నేనెలా బాధ్యుడినవుతాను?"

"బీద స్త్రీలు ఆ విధంగా చేయటం వేరు. ఎందుకంటే పాపం వాళ్లకు వేరే మార్గం వుండదు. కాని వీళ్లు అట్లా చేయటమన్నది సమంజసమెలా అవుతుందో నాకర్థం కాదు".

"ఈ చట్టం చెడ్డది, క్రూరమైనది" అన్నది కార్మెన్సిటా. అధ్యక్షుడు ఒక్కసారిగా లేచినిలబడి తన రెండు చేతులను పక్కలకు చాపి, ఇలా అన్నాడు. "ఈ దేశానికి సంపదనూ శాంతినీ తెచ్చిన ఆ చట్టాన్ని నిషేధించాలని అడగకండి. ప్రజలచేత ఎన్నుకోబడ్డ నేను ప్రజల్లో ఒకణ్ని. నా మాతృదేశపు ఐశ్వర్యం నా హృదయానికి చాలా దగ్గరగా వుండే విషయం. విడాకుల చట్టం మన దేశపు ముఖ్య పరిశ్రమ. చచ్చినా దాన్ని నేను నిషేధించను".

"ఓరి దేవుడా! ఆఖరుకు ఇట్లాంటి గతి దాపురించింది. నా ఇద్దరు కూతుళ్లు న్యూ ఆర్లియెన్స్‌లోని కాన్వెంటులో చదువుతున్నారు. అయ్యో భగవంతుడా! ఈ వ్యాపారం చాలా

వరకు దుఃఖాన్ని తెచ్చిపెట్టేదే. అయినా నా ఇద్దరు కూతుళ్లు చక్కగా పెళ్లిళ్లు చేసుకుంటారనీ, నేను ఈ పనిని మానుకునే సమయం వచ్చినప్పుడు వాళ్ళు దీన్ని నడిపే బాధ్యతను తమ చేతుల్లోకి తీసుకుంటారనీ ఆశ పడుతూ ఎప్పుడూ నన్ను నేను సముదాయించుకున్నాను. ఈ వ్యాపారమే లేకపోతే న్యూ ఆర్లియెన్స్ వంటి మహానగరంలోని కాన్వెంటులో వాళ్లను అంత సులభంగా ఉంచగలనా?" అన్నది కార్మెన్సిటా.

"మరి నా సంగతి? నా బంగళాను మూసేసుకుంటే నా కొడుకును హార్వర్డ్ విశ్వ విద్యాలయంలో ఎవరు చదివిస్తారు?" అని అడిగింది లా గోర్డా.

"నేను మాత్రం దీన్ని ఖాతరు చేయను. ఫ్రాన్సుకు వెళ్లిపోతాను. నా తల్లికి ఇప్పుడు ఎనభై ఏడు సంవత్సరాల వయసుంది. ఆమె ఇంకా ఎంతో కాలం బతకదు. తన అవసానదశలో నేనామె పక్కన వుంటే ఆమెకు ఊరటా మనశ్శాంతీ దొరుకుతాయి. కాని ఈ అన్యాయం నన్నెంతగానో బాధపెడుతోంది. అయ్యా, మాన్యుయెల్ గారూ! తమరు కూడా ఎన్నో సాయంత్రాలను నా బంగళాలో ఆనందంగా గడిపారు. మీరు మాతో ఇలా వ్యవహరిస్తుంటే మా మనసులు గాయపడుతున్నాయి. ఒకప్పుడు నా దగ్గర చిన్నచిన్న పనులను నిర్వహించే ఉద్యోగం చేసి, నా బంగాళాలోకి దేశాధ్యక్షుని హోదాలో గౌరవ అతిథిగా వచ్చినపుడు అది మీ జీవితంలోని అత్యంత ప్రతిష్ఠాత్మకమైన సందర్భం అని మీరు స్వయంగా నాతో అనలేదా?" అన్నది మేడమ్ కొరాలీ.

"అది వాస్తవం కాదని అనటం లేదు. నేనెప్పుడూ నిజాయితీగానే వ్యవహరిస్తాను" అని డాన్ మాన్యుయెల్ ఆ హాలులో అటూ యిటూ నడుస్తూ, అలవాటుగా మధ్యమధ్య తన భుజాలను పైకి లేపాడు. దీర్ఘాలోచనలో మునిగిన అతడు "నేను ప్రజల మనిషిని. ప్రజలచేత ఎన్నుకోబడిన వాడిని. ఇక్కడ వాస్తవమేమిటంటే, ఈ స్త్రీలు విశ్రాంతి తీసుకోకుండా పనిచేశారు" అని తన సెక్రటరీలతో నాటక ఫక్కీలో మళ్లీ ఇలా అన్నాడు. "నా పరిపాలన మీద ఇదొక మచ్చ. నైపుణ్యం లేని విదేశీయులు నిరంతరం నిజాయితీతో కృషి చేసే ఇక్కడి మనుషుల పొట్టలను కొట్టడం నా సిద్ధాంతానికి విరుద్ధం. ఈ స్త్రీలు నన్ను ఆశ్రయించి నానుండి రక్షణను కోరటం సరైనదే. ఈ వ్యవహారం ఇంకా ఇలా కొనసాగటాన్ని నేను అనుమతించను".

అతని మాటలు నిశితంగా ప్రభావవంతంగా ఉన్నాయి కాని, వాటిని విన్న వాళ్లందరికీ కేవలం ఆ మాటల వల్ల ఏం లాభం చేకూరదని తెలుసు. మేడమ్ కొరాలీ కొట్టొచ్చినట్టుగా పెద్దగా వుండే తన ముక్కుమీద పౌడరును అద్దుకుని, తన పర్స్‌లోని చిన్న అద్దంలో ఒకసారి చూసుకుంది.

"మానవ నైజం ఎట్లా వుంటుందో తెలుసు నాకు. ఆ అందమైన విదేశీ స్త్రీల పని ఐపోయే రోజు వస్తుంది" అన్నదామె.

"మనం ఒక గోల్ఫ్ మైదానాన్ని తయారు చేయవచ్చు. కాని అది కేవలం పగటి వేళల్లో మాత్రమే జనాన్ని ఆకర్షిస్తుందనేది వాస్తవం" అన్నాడొక సెక్రటరీ.

"కులకడానికి వాళ్లకు మగాళ్లు అవసరమైతే వాళ్లే తమతో పాటు తెచ్చుకోవచ్చు కదా?" అన్నది లా గోర్డా.

"భగవంతుడా" అని అరిచి, కొంత సేపు కదలక మెదలక నిల్చున్నాడు అధ్యక్షుడు. తర్వాత "దీనికో పరిష్కారం వుంది" అన్నాడు. అంతర్వివేచనా, వివేకమూ లేకుండానే అతడు అంతటి ఉన్నత స్థానాన్ని చేరుకోలేదు. ఆయన ఉల్లాసంతో నవ్వి ఇలా అన్నాడు."చట్టాన్ని మార్చేద్దాం. ఇకముందు పురుషులు మునుపటి లాగానే ఏ ఆటంకం లేకుండా వస్తారు. కాని, స్త్రీలు మాత్రం భర్తలతోనే రావాలి, లేదా హామీ పత్రాన్ని ఇవ్వాలి". వెంటనే తన సెక్రెటరీల చూపుల్లో నిరాశను గమనించి "అయితే భర్త అనే పదాన్ని అత్యంత విస్తృతార్థంలో చూడాలని ఇమిగ్రేషన్ అధికారులకు మనం ఆదేశాలను ఇస్తాము" అని వాళ్ల వైపు చేయి ఊపాడు అధ్యక్షుడు.

"భలేగా వుంది. ఆ విధంగా ఆ స్త్రీలతో పాటు మగవాళ్లెవరైనా వస్తే ఇతర పురుషులెవరూ మధ్యలో జోక్యం చేసుకునే అవకాశముండదు కనుక, మా కస్టమర్లు మేము నడుపుతున్న వేశ్యాగృహాలకే తిరిగి వచ్చి మా ఆతిథ్యాన్ని స్వీకరిస్తారు. డాన్ మాన్యుయెల్ గారూ, మీరొక అద్భుతమైన వ్యక్తి అంటాన్నేను. ఏదో ఒక రోజున ప్రజలు మీ శిలా విగ్రహాన్ని తప్పక ప్రతిష్ఠిస్తారు" అన్నది మేడమ్ కొరాలీ.

చాలా సార్లు చిన్న చిన్న ఉపాయాలే పెద్ద పెద్ద కష్టాలనుండి మనను గట్టెక్కిస్తాయి. డాన్ మాన్యుయెల్ సూచించిన విధంగా చట్టం మార్చబడింది. పుష్కలమైన సూర్యరశ్మినీ, వైశాల్యాన్నీ కలిగిన ఆ స్వతంత్ర దేశం సంపదతో తులతూగటం వల్ల, మేడమ్ కొరాలీ తను ఆశించినట్టుగా తన వ్యాపారాన్ని కొనసాగించి బాగా లాభాలను గడించింది. కార్మెన్సిటా కూతుళ్లిద్దరూ న్యూ ఆర్లియన్స్ నగరంలో ఖరీదైన విద్యను పూర్తి చేశారు. లా గోర్డా కొడుకు హార్వర్డ్ విశ్వవిద్యాలయంలో మంచి మార్కులతో పట్టభద్రుడయ్యాడు.

12

# వాగ్దానం

**(The Promise)**

**నా** భార్యకు సమయపాలన పట్ల అంతగా శ్రద్ధ లేదు. అందుకే ఒకసారి ఒక హోటల్లో మేమిద్దరం కలిసి లంచ్ చేద్దామనుకున్నప్పుడు అనుకున్న సమయం కంటె నేనక్కడికి పది నిమిషాలు ఆలస్యంగా వెళ్లినా ఆమె యింకా రాకపోవటం నాకు ఆశ్చర్యాన్ని కలిగించలేదు. అప్పుడు నేనొక కాక్‌టెయిల్‌కు ఆర్డరిచ్చాను. అది గిరాకీ సీజన్ కావడం వల్ల, ఆ హోటల్లో అప్పుడు రెండు మూడు కన్న ఎక్కువ టేబుళ్లు ఖాళీగా లేవు. కొందరు అప్పటికే భోజనం చేసి కాఫీ తాగుతున్నారు. మరికొందరు నాలాంటి వాళ్లు డ్రై మార్టిని డ్రింక్ తాగుతున్నారు. స్త్రీలు వేసవి దుస్తుల్లో ఆనందంగా, ఆకర్షణీయంగా కనపడుతున్నారు. మగవాళ్లేమో తుళ్లుతూ నాగరికతను కనబరుస్తున్నారు. కాని, మరో పావుగంట నిరీక్షణ సమయాన్ని నాతో గడపటం కోసం ఆసక్తికరమైన వ్యక్తి ఎవరూ కనిపించలేదు. వాళ్లందరూ చక్కని దుస్తుల్లో హాయిగా కనిపించారు. కాని సాధారణమైన తరహాకు చెందినవారు కావటం వల్ల వాళ్లను నేను ఆసక్తితోకన్న యెక్కువగా సహనంతో గమనించాను. సమయం రెండు గంటలవుతోంది. కనుక, నాకు ఆకలిగా వుంది. అంతలోనే ఒక వెయిటర్ వచ్చి, నా భార్య ఒకచోట ఆగిపోవాల్సి వచ్చినందుకు లంచ్ కోసం రాలేకపోతున్నదని హోటల్‌కు ఫోన్ చేసి చెప్పిందని అన్నాడు నాతో.

నేను సంశయంలో పడ్డాను. గోల నిండిన ఆ హోటల్లో తోడు లేకుండా ఒక్కణ్నే భోజనం చేయడం బాగుండదనిపించింది. కాని, బాగా ఆలస్యమైంది కనుక అప్పుడు క్లబ్బుకు కూడా పోలేను కాబట్టి అక్కడే ఉండిపోవడం మంచిదనిపించింది. డైనింగ్ రూంలోకి నడిచాను. మంచి మంచి రెస్టారెంట్లలో హెడ్ వెయిటర్ల చేత పేరు పెట్టి పిలిపించుకోవడం సాధారణంగా నాకు నచ్చదు. కాని అప్పుడు మాత్రం పరిచయమున్న వాళ్లెవరైనా కనపడి

పలకరిస్తే బాగుండుననిపించింది. ఒక్క టేబులు కూడా ఖాళీ లేదని హెడ్ వెయిటర్ చెప్పాడు. నిస్సహాయంగా చుట్టూ చూస్తుంటే నాకు తెలిసిన ఒకామె అకస్మాత్తుగా కనిపించింది. లేడీ ఎలిజబెత్ వెర్మాంట్ అనే ఆ స్త్రీ నాకు పాత స్నేహితురాలు. నన్ను చూడగానే ఆమె నవ్వింది. తన పక్కన యెవరూ లేకపోవడంతో అటువైపు నడిచాను.

"బాగా ఆకలితో వున్న నా మీద దయ వుంచి నన్ను మీతో కూచోనిస్తారా?" అని అడిగాను.

"ఓ, తప్పకుండా. కాని, నా భోజనం దాదాపు పూర్తి కావచ్చింది".

ఆ టేబులు ఒక లావైన స్తంభం పక్కన వుండటం వల్ల, హోటల్లో జనం బాగా వున్నా అక్కడ కొంచెం ఏకాంతం దొరికినట్టయింది.

"మీరు కనిపించడం నా అదృష్టం. ఆకలి మూలంగా నాకు దాదాపు మూర్ఛ వచ్చినంత పనైంది" అన్నాను. ఆమె స్నేహపూర్వకంగా నవ్వింది. ముఖం ఒక్కసారిగా వెలిగిపోలేదు కాని ఆకర్షణ మెల్లమెల్లగా కదలాడింది. అది మొదట పెదవుల చుట్టూ తారట్లాడి, అద్భుతంగా మెరుస్తున్న కళ్లదగ్గరికి పాకి, అక్కడ మృదువుగా దోబూచులాడింది. ఎలిజబెత్ వెర్మాంట్ మూసరకానికి చెందిన స్త్రీ కాదని ఎవరికైనా చూడగానే తెలిసిపోతుంది. ఆమె చిన్నపిల్లగా ఉన్నప్పుడు నా కసలే తెలియదు. కాని, చాలా ఆకర్షణీయంగా వుండేదనీ, మనోహరమైన ఆ రూపం ఆపుకోలేని మానసిక ఉద్వేగాన్ని కలిగించి చూపరులకు కన్నీళ్లను తెప్పించేదనీ చాలా మంది చెప్పారు. వాళ్ళు చెప్పిందాన్ని నేను పూర్తిగా నమ్ముతాను. ఎందుకంటే యాభయ్యేళ్ల వయసులో కూడా ఆమె అనుపమానమైన అందంతో వెలిగిపోతోంది. యవ్వనంలో ఉన్న అమ్మాయిల తాజాదనమూ, సొగసూ అతిశయించిన ఆమె సౌందర్యం ముందు దిగదుడుపే అనిపించేంత గొప్ప శోభ వుంటుంది ఆమె రూపంలో. మేకప్‌తో ఒక్కలాగే కనిపించే ముఖాలను ఇష్టపడను నేను. పౌడరు, లిప్‌స్టిక్ వంటి వస్తువుల్తో తమ వ్యక్తిత్వాన్ని మసకబారగొట్టుకునే ఆడవాళ్లు మూర్ఖులని నా అభిప్రాయం. ఎలిజబెత్ వెర్మాంట్ మేకప్ చేసుకుంది కాని అది అనుకరించడం కోసం కాదు, తన శరీర ప్రకృతిని పెంచుకోవడానికే. ఆమె తీరులో హుందాతనం, గాంభీర్యం, నిర్భయత్వం చోటు చేసుకున్నాయి. ఎంతమాత్రం వంగకుండా కుర్చీలో నిటారుగా కూర్చుంది. వెంట్రుకలకు రంగు వేసుకున్నా అవి నల్లగా మెరుస్తూ సహజత్వాన్ని వెలయిస్తున్నాయి. దుస్తులు ఖరీదైనవే అయినా ఆడంబరంగా లేకుండా ఆరాధన భావాన్ని కలిగిస్తున్నాయి. మెడలో చక్కని ముత్యాలహారం, ఒక వేలుకు పెళ్లి ఉంగరం, దానిపక్కనే పెద్ద పచ్చతో చేసిన మరో ఉంగరం ధరించింది. శరీరమంతా శోభతో వెలిగిపోతున్నా ముడుతలు పడ్డ చేతివేళ్లు మాత్రం ఆమె వయస్సును దాచలేకపోతున్నాయి. అవి గద్దవంటి పక్షి వేళ్లలాగా

వుండి చూసేవారికి కొంచెం ఇబ్బందిని కలిగిస్తున్నాయి. ఎలిజబెత్ వెర్మాంట్ గొప్ప చరిత్ర గల స్త్రీ. ఒక రాజవంశంలో పుట్టిన ఆమె తన పద్దెనిమిదవ యేట ఒక అత్యంత ధనవంతుణ్ణి పెళ్లాడి, జీవితాన్ని విలాసాలతో, భోగలాలనతో గడిపి, దివాలా తీసింది. ఆమె ఎంత మాత్రం జాగ్రత్తను పాటించక, తర్వాత ఏమౌతుందోననే భయం లేక ప్రవర్తించడంతో, రెండేళ్లలోపలే భర్త ఆమెకు విడాకులిచ్చాడు. డబ్బుపరమైన వివాదంలో కొందరు అతని మీద కోర్టు కేసు వేయడం అందుకు ముఖ్య కారణమైంది. అప్పుడు కేసు వేసిన ముగ్గురిలోంచి ఒక ధనవంతుణ్ని ఆమె పెళ్లి చేసుకుని, ఏడాదిన్నరకే వదిలేసింది. ఆ తర్వాత ప్రియుల పరంపర కొనసాగింది. డబ్బును విచ్చలవిడిగా ఖర్చు చేసే స్త్రీగా చెడ్డపేరు తెచ్చుకుంది ఆమె. అద్భుతమైన తన సౌందర్యం, కళంకపూరితమైన ప్రవర్తన ఆమె పేరు ప్రజల నోళ్లలో నానేలా చేశాయి. కొంతకాలానికే ప్రజలంతా ఆమె గురించిన పుకార్లను చర్చించడం మొదలుపెట్టారు. ఆమె బాగా జూదం ఆడుతుందనీ, విపరీతంగా డబ్బును ఖర్చు చేస్తుందనీ, విచ్చలవిడిగా ప్రవర్తిస్తుందనీ అందరూ అనుకున్నారు. ప్రియుల పట్ల విశ్వాసాన్ని కనబరచకపోయినా, ఆమె తన స్నేహితులను మాత్రం వదలక, వాళ్లపట్ల చక్కని సౌజన్యాన్ని చూపింది. వ్యక్తిగత వ్యవహారాల్లో తన ప్రవర్తన యెట్లా వున్నా ఆమె చాలా మంచిమనిషి అని భావించేవాళ్లు కొందరున్నారు. ఎప్పుడూ ధైర్యంగా, ఉత్సాహంగా, ఉల్లాసంగా, చురుకుదనంతో ఉంటుంది ఆమె. కపటం ఎంత మాత్రం లేని మనిషి. పైకొకటి చెప్తూ లోపల వేరేది దాచుకోవటం అన్నది ఆమె స్వభావంలో ఇసుమంతైనా లేదు. అంతేకాక, ఆమెలో నిజాయితీ, ఔదార్యం పుష్కలంగా వున్నాయి. అటువంటి దశలో ఆమెతో నాకు పరిచయం కలిగింది. ఎందుకంటే పేరు మోసిన ఉన్నత వర్గాల స్త్రీలు మతాన్నీ, భక్తినీ నాగరికతగా ఎంచరు కనుక, కళల్లో ఆసక్తిని చూపుతారు. సొంత వర్గపు మనుషులు తమతో స్నేహంగా లేనపుడు వాళ్లు రచయితలు, చిత్రకారులు, సంగీతపరులు మొదలైన కళాకారులతో స్నేహం చేస్తారు. ఆమెలో ఒక సానుకూలత, సరిపడే మనస్తత్వం ఈ రెండూ గల మిత్రురాలిని చూశాను. తన మనసులో వున్న విషయాన్ని ఎటువంటి దాపరికం లేకుండా నిర్భయంగా బయటికి చెప్పే అరుదైన స్త్రీ ఆమె. పైగా ఆమె మాటల్లో చురుకైన హాస్యం ఎప్పుడూ సిద్ధంగా వుంటుంది. తళుకు నిండిన తన గతం గురించి మాట్లాడటానికి ఆమె ఎప్పుడూ వెనుకాడదు. ఆమె సంభాషణలో సమాచారం అంత యెక్కువగా లేకపోయినా, అది బాగుంటుంది. ఎందుకంటే మిగతా విషయాలను పక్కకు పెడితే ఆమెలో గొప్ప నిజాయితీ వుంది.

తన నలబయ్యవ ఏట ఒక చాలా ఆశ్చర్యకరమైన పని చేసిందామె. అదేమిటంటే, ఇరవయ్యొక్క సంవత్సరాల వయస్సున్న యువకుణ్ని పెళ్లాడింది. అది చాలా పిచ్చిపని

అన్నారు స్నేహితులు. కాని చాలా సన్నిహితులైన మిత్రులు కొందరు ఆమె చర్యను బలపరిచారు. ఆ అబ్బాయి చాలా మంచివాడని కితాబిచ్చారు. ఎక్కువ మంది ప్రమాదం రాబోతున్నదని జోస్యం చెప్పారన్నది నిజం. ఎందుకంటే ఎలిజబెత్ వెర్మాంట్ అంతకు ముందు ఏ భర్తతోనూ ఎక్కువ కాలం కలిసి వుండలేదు. కాని, వాళ్లందరి అంచనాలు తారుమారయ్యాయి. కాలమే ఆమె హృదయాన్ని మార్చిందో, లేక పీటర్ అనే ఆ యువకుని అమాయకత్వం ఆమెను కదిలించిందో చెప్పలేను కాని, అతనికి ఒక అద్భుతమైన భార్యగా మారిపోయింది. వాళ్లకు డబ్బు అంతగా లేదు. ఆమేమో డబ్బును మంచినీళ్ల లాగా ఖర్చు పెట్టే స్వభావం కలది. అయినా చాలా పొదుపరి అయిన గృహిణిగా మారింది. సమాజంలో తన ఆత్మగౌరవం పట్ల అకస్మాత్తుగా జాగ్రత్తను పాటించటంతో అంతకు ముందు ఆమె గురించి లొడలొడ వాగిన నోళ్లకు మూతలు పడ్డాయి. పీటర్ సంతోషమే ఆమెకు అత్యంత ముఖ్యమైన విషయమై పోయింది. ఎలిజబెత్ అతణ్ని పూర్తి విశ్వాసంతో గాఢంగా ప్రేమిస్తున్నదనే విషయాన్ని ఎవ్వరూ శంకించలేదు. ఆమె పూర్తిగా మారిపోయింది. మరెన్నో సంవత్సరాల పాటు సంపూర్ణమైన గౌరవ మర్యాదలతో బతికింతర్వాత ఆమె గతజీవితపు చవకరకం తళుకును భవిష్యత్తులో అందరూ మరిచిపోతారని అనుకున్నాను. ముఖ్యంగా చాలామందికి అసూయను కలిగించే మరుపు అనే వరం వుంటుంది ఆడవాళ్లకు.

కాని భవిష్యత్తు ఎట్లా వుంటుందో యెవరూహించగలరు? ఆదర్శవంతంగా పెళ్లి చేసుకున్న పది సంవత్సరాల తర్వాత, పీటర్ ఒక అమ్మాయితో గాఢమైన ప్రేమలో పడిపోయాడు. ఆమె పేరు బార్బరా కాంటన్. లార్డ్ రాబర్ట్ కాంటన్ అనే ఐశ్వర్యవంతుని చిన్నకూతురైన ఆమె, చాలా మంచిది. చాలా తెల్లగా, మృదువైన పువ్వులాగా వుంటుంది. రాబర్ట్ కాంటన్ ఒకప్పుడు విదేశీ మంత్రిత్వ శాఖలో పెద్ద అధికారిగా పనిచేశాడు. కాని, లేడీ ఎలిజబెత్‌తో బార్బరా యెంతమాత్రం సరితూగదు. పీటర్‌కూ బార్బరాకూ మధ్య జరిగిన ప్రేమవ్యవహారం గురించి చాలా మందికి తెలుసు కాని, ఎలిజబెత్ వెర్మాంట్‌కు చూచాయగానైనా తెలుసా అన్నది ఎవ్వరూ చెప్పలేరు. తన గతజీవిత అనుభవానికి పూర్తి భిన్నంగా ఉన్న కొత్త పరిస్థితిని ఆమె ఎట్లా కుదుర్చుకుంటుందా అని చాలామంది ఆసక్తిని కనబరిచారు. అంతకు ముందు ఆమె తల్లి భర్తల్ని మార్చింది తప్ప ఆమెను యెవ్వరూ మార్చలేదు. ఎలిజబెత్ త్వరలోనే బార్బరా కాంటన్ భరతం పట్టి, వ్యవహారాన్ని చాకచక్యంతో ముగింపజేస్తుందనుకున్నాను. తన ధైర్యం, చాతుర్యం నాకు బాగా తెలుసు. లంచ్ చేస్తున్నప్పుడు ఆమెతో మాట్లాడుతుంటే ఇదంతా నా మనసులో మెదిలింది. తన తీరులో ఎప్పటిలాగా ఆహ్లాదం, ఆకర్షణ, ఔదార్యం, కలుపుగోలుతనం కనిపించాయి తప్ప, ఏ రకమైన ఇబ్బందిలోనూ ఉన్నట్టు కనిపించలేదామె. ఎన్నో విషయాల గురించి చక్కగా,

కుదురుగా, హాయిగా మాట్లాడింది. పీటర్ మరో అమ్మాయితో ప్రేమలో పడ్డ విషయం ఆమెకు తెలియకపోవడం ఊహించని అద్భుతమనే నిర్ణయానికి వచ్చాను. పీటర్ పట్ల తన ప్రేమ చాలా గొప్పది కనుక, అతనికి తనపట్ల ప్రేమ తగ్గే అవకాశం లేదని బాగా తెలిసినందువల్ల, ఎలిజబెత్ మనసులో అటువంటి అనుమానమే రాలేదేమో.

మేం కాఫీ తాగి ఓ రెండు సిగరెట్లు కాల్చాము. "టైమెంత?" అని అడిగిందామె.

"పావు తక్కువ మూడు" అన్నాను.

"నా బిల్లెంతో అడగాలి"

"నన్ను మీ బిల్లు కట్టనివ్వరా?"

"ఓ, తప్పకుండా" అని నవ్వింది.

"మీరు తొందరలో ఉన్నారా?"

"మూడు గంటలకు పీటర్ని కలవబోతున్నాను"

"ఓ, పీటర్ ఎట్లా వున్నాడు?"

"చాలా బాగున్నాడు"

ఆమె చిన్నగా నవ్వింది. ఆహ్లాదకరంగా, మెల్లగా ముఖమంతా పాకే అదేనవ్వు. కాని, ఆ నవ్వులో అనుమానానికి తావివ్వని ఒక వెక్కిరింత కనిపించింది. ఒక్కక్షణం సేపు కొంచెం సందేహించి, నన్ను బుద్ధిపూర్వకమైన ఆసక్తితో చూసింది.

"కుతూహలాన్ని రేపే పరిస్థితులంటే మీకిష్టం కదా. ఇప్పుడు నేను ఏ పని మీద పీటర్ని కలవడానికి వెళ్తున్నానో మీరు ఊహించలేరు. ఉదయం పీటర్‌కు ఫోన్ చేసి, మధ్యాహ్నం మూడు గంటలకు కలుద్దామన్నాను. నాకు విడాకులివ్వమని అతణ్ని కోరబోతున్నాను."

"ఓ, అలాగా" అని దాదాపు అరిచినంత పని చేశాను. తర్వాత ఏమనాలో తెలియలేదు. అయినా తేరుకుని, "పీటరూ మీరూ చాలా సఖ్యతతో ఉన్నారని భావించాను" అన్నాను.

"ప్రపంచమంతటికీ తెలిసిపోయిన సంగతులు నాకు తెలియవనుకుంటున్నారా? నేనంత అమాయకురాలినేం కాదు".

నాకేం తెలియదని ఎలిజబెత్ చేత నమ్మించటం సాధ్యం కాదు. ఆ విధంగా నేను నటించలేక కొన్ని క్షణాలపాటు మౌనంగా ఉండిపోయాను. తర్వాత "విడాకులకు ఎందుకొప్పుకోవాలి మీరు?" అని అడిగాను.

"రాబర్ట్ కాంటన్ చాలా సీరియస్ మనిషి. నేను పీటర్‌కు విడాకులిస్తే ఆయన తన కూతురును వివాహం చేసుకోనివ్వడని నా బలమైన నమ్మకం. ఇక పోతే నాక్కూడా ఇది తక్కువ సీరియస్ విషయం కాదు" అని తన అందమైన బుజాలెగరేసింది.

"అతడు బార్బరాను పెళ్లి చేసుకోవాలనుకుంటున్నాడని మీకెలా తెలుసు?"

"ఆమె పట్ల నిండా ప్రేమలో మునిగివున్నాడు"

"అని చెప్పాడా మీకు?"

"ఉహుఁ, నాకు తెలుసని అతనికి తెలియనే తెలియదు. పాపం పీటర్. చాలా దీనమైన స్థితిలో వున్నాడు. నన్ను బాధ పెట్టవద్దని ఎంతగానో ప్రయత్నిస్తున్నాడు".

"బహుశా అది తాత్కాలికమైన మోహమేమో. తర్వాత అంతా మరచిపోతాడనిపిస్తోంది నాకు".

"ఎందుకు మరచిపోవాలి? బార్బరా అందమైన యవ్వనవతి. చాలా మంచి అమ్మాయి కూడా. వాళ్ళు ఒకరికొకరు చాలా బాగా సరిపోతారు. పైగా వాళ్ల ప్రణయం ఆగిపోతే ఏం మంచి జరుగుతుంది? వాళ్లిద్దరి మధ్య నిజమైన ప్రేమ ఉంది. అది చాలా ముఖ్యమైన విషయం. నేను పీటర్ కన్న పందొమ్మిది సంవత్సరాలు పెద్దదాన్ని. ఇప్పటికే ఇంత వయసు మీరిన నన్ను అతడు ఇప్పుడు ప్రేమించడం లేదంటే ఇక తర్వాత ప్రేమిస్తాడంటారా? మీరు నవలా రచయిత కనుక ఆ విషయం మీకు బాగా తెలిసివుండాలి".

"ఈ త్యాగాన్ని ఎందుకు చేయాలి మీరు?"

"పదేళ్ల క్రితం అతడు నన్ను పెళ్లి చేసుకున్నప్పుడు, ఎప్పుడు కావాలన్నా తను నానుండి విడిపోవచ్చునని వాగ్దానం చేశాను. మా యిద్దరి వయసుల మధ్య చాలా తేడా వుంది కనుక ఇప్పుడతడు వేరే స్త్రీని ప్రేమించడం న్యాయమే అనిపిస్తోంది."

"అతడు కోరకుండానే ఆ వాగ్దానాన్ని మీరు నిలుపుకోవాలనుకుంటున్నారా?" ఆమె తన పొడవైన సన్నని చేతుల్ని ఊపింది. వేలికి వున్న ఉంగరం ఏదో అశుభాన్ని సూచిస్తూ తళుక్కున మెరిసింది.

"తప్పక నిలుపుకోవాలి. మనమందరం చాలా మర్యాదగా, సమంజసంగా ప్రవర్తించాలి. నిజం చెప్పాలంటే, ఇప్పుడు నేనిక్కడ లంచ్ తినడానికి కారణం అదే. పదేళ్ల క్రితం మేమిద్దరం ఈ టేబులుమీదనే తింటూ వుండగా, పీటర్ నన్ను పెళ్లి చేసుకుంటానని అడిగాడు. అప్పుడు ఏ సీట్లో కూచున్నానో ఇప్పుడూ అదే సీట్లో కూచున్నాను. ఇప్పుడు వచ్చిన ఇబ్బందేమిటంటే పీటర్ను నేను అప్పుడెంతగా ప్రేమించానో ఇప్పుడు కూడా అంతగానే ప్రేమిస్తున్నాను" ఆమె ఒక్క నిముషం ఆగింది. తన దవడల్ని గట్టిగా బిగించి ఉద్వేగాన్ని ఆపుకోవడం గమనించాను. తర్వాత "ఇక నేను పోవాలి. చెప్పిన సమయానికి రానివాళ్లంటే పీటర్కు అసహ్యం" అంది. ఆమె నావైపు నిస్సహాయంగా చూసింది. కుర్చీలోంచి లేవడానికి ఆమె ఎంతో యాతన పడుతున్నట్టు గ్రహించాను. కాని నవ్వి ఒక్క ఉదుటున లేచి నిలబడింది.

"తోడుగా నన్ను రమ్మంటారా?" అని అడిగాను.

"హోటల్ ద్వారం దాకా రండి" అని నవ్వింది.

తలుపు దగ్గరకి రాగానే అక్కడున్న కాపలా మనిషి రివాల్వింగ్ డోర్‌ను తెరిచాడు. "టాక్సీని పిలవాలా?" అని అడిగాను.

"ఉహు, నడుస్తూ తొందరగానే పోగలను. మిమ్మల్ని చూడటం నాకెంతో సంతోషాన్నిచ్చింది. నేను రేపే విదేశాలకు వెళ్తున్నాను. వచ్చే ఆగస్టు నుండి మూడు నెలలపాటు లండన్‌లో వుంటాను. అప్పుడు నాకు ఫోన్ చేయండి" అన్నది.

ఆమె గిరుక్కున వెను తిరిగింది. డేవిస్ స్ట్రీట్‌లోకి వెళ్తుండటం చూశాను. వాతావరణం అంత ఆహ్లాదకరంగా లేదు. నీలాకాశంలో చిన్న చిన్న తెల్ల మబ్బులు నింపాదిగా కదుల్తున్నాయి. ఆమె నిటారుగా నడుస్తోంది. చక్కగా నిలిపిన తల గాంభీర్యాన్నీ, రాజసాన్నీ ఒలికిస్తోంది. బక్కపలుచని అందమైన శరీరంతో నడుస్తుంటే అందరూ ఆమెనే చూస్తున్నారు. ఎవరో పరిచయస్తుడు ఆమెను చూసి తన టోపీని ఒక చేత్తో తీసి, దాన్ని అలాగే గాల్లో వుంచాడు. ఎలిజబెత్ మనోహరంగా మర్యాదను కనబరుస్తూ కొంచెం వంగింది. ఆమె హృదయం అప్పుడు ముక్కలవుతోందని ఆ వ్యక్తికి ఎంత మాత్రం తెలియదు. ఆమె అత్యంత నిజాయితీ గల స్త్రీ అని మరోసారి చెప్తున్నాను.

13

# ఆప్త మిత్రుడు

**(A Friend in Need)**

ముప్ఫై సంవత్సరాలుగా నేను తోటి మానవులను పరిశీలిస్తూ వస్తున్నప్పటికీ వాళ్ల గురించి ఎక్కువగా తెలుసుకోలేకపోయాను. కేవలం ముఖాన్ని చూసి ఒక వ్యక్తిని పనిలో పెట్టుకోవడానికి తప్పనిసరిగా సందేహించాల్సిందే అని నా అభిప్రాయం. అయినప్పటికీ చాలా వరకు మనిషి వాలకాన్ని చూసే ఆ మనిషిని మనం బేరీజు వేయగలుగు తామనుకుంటాను. దవడ ఆకృతినీ, కళ్లలోని భావాన్నీ, మూతి రూపురేఖల్నీ చూసి వాళ్ల గురించి ఒక అభిప్రాయాన్ని ఏర్పరచుకుంటాం. అయితే చాలాసార్లు మన అంచనా సరైనదిగా తేలుతుందా అని నా అనుమానం. నవలలూ నాటకాలూ ఎక్కువ వరకు అసహజంగా ఎందుకుంటాయంటే, వాటి రచయితలు బహుశా అవసరం కోసం పాత్రలను ఒకే తరహాలో మలుస్తారు. వాళ్లు వాటిలో వైరుధ్యాన్ని ప్రవేశపెట్టలేరు. ఎందుకంటే అప్పుడు ఆ పాత్రలు అగోచరంగా తయారవుతాయి. కాని నిజానికి మనలో చాలా మంది వైరుధ్యం నిండినవాళ్లమే. ఒక ప్రత్యేక రకానికి చెందిన లక్షణాల అస్తవ్యస్త సమాహారంగా మనను మనం అభివర్ణించుకోవచ్చు. పసుపురంగు గొట్టంలాగా వుంటుందనీ, కృతజ్ఞత గాలికంటె బరువైనదనీ పేర్కొనడం విడ్డూరమైన విషయమని తర్కశాస్త్ర గ్రంథాల్లో చెప్తారు. కాని, మానవతత్వం ఏర్పడటానికి కారణమైన ఆ పరస్పర వైరుధ్యాల మిశ్రమంలో పసుపురంగు ఒక గుర్రపుబగ్గీ, కృతజ్ఞత అన్నది రాబోయే వారపు మధ్యభాగం అనవచ్చు. ఇతరులను చూసి తాము వేసుకునే అంచనాలు ప్రతిసారీ సరైనవిగా తేలుతాయని ఎవరైనా నాతో అన్నప్పుడు వాళ్ళ మాటల పట్ల నాకు సందేహం కలుగుతుంది. వాళ్ల పరిశీలనా శక్తి చిన్నదైనా కావాలి, లేదా వాళ్లు అతిగా ఆత్మవిశ్వాసం కలవారైనా అయివుండాలి. నా మట్టుకు నాకు ఏమనిపిస్తుందంటే, ఇతరులు నాకు యెంత ఎక్కువ కాలంగా తెలిసివుంటే

వాళ్ల స్వభావాన్ని బేరీజు వేసేటప్పుడు నేనంత యెక్కువగా తికమక పడతాను. ఎంతో కాలంగా నేనెరిగి వున్న నా పాత మిత్రులు అసలెటువంటి వాళ్లు అన్న ప్రాథమిక విషయమే నాకు తెలియదని చెప్పగలను. ఇటువంటి ఆలోచనలు నాకు రావడానికి కారణం కోబె నగరంలో ఎడ్వర్డ్ హైడ్ బర్టన్ అనే అతను చనిపోయాడని ఈ ఉదయాన వార్తాపత్రికలో ప్రచురింపబడటమే. అతడొక వ్యాపారస్థుడు. చాలా సంవత్సరాలుగా జపాన్‌లో వ్యాపారం చేసుకుంటున్నాడు. అతని గురించి నాకు చాలా తక్కువగా తెలుసు. కాని ఒకసారి నాకు పెద్ద ఆశ్చర్యాన్ని కలిగించాడు కనుక నాలో ఆసక్తిని రేపాడు. తన సొంత కథను అతడే స్వయంగా నాకు చెప్పకపోతే, అటువంటి పనిని చేయగల సామర్థ్యం అతనికి వుందని నేనసలు నమ్మేవాడినే కాదు. ఆ సంగతి యెందుకు నాకు పెద్ద దిగ్భ్రాంతిని కలిగించిందంటే, అతని రూపాన్నీ వాలకాన్నీ చూస్తే అతడట్లాంటి పని చేయగలడని అనిపించదు. అంతర్గత వైరుధ్యం ఎంత మాత్రం లేని మనిషి ఒకవేళ ఎవరైనా వున్నాడంటే అది అతడే కావాలి అనిపించేలా వుంటుంది అతని రూపం. అతడు చాలా చిన్నగా వుంటాడు. ఎత్తు ఐదడుగుల నాలుగంగుళాల కంటె యెక్కువ ఉండదు. తెల్లని వెంట్రుకల్తో, ముడుతలు పడ్డ ఎర్రని ముఖంతో నీలిరంగు కళ్లతో మరీ బక్కపలుచగా వుంటాడు. నన్ను కలిసినప్పుడు అతనికి సుమారు అరవై సంవత్సరాల వయస్సుండవచ్చు. తన వయసుకు, తాహతుకు తగ్గట్టుగా ఎప్పుడూ చక్కని సాదాసీదా దుస్తుల్ని తొడుక్కుని మౌనంగా వుండేవాడు.

తన ఆఫీసు కోబెలో ఉన్నా బర్టన్ తరచుగా యోకోహామాకు వచ్చేవాడు. ఒకసారి నేను ఓడకోసం ఎదురు చూస్తూ కొన్ని రోజులు అక్కడ గడిపాను. అక్కడి బ్రిటిష్ క్లబ్‌లో నాకు పరిచయమయ్యాడతడు. మేమిద్దరం బ్రిడ్జ్ ఆడాము. అతడు ఔదార్యంతో చక్కగా ఆడాడు. అప్పుడు కానీ తర్వాత కానీ మేం మద్యం తాగుతున్నప్పుడు అతడు తక్కువగా మాట్లాడాడు. అయితే మాట్లాడినదాంట్లో ఔచిత్యం కనిపించింది. అతనిది ప్రశాంతమైన పొడిపొడి హాస్యం. ఆ క్లబ్బులో అతనికి మంచి పేరే ఉన్నట్టుంది. క్లబ్ లోంచి బర్టన్ వెళ్లిపోయాక అక్కడి వాళ్ళందరూ అతణ్ని అరుదైన విశిష్ట వ్యక్తిగా అభివర్ణించారు. అప్పుడు మేమిద్దరం గ్రాండ్ హోటల్లో బస చేసి వున్నాము. మరుసటి రోజు తనతో కలిసి భోజనం చెయ్యవలసిందిగా నన్ను కోరాడు. పెద్దరికం ఉట్టిపడే అతని భార్య లావుగా వుంది. ఆమె ముఖం మీద చిరునవ్వు కదలాడింది. వాళ్ల యిద్దరు కూతుళ్లను కూడా కలిశాను నేను. వాళ్లది ఐక్యతా, ఆపేక్షా నిండిన కుటుంబం అని స్పష్టంగా తెలిసిపోయింది. బర్టన్‌లో నాకు కొట్టొచ్చినట్టుగా కనిపించిన విషయం అతని దయాగుణం. సాత్వికత నిండిన అతని నీలికళ్లలో ఆహ్లాదకరమైనదేదో వుంది. అతని గొంతు ఎంత మృదువుగా వుంటుందంటే, కోపం వచ్చినప్పుడు అతడు దాన్ని పెంచగలడని మనం ఊహించలేము.

అతని నవ్వులో సౌమ్యత దాగి వుంది. తోటి మానవులపట్ల బర్టన్‌కు ఉన్న అసలైన ప్రేమను చూసి అతనిపట్ల మనం ఆకర్షితులమౌతాము. అతని తీరులో ఎబ్బెట్టుతనం ఎంత మాత్రం లేదు. తన పేకాటనూ మద్యాన్నీ అతడెంతో ఆనందించేవాడు. మసాలా నిండిన ఒక కథను బర్టన్ ఎంతో నేర్పుతో చెప్పగలడు. తన యవ్వనదశలో చురుకుగా ఆటలను ఆడిన చరిత్ర వుందతనికి. ప్రతి పైసానూ ఎంతో కష్టపడి సంపాదించిన అతడు ఒకప్పుడు బాగా డబ్బున్నవాడే. అతని చిన్న, బలహీనమైన ఆకారమే మనం అతణ్ని ఇష్టపడేలా చేస్తుందని నా అభిప్రాయం. ఒక చిన్న చీమను కూడా అతడు హింసింపజాలడని అనిపిస్తుంది అతణ్ని చూస్తే.

ఒక పగటి వేళ నేను గ్రాండ్ హోటల్‌లోని బయటి హాలులో కూచుని వున్నాను. ఇది భూకంపం రాకముందు జరిగిన సంఘటన. ఆ హోటల్లో అప్పుడు తోలు తొడుగులున్న కుర్చీలుండేవి. కిటికీలోంచి చూస్తే ఓడ రేవూ, అందులో కిక్కిరిసి వున్న జనం తాలూకు రద్దీ స్పష్టంగా కనిపిస్తాయి. షాంఘై, హాంకాంగ్, సింగపూర్ల మీదుగా వాంకూవర్‌కూ, సాన్ ఫ్రాన్సిస్కోకూ గాని, లేక యూరప్‌కు గాని పోయే పెద్ద పెద్ద ఓడలు కనిపిస్తాయి. అన్ని దేశాలకు చెందిన సోమరి బికారులు, సముద్రపు అలల తాకిడికి పాడైపోయిన ఓడలు, అద్భుతమైన రంగు రంగుల తెరచాపలు, లెక్కలేనన్ని చిన్న చిన్న పడవలు – ఇవన్నీ కనిపిస్తాయి అక్కణ్నుంచి. అది మనుషుల రద్దీనీ, అలజడినీ చూపించే దృశ్యం. అయినా ఎందుకోగాని అది మనసుకు స్తిమితాన్ని చేకూరుస్తుంది. చేయి చాపితే చేతికి తగులుతుందా అనిపించేలా ఉండే ఆ దృశ్యంలో ఆహ్లాదం నిండి వుంటుంది.

హోటల్ లాంజ్ లోనికి వచ్చిన బర్టన్ కనిపించాడు నాకు. దగ్గరికి వచ్చి నా పక్క కుర్చీలో కూచున్నాడు.

“కొంచెం మద్యం తాగుదామా?” అని అడిగాడు నన్ను. తర్వాత చిన్నగా చప్పట్లు కొట్టి ఒక పనిపిల్లవాడిని పిలిచి, రెండు సీసాల జిన్ తీసుకురమ్మని చెప్పాడు. ఆ అబ్బాయి తెచ్చి యిచ్చాడు. అంతలోనే ఒకాయన వీధిలోంచి పోతూ నాకు చేయి ఊపాడు.

నేను కూడా సమాధానంగా అతనికి చేయి ఊపడాన్ని చూసి “బర్టన్ మీకు తెలుసా?” అని అడిగాడు.

“నేనతణ్ని క్లబ్ దగ్గర కలిశాను. డబ్బుల్ని ఇతరులకు పంపే పనిలో అందరికీ సాయం చేస్తాడట కదా?”

“అవును. అట్లాంటి వాళ్లిక్కడ చాలా మంది వున్నారు”.

“బ్రిడ్జ్ బాగా ఆడుతాడతడు”.

"బ్రిడ్జ్ బాగా ఆడేవాళ్లు ఇక్కడ ఎక్కువ మందే వున్నారు. సంవత్సరం క్రితం ఇక్కడ ఒకతనుండే వాడు. నాకు తెలిసిన అత్యంత ప్రతిభావంతుడైన బ్రిడ్జ్ ఆటగాడతడు. చిత్రమేమిటంటే నా పేరూ అతని పేరూ ఒకటే. లండన్‌లో అతడు మీకు ఎదురు పడలేదనుకుంటా. తన పేరు లెన్నీ బర్టన్ అని చెప్పుకునే వాడు. పెద్ద పెద్ద క్లబ్బుల్లో అతనికి సభ్యత్వం ఉందనుకుంటాను".

"ఉహుఁ అటువంటి పేరేదీ ఇంతకు ముందు విన్నట్టు నాకు జ్ఞాపకం లేదు."

"చాలా మంచి ఆటగాడు. పేకముక్కలకు సంబంధించిన సహజమైన జ్ఞానం అతనికి ఉన్నట్టనిపిస్తుంది. అది చాలా విచిత్రం అనిపించేది నాకు. నేనతనితో ఎక్కువగా ఆడేవాణ్ణి. కొన్నాళ్ల పాటు అతడు కోబెలో వున్నాడు" అని కొంచెం జిన్ తాగాడు బర్టన్.

తర్వాత మళ్లీ "అదొక విచిత్రమైన కథ. అతడు చెడ్డవాడేం కాదు. అతడంటే నాకు ఇష్టం వుండేది. ఎప్పుడూ చక్కని దుస్తుల్ని తొడుక్కుని హుందాగా కనిపించేవాడు. ఆ ఉంగరాల జుట్టూ, తెలుపు, గులాబీ రంగులు కలిసిన చెక్కిళ్లూ చూస్తే అందగాడనిపించక మానదు. ఆడవాళ్లకు అతని పట్ల మంచి అభిప్రాయం ఉండేది. హాని చేసే ఆలోచన అతనిలో ఎంత మాత్రం ఉండేది కాదు. తెలుసా? కాకపోతే అతనికి ఉద్వేగం కొంచెం ఎక్కువ. మద్యం ఎక్కువగా తాగేదేవాడనుకో. ఆ రకానికి చెందినవాళ్లు అట్లానే వుంటారు. నాలుగు నెలలకోసారి అతనికి ఇంటినుండి డబ్బు వచ్చేది. పేకాట ద్వారా మరికొంత సంపాదించేవాడు. నా డబ్బును చాలా గెలుచుకున్నాడు. ఆ విషయాన్ని నేను మరచిపోను" అని నిష్కపటంగా నవ్వాడు.

"బ్రిడ్జ్ ఆటలో బర్టన్ ఎంతో డబ్బును పోగొట్టుకున్నా హుందాగా వ్యవహరించే వాడని చెప్తుంది నా అనుభవం". నున్నని తన గెడ్డాన్ని చేయితో కొట్టుకున్నాడు బర్టన్. అక్కడ చర్మం దాదాపు పారదర్శకంగా తయారై రక్తనాళాలు పైకి తేలాయి.

"బహుశా అందుకేననుకుంటా, తాను ఆర్థికంగా చితికిపోయినప్పుడు నా దగ్గరికి వచ్చాడు. అతని పేరూ నా పేరూ ఒకటే కావటం కూడా మరొక కారణం కావచ్చు. ఒకరోజు నా ఆఫీసుకువచ్చి ఉద్యోగం ఇవ్వమని అడిగాడు నన్ను. నాకు కొంచెంఆశ్చర్యం కలిగించింది. ఇంటి నుండి తనకు డబ్బు రావడం ఆగిపోయినందువల్ల ఉద్యోగం చేయాలనుకుంటున్నట్టు చెప్పాడు. తన వయసెంతో చెప్పమన్నాను నేను"

"ముప్పై ఐదు" అన్నాడతడు.

"ఇంతకు ముందు ఏ పని చేశావు?" అని అడిగాను.

"పెద్దగా పనేమీ చేయలేదు" అన్నాడు.

"నేను నవ్వకుండా ఉండలేక పోయాను."

"ప్రస్తుతానికి నేనేమీ సహాయం చేయలేననుకుంటా. మరో ముప్ఫై ఐదు సంవత్సరాల తర్వాత వచ్చి కలువు, అప్పుడు చూద్దాం"

"అతడు కదలలేదు. అతని ముఖం కొంచెం పాలిపోయింది. కొంచెం సేపు తటపటాయించి, గత కొన్ని నెలలుగా పేకాటలో తనకు దురదృష్టం ఎదురవుతూ వస్తోందని చెప్పాడు. బ్రిడ్జ్ ఆటనే కొనసాగించాలని అనుకోలేదతడు. పోకర్ ఆడటం మొదలు పెట్టి చాలా డబ్బును పోగొట్టుకున్నాడు. చేతిలో చిల్లిగవ్వ కూడా లేని పరిస్థితి వచ్చింది. తనకున్నదంతా తాకట్టు పెట్టి అప్పులు తీసుకున్నాడు. హోటల్ గది తాలూకు అద్దె డబ్బులు చెల్లించలేకపోయాడు. గదిని ఖాళీ చేయవలసిందిగా హోటల్ యజమాని ఒత్తిడి తెచ్చాడు. లెన్నీ బర్టన్ పూర్తిగా దివాలా తీశాడు. డబ్బును సంపాదించే మార్గం ఏదైనా దొరకకపోతే ఆత్మహత్య చేసుకోవాల్సిన సంకట పరిస్థితి వచ్చింది."

"అతని వైపు చూశాను. అతడు పూర్తిగా బికారి అయిపోయినట్టు తెలుస్తోంది అతని వాలకాన్ని చూస్తే. ముందుకన్న ఎక్కువగా మద్యం తాగటం చేత అతడు యాబయ్యేళ్ల వయస్సు వాడిలా కనిపించాడు. ఆడవాళ్లు ఇప్పుడతణ్ని చూస్తే అతని గురించి వాళ్లకు ఏమంత మంచి అభిప్రాయం కలుగదు.

"ఊఁ, పేకాట తప్ప మరే ఇతర పనీ చేయలేవా నువ్వు?" అని అడిగాను.

"ఈదగలను"

"ఏమిటీ? ఈదగలవా?" నా చెవుల్ని నేనే నమ్మలేకపోయాను. అది చాలా తెలివి తక్కువ సమాధానం అనిపించింది.

"ఈతపోటీల్లో మా విశ్వవిద్యాలయానికి ప్రాతినిధ్యం వహించాను."

అతడేం చెప్పదల్చుకున్నాడో నాకు చూచాయగా తెలిసింది. విశ్వవిద్యాలయ స్థాయిలో వెలిగిపోయిన చాలా మంది నాకు తెలుసు. కాని అంత మాత్రాన ఆశ్చర్యపడాల్సిన అవసరం లేదు.

"యౌవనంలో ఉన్నప్పుడు నేను కూడా మంచి ఈతగాణ్నే" అన్నాను. "హఠాత్తుగా నా మెదడులో ఒక ఊహ మెదిలింది" అని బర్టన్ నా వైపుతిరిగాడు.

"కోబె తెలుసా మీకు?" అని అడిగాడు నన్ను.

"ఉహు. ఆ నగరం మీదుగా ఒకసారి వెళ్లాను కాని, అక్కడ ఒక్క రాత్రి మాత్రమే గడిపాను" అన్నాను నేను.

"అయితే షియోయా క్లబ్ మీకు తెలిసి వుండదు. నేను పడుచువానిగా ఉన్నప్పుడు అక్కడి లైట్ హౌస్ చుట్టూ ఈదుకుంటూ పోయి తారుమి అనే ప్రదేశం దగ్గరి రాళ్లగట్టును చేరుకునేవాణ్ని. ఆ దూరం మూడు మైళ్లకు పైనే వుంటుంది. పైగా సుడిగుండాలుండటం

వల్ల అక్కడ ఈదటం కొంచెం కష్టమైన పనే. ఆ విషయాన్ని లెన్నీ బర్టన్‌కు చెప్పి, నాలాగా అదే చోటులో ఈదితే అతనికి ఉద్యోగం ఇస్తానన్నాను" అన్నాడు బర్టన్.

అతడు నిర్ఘాంతపోయి కొంచెం సందేహించినట్టనిపించింది.

"నువ్వొక మంచి ఈతగానివని చెప్పావు కదా?" అన్నాను.

"నా శరీరంలో ఇప్పుడు పటుత్వం లేదు."

నేనేమీ అనక బుజాలను ఊపాను. అతడు ఒక్క క్షణం నా వైపు చూసి తల ఊపాడు

"సరే మంచిది. మరి నన్నెప్పుడు ఈదమంటారు."

"నేను నా చేతి గడియారం వైపు చూశాను. పది గంటలు దాటి కొన్ని నిమిషాలవుతోంది.

"ఈదడానికి నీకు ఒకటింపావు గంటకన్న ఎక్కువ సమయం పట్టదు. నేను ఆ రాళ్లగుట్ట చుట్టూ కారు డ్రైవ్ చేసుకుంటూ పన్నెండు గంటలప్పుడు వచ్చి నిన్ను కలుస్తాను. అక్కడి నుండి నిన్ను క్లబ్బుకు తీసుకుపోతాను. అక్కడ ఇద్దరం కలిపి లంచ్ చేద్దాం"

"ఓ, సరే" అన్నాడతడు.

మేము పరస్పరం హ్యాండ్ షేక్ ఇచ్చుకున్నాం. నేనతనికి గుడ్ లక్ చెప్పగానే అతడు వెళ్లిపోయాడు. ఆ ఉదయం నాకు పని బాగా వుండింది. అందువల్ల తారుమి రాళ్లగుట్ట దగ్గరికి చేరుకునే సరికి పన్నెండున్నర అయింది. కాని నేనంతగా ఆదరాబాదరాగా రాకపోయినా ఏమీ అయ్యేది కాదు. ఎందుకంటే లెన్నీ బర్టర్ ఇంకా అక్కడికి చేరుకోలేదు.

"ఆఖరి నిమిషంలో మనసు మార్చుకుని ఈదలేదా?"

"ఉహుc, అతడు మొదట్లో బాగానే ఈదాడు. కాని తాగుడు మూలంగా శరీర పటుత్వాన్ని పోగొట్టుకున్నాడు కదా. ఆ లైట్ హౌస్ చుట్టూ వున్న సుడిగుండాలను తట్టుకోలేకపోయాడు. మూడు రోజులదాకా అతని శవం దొరకలేదు".

రెండు క్షణాల పాటు నేనేమీ అనకుండా మౌనంగా వున్నాను. కొంచెం చలించిపోయాను. తర్వాత "ఉద్యోగం కోసం పందెం లాంటి దాన్ని పెట్టావు కదా. అతడు ఈదలేక మునిగిపోతాడని ముందుగానే ఊహించావా నువ్వు?" అని అడిగాను బర్టన్‌ను.

అతడు చిన్నగా నవ్వి, దాపరికం లేని తన చిన్న నీలికళ్లతో నన్ను చూశాడు. తన చేయితో గెడ్డాన్ని రుద్దుకుని, "అప్పుడు నా ఆఫీసులో ఖాళీ లేదు మరి" అన్నాడు.

14

# ముత్యాల హారం

**(The String of Beads)**

"నేను మీ పక్కసీట్లో కూచోవడం యెంత అదృష్టం!" అన్నది లారా ఒకసారి ఓ విందు భోజనంలో.

"ఆ అదృష్టం నాది" అన్నాను మర్యాదగా.

"అదృష్టం యెవరిదో తర్వాత తెలుస్తుంది. మీతో మాట్లాడే అవకాశాన్ని ప్రత్యేకంగా కోరుకున్నాను. మీకు చెప్పటానికి నా దగ్గర ఒక కథ వుంది" అని లారా అనగానే నా గుండె గుబగుబలాడింది. "దానికన్న మీ గురించో లేక నా గురించో మాట్లాడుకోవడం మంచిదనుకుంటాను" అన్నాను.

"అబ్బా, కాని నేనీ కథను మీకు చెప్పి తీరాలి. మీరు కథ రాయడానికి యిది పనికొస్తుందని నా ఉద్దేశం"

"తప్పక చెప్పాల్సిన కథైతే దాన్ని నువ్వు చెప్పాల్సిందే. తప్పదు. కాని మెనూ కార్డులో యేముందో చూద్దాం ముందు".

"నేను కథ చెప్పటం మీకిష్టం లేదా? నిజానికి నా కోరికను విని మీరు సంతోషిస్తారనుకున్నాను" అన్నది లారా, కొంచెం నొచ్చుకుంటున్నట్టుగా.

"నాకు నిజంగా సంతోషంగా వుంది. బహుశా నువ్వొక నాటికను రాసి, దాన్లోని కథను నాకు చెప్పాలనుకుంటున్నావేమో"

"ఉహు, అదేం కాదు. ఇది నా స్నేహితురాలింట్లో జరిగింది. కాబట్టి పూర్తిగా యథార్థమైంది"

"అదేమంత మంచి సిఫార్సు కాదు. యథార్థ సంఘటనలున్న కథ కల్పిత కథంత బాగా యెప్పుడూ ఉండదు."

"అంటే?"

"ప్రత్యేకంగా ఏమీ చెప్పలేను. కాని నేనన్నది సరైనదే అనుకుంటున్నాను."

"నన్ను కథ చెప్పనిస్తే బాగుంటుందేమో."

"సరే. నేను పూర్తి సావధానంగా వున్నాను. సూపు తాగితే బరువు పెరుగుతుంది కనుక, దాన్ని తాగటం లేదు నేను"

ఆమె కొంచెం పాలిపోయిన, నిరాశ నిండిన చూపునొకదాన్ని నావైపు సారించి, తర్వాత చిన్నగా నిట్టూరుస్తూ మెనూకార్డును చూసింది.

"ఓ, మీరన్నది నిజమే. మీరు తాగకపోతే నేను కూడా తాగకూడదనుకుంటున్నాను. నా ఆకారం యిలా ఉండగా ఆహారం విషయంలో స్వాతంత్ర్యం తీసుకోలేను."

"అది పోనీ, క్రీమ్ అంతగా లేని రుచికరమైన సూపు ఏదైనా వుందా?."

"ఎందుకు లేదూ, బోర్ష్ వుంది కదా. నాకు నచ్చే సూపు అదొక్కటే."

"సరే కానియ్యి, నువ్వు కథను మొదలు పెట్టు. చేపల కూర వచ్చేదాకా మనం అసలు తిండి గురించి ఆలోచించే అవసరం లేదు."

"మంచిది. ఇది జరిగినప్పుడు నేనక్కడే వున్నాను. లివింగ్‌స్టన్ దంపతులతో కలిసి భోంచేస్తున్నాను. వాళ్లు మీకు తెలుసా?"

"ఉహుఁ, తెలియదనుకుంటాను"

"వాళ్లను అడిగితే తెలుస్తుంది మీకు, నేను చెప్తున్నదంతా నిజమేనని. ఒకసారి వాళ్లు తమ యింట్లో విందును ఏర్పాటు చేశారు. దానికి సంబంధించిన పనులను చూసుకునేందుకు ఒకామెను నియమించుకున్నారట. కాని తాను రాలేనని ఆఖరు నిమిషంలో చెప్పిందట ఆమె. చూశారా, కొందరు మనుషులెంత నిర్లక్ష్యంగా వుంటారో. ఇక తప్పని పరిస్థితిలో లివింగ్‌స్టన్ దంపతులు తమ యింటి వ్యవహారాలను చూసుకునే మిస్ రాబిన్సన్‌కు ఆ పనిని అప్పజెప్పారు. ఆమె చాలా మంచి అమ్మాయి. చాలా అందమైనది కూడా. వయసు ఇరవై సంవత్సరాలో ఇరవయ్యొక్క సంవత్సరాలో వుండవచ్చు. నేనైతే అటువంటి అందమైన, యవ్వనురాలైన స్త్రీని పనిలో పెట్టుకోను. పెట్టుకుంటే ఏమైనా జరగవచ్చు. చెప్పలేం కదా."

"కాని, మంచి జరగాలనే ఆశిస్తారు యెవరైనా"

నా అభిప్రాయంతో లారా ఏకీభవించినట్టు లేదు. ఇలా అన్నదామె: "అటువంటి స్త్రీ తన ధ్యాసను ఇంటి పనుల మీద పెట్టే బదులు యువకులమీద పెట్టే అవకాశముంది.

మన యింటి వాతావరణానికి అలవాటు పడుతున్న దశలో పని మానేసి పెళ్లి చేసుకుంటాననవచ్చు. కాని మిస్ రాబిన్సన్ గురించి చాలా మంది మంచి సిఫార్సులు చేశారు. ఆమె మంచి మనిషే కాక, గౌరవానికి అర్హురాలు కూడా. చర్చిలోని ఒక ఫాదరుకు మిస్ రాబిన్సన్ ఒక కూతురని యెవరైనా చెబితే నమ్మవచ్చు. ఆ విందుకు వచ్చిన వాళ్ళలో కౌంట్ బోర్సెల్లి అనే మరొకతను వున్నాడు. ఆయన ఒక రంగంలో నిపుణుడు. కాని, ఆయన మీకు తెలియదనుకుంటా. రత్నాలు, వజ్రాలు మొదలైనవాటి గురించి ఆయనకు తెలిసినంతగా మరెవరికీ తెలియదు. అతని పక్కన మేరీ లింగేట్ అనే ఆమె కూర్చుని వుంది. తన సొంత ముత్యాల హారాన్ని బాగా యిష్టపడే ఆమె, మాటల సందర్భంలో ఆ దండ గురించి అతని అభిప్రాయాన్ని అడిగింది. అది చాలా బాగుందన్నా డతడు. ఆమెకు కొంచెం అహం దెబ్బ తిన్నట్టై "దీని ధర ఎనిమిది వేల పౌండ్లు" అన్నది.

"అవును అది అంత విలువైనదే" అన్నాడతడు.

"మిస్ రాబిన్సన్ అతనికెదురుగా కూర్చుని వుంది. ఆ సాయంత్రం పూట ఆమె అందంగా కనపడుతోంది. ఆమె మిసెస్ సోఫీ లివింగ్స్టన్ యిచ్చిన పాత డ్రెస్సును తొడుక్కున్నదని గుర్తించాను. కాని మిస్ రాబిన్సన్, మిసెస్ సోఫీ లివింగ్స్టన్ యింట్లో పని చేస్తున్నదని తెలియకపోతే ఆ డ్రెస్సు కొత్తది కాదనే విషయం తెలియదు మీకు".

మిస్ రాబిన్సన్‌ను చూసిన బోర్సెల్లి "అదిగో, ఆమె మెడలో వున్న ముత్యాల హారం చాలా బాగుంది" అన్నాడు.

"కాని, ఆమె మిసెస్ లివింగ్స్టన్ యింట్లో పని చేసే మనిషి" అన్నది మేరీ లింగేట్.

"కావచ్చు. కాని, ఆ ముత్యాల దండ చాలా విలువైనది. దాని ధర యాభై వేల పౌండ్లు వుంటుంది"

"నాన్సెన్స్"

"నేను చెప్పింది అక్షరాలా నిజం."

"మేరీ లింగేట్ కొంచెం వంగి, ఆమె మెడలోని దండను చూస్తూ "వింటున్నావా మిస్ రాబిన్సన్? నీ మెడలోని దండ యాభై వేల పౌండ్ల ఖరీదు చేస్తుందంటున్నాడు బోర్సెల్లి" అన్నది.

"అదే క్షణంలో సంభాషణలో చిన్న అంతరాయం ఏర్పడింది. మేమందరం మిస్ రాబిన్సన్ వైపు చూశాము. ఆమె కొంచెం తడబడి నవ్వింది. తర్వాత "నిజానికి నేను చాలా బేరమాడి, దీన్ని కేవలం పదిహేను షిల్లింగ్‌లకే కొన్నాను" అన్నది.

"ఆఁ కొన్నావులే పదిహేను షిల్లింగులకు" అన్నాడు బోర్సెల్లి కొంచెం వెటకారంగా."

"మేమందరం నవ్వాము. నిజమైన ఖరీదైన హారాలను కొని, అవి నకిలీవని తమ భర్తల చేత నమ్మించడానికి ప్రయత్నించే స్త్రీల గురించి మాకందరికీ తెలుసు కనుక, మిస్ రాబిన్సన్ చెప్తున్నది కూడా పూర్తిగా అబద్ధమని ఊహించాము."

"మీ ఊహ బాగుంది" అన్నాను, ఈ కోణంలోంచి ఏదైనా కథను రాయవచ్చా అని ఆలోచిస్తూ.

"కాని, ఆ హారం విలువ ఒకవేళ యాభైవేల పౌండ్లు వుంటే, మిస్ రాబిన్సన్‌కు అటువంటి చిన్న ఉద్యోగం చేసే ఖర్మ యెందుకు పడుతుంది? కాబట్టి, బోర్సెల్లి పొరపాటు పడ్డాడని భావించాము. అంతలోనే ఒక అరుదైన సంఘటన జరిగింది. యాదృచ్ఛికత తన బలమైన ఉనికిని చాటుకుంది" అన్నది లారా.

ఒక కాల్చబడిన సాల్మన్ చేపను నా ఎడమవైపు నుండి తీసుకొచ్చి టేబుల్‌మీద పెట్టాడు బట్లర్. "మిసెస్ లివింగ్‌స్టన్ దివ్యమైన విందునిస్తున్నారు మనకు" అన్నాను.

"సాల్మన్ చేపను తింటే లావెక్కుతారా?" అని అడిగింది లారా, పెద్ద ముక్కను తీసుకుంటూ "చాలా లావెక్కుతారు" అన్నాను.

"నాన్సెన్స్" అన్నదామె.

"కథను కంటిన్యూచెయ్యి. యాదృచ్ఛికత తన బలమైన ఉనికిని చాటుకుంది అన్నావు కదా. దాంతర్వాత యేం జరిగింది?"

"అప్పుడు మా బట్లర్ వెంటనే మిస్ రాబిన్సన్ మీదికి వంగి, ఆమె చెవిలో ఏదో చెప్పాడు. ఆమె ముఖం కొంచెం పాలిపోయింది. అందరు స్త్రీలలాగా ముఖానికి రూజ్ అనే ఎర్రని పొడిని పులుముకోకపోవడం వల్ల మిస్ రాబిన్సన్ ముఖం పాలిపోవటం సులభంగా తెలిసిపోయింది. ఆమె ఒక్కసారిగా ఉలిక్కిపడటం స్పష్టంగా తెలిసింది. కొంచెం ముందుకు వంగింది రాబిన్సన్"

"మేడమ్ లివింగ్‌స్టన్! నాతో మాట్లాడటం కోసం మన హాల్లో ఇద్దరు మనుషులు వేచి వున్నారట" అన్నది రాబిన్సన్.

"అయితే వెళ్ళి మాట్లాడు" అన్నది మిసెస్ సోఫీ లివింగ్‌స్టన్"

"మిస్ రాబిన్సన్ లేచి వెళ్ళింది. అందరి మనసులలో ఒకే ఊహ కదలాడింది.కాని, అందరికన్న ముందుగా నేనే "వాళ్లు ఆమెను అరెస్ట్ చేయడానికి రాలేదు కదా. అదే జరిగితే మీ పరిస్థితి ఘోరం సోఫీ" అన్నాను.

"బోర్సెల్లీ, ఆ ముత్యాలహారం అచ్చమైనదేనా?" అని అడిగింది సోఫీ.

"అవును అందులో అనుమానమే లేదు"

"ఒకవేళ అది దొంగిలించిన హారమైతే ఇప్పుడు దాన్ని ధరించేది కాదు"

"సోఫీ లివింగ్‌స్టన్ ముఖం విపరీతంగా పాలిపోయింది. తన నగలపెట్టెలో నగలన్నీ భద్రంగా ఉన్నాయా అనే అనుమానం వచ్చిందామెకు. నేనేమో ఒక చిన్న వజ్రాల హారాన్ని ధరించాను. ఈ సంఘటన జరగటంతో దాన్ని చేత్తో తడిమి చూసుకున్నాను".

"పిచ్చిగా మాట్లాడకు. అంత విలువైన ముత్యాల హారాన్ని మిస్ రాబిన్సన్ యెట్లా దొంగిలించగలుతుంది?" అన్నది మిసెస్ లివింగ్‌స్టన్.

"ఆమె దొంగవస్తువుల్ని కొనే ఆమె కావచ్చు" అన్నాను నేను.

"కాని ఆమె గురించి ఎంతో మంచి సిఫారసు చేశారెందరో."

"అట్లానే చేస్తారు చాలా మంది" అన్నాను.

లారా చెప్పేదాన్ని మధ్యలోనే ఆపేస్తూ "ఆ సంఘటనను నువ్వు పాజిటివ్‌గా తీసుకోనట్టుంది" అన్నాను.

"నిజానికి మిస్ రాబిన్సన్ గురించి నాకేం తెలియదు. ఆమె మంచిది కావచ్చు కూడా. కాని, ఆమె వొక పేరు మోసిన దొంగ అయి, అంతర్జాతీయ దొంగల ముఠాలోని సభ్యురాలైతే థ్రిల్లింగ్‌గా వుంటుంది కదా" అన్నది లారా.

"అంటే సినిమాల్లోలాగా అన్నమాట. అట్లాంటి ఉత్కంఠ నిండిన విషయాలు కేవలం సినిమాల్లోనే జరుగుతాయి" అన్నాను.

కథను కొనసాగిస్తూ లారా ఇలా చెప్పింది. "మేమందరం ఊపిరి బిగబట్టి వేచి వున్నాం. హాల్లోంచి తగాదా తాలూకు చప్పుడు వస్తుందేమోనని అనుకున్నాం. కాని యెట్లాంటి చప్పుడూ వినపడలేదు. తర్వాత తలుపు తెరుచుకుంది. మిస్ రాబిన్సన్ హాల్లోంచి డైనింగ్ రూములోకి వచ్చింది. ఆమె మెడలో ఆ హారం లేకపోవడం గమనించాను. ఆమె ముఖం పాలిపోయి వుంది. ఉద్రేకం, తత్తరపాటు చోటు చేసుకున్నాయి. టేబులు దగ్గరికి వచ్చి నవ్వుతూ కుర్చీలో కూర్చుని దాన్ని పడేసింది".

"దేన్ని పడేసింది?" అని అడిగాను.

"ఒక ముత్యాల హారాన్ని, టేబులు మీద"

"ఇదీ నా ముత్యాల హారం" అన్నది రాబిన్సన్.

బోర్సెల్లి ముందుకు వంగి, "కాని ఇది నకిలీ హారం" అన్నాడు.

"నేను చెప్పాను కదా ఆ ముత్యాలు నకిలీవని" అని నవ్వింది రాబిన్సన్.

"కొన్ని క్షణాల క్రితం మీ మెడలో వుండిన హారం కాదిది" అన్నాడు.

"ఆమె తల వూపి మార్మికంగా నవ్వింది. మాకందరికీ ఏమీ అర్థం కాలేదు. సోఫీ లివింగ్‌స్టన్‌కు యిదంతా నచ్చలేదు. అసలు విషయం చెప్పమని మిస్ రాబిన్సన్‌ను అడిగింది. జారట్స్ అనే దుకాణం నుండి ఇద్దరు మనుషులు హాల్లోకి వచ్చారనీ, ఆ హారాన్ని తాను

ఆ దుకాణంలోనే కొన్నదనీ, కాని దాని కొండి సరిగా లేకపోవడంతో దుకాణం వాళ్లు సరిగ్గా చూసుకోక వేరే హారాన్ని యిచ్చారనీ, ఇప్పుడు దాన్ని తీసుకుని తాను కొన్న చవకైన హారాన్నే యిచ్చారనీ చెప్పిందామె. అటువంటి బుద్ధి తక్కువ పనిని ఎవరైనా ఎట్లా చేస్తారనే అనుమానం వచ్చింది మాకు. మొత్తానికి తేలిందేమిటంటే, అంతకుముందు మిస్ రాబిన్సన్ ధరించిన హారం విలువ యాభై వేల పౌండ్లు అనీ, దాన్ని తీసుకుని మళ్లీ నకిలీ హారాన్ని ఇప్పుడు దుకాణం వాళ్లు ఇచ్చారనీ, అసౌకర్యాన్ని కలిగించినందుకు దుకాణం వాళ్లు తనకు మూడు వందల పౌండ్ల చెక్కును ఇచ్చారని చెప్పి మిస్ రాబిన్సన్ ఆ చెక్కును చూపించింది. ఆమె సంతోషంగా వుంది" అన్నది లారా.

"ఆమె అదృష్టం బాగుండిపోయింది. కదా" అన్నాను.

"అని అనుకుంటున్నారు మీరు. కాని అదే ఆమె నాశనానికి కారణమైంది"

"ఓహో, అదెలాగా?"

"మిస్ రాబిన్సన్ కొన్నాళ్ల పాటు సెలవు మీద పోవాలనుకుంది. డ్యూవిల్ పట్టణానికి వెళ్లి ఆ మూడు వందల పౌండ్లతో అక్కడ ఒక నెల రోజుల పాటు గడిపి రావాలను కుంటున్నానని మిసెస్ సోఫీ లివింగ్‌స్టన్‌తో చెప్పింది. కాని, డబ్బును అట్లా వృథా చేయవద్దనీ, ఆ మొత్తాన్ని బ్యాంకులో జమ చేసి మంచి వడ్డీని పొందాలనీ సూచించింది సోఫీ. మిస్ రాబిన్సన్ ఆ మాటలను లెక్క చేయలేదు. తనకు అంత మంచి అవకాశం మళ్లీ రాదు కనుక కొంతకాలం యువరాణిలాగా హాయిగా ఆనందిస్తానన్నది. సోఫీ ఏమీ చేయలేక ఊరుకుండి పోయింది. తాను కట్టుకోకుండా మిగిల్చిన ఎన్నో దుస్తుల్ని ఆమె రాబిన్సన్‌కు అమ్మింది. ఫ్రీగా యిచ్చానని చెప్పింది కాని నేనది నమ్మలేదు. వాటిని తక్కువ ధరకు అమ్మిందనే అనుకుంటాను. రాబిన్సన్ తర్వాత డ్యూవిల్ నగరానికి వెళ్లిపోయింది. ఆపైన యేం జరిగిందనుకుంటున్నారు?"

"నేనూహించలేను. బహుశా అక్కడ బాగా ఆనందంగా గడిపిందేమో"

"మరో వారం రోజుల్లో తిరిగి రావాల్సి వుందనగా మిస్ రాబిన్సన్ తాను తన మనసు మార్చుకున్నదనీ, వేరే వృత్తిలోకి ప్రవేశిస్తుండటం వల్ల తిరిగి రాలేకపోతున్నందుకు క్షమించాలనీ మిసెస్ సోఫీ లివింగ్‌స్టన్‌కు ఉత్తరం రాసింది. సోఫీ బాగా కోపానికి వచ్చింది. అసలు ఏం జరిగిందంటే, డ్యూవిల్ నగరంలో మిస్ రాబిన్సన్ అర్జెంటినా దేశపు ఒక అత్యంత ధనవంతుణ్ని పెళ్లాడి, పారిస్‌కు తరలిపోయిందట. ఆమెను నేను ఫ్లారెన్స్ నగరంలో చూసినపుడు తన శరీరమంతా భారీ నగలతో నిండివుంది. నేను చెడామడా తిట్టాననుకోండి. తనకొక పెద్ద బంగళా, రోల్స్ రాయిస్ కారూ ఉన్నాయని చెప్పింది. తర్వాత ఆ అర్జెంటినా దేశస్థుణ్ణి వదిలి, గ్రీకు ధనికుణ్ని పెళ్లాడిందట. ప్రస్తుతం యెవరితో వుంటుందో తెలియదు.

ఏతావాతా తేలిందేమిటంటే, ఇప్పుడామె పారిస్‌లోని ధనవంతురాళ్లైన వగలాడిలలో ఒకతి".

"ఆమె జీవితం నాశనమైందని నువ్వు అన్నప్పుడు ఆ పదాన్ని సాంకేతిక అర్థంలో వాడి ఉంటావు" అన్నాను.

"మీరంటున్నదేమిటో నాకర్థం కాలేదు. ఆమె చెప్పిందంతా ఒక పెద్ద కాకమ్మ కథ అనిపించడం లేదా మీకు?" అన్నది లారా.

"దురదృష్టవశాత్తూ నేనిదివరకే ముత్యాల హారం గురించి ఒక కథను రాసివున్నాను. మళ్లీ అదే ఇతివృత్తంతో రాయలేను కదా"

"నిజానికి దీని ఆధారంగా నేనే ఒక కథ రాయాలనుకుంటున్నాను. కాని ముగింపును మార్చాల్సి వుంటుంది" అన్నది లారా.

"ఓ, ఎలా ముగిస్తావు కథను?"

"యుద్ధంలో ఒక కాలు పోయి, ముఖమంతా దెబ్బతిని, దుర్భర దారిద్ర్యంలో వున్న ఒక బ్యాంకు క్లర్కుతో ఆమెను జత చేస్తాను. అతడు నెలనెలా డబ్బును ఆదా చేస్తూ ఊరవతల ఒక యిల్లు కొనుక్కున్నాక పెళ్లి చేసుకుందామంటాడు. ఆఖరు ఇన్‌స్టాల్‌మెంట్ కట్టింతర్వాత ఆమె తన దగ్గరున్న మూడు వందల పౌండ్లను అతనికి చూపిస్తుంది. అతడు నమ్మలేక సంతోషంతో ఏడుస్తాడు. తలను ఆమె భుజం మీద పెట్టి చిన్నపిల్లాడిలా యేడుస్తాడు. వాళ్లిద్దరూ పెళ్లి చేసుకుని ఆ చిన్న యింట్లో నివసిస్తారు. అతని ముసలి తల్లిని వాళ్లతోనే వుంచుకుంటారు. అతడు రోజూ బ్యాంకుకు పోయి ఉద్యోగం చేస్తుంటాడు. పిల్లలు పుట్టకుండా జాగ్రత్త తీసుకుని ఆమె ఒక ఉద్యోగంలో చేరుతుంది. మధ్యమధ్య అతని గాయం తిరగబెడితే అతనికి సేవలు చేస్తూ వుంటుంది. అదంతా చాలా హృదయ విదారకంగా, మధురంగా వుంటుంది కదా" అన్నది లారా.

"నాకైతే ఈ ముగింపు చప్పగా వుంది" అన్నాను.

"కావచ్చు. కాని, నైతికంగా ఉంటుంది" అన్నది ఆమె.

**15**

# కలుపు మొక్క

**(The Alien Corn)**

**బ్లౌం**డ్ కుటుంబానికి ఫెర్డీ రాబెన్‌స్టీన్‌తో బంధుత్వం ఉన్న సంగతి నాకు తెలియడానికి పూర్వం నేనా కుటుంబాన్ని చాలా కాలంగా ఎరుగుదును. నేనతణ్ని మొదటిసారిగా కలిసినప్పుడు ఫెర్డీకి దాదాపు యాభై సంవత్సరాలుండివుంటాయి. కానీ ఇది రాసేటప్పుడు అతడు డెబ్భై దాటి ఉంటాడు. అతను కొద్దిగా మారిపోయాడు. మందంగా, ఒత్తుగా, ఉంగరాల వెంట్రుకలు తెల్లబడినా తన రూపు చెడగొట్టుకోకుండా ముందులాగానే ధీరోదాత్తంగా వున్నాడు. అందరూ అనుకున్నట్టుగా యవ్వనంలో అతడు అందంగా ఉండేవాడనేది నమ్మశక్యమైన విషయమే! ఇప్పటికీ అతనిది చక్కని హీబ్రూ (అంటే యూదుల) రూపు. నల్లని ఆ మెరిసే కళ్లు ఎన్నో యూదేతర స్త్రీ హృదయాల్లో సంచలనాన్ని కలిగించాయి. కోల ముఖం, స్వచ్ఛమైన చర్మంతో పొడుగ్గా సన్నగా వుంటాడు. చాలా మంచి బట్టలు తొడుక్కునేవాడు. ఇప్పటికీ అతణ్ని సాయంత్రం దుస్తుల్లో చూస్తే నాకు తెలిసిన అత్యంత అందమైన పురుషుల్లో అతడూ ఒకడనిపిస్తుంది. అప్పట్లో అతడు చొక్కా ముందు భాగంలో నల్లని పెద్ద ముత్యాలను, వేళ్లకేమో ప్లాటినం ఉంగరాన్నీ ఇంకా ఇంద్రనీలపు ఉంగరాన్నీ ధరించేవాడు. కొంచెం షోకుగా ఉండేవాడనుకోండి. కానీ మరే విధంగా వున్నా అతనికది అనుచితంగా వుంటుందని అతని స్వభావపు తీరులోనే తెలిసేది.

"ఎంతైనా నేను తూర్పువాణ్ని కావడం వల్ల నాలో కొంత మొరటు వైభవం వుంటుంది కదా" అనేవాడు.

జీవిత చరిత్ర రాయడానికి ఫెర్డీ రాబెన్‌స్టీన్ ఓ అద్భుతమైన వస్తువుగా పనికొస్తాడని నేను తరుచుగా తలపోసేవాణ్ని. అతడు గొప్పవాడేం కాదుగానీ తనకు తాను పెట్టుకున్న పరిధుల్లో నిజ జీవితాన్ని ఓ కళాఖండంగా తయారు చేసుకున్నాడు. పర్షియన్ చిత్రంలా

అదొక అపూర్వ సృష్టి. దాని పరిపూర్ణత నుండి అది ప్రయోజనాన్ని పొందింది. ఎప్పుడో ధ్వంసం అయిపోయిన రచనలూ, చావుకు దగ్గరగా వున్న మనుషుల గురించిన జ్ఞాపకాలూ తప్ప దురదృష్టం కొద్దీ అతని జీవితంలో అంతకంటే ఎక్కువ సామగ్రి లేదు. అతని జ్ఞాపకశక్తి అద్భుతమైనది. అయినా అతడు తన జ్ఞాపకాలను పుస్తకంగా రాయలేదు. ఎందుకంటే అతడు తన గతాన్ని పూర్తిగా వ్యక్తిగత వినోదాన్ని కలిగించేదిగానే భావిస్తాడు. అతి సంపూర్ణమైన విచక్షణా జ్ఞానం వున్న మనిషతడు. అతని జీవిత చరిత్రను రాయడానికి మాక్స్ బీర్‌బోమ్ తప్ప మరెవరూ న్యాయం చేకూర్చగలిగేవాళ్లని నేనెరుగను. నేటి ఈ కర్కశ ప్రపంచంలో సూక్ష్మ విషయాలను కూడా మృదువైన సానుభూతితో చూసి నిరర్థకతలోంచి సున్నితమైన హృదయ విదారకతను పిండగలిగే వాళ్లు మాక్స్ తప్ప వేరెవరూ లేరు. ఫెర్డీని నేను ఎరిగిన దానికంటే ఎక్కువగానూ, ఎక్కువ కాలంగానూ ఎరిగి వున్న మాక్స్, ఫెర్డీ జీవిత చరిత్రను రాయడం పట్ల ఎందుకు ఆకర్షితుడు కాలేదా అని ఆశ్చర్యపడ్డాను నేను. మాక్స్ రాయడం కోసమే పుట్టాడు ఫెర్డీ. నా మనోనేత్రంలో కదలాడే ఆ సొగసైన పుస్తకానికి చిత్రాలను అబ్రే బెర్డ్స్లీ కాక మరెవరు గీస్తారు! ఆ విధంగా ఒక మహనీయుని స్మారక చిహ్నం సృష్టింపబడి ఆ అశాశ్వత జీవి భావితరాల కోసం పారదర్శకతలో బంధింపబడి ఉండేవాడు.

ఫెర్డీ ఆస్తిపాస్తులు సాంఘికమైనవి. అతని కార్యరంగమేమో ఈ విశాల ప్రపంచం. దక్షిణాఫ్రికాలో పుట్టిన అతడు తన ఇరవయ్యో ఏడు దాకా ఇంగ్లండుకు రాలేదు. కొంతకాలం స్టాక్ ఎక్స్ఛేంజ్‌లో వున్నాడు. కానీ తండ్రి మరణంతో బాగా ఆస్తి సంక్రమించి అతడు వ్యాపారం నుండి విరమించుకోవడం వల్ల పట్టణ జీవితానికి తనను తాను అంకితం చేసుకున్నాడు. ఆ కాలంలో ఇంగిష్‌వాళ్ల సమాజం ఒక అభేద్యమైన వ్యవస్థగా ఉండేది. దాని గోడలను ఛేదించడం అనేది ఒక యూదుడికి సులువైన పని కాదు. కానీ అవి ఫెర్డీ ధాటికి చొప్పబెండ్లలా కూలిపోయాయి. అతడు అందగాడు, ఐశ్వర్యవంతుడు. ఆటలు బాగా ఆడతాడు. అంతేకాక మంచి కంపెనీ ఇస్తాడు. అతనికి కర్జన్ వీధిలో అత్యంత సుందరమైన ఫ్రెంచ్ ఫర్నిచర్ కలిగిన ఇల్లూ, ఒక ఫ్రెంచ్ వంట మనిషీ – ఇంకా ఓ గుర్రపు బగ్గీ ఉన్నాయి. అద్భుతమైన అతని పురోభివృద్ధిలోని మొదటి అంశాలు ఉత్సుకతను కలిగిస్తాయి. అవి కాలపు చీకటి అగాథంలో కలిసిపోయాయి. నేనతన్ని మొదటిసారిగా కలిసినప్పుడు అప్పటికే లండన్‌లో అతి చురుకైన మనుషుల్లో ఒకడై కూర్చున్నాడు. ఫెర్డీ సాహిత్యం పట్ల అభిమానం ఉన్న ఒకావిడ నార్‌ఫోక్‌లోని అతి వైభవమైన తన ఇంటికి నన్ను ఆహ్వానించిందొకసారి. ఆమె దృష్టిలో అప్పుడు నేనొక ప్రతిభావంతుడినైన యువ నవలా రచయితను. కాని, వచ్చిన అతిథులు చాలా ప్రసిద్ధులు కావడం వల్ల నాకెంతో సంభ్రమమూ, కొద్దిగా జంకూ కలిగాయి. మేము పదహారుగురం ఉన్నాము. నాకేమో ఆ

క్యాబినెట్ మంత్రులు, గొప్పింటి స్త్రీలు, ఇంకా పార్లమెంట్ మనుషుల మధ్య సిగ్గుగా, బెరుకుగా అనిపించింది.

వాళ్ళు మాట్లాడే మనుషుల గురించీ, విషయాల గురించీ నాకేమీ తెలియదు. వాళ్లు నాతో సౌమ్యంగా ప్రవర్తించినప్పటికీ ముభావంగా ఉండటంతో నన్ను ఆహ్వానించినావిడకు నేనొక విధంగా భారమైనట్టు స్పృహ కలిగింది నాకు. ఫెర్డీ రక్షించాడు నన్ను. అతడు నాతో కూర్చుంటూ, నడుస్తూ మాట్లాడసాగాడు. నేను రచయితనని తెలుసుకున్నాడు. నాటకాన్నీ, నవలనూ చర్చించాము మేము. ఐరోపా ఖండంలో నేను ఎక్కువగా నివసించినట్టు తెలుసుకున్న అతడు ఫ్రాన్స్, జర్మనీ, స్పెయిన్‌ల గురించి నాతో ఆహ్లాదకరంగా మాట్లాడాడు. నిజంగా అతడు నా సాంగత్యాన్ని కోరుతున్నట్టనిపించింది. తనూ, నేనూ అక్కడున్న మిగతా సభ్యుల కంటె భిన్నంగా ఉన్నట్టు పొగడ్త నిండిన అభిప్రాయాన్ని వెలిబుచ్చాడు. ఇంకా మా సంభాషణ ద్వారా రాజకీయ పరిస్థితి మీదా, ఎవరిదో విడాకుల కుంభకోణం గురించీ, నెమళ్లను చంపడం పట్ల పెరుగుతున్న విముఖత గురించీ, ఇతరులు చేసిన సంభాషణను హాస్యాస్పదమనిపించేలా చేశాడు. కానీ ఫెర్డీకి మా చుట్టూ వున్న సహృదయులైన ఆంగ్ల సమాజపు పెద్ద మనుషుల పట్ల తన ఆంతర్యపుటడుగున ఎట్లాంటి స్వల్పమైన ద్వేషం ఉన్నా దాని జాడను గోచరింపజేసింది నాకొక్కడికేనని కచ్చితంగా తెలుసు నాకు. సింహావలోకనం చేసుకుంటే అది అతడు నాకర్పించిన మృదువైన వినయపూర్వక ప్రశంస కాదా అని ఆశ్చర్యపడక మానను. అతడు నిజంగా తనలోని ఆకట్టుకునే శక్తిని ప్రయోగించడానికి ఇష్టపడే వాడనుకుంటాను. అతని సంభాషణ నాకు ఇచ్చే ప్రస్ఫుటమైన ఆనందం అతణ్ని సంతృప్తి పరిచేదని చెప్పడానికి నేను సాహసిస్తాను. కానీ సామాన్యుడైన నవలా రచయిత మీద అంత శ్రమ తీసుకోవడానికి అతనికి కళ మీదా, సాహిత్యం పట్లా వున్న నిజమైన అభిరుచి కాక మరే ఉద్దేశం ఉండి ఉండదు. రచయితను కావడం వల్ల నేనూ, హీబ్రూ (యూదుడు) కావడం వల్ల అతడూ మౌలికంగా ఆ మనుషులకు చెరి సమానంగా పరాయి వాళ్లమైనట్టు ఫీలయ్యాను నేను. కానీ ఏ మాత్రం ఆందోళన లేకుండా అతడు ప్రవర్తించడం పట్ల  నేను ఈర్ష్య చెందాను. పూర్తిగా స్వంత ఇంట్లో ఉన్నట్టే ఉన్నాడతడు. అందరూ అతన్ని ఫెర్డీ అని పిలిచారు. ఎప్పుడూ ఉల్లాసంగా ఉన్నట్టు కనిపిస్తాడు ఫెర్డీ. ఒక ఛలోక్తికి గానీ, ఒక చమత్కారానికి గానీ, ఒక చురుకు మాటకు గానీ అతడు ఎప్పుడూ తడుముకోలేదు. ఆ ఇంట్లో వాళ్లతణ్ని ఎందుకు ఇష్టపడ్డారంటే అతడు వాళ్లను నవ్వించాడే తప్ప అర్థం కాకుండా మాట్లాడి ఇబ్బంది పెట్టలేదు. అతడు వాళ్ళ జీవితాల్లోకి ప్రాచ్యదేశాల భావుకత తాలూకు చిరు మాధుర్యాన్ని తీసుకొచ్చాడు. కానీ అది ఎంత చాతుర్యంతో నంటే దాని వల్ల వాళ్లు మరింత ఎక్కువ ఇంగ్లిషు వాళ్లలాగే ఫీలయ్యారు. ఫెర్డీ పక్కన ఉన్నప్పుడు మనకు నీరసంగా ఉండనే

ఉండదు. అతడుంటే ఇంగ్లిష్ మిత్ర సమావేశాలను అప్పుడప్పుడు పీడించే విధ్వంసకర నిశ్శబ్దం తాలూకు భయం నుండి రక్షణ లభిస్తుంది మనకు. మౌనం అనివార్యమనిపిస్తే చాలు, అందరినీ ఉత్సాహపరిచే విషయంలోకి విజృంభిస్తాడు ఫెర్డీ రాబెన్‌స్టీన్. ఏ విందు పార్టీకైనా అతడు ఓ అమూల్యమైన వరం అనుకోవచ్చు. అతని దగ్గర తరగని హీబ్రూ కథల నిధి ఉంది. ఫెర్డీ చాలా మంచి ధ్వన్యనుకరణ కర్త. యూదుల ఉచ్చారణను అనుకరించి, యూదుల చేష్టలను ఉన్నదున్నట్టుగా అభినయం చేస్తాడు. తల దేశంలోకి కూరుకుని పోయిన మొహంలో కౌటిల్యం పెరిగి, గొంతు నూనె తాగిన వాడి గొంతులా అయిపోయి యూదుల ప్రవక్తలా, వృద్ధుడైన బట్టల వర్తకుడిలా, ప్రయాణాలు చేసే చలాకీ వ్యాపారస్తునిలా, ఇంకా విటులకు వేశ్యలను కొనితెచ్చే లావుపాటి స్త్రీలా అయ్యేవాడు. అది నాటకమంత బాగుండేది. తనే ఒక యూదుడు కావడం వల్ల, ఇంకా ఆ విషయాన్ని అతడు నొక్కి చెప్పడంతో మనం దాపరికం లేకుండా నవ్వేస్తాం. కానీ నా మటుకు నాకు అంతరాంతరాల్లో ఇబ్బంది కలిగేది. తన స్వంత జాతినే క్రూరంగా ఎగతాళి చేసే హాస్య ధోరణి పట్ల నాకంతగా విశ్వాసం లేదు. యూదుల గురించిన కథలు  చెప్పడం అతని ప్రత్యేకత అని తరువాత తెలుసుకున్నాను నేను. అతణ్ని ఎక్కడ కలిసినా వెంటనే గానీ లేక కొంచెంసేపైన తర్వాత గానీ అట్లాంటి యూదుల కథను కొత్తదాన్ని ఫెర్డీ చెప్పకుండా ఉండడం చాలా అరుదు.

కాని ఒక సందర్భంలో అతడు నాకు చెప్పిన చాలా మంచి కథ ఒకటి యూదులది కాదు. అది నన్నెంత ప్రభావితుణ్ని చేసిందంటే దాన్ని నేనెంత మాత్రం మరిచిపోలేదు. కాని ఏదో ఒక కారణం చేత దాన్ని మళ్లీ చెప్పే సందర్భం నాకు దొరకనే లేదు. దాన్ని నేనిక్కడ ఎందుకు చెబుతున్నానంటే అది విక్టోరియా శకపు సాంఘిక చరిత్రలో నిలిచిపోయే వ్యక్తులకు సంబంధించిన ఉత్కంఠకరమైన కథ. దాన్ని పోగొట్టుకోవడం విచారకరమైన విషయమని భావిస్తాను నేను. ఫెర్డీ ఒకప్పుడు తాను మంచి యవ్వనంలో వున్న కాలంలో ఒక ఊర్లోని ఒక ఇంట్లో ఉండేవాడనీ, ఆ కాలంలో సౌందర్యానికి పరాకాష్ఠగా నిలిచి విస్మయపరిచే ఖ్యాతినార్జించిన మిసెస్ లాంగ్ ట్రీ కూడా అదే ఇంట్లో అతిథిగా వుండేదని చెప్పాడు. ఎగ్లింటన్ అందాల పోటీలో సౌందర్యరాణిగా గెలిచిన సోమర్సెట్ యువరాణి కూడా ఆ ఇంటికి దగ్గర్లోనే ఉండేదట. ఆమెతో కొద్దిగా పరిచయం ఉండడం వల్ల ఆ ఇద్దరాడవాళ్లను సన్నిహితం చేస్తే ఆసక్తికరంగా ఉంటుందనిపించిందిట ఫెర్డీకి. ఈ సంగతిని మిసెస్ లాంగ్ ట్రీకి సూచించగానే ఆమె సిద్ధమేననడంతో వెంటనే, 'పేరు మోసిన అందాల రాశి నొకదాన్ని తమ దర్శనం కోసం తీసుకురావచ్చా' అని యువరాణికి రాశాడు ఫెర్డీ. ఈ తరపు (ఇది ఎనభైలలో మాట) అతి సుందరమైన యువతి పోయిన తరపు సౌందర్యరాణిని పురస్కరించడం సబబుగా ఉంటుందని పేర్కొన్నాడు ఫెర్డీ. 'తప్పకుండా

తీసుకురండి. కానీ ఆమె నిర్ఘాంతపోతుందని మిమ్మల్ని హెచ్చరిస్తున్నాను' అని జవాబిచ్చింది యువరాణి. వాళ్లు రెండు గుర్రాల బగ్గీల్లో వెళ్లారు. పొడవైన సిల్కు దారాలతో మెడ దాకా వ్యాపించి సుందరమైన తన శిరోరూపాన్ని కనబరుస్తూ కళ్లను మరింత నీలం చేస్తూ ఒంటికి అదిమినట్టున్న నీలం రంగు దుస్తుల్లో ఉంది మిసెస్ లాంగ్ ట్రీ. తనను చూడడానికి వచ్చిన ఆ మిరుమిట్లు గొలిపే సౌందర్యాన్ని చిన్న కళ్లల్లోంచి వ్యంగ్యంగా చూస్తూ అందవికారమైన ఓ వృద్ధురాలు వాళ్లకు స్వాగతమిచ్చింది. టీ తాగి వాళ్లు మాట్లాడుకున్న తర్వాత తిరిగి ఇంటికి వెళ్లారు. మిసెస్ లాంగ్ ట్రీ చాలా మౌనంగా వుంది. ఫెర్డీ ఆమె వైపు చూశాడు. ఆమె నిశ్శబ్దంగా ఏడుస్తున్నది. వాళ్లింటికి వెళ్లగానే ఆమె తన గదిలోకి పోయి భోజనం కోసం కూడా ఆ రాత్రికి కిందికే రాలేదు. సౌందర్యం నశిస్తుందని మొదటిసారిగా అర్థమయింది ఆమెకు.

ఫెర్డీ నా చిరునామా అడిగాడు. నేను మళ్లీ లండన్‌కు చేరుకున్న తర్వాత కొద్ది రోజులకే ఫెర్డీ నన్ను భోజనానికి ఆహ్వానించాడు. మేము ఆరుగురమే ఉన్నాం. గొప్పింటి ఇంగ్లిషతన్ని పెళ్లాడిన ఓ అమెరికన్ స్త్రీ, ఓ స్వీడిష్ చిత్రకారుడు, ఒక నటి – ఇంకా ఓ పేరుమోసిన విమర్శకుడు. మేము చాలా మంచి తిండి తిని అద్భుతమైన మద్యాన్ని ఆస్వాదించాం. సంభాషణ సాదాగా, విజ్ఞానదాయకంగా ఉంది. భోజనం అయిన తరువాత ఫెర్డీని పియానో వాయించడానికి ఒప్పించాము. అతను వియన్నా వాల్స్‌లను మాత్రమే వాయించాడు. అవి అతని ప్రత్యేకత అని తర్వాత తెలిసింది నాకు. మృదువుగా స్వరబద్ధంగా ఉన్న ఆ సంగీతం ఆహ్లాదకరంగా ఉండి అతని సలక్షణమైన ఠీవికి అతికినట్లు ఉందనిపించింది. లయబద్ధమైన ఊపుతో కృత్రిమత లేకుండా వాయించాడు. అతను మీటడంలో సొంపు వుంది. అతనితో కలిసి నేను చేసిన ఎన్నో మంచి విందులలో ఇది మొదటిది. సంవత్సరానికి రెండు మూడుసార్లు నన్నతడు ఆహ్వానిస్తాడు. రానురాను నేనతణ్ని ఇతర వ్యక్తుల ఇళ్లల్లో ఎక్కువ తరచుగా కలవసాగాను. ప్రాపంచికంగా చూస్తే నేను పైకొచ్చాను. అతడు కొంచెం పడిపోయాడేమో అనిపిస్తుంది.

ఈ మధ్య గత కొన్ని సంవత్సరాలలో అప్పుడప్పుడు నేనతన్ని ఇతర యూదులు హాజరైన విందులో చూశాను. తన జాతి మనుషుల మీద క్షణకాలం నిలిచే అతని ప్రకాశవంతమైన కళ్ళల్లో ఈ ప్రపంచానికి ఏం జరగనున్నదో అనే భావం పట్ల ఒకింత జాలి నిండిన వినోదాన్ని చూసినట్టు ఊహించుకున్నాన్నేను. అతడు డాబు మనుషుల సాంగత్యాన్ని మాత్రమే ఇష్టపడతాడనే వాళ్లున్నారు కొందరు. కాని నేనట్లా అనుకోను. తన బాల్యదినాల్లో అతడు గొప్ప వాళ్లను తప్ప మరెవర్నీ కలవకపోవడం జరిగిందంతే! కళ పట్ల, కళను బాగా వెలికి తెచ్చే వాళ్ళ పట్ల అతనికి నిజమైన గాఢానురాగం ఉండేది. వాళ్లదగ్గర అతడు బాతాఖానీ తాలూకు ప్రభావాన్ని ఛాయా మాత్రంగానైనా రానీయలేదు.

కానీ చాలా గొప్పవాళ్లతో ఉన్నప్పుడు కనిపించే ఆ ప్రభావం అతడు వాళ్ల ఠీవికి మారురూపంగా కాదు గదా అనే అనుమానాన్ని కలిగించేది. అతని అభిరుచి చాలా పరిణతమైనది కావడం వల్ల చాలామంది మిత్రులు అతని పరిజ్ఞానాన్ని వినియోగించు కొనడానికి ఉత్సాహపడ్డారు. పాత ఫర్నిచరుకు విలువనిచ్చే అగ్రగణ్యుల్లో ఫెర్డీ ఒకడు. పూర్వీకుల భవంతుల్లోని అటకల మీది నుండి ఎన్నో అమూల్యమైన వస్తువులను రక్షించి కూర్చునే గదుల్లో వాటికి గౌరవస్థానాన్ని కల్పించాడు. వేలం జరిగే స్థలాల చుట్టూ తిరగడం అతనికి సరదాగా వుండేది. ఆలస్యం లేకుండా అందమైన వస్తువులను స్వంతం చేసుకునే లాభదాయకమైన పెట్టుబడి కోసం ఆశించే గొప్పింటి స్త్రీలకు తన సలహానివ్వడానికి అతనెప్పుడూ సంసిద్ధుడే. అతడు ఐశ్వర్యవంతుడూ, గుణవంతుడూను. కళలను పోషించడం అంటే అతనికెంతో ఇష్టం. ప్రశంసనీయమైన ప్రతిభను కలిగిన కుడ్యచిత్రకారునికి జీవన భత్యాన్ని సంపాదించి పెట్టడం కోసం గానీ, ఏ ఇతర విధంగానూ కచేరీ భాగ్యం లభించని వాద్యకారుని కోసం ఒక సంపన్నుడి ఇంట్లో కచేరీ ఏర్పాటుకై గానీ ఎంతో శ్రమ తీసుకుంటాడు ఫెర్డీ. కానీ ఆ సంపన్నుడిని అతడెప్పుడూ నిరుత్సాహపరచలేదు. దగా చేయడం సాధ్యం కానంత గొప్ప అభిరుచి అతనిది. మామూలు మనుషుల పట్ల సౌమ్యంగా ఉన్నప్పటికీ వాళ్లకు సహాయం చేయడానికి అతడు వేలు కూడా కదపడు. జాగ్రత్తగా ఎంపిక చేసుకున్న అతని సంగీత సభలు చిన్నవిగా, వీనుల విందుగా ఉండేవి. అతడు పెళ్లి చేసుకోలేదు.

"నేను ప్రపంచానికి చెందిన వాణ్ని. నాకు తరతమ విభేదాలు లేవని నన్ను నేను పొగుడుకుంటాను. కానీ ఒక యూదేతర స్త్రీని పెళ్లాడటానికి నన్ను నేను ఆయత్తపరచు కోగలనని అనుకోను. భోజనపు దుస్తుల్లో నాటకానికి వెళ్లడం ప్రమాదకరమేమీ కాదుగానీ నా కట్లూ చేయాలని ఎప్పుడూ స్ఫురించదు" అంటాడు ఫెర్డీ.

"మరయితే ఓ యూదురాలిని ఎందుకు పెళ్లి చేసుకోలేదు నువ్వు?"

(ఈ సంభాషణను నేను వినలేదు గాని ఉద్వేగంతో అతన్నెదుర్కున్న ఆ మొండి ధైర్యపు ప్రాణి దాని గురించి చెప్పింది నాకు)

"ఓ మొద్దు మొహమా! మన ఆడవాళ్లు పుష్కలంగా సంతానాన్ని కంటారు. ఈ ప్రపంచాన్ని చిన్న ఐకీ, చిన్న జేకబ్, చిన్న రెబెకా చిన్న లీ – ఇంకా చిన్న రేచెల్‌లతో జనాభా మయం చేసే ఊహను నేను భరించలేను" అంటాడు ఫెర్డీ

కానీ ఫెర్డీకి ప్రేమ కలాపాలు, వ్యవహారాలు ఉండేవి. గడచిన ప్రణయం తాలూకు వ్యామోహం అతన్నింకా అంటుకునే వుంది. ప్రణయ రూపాన్ని సంతరించుకున్న యవ్వనంలో ఉండేవాడు ఫెర్డీ. అతడు నిగ్రహించుకోలేనంతగా ముద్దొచ్చేవాడని నాకు తెలిసిన ప్రౌఢ స్త్రీలు కొందరు చెప్పారు. వాళ్లు జ్ఞాపకాలను నెమరువేసుకుంటున్న రీతిలోనే

అతని కోసం పూర్తిగా వెర్రివాళ్లైపోయిన స్త్రీల గురించి మాట్లాడినప్పుడు అతని అందం ఆ విధమైనదనీ, తప్పు పట్టడానికి వాళ్ల హృదయాల్లో అటువంటిది లేదనీ గ్రహించాను నేను. ఆ కాలపు పుస్తకాల్లో నేను చదివిన గొప్పింటి స్త్రీల గురించి కానీ, ఎటన్‌లో తమ మనుమలను గట్టిగా  కసిరే పరువైన విగత భర్తృకల గురించి కానీ లేక బ్రిడ్జి ఆడుతూ ముక్కలను గజిబిజి చేసుకోవడం గురించి గానీ వినడం ఆసక్తికరంగా వుండేది. వాళ్లంతా ఆ అందమైన యూదుని కోసం దుర్నీతికర వ్యామోహంతో మగ్గిపోయారని భావించాన్నేను. విక్టోరియా మహారాణి పరిపాలనా కాలపు చివరి రోజుల్లోని అందాల రాశులలోకెల్లా అతి సౌందర్యవతీ, అతి ధీరోదాత్తురాలూ అయిన హెర్‌ఫోర్డ్ యువరాణితో ఫెర్డీకి ఉన్న ప్రణయం అత్యంత ప్రచారాన్ని పొందింది. ఆ ప్రణయం ఇరవయ్యేళ్ల దాకా కొనసాగింది. ఈలోగా అతనికి నిస్సందేహంగా వేరే ప్రేమకలాపాలున్నప్పటికీ  వాళ్ల స్నేహ సంబంధాలు పటిష్ఠంగా ఉండి అందరి ఆమోదాన్ని పొందాయి. చిట్టచివరకు ప్రౌఢ స్త్రీ అయిన ఆ యువరాణిని అతడొక విశ్వసనీయమైన స్నేహితురాలిలాగా తారుమారు చేయడం అతని అద్భుతమైన బుద్ధికుశలతకు నిదర్శనం. ఆ జంటను నేను పగటి భోజన సమయంలో కలిసింది ఎక్కువ కాలం క్రితం కాదని నాకు జ్ఞాపకం. ఠీవి నిండిన అస్తిత్వంతో పొడుగ్గా ఉండి రేగిపోయిన ముఖం మీద రంగు పూతతో వయసు మీరి వుందామె. కార్ల్‌టన్‌లో మేము పగటి భోజనాలు చేస్తుండగా మమ్మల్ని విందుకాహ్వానించిన ఫెర్డీ కొన్ని నిముషాలు ఆలస్యంగా వచ్చాడు. అతడు మాకు మద్యాన్ని అందివ్వగా మేమప్పటికే ఓసారి తాగామని చెప్పింది  యువరాణి.

"ఓహో, అలాగా! నీ కళ్లెందుకింత ద్విగుణీకృత ప్రకాశంతో వెలిగిపోతున్నాయా అని ఆశ్చర్యపడ్డాను" అన్నాడు ఫెర్డీ.

ముఖంలో రంగు నిండిన ఆ వృద్ధ స్త్రీ ఆనందంతో ఎర్రబారిపోయింది.

నా యవ్వనం గడిచిపోయి నేను మధ్య వయస్కుడినయ్యాను. నన్ను నేను వయసు మళ్లినవాడిగా చిత్రించుకోవడం ఎంత త్వరగా ప్రారంభించాలా అని తలపోయసాగాను. నేను పుస్తకాలూ, నాటకాలు రాశాను. ప్రయాణాలు చేశాను. ఎన్నో అనుభవాలకు లోనయ్యాను. ప్రేమలో పడి మళ్లీ బయట పడ్డాను. అయినా ఇప్పటికీ విందుల్లో ఫెర్డీని కలుస్తూనే వచ్చాను. యుద్ధం వచ్చిపడి, కొనసాగింది. లక్షల కొద్దీ జనం హతులయ్యారు. ప్రపంచపు రూపే మారిపోయింది. ఫెర్డీ యుద్ధాన్ని ఇష్టపడలేదు. దాన్లో పాల్గొనలేనంత వృద్ధాప్యం వచ్చింది. అతని జర్మన్ పేరు ఇబ్బందికరమై పోయింది. కానీ పరాభవానికి గురి కాకుండా జాగ్రత్త తీసుకుని తెలివిగా ఉన్నాడు ఫెర్డీ. పాత స్నేహితులు అతనికి విశ్వాసపాత్రులుగా ఉన్నారు. అతడు గౌరవకరమైన ఏకాంతంలో జీవించసాగాడు. కానీ ఇంతలో యుద్ధం ముగిసి శాంతి రావడంతో అతడు ధైర్యంగా, మారిన పరిస్థితులను

సద్వినియోగ పరచుకునేందుకు తనను తాను ఆయత్తపరచుకున్నాడు. సమాజం ఇప్పుడు కలగాపులగం అయిపోయింది. పార్టీల్లో కోలాహలం హెచ్చింది. కానీ ఫెర్డీ కొత్త జీవితాన్ని అలవరచుకున్నాడు. ఇప్పటికీ అతడు ఇంకా యూదుల గురించిన హాస్య కథలను చెబుతుంటాడు. వేలం జరిగే స్థలాల చుట్టూ తిరుగుతూ కొత్తగా ధనవంతులైన వారికి ఏది కొనాలో చెబుతుంటాడు. స్ట్రాస్‌వాల్స్‌లను ఆహ్లాదకరంగా వాయిస్తుంటాడు. నేను విదేశాల్లో నివసించడానికి వెళ్లాను. కానీ నేను లండన్ వచ్చినప్పుడల్లా ఫెర్డీని కలుస్తుంటాను. అతనిలో ఏదో ఒకింత అసహజమైన వింత ధోరణి కనిపించింది. అతడు లొంగినట్టు కనపడలేదు. ఒక్కరోజు కూడా అస్వస్థతనెరుగడు ఫెర్డీ. అతనికి అలిసిపోవడం అనేది లేదనిపించింది. ఇంకా అందంగా బట్టలు తొడుక్కుంటున్నాడు ఫెర్డీ. ప్రతి ఒక్కరిలో అతడు ఆసక్తిని కనబరిచాడు. అతని మెదడులో చురుకుదనం ఉంది. అతన్ని భోజనానికి పిలుస్తున్నారంటే అతనిలో విలువ ఉందనే గాని పాత స్నేహం వల్ల కాదు. కర్జన్ వీధిలో తన ఇంట్లో ఇంకా అతడు ఆహ్లాదకరమైన చిన్న సంగీత కచేరీలు ఇస్తున్నాడు.

అటువంటి కచేరీలో ఒకదానికి నన్నాహ్వానించినప్పుడు నేను కనుగొన్న విషయం నాలో అతని గురించి జ్ఞాపకాలను రేకెత్తించడంతో వాటిని నేనిక్కడ పొందుపరిచాను.

హిల్ స్ట్రీట్‌లోని ఒక ఇంట్లో ఓ పెద్ద పార్టీలో మేము భోజనం చేస్తున్నాము. ఆడ వాళ్లు పై అంతస్తుకు వెళ్ళడంతో నేనూ ఫెర్డీ ఒకరి పక్కన ఒకరం మిగిలిపోయాము. రాబోయే శుక్రవారం సాయంత్రం తన కోసం కచేరీ చేయడానికి లిమకార్డు వస్తుందని నేను వెళ్తే తను సంతోషిస్తాడని చెప్పాడు ఫెర్డీ నాకు.

"క్షమించాలి. నేను ఆరోజు బ్లాండ్స్ దగ్గరకి వెళ్తున్నాను" అన్నాను.

"ఏ బ్లాండ్స్?" అడిగాడు ఫెర్డీ.

"ససెక్స్‌లో టిల్బీ అనే ప్రదేశంలో ఉంటారు వాళ్లు" అన్నాను.

"నువ్వు వాళ్లనెరుగుదువని నాకు తెలియనే తెలియదు" అన్నాడు. నన్ను కొంచెం వింతగా చూసి నవ్వాడు. అందులో అతనికి నవ్వును కలిగించేదేముందో నా కర్థంకాలేదు.

"ఔను, ఎన్నో సంవత్సరాలుగా నేను వాళ్లనెరుగుదును. బస చేయడానికి చాలా బాగుంటుంది ఆ ఇల్లు" అన్నాను.

"ఎడాల్ఫ్ నాకు అల్లుడవుతాడు" అన్నాడు ఫెర్డీ.

"సర్ ఎడాల్ఫసా!"

"ఉపరాజును సూచిస్తున్నట్టుంది కదూ ఆ పేరు! కానీ అతనికి ఎడాల్ఫ్ అని నామకరణం చేసిన సంగతిని నీ దగ్గర దాచను నేను" అన్నాడు ఫెర్డీ రాబెన్‌స్టీన్.

"నాకు తెలిసిన వాళ్లందరూ అతని ఫ్రెడ్డీ అని పిలుస్తారు"

“అది నాకు తెలుసు. ఇంకా అతని భార్య మిరియామ్, మ్యూరియెల్ అని పేరుతో పిలిస్తే తప్ప పలకదనుకుంటాను”

“అతడు నీకు అల్లుడెట్లా అవుతాడు?”అని అడిగాను.

“ఎందుకంటే నా సోదరి హానా రాబెన్‌స్టీన్, సర్ అల్‌ఫ్రెడ్ బ్లాండ్ (మొదటి బారొనెట్)గా తనువు చాలించిన ఎల్ఫాన్స్ సహజ క్రమాన సర్ ఎడాల్ఫస్ బ్లాండ్ (రెండవ బారొనెట్)గా అయ్యాడు”.

“అయితే ఫోర్ట్‌లాండ్ ప్లేస్‌లో నివసించే ఫ్రెడ్డీ బ్లాండ్ యొక్క తల్లి, లేడీ బ్లాండ్ నీ సోదరి అన్నమాట” అన్నాను.

“ఔను, హానా నా సోదరి, మాలో అందరి కన్న పెద్దది ఆమె. ఆమె తన ఎనభయ్యో పడిలో వున్నా సంపూర్ణమైన మనోబలాన్ని, శక్తి సామర్థ్యాలనూ స్వంతం చేసుకుంది” అన్నాడు.

“ఆమెను నేను ఎప్పుడూ కలవనే లేదు”.

“నీ బ్లాండ్ స్నేహితులు కలుస్తారనుకుంటాను. ఆమె తన జర్మన్ ఉచ్చారణను ఎంత మాత్రం పోగొట్టుకోలేదు”

“నువ్వు వాళ్లను అసలే కలవవా?” అడిగాను నేను.

“ఇరవై సంవత్సరాలుగా నేను వాళ్లతో మాట్లాడలేదు. నేనటువంటి యూదున్ని, వాళ్లటువంటి ఇంగ్లీషు వాళ్లూనూ” అని నవ్వాడు ఫెర్డీ. “ఫ్రెడ్డీ, మ్యూరియెల్ అనేవి వాళ్ల పేర్లని నాకు జ్ఞాపకం ఉండదు. ఎడాల్ఫ్‌ను గానీ, మిరియామామ్‌ను గానీ మహా చెడ్డవేళల్లో చూసేవాణ్ని నేను. వాళ్లకు నా కథలు నచ్చలేదు. మేము కలుసుకోకపోవడమే మంచిదన్నట్టుగా అయింది. యుద్ధం మొదలై, నేను నా పేరు మార్చుకోకపోయేసరికి వాళ్లకు అది మరీ దుర్భరమై పోయింది. నా స్నేహితులు నన్ను ఫెర్డీ రాబెన్‌స్టీన్‌గా తప్ప వేరే పేరుతో ఊహించడానికి వాళ్లను అలవరచడం నా వల్ల కాదు. అదెప్పుడో జరగవలసింది. నా కిప్పుడు పూర్తిగా సంతృప్తికరంగా వుంది. ఒక స్మిత్‌గా కానీ, ఒక బ్రౌన్‌గా కానీ లేక ఒక రాబిన్‌సన్‌గా కాని ఉండాలని నేను కోరలేదు”.

పరిహాస ధోరణిలో మాట్లాడినప్పటికీ ఫెర్డీ కంఠంలో అతి స్వల్పమైన వ్యంగ్యం చోటు చేసుకుంది. దుర్భేద్యమైన అతని ఆంతర్యపుటడుగున తాను జయించిన యూదేతరుల పట్ల అతనికి గల విద్వేషం కనపడీ కనపడనట్టు ఛాయా మాత్రంగా గోచరించ నట్టనిపించింది. అంతకు ముందు కూడా తరచుగా నాకట్లాంటి భావం అస్పష్టంగా కలిగేది.

“అయితే ఆ ఇద్దరబ్బాయిలను నువ్వెరుగుదువన్నమాట” అన్నాను

“లేదు” అని జవాబిచ్చాడు ఫెర్డీ.

"పెద్దతని పేరు జార్జ్. అతను రెండోవాడైన హ్యారీ అంత తెలివైనవాడు కాదను కుంటాను. కానీ బాగా ఆకట్టుకునే యువకుడు. నువ్వతన్ని ఇష్టపడతావనుకుంటాను"

"ఇప్పుడెక్కడున్నాడతను?" అన్నాడు ఫెర్డీ

"మొన్నమొన్ననే ఆక్స్‌ఫర్డ్ నుండి బహిష్కారం పొందాడు. ఇప్పుడు ఇంటి దగ్గరే ఉంటున్నాడనుకుంటాను. హ్యారీ ఇంకా ఎటన్‌లోనే వుంటున్నాడు" అని జవాబిచ్చాను.

"జార్జ్‌ను లంచ్ కోసం నా వద్దకు తీసుకురాలేవా?"

"అడిగి చూస్తాను. సంతోషంగా వస్తాడనుకుంటాను"

"కొంచెం ఇబ్బందికరంగా తయారయ్యారని నా చెవుల దాకా వచ్చింది" అన్నాడు ఫెర్డీ.

"అలాగా, నాకు తెలియదు. అతడు సైన్యంలో చేరాలని వాళ్లు ఆశించారు గానీ అతడందులోకి పోలేదు. ఆర్మీని వాళ్లు కొంతవరకు ఉబలాటంతో కాంక్షించారు. కానీ దానికి బదులు ఆక్స్‌ఫర్డ్ వెళ్లాడు జార్జ్. కష్టపడలేదు సరికదా పెద్ద మొత్తాల్లో డబ్బును ఖర్చు చేసి జల్సాగా ఖుషీలు చేశాడు. అదంతా మామూలే" అన్నాను.

"ఎందుకోసం బహిష్కరించబడ్డాడు?" అడిగాను.

"ఏమో అంత ముఖ్యమైన విషయమేమీ కాదనుకుంటాను" అన్నాను.

ఆ సమయంలో మా విందుకర్త లేవడంతో మేము పైకి వెళ్లాము. ఫెర్డీతో సెలవు తీసుకుంటున్నప్పుడు అతడు తన చెల్లెలి మనవడిని గురించి మరిచిపోవద్దని చెప్పాడు" నాకు.

"ఫోన్ చేసి చెప్పు, బుధవారం అయితే నాకు బాగుంటుంది. లేకపోతే శుక్రవారమైనా సరే" అన్నాడు.

మర్నాడు నేను టిల్బీకి వెళ్ళాను. లేత గోధుమ వర్ణపు లేళ్లు తిరిగే విశాలమైన వినోదవనంలో నిలిచిన ఆ భవనం ఎలిజబెత్ కాలం నాటిది. దాని కిటికీల్లోంచి చూస్తే పరుచుకుంటున్న పచ్చిక మైదానాల విశాల దృశ్యం దృగ్గోచరమౌతుంది. బ్లాండ్‌లకు చెందిన భూమి కనుచూపు మేర దాకా వ్యాపించి ఉన్నట్టనిపించింది నాకు. తన కౌలుదార్లు సర్ ఎడాల్ఫస్‌ను అద్భుతమైన భూస్వామిగా భావించి ఉండాలి. ఎందుకంటే పొలాలను అంత పద్ధతిగా ఉంచడం నేనెప్పుడూ చూడలేదు. ధాన్యపు గోదాములూ, పశువుల కొట్టాలూ శుభ్రంగా ఉన్నాయి. పందుల దొడ్లు చూడముచ్చటగా ఉన్నాయి. పానశాలలు పాత ఇంగ్లిషు కాలపు నీటి రంగులలాగా ఉండి ఎస్టేట్‌లో అతడు నిర్మించిన విశ్రాంతి గృహాలు సౌకర్యాన్నీ, దృశ్యరామణీయకతనూ ప్రశంసనీయంగా సమ్మిళితం చేశాయి. ఈ ప్రాతిపదిక మీద ఆ స్థలాన్ని నడపడానికి అతనికి బోలెడంత డబ్బు ఖర్చయి వుండాలి. అదృష్టం కొద్దీ అతనికి డబ్బుంది. హుందాగా ఉన్న మహావృక్షాలు, ఇంకా తొమ్మిది రంధ్రాల గోల్ఫ్

మైదానంతో వినోదవనం ఒక ఉద్యానవనంలా సంరక్షింపబడి ఉంది. విశాలంగా వ్యాపించిన తోటలు ఆ పరిసర ప్రాంతాలకు గర్వకారణంలా ఉన్నాయి. ఎత్తయిన పైకప్పులను, నిలువుగా విభజింపబడ్డ కిటికీలను కలిగిన ఆ అద్భుత భవనం ఇంగ్లండులో అత్యంత ప్రఖ్యాతి నొందిన వాస్తుకారునిచే పునర్నిర్మింపబడి అభిరుచితో పరిజ్ఞానంతో దానికి సంపూర్ణంగా అమరిన శైలిలో లేడీ బ్లాండ్‌చేత అలంకరింపబడింది.

"ఇల్లు చాలా మామూలుగా ఉందనుకోండి. గ్రామ ప్రాంతంలో ఓ ఇంగ్లిషు గృహం అంతే" అన్నది మ్యూరియెల్ బ్లాండ్.

భోజనాల గది పాతకాలపు ఇంగ్లిష్ ఆటల తాలూకు చిత్రాలతో అలంకరింపబడి ఉంది. షిపెండేల్ కుర్చీలేమో నమ్మశక్యం కానంత విలువైనది. డ్రాయింగ్ రూమ్‌లో రెనాల్డ్స్, గేన్స్‌బరోలు గీసిన చిత్రపటాలూ, ఓల్డ్ క్రోమ్, రిచర్డ్ విల్సన్‌లు గీసిన ప్రకృతి దృశ్యాలూ ఉన్నాయి. దోమతెర మంచం ఉన్న నా (నాకు కేటాయించిన) పడక గదిలో కూడా బిర్కెట్ పాస్టర్ గీసిన వాటర్ కలర్ చిత్రాలున్నాయి. అదంతా చాలా రమణీయంగా, బస చేయడానికి కన్నుల పండువుగా ఉంది. కానీ గమ్మత్తేమిటంటే, తాము ఆశించిన ప్రభావం పూర్తిగా లోపించిందని మ్యూరియెల్ బ్లాండ్ తెలుసుకుంటే ఆ విషయం ఆమెకు అన్నిటి కన్న ఎక్కువ ఆవేదన కలిగించి ఉండేది. అది ఇంగ్లిషు వాళ్ల గృహం కాదని ఒక్క క్షణంలో తెలిసిపోతుంది. ప్రతి వస్తువూ ఉమ్మడి ప్రణాళికను దృష్టిలో పెట్టుకుని జాగ్రత్తగా ఎంపిక చేసుకొనబడిందనే భావం కలుగుతుంది మనకు. వాళ్ల పూర్వీకుడొకాయన దేశాటనం నుండి తిరిగి వస్తూ తెచ్చిన పెద్ద పెద్ద అకాడమీ చిత్రపటాలు భోజనాల గదిలో వేలాడదీసి ఉండటం, ఇంకా వాళ్ల అత్త ఒకామె గీసిన వాటర్ కలర్ చిత్రాలు డ్రాయింగ్ రూమ్‌లో మనోహరంగా రెపరెపలాడడం మన దృష్టిలో పడవు. అంత వికృతంగా లేని విక్టోరియా కాలపు సోఫా ఒకటి ఎవరికీ తొలగించాలనే ఊహ రానీయని విధంగా ఎప్పుడూ అక్కడ పడి వుంటుంది. గొప్ప ప్రదర్శన జరిగే రోజుల్లో అవివాహిత అయిన కుమార్తె ఎంతో శ్రమపడి తయారు చేసే కుట్టు పని కుర్చీలేవీ లేవక్కడ. అందం ఉంది గానీ అక్కడ భావస్ఫూర్తి లేదు.

అయినప్పటికీ అక్కడ ఎంత సౌకర్యంగా వుంటుందని! మననెంత బాగా చూసుకుంటారు! బ్లాండ్‌లు ఎంతటి హృదయపూర్వకమైన స్వాగతమిస్తారు మనకు! మనుషులను వాళ్లు నిజంగా ఇష్టపడతారనిపిస్తుంది. వాళ్ళు కరుణామయులూ, ఉదార స్వభావులూనూ. అతిథి సత్కారం చేస్తున్నప్పటి కంటే మరెప్పుడూ వాళ్లు ఎక్కువ ఆనందంగా ఉండరు. ఆ ఆస్తిని వాళ్లు స్వంతం చేసుకుని ఇరవై సంవత్సరాల కంటె ఎక్కువ కాకపోయినా తమను తాము పరిసరాలకు అనుగుణమైన రీతిలో బలంగా స్థిరపరచుకున్నారు. ఎస్టేటును

నడిపించే నిపుణ విధానంలో, ఇంకా రీవీలో తప్ప శతాబ్దాలుగా వాళ్లక్కడ స్థిరపడి పోలేదని సూచించడానికేమీ లేదు.

ఫ్రెడ్డీ ఎటన్‌లో ఆక్స్‌ఫర్డ్‌లో ఉండేవాడు. ఇప్పుడతని వయస్సు యాబయ్యేళ్లకు ఒకటి రెండు సంవత్సరాలు ఎక్కువ ఉంటుంది. అతడు మౌన ప్రవర్తనతో వినయంగా, హుందాగా – కానీ కొంచెం ముభావంగా ఉంటాడు. చాలా చురుకైన వాడు కూడా అని నా ఊహ. అతనిలో గొప్ప శోభ వుంటుందికానీ అది ఇంగ్లిషు శోభ కాదు. నెరిసిన తల వెంట్రుకలు, చిన్నగా ముందుకు పెరిగిన తెల్లగడ్డం, నల్లని చిన్న కళ్ళు ఇంకా చిలక ముక్కు ఉంటాయతనికి. సగటు మనిషి కంటె కొంచెం ఎక్కువ ఎత్తుంటాడు. అతన్ని చూడగానే హోదాగల విదేశీ దూతగా ఊహిస్తారే తప్ప ఒక యూదునిగా మాత్రం భావించరని నా ఉద్దేశం. అతడు గుణవంతుడే కాని గమ్మత్తేమిటంటే జీవితంలో విజయాన్ని సాధించినప్పటికీ స్వల్పంగా బాధామయ ఏకాంతం తాలూకు ప్రభావాన్ని కనిపింపజేస్తాడు. అతని విజయాలు ఆర్థికపరమైనవీ ఇంకా రాజకీయ పరమైనవీనూ. ఆటల్లో అతనికెంత పట్టుదల ఉన్నప్పటికీ అతడసలే రాణించలేదు. చాలా సంవత్సరాలు కుక్కలను తీసుకుని వేటకు వెళ్ళేవాడు. కానీ అతనికి స్వారీ చేయడం బాగా రాదు. వయసు మీరినతనమూ, వ్యాపారపుటొత్తిడీ అతన్ని వేట మానేసేలా చేశాయని తనను తాను సమాధాన పరచుకున్నప్పుడు అతనికి పెద్ద బరువు తీరినట్టు అనిపించి ఉంటుందని నేననుకుంటాను. ఫ్రెడ్డీ వేట ఎక్కువగా చేసేవాడు. దానికోసం ఎన్నో గొప్ప విందులు చేశాడు కానీ అతడు మంచి వేటకాడు కాలేకపోయాడు. తన తోటలో గోల్ఫ్ మైదానం ఉన్నప్పటికీ అందులో అతడొక మామూలు ఆటగాడు కావడం కన్న ఎక్కువ సాధించిందేమీ లేదు. ఇంగ్లండ్‌లో వీటన్నిటికీ ఎంత ప్రాధాన్యం ఉందో అతనికి బాగా తెలుసు కనుక తన అసమర్థత అతనికి సహించరాని నిరాశను కలిగించింది. అయినా జార్జ్ దాన్ని భర్తీ చేస్తాడు.

గోల్ఫ్ బాగానే ఆడుతాడు జార్జ్. టెన్నిస్ తన ఆట కాకపోయినా సగటు ఆటగాళ్ళకంటే ఎంతో బాగా ఆడతాడు. అతనికి తుపాకీ పట్టుకోగలిగే వయసు రాగానే బ్లాండ్‌లు తుపాకీ పేల్చడం నేర్పించారు. జార్జ్ తుపాకీతో బాగా హంటింగ్ చేస్తాడు. రెండు సంవత్సరాల వయసప్పుడు వాళ్లతన్ని చిన్నగుర్రం మీద కూచోబెట్టారు. ఫ్రెడ్డీకి తాను గట్టి పట్టుదలతో నక్కను వెంటాడుతూ వేటాడే సమయాల్లో కడుపులో తిప్పినట్టే వేట అనేది ఒక నరకయాతన అయ్యేది. కానీ ఆ పిల్లవాడు గుర్రం మీద కూచోవడాన్ని చూస్తూ ఆ కుర్రాడు కంచెను సమీపించగానే ఫ్రెడ్డీకి అట్లాంటి భావం కాకుండా ఎంతో ఉత్సాహం కలిగేది. జార్జ్ సన్నగా, పొడుగ్గా ఉంటాడు. ఉంగరాలు తిరిగిన ఆ లేత గోధుమ వర్ణపు వెంట్రుకలు సన్నగా వుంటాయి. ఇంకా నీలిరంగు కళ్లతో అతడు యవ్వనంలో వున్న ఇంగ్లిషు వ్యక్తిని సంపూర్ణంగా పోలి వుంటాడు. అతనిలో వాళ్ల వంశం తాలూకు ఆహ్లాదకరమైన

కలుపుగోలుతనం ఉంటుంది. అతని ముక్కు కొంచెం కండ కలిగి వున్నప్పటికీ చక్కగా తీర్చిదిద్దినట్టుంటుంది. పెదాలు కొంచెం పెద్దగా ఉన్నా పళ్లు అందంగా వుంటాయి. నున్నని ఆ చర్మం ఏనుగు దంతంలా తెల్లగా వుంటుంది. తన తండ్రికి జార్జ్ అత్యంత ప్రియమైన వాడు. హ్యారీ కొంచెం పొట్టిగా, దృఢంగా తన వయసుకు మించిన పెద్ద భుజాలతో, చురుకుదనాన్ని ప్రతిబింబించేలా మెరిసే నల్లని కళ్లతో, నల్లని దళసరి వెంట్రుకలతో – ఇంకా పెద్ద ముక్కుతో తన జాతిని ప్రదర్శించేలా ఉంటాడు. అతనితో కటువుగానూ, తరుచూ అసహనంగానూ ఉండే ఫ్రెడ్డీ జార్జ్ పట్ల మాత్రం పట్టువిడుపును కలిగి వుంటాడు. హ్యారీకి తెలివీ, చొరవా వున్నాయి. కనుక వ్యాపారంలోకి పోగలడు. కానీ జార్జ్ వాళ్లకు వారసుడు. అతడొక మర్యాదస్తుడైన ఆంగ్లేయుడు.

తండ్రి తనకు జన్మదిన కానుకగా ఇచ్చిన కారులో నన్ను తీసుకెళ్లాడు జార్జ్. అతడు చాలా వేగంగా నడపడంతో మేము మిగతా ఆహూతులకంటే ముందుగా చేరుకున్నాము. శోభాయమానమైన గంధపు చెట్టు కింద టీలు పెట్టుకుని లాన్‌లో కూర్చున్నారు బ్లాండ్ దంపతులు.

"అన్నట్టు ఆ మధ్య ఒక రోజున నేను ఫెర్డీ రాబెన్‌స్టీన్‌ను కలిశాను. తనతో కలిసి భోజనం చేయడానికి జార్జ్‌ను తీసుకురావలసిందిగా అడిగాడు నన్ను" అన్నాను నేను.

ఆహ్వానాన్ని గురించి తోవలో జార్జ్‌కి చెప్పలేదు నేను. ఎందుకంటే వాళ్ల మధ్య ఏదైనా కుటుంబ తగాదా ఉండి ఉంటే అతని తల్లిదండ్రులతో కూడా మాట్లాడడం మంచిది కదా అనుకున్నాన్నేను.

"అసలీ ఫెర్డీ రాబెన్‌స్టీన్ ఎవరు?" అన్నాడు జార్జ్.

మానవ దివ్యత్వం ఎంత అశాశ్వతమైనది! ఒక తరం వెనుక అట్లాంటి ప్రశ్న వికృతంగా కనిపించి ఉండేది.

"అతడు నీకు తాత అవుతాడు" బదులు పలికాను నేను.

మొదట నేను మాట్లాడగానే తండ్రి నుండి తల్లికి ఒక చూపు పాకింది.

"ఆయనొక భయంకరమైన ముసలి పీనుగు" అంది మ్యూరియెల్.

"జార్జ్ పుట్టక ముందే కచ్చితంగా తెగిపోయిన బంధుత్వాలను పునరుద్ధరించడానికి జార్జ్ కెలాంటి అవసరం లేదనుకుంటాను"అన్నాడు ఫ్రెడ్డి.

"ఏమైనా కబురునైతే చేరవేశాను నేను" నన్ను కొంచెం చిన్నబుచ్చినట్టు ఫీలవుతూ అన్నాను నేను.

"ఆ ముసలి ఘటాన్ని చూడదల్చుకోలేదు నేను" అన్నాడు జార్జ్

ఇతర అతిథులు రావడంతో మా సంభాషణ ఆగిపోయి కొద్దిసేపైన తర్వాత జార్జ్ తన ఆక్స్‌ఫర్డ్ మిత్రునితో గోల్ఫ్ ఆడటానికి వెళ్లిపోయాడు.

మర్నాటి దాకా ఆ విషయం మళ్లీ ప్రస్తావనకు రాలేదు. ఉదయం పూట నేను ఫ్రెడ్డీ బ్లాండ్‌తో ఆడిన ఒక రౌండ్ టెన్నిస్ నాకు సంతృప్తికరంగా లేదు. మధ్యాహ్నం పూట మళ్లీ చాలా సెట్లు ఆడి డాబా మీద మ్యూరియెల్‌తో నేను కూర్చున్నాను. ఇంగ్లండులో వాతావరణం ఎంత చెడ్డదిగా ఉంటుందంటే ప్రపంచంలోని మరే ప్రదేశపు రోజు కన్నా ఎక్కువ అందంగా ఉంటేనే ఆ రోజును ఇంగ్లండ్‌లో అందమైన రోజుగా పరిగణించడం సబబుగా ఉంటుంది. ఈ జూన్ మాసపు సాయంకాలం అద్భుతంగా ఉంది. నీలాకాశంలో మబ్బులు లేవు. పిల్లగాలి హాయి గొల్పుతూ మధురంగా ఉంది. మా ముందు పచ్చని పచ్చిక మైదానాలూ, వృక్షాలూ వ్యాపించి వున్నాయి. అల్లంత దూరాన చిన్న గ్రామపు చర్చి యొక్క ఎర్రని పైకప్పులు కనపడుతున్నాయి. బ్రతికి ఉండడమే పరమానంద కరమన్నట్టుగా ఉందా రోజు. కవిత్వం తాలూకు విడిపంక్తులు నా స్మృతిలో అస్పష్టంగా ఊగిసలాడాయి. మ్యూరియెల్, నేను ఆ మాటా ఈ మాట్లాడుకున్నాం.

"ఫెర్డీతో జార్జ్ భోజనం చేయడాన్ని నిరాకరించినందుకు మీరు మమ్మల్ని భయంకరంగా ఊహించుకోలేదని ఆశిస్తాను నేను. గొప్పవాళ్లతో తప్ప మామూలు వాళ్లతో స్నేహం చేయడం ఇష్టంలేని దౌర్భాగ్యుడు ఫెర్డీ. అంతేనా కాదా?" అన్నదామె హఠాత్తుగా.

"మీకట్లా అనిపిస్తుందా? నాతో అతనెప్పుడూ చాలా స్నేహంగా ఉంటాడు" అన్నాను నేను.

"ఇరవై సంవత్సరాలుగా మా మధ్య మాటల్లేవు. యుద్ధకాలంలో అతని ప్రవర్తనకు ఫ్రెడ్డీ అతన్ని మన్నించనే లేదు. ఏ మాత్రం దేశాభిమానం లేనివాడిలా అనిపించాడు ఫెర్డీ నాకు. దేనికైనా ఒక హద్దుండాలి. గగుర్పాటును కలిగించే తన జర్మన్ పేరును వదులుకోవడానికి అతడు ససేమిరా ఒప్పుకోలేదని మీకు తెలుసు కదా. పార్లమెంట్‌కు వెళ్ళే ఫ్రెడ్డీకి ఆ ఆయుధాల రవాణా ఇంకా అట్లాంటి గొడవంతా ఎంతో భరింపరానిదై పోయింది. జార్జ్‌ను కలవాలని అతడెందుకనుకుంటున్నాడో నాకర్థం కావడం లేదు. జార్జ్‌కు అతడేమీ కాజాలడు"

"అతనికి వృద్ధాప్యం వచ్చింది జార్జ్, హారీలు అతనికి మనవలు మరి. ఎవరికో ఒకరికి ఫెర్డీ తన ధనాన్ని వదిలిపోవలసిందే కదా" అన్నాను.

"అతని డబ్బును మేము తీసుకోలేమనుకుంటా" అంది మ్యూరియెల్ చల్లగా.

ఫెర్డీ రాబెన్‌స్టీన్‌తో జార్జ్ భోజనానికి వెళ్లే విషయమై నేను రవ్వంత కూడా లక్ష్యం చేయలేదనుకోండి. ఆ విషయాన్నంతటితో వదిలేయడానికి నేను పూర్తిగా సుముఖంగా ఉన్నాను. కానీ దాని గురించి బ్లాండ్ దంపతులు మాట్లాడుకున్నట్టు తెలుస్తూనే ఉంది. నేనేదో ఒక సమాధానం చెప్పాల్సి ఉందని మ్యూరియెల్‌కు తోచినట్టుంది.

"ఫ్రెడ్డీలో యూదుల రక్తం ఉందని మీకు తెలుసునాయె" అందామె.

నా వంక తీక్ష్ణంగా చూసింది. మ్యూరియెల్ ఒక రకంగా మంచి రంగున్న లావుపాటి స్త్రీ. ఆమెది భారీ శరీర ప్రకృతి కావడం వల్ల దాన్ని తగ్గించే ప్రయత్నింలోనే ఆమె చాలా సమయాన్ని గడిపేది. యవ్వనంలో ఉన్నప్పుడామె ఎంతో ఆకర్షణీయంగా ఉండేది. ఇప్పటికీ ఆమె ముచ్చటగా కనపడుతుంది. కానీ కొంచెం కొట్టొచ్చినట్టుండే గుండ్రని నీలి కళ్లు, కండ గల ఆమె ముక్కు, ఆ ముఖం యొక్క ఆకారం, మెడ వెనుక భాగం, ఉత్సాహంతో పొంగి పొర్లే ఆమె స్వభావం – ఇవన్నీ ఆమె జాతిని సూచిస్తాయి. ఎంత మంచి రంగున్న వెంట్రుకలున్నా ఏ ఇంగ్లిష్ వనితా ఆమెలా కనపడదు. అయినప్పటికీ ఆమె ఒక యూదేతర స్త్రీ అనిపించేలా రూపొందించబడింది.

"ఈ రోజుల్లో చాలా మందిలో ఆ రక్తం ఉంది" జాగ్రత్తగా సమాధానమిచ్చాను నేను.

"అది నిజమే. కానీ అనునిత్యం ఆ భావాన్ని పట్టుకుని వేలాడే అవసరం లేదు. అవునా? ఎంతైనా మేము అచ్చమైన ఇంగ్లిషు వాళ్లం. రూపంలో అయితేనేం, నడవడికలో అయితేనేం – ఇంకా ఏ విషయంలోనైనా జార్జ్‌కన్న ఎక్కువ ఇంగ్లిష్ తనం ఉన్న వాళ్లు వేరొకరుండరు. నేననేదేమిటంటే అంత మంచి ఆటగాడూ గట్రా అయిన జార్జ్ కేవలం దూరపు బంధువయినంత మాత్రాన ఒక యూదున్ని కలవాలనడంలో ధ్యేయమేమీ కనపడదు నాకు" అన్నది మ్యూరియెల్.

"ఈ కాలంలో యూదుల నెరగకుండా ఉండడం అనేది ఇంగ్లండులో ఎంతో కష్టమైనది. కాదంటారా?"

"అవుననుకోండి. లండన్‌లో ఎక్కువే వుంటారు. వాళ్లలో కొందరు చాలామంచి వాళ్లని నా ఉద్దేశం. వాళ్లెంతో కళాభిరుచి ఉన్న వాళ్లు. ఫ్రెడ్డీ నేనూ వాళ్లను ఉద్దేశపూర్వకంగా కలవకుండా ఉంటామనేటంత దూరం పోను నేను. అసలు నేనా విధంగా చేయను. కానీ నిజంగా మేమట్లాంటి వాళ్లను అంతగా ఎరగకపోవడం అనేది జరుగుతుందంతే. పోతే ఇక్కడ మేము తెలుసుకోవలసిన వాళ్లెవరూ లేరు" అన్నది మ్యూరియెల్.

సమాధాన పరిచే రీతిలో ఆమె మాట్లాడిన విధానాన్ని లోలోపల ఆశ్చర్యపూర్వకంగా ప్రశంసించకుండా ఉండలేకపోయాను. తను పలికిన ప్రతి మాటను ఆమె పూర్తిగా విశ్వసిస్తుందని ఎవరైనా చెప్తే నాకెంతమాత్రం ఆశ్చర్యం కలిగి ఉండేది కాదు.

"జార్జ్‌కి ఫెర్డీ తన ధనాన్ని వదిలే అవకాశముందని చెప్తున్నారు మీరు. బాగానే వుంది. కానీ ఆ ధనం అంత ఎక్కువగా ఉంటుందని ఎట్లాగూ నేను విశ్వసించను. యుద్ధానికి పూర్వమైతే అదొక మంచి సౌకర్యదాయకమైన సిరి. కానీ ఈ రోజుల్లో అది ఏమీ లేనట్టే లెక్క. పైగా జార్జ్ ఇంకొంచెం పెరిగాక రాజకీయాల్లోకి వెళ్తాడని ఆశిస్తున్నాం

మేము. ఒక రాబెన్‌స్టీన్ నుండి ధనం సంక్రమించడం తన పరగణాలో అతనికెలాంటి మంచిని చేకూర్చదని నా అభిప్రాయం".

"జార్జ్‌కు రాజకీయాల్లో అభిరుచి వుందా?" సంభాషణను మార్చడానికా అన్నట్టు అడిగాను.

"అవుననుకుంటాను. ఎట్లాగూ అతని కోసం కుటుంబ పరగణా కాచుకుని ఉంది. అది నిశ్చింతకరమైన కన్సర్వేటివ్ సీటు. పోతే ఫ్రెడ్డీ ఈ హౌస్ ఆఫ్ కామన్స్ యొక్క రంపపు కోతతో నిరంతరంగా నెట్టుకుపోవాలని ఎవరూ ఆశించరు."

మ్యూరియెల్ గొప్పలు పోతోంది. అప్పుడే ఆ పరగణాకు బ్లాండ్ కుటుంబీకులు ఇరవై తరాలుగా పోటీ చేస్తున్నట్టు మాట్లాడేస్తోంది. మొత్తానికి ఆమె అన్న మాటలు ఫ్రెడ్డీకి ఉన్న చిరకాలవాంఛ నెరవేరలేదని నాకు ప్రథమంగా సూచించాయి.

"జార్జ్ తన కాళ్లమీద తాను నిలబడే వాడయ్యే సరికి ఫ్రెడ్డీ హౌస్ ఆఫ్ లార్డ్స్‌కు వెళ్తాడనుకుంటాను" అన్నాను.

"పార్టీకి మేము బాగానే సేవ చేశాము" అన్నది మ్యూరియెల్.

మ్యూరియెల్ ఒక క్యాతలిక్ స్త్రీ. తను కాన్వెంటులో చదివినట్టు చెప్తూ, "ఆ నన్స్ ఎంత ముద్దొస్తారని! ఎప్పుడూ నేననేదేమిటంటే, కూతురు ఉండి వుంటే దాన్ని కూడా కాన్వెంటుకు పంపి వుండేదాన్ని" అని అంటుండేది తరచుగా. కానీ తన నౌకర్లు పెద్ద చర్చికి వెళ్లాలని ఆమె ఇష్టపడేది. ఆదివారపు సాయంత్రాలు వేడిగా లేని చేపకూరతో, ఇంకా ఐస్‌క్రీంతో మేం రాత్రి భోజనాలు కానిచ్చేవాళ్లం. నౌకర్లేమో చర్చికి వెళ్లేవాళ్లు. అప్పుడు మా కోసం నలుగురికి బదులు ఇద్దరే పని వాళ్లు భోజనాల కోసం కాచుక్కూచునే వాళ్లు. మా ముచ్చట్లు ముగిసే సరికి ఇంకా వెలుతురు వుంది. ఫ్రెడ్డీ, నేనూ సంధ్య చీకట్లో డాబా మీద చుట్టలు కాలుస్తూ పచార్లు చేయసాగాము. మ్యూరియెల్ తను నాతో చేసిన సంభాషణను గురించి అతనికి చెప్పి వుంటుంది. జార్జ్ తన తాతను చూడ్డానికి అతడు తెలిపిన అసమ్మతి ఫ్రెడ్డీనింకా ఇబ్బంది పెడుతున్నదేమో. కానీ ఆవిడకంటే చాకచక్యంతో అతడా విషయాన్ని మరింత పరోక్షంగా ఎదుర్కొన్నాడు. జార్జ్ గురించి తనకెంతో దిగులుగా వుందనీ, అతడు సైన్యంలో చేరడానికి నిరాకరించడం ఎంతో నిరుత్సాహంగా ఉందనీ చెప్పాడు.

"వాడు ఆ జీవితాన్ని ఎంతో ప్రేమించేవాడని నా ఊహ" అన్నాడు.

"ఇంకా ఆ గార్డు దుస్తుల్లో అతడు నిస్సందేహంగా అద్భుతంగా కనపడేవాడు" అన్నాను నేను.

"అవును, కనపడేవాడు కదా! ఎలా నిరాకరించాడో నాకు ఆశ్చర్యంగా వుంది" తెలివిగా బదులు పలికాడు ఫ్రెడ్డీ.

ఆక్స్‌ఫర్డ్‌లో పూర్తిగా సోమరిగా వుండేవాడు జార్జ్. తండ్రి అతనికి చాలా పెద్ద మొత్తంలో డబ్బు ఇచ్చినప్పటికీ భయంకరమైన అప్పుల్లో మునిగి అక్కణ్నుంచి వెళ్ళగొట్టబడ్డాడు.కానీ అతడెంతో కటువుగా మాట్లాడినప్పటికీ ఎప్పుడూ తంటాలు తెచ్చే తన కొడుకు పట్ల గర్వపడుతున్నట్టు కనపడింది నాకు. ఎటువంటి ఇంగ్లిష్ వాత్సల్యంతో కొడుకును ప్రేమిస్తున్నాడంటే జార్జ్ ఉజ్వలంగా వెలిగిపోతున్నాడని మనసులో పొంగిపోతున్నాడు.

"మీరెందుకు దిగులు చెందాలి? జార్జ్‌కు డిగ్రీ ఉన్నా లేకపోయినా మీరు దాన్ని నిజంగా లక్ష్యపెట్టడం లేదు గదా" అన్నాను నేను.

ఫ్రెడ్డీ చిన్నగా నవ్వాడు.

"నిజమే. నిజంగా నేను లక్ష్యపెడతాననుకోను. ఆక్స్‌ఫర్డ్ గురించి నేననుకునే ఒకే ఒక ముఖ్య విషయమేమిటంటే మనం అక్కడ చదివినట్టు ప్రజలకు తెలుస్తుంది. వాడి మూకలోని ఇతర యువకులకంటే జార్జ్ ఎంత మాత్రం ఎక్కువ పేట్రేగి పోలేదని చెప్పడానికి సాహసిస్తాను నేను. నేనాలోచిస్తున్నది వాడి భవిష్యత్తు గురించి. వాడెంతో సోమరిపోతు. సరదాగా ఆనందించడం తప్ప వాడు మరేమీ కోరుకున్నట్టు కనపడదు" అన్నాడు ఫ్రెడ్డీ.

"అతడింకా చిన్నవాడే కదా"

"రాజకీయాలంటే వాడికిష్టం లేదు. పోతే ఆటల్లో వాడెంత బాగున్నప్పటికీ వాటి పట్ల కూడా అంత శ్రద్ధ లేదు వాడికి. ఎక్కువ సమయాన్ని పియానో మీటడంలోనే గడుపుతాడు".

"అదైతే అపకారం లేని వినోదం" అన్నాను.

"అవును నిజమే. నాకేం అభ్యంతరం లేదు. కానీ ఎప్పటికీ వాడట్లా బేకారుగా తిరగలేడు కదా! చూడండి, ఈ ఆస్తంతా వాడిదవుతుందొకరోజు". ఫ్రెడ్డీ ఆ ప్రాంతాన్నంతా ఆవరించినట్టు కనపడేలా విసురుగా చేతుల్ని ఊపి సంజ్ఞ చేశాడు. కానీ ఇంకా అదంతా అతని స్వంతం కాలేదని నాకు తెలుసు. "తన బాధ్యతల్ని వహించడానికి వాడు యోగ్యుడవ్వాలని నాకెంతో ఆదుర్దాగా వుంది. వాడి తల్లి ఎన్నో ఆశలు పెట్టుకుంది వాడిమీద. కానీ నేను మాత్రం వాడు మర్యాదస్తుడైన ఇంగ్లిష్ మనిషై పోవాలని కోరుకుంటాను" అన్నాడు.

ఫ్రెడ్డీ ఏదో అనాలనుకొని మళ్లీ నేను దాన్ని విడ్డూరంగా భావిస్తానేమోనని సంకోచిస్తున్నాడా అన్నట్టు నా వైపు ఓ ఓరచూపు విసిరాడు.కానీ రచయిత కావడం వల్ల ఒక లాభముంది. ఎందుకంటే ప్రజలు మన్ననతో చూస్తారు కాబట్టి తమ సమానులతో చెప్పుకోని విషయాలను చాలాసార్లు మనతో చెప్పుకుంటారు. ఏమైనా కానీ చెప్పాలని నిశ్చయించుకుంటున్నట్టున్నాడు ఫ్రెడ్డీ.

"ఉదాత్తమైన జీవితాశయాన్ని పరిపూర్ణంగా సిద్ధింపజేసుకోవడం అనేది ఎస్టేటుదారైన ఒక ఇంగ్లిష్ పెద్దమనిషికంటే బాగా ప్రపంచంలో మరెక్కడా ఎవరూ చేయరని నాకో అభిప్రాయముంది" అన్నాడు ఫ్రెడ్డీ. "అట్లాంటి వాడి జీవితంలో కళాఖండపు సౌందర్యం ఉంటుందని అనుకుంటాను నేను" అన్నాడు మళ్లీ.

కట్టల కొద్దీ డబ్బును భద్రంగా అమెరికన్ బాండ్ల రూపంలో పెట్టుబడి పెట్టందే ఈ రోజుల్లో మర్యాదస్తుడైన ఇంగ్లిష్ గ్రామీణుడికి అట్లాంటిదేదీ సాధ్యం కాదని తలపుకు రాగానే నేను నవ్వకుండా ఉండలేక, సానుభూతితో మందహాసం చేశాను. పెట్టుబడిదారైన ఈ యూదుడు అట్లాంటి మనోహర స్వప్నాన్ని ప్రతిష్ఠించుకోవడం ఓ విధంగా నన్ను కదిలించింది.

"వాడొక మంచి భూస్వామి కావాలనీ, దేశ వ్యవహారాల్లో పాలుపంచుకోవాలనీ, ఇంకా వాడొక నిపుణుడైన ఆటగాడు కావాలనీ కోరుకుంటాను నేను" అన్నాడు.

'చవట వెధవ' అని లోపలే అనుకున్నాను. కానీ, "అయితే జార్జ్ కోసం ఇప్పుడు మీ ఏర్పాట్లేమిటి?" అని అడిగాను.

"వాడికి ఎంబెస్సీ కార్యాలయంలో పనిచేయాలనే కాంక్ష ఉన్నట్టుంది. జర్మనీకి వెళ్లి ఆ భాషను నేర్చుకోవాలన్నట్టు చూచాయగా మాకు సూచించాడు".

"చాలా మంచి ఆలోచన అనిపిస్తుంది నాకు" అన్నాను.

"ఎందుకోగానీ మ్యూనిక్ వెళ్లాలనే కోరిక వాడి తలలో చోటు చేసుకుంది" అన్నాడు.

"అది చాలా మంచి ప్రదేశం" అన్నాను నేను.

మర్నాడే నేను లండన్‌కు తిరిగి వెళ్లాను. అక్కడ చేరిన కొద్దిసేపటికే ఫెర్డీ రాబెన్‌స్టీన్‌కు ఫోన్ చేశాను.

"నువ్వు నన్ను క్షమించాలి. బుధవారం నాడు నీతో భోజనం చేయడానికి జార్జ్ రావడం లేదు" అన్నాను.

"శుక్రవారం వస్తాడా?"

"శుక్రవారం కూడా రావడం లేదు" – ఇక ముసుగులో గుద్దులాటలో లాభం లేదనుకుని" "అసలు సంగతేమిటంటే, అతడు నీతో భోజనం చేయడం పట్ల తన వాళ్లు శ్రద్ధ చూపడం లేదు" అన్నాను.

ఒక్క క్షణం నిశ్శబ్దం చోటుచేసుకుంది. తర్వాత, "ఓహో, అదా సంగతి! ఇంతకూ బుధవారం నాడు నువ్వొస్తున్నావా మరి?" అన్నాడు.

"ఔను, రావాలనే అనిపిస్తుంది" అని జవాబిచ్చాను.

ఆ విధంగా బుధవారం రోజు ఒకటిన్నరకు నేను కర్జన్ వీధికి నడక సాగించాను. తాను అలవర్చుకున్న విస్తృతమైన సహృదయతతో నాకు స్వాగతమిచ్చాడు ఫెర్డీ. బ్లాండ్‌ల

గురించి అతడు ఊసెత్తలేదు. డ్రాయింగ్ రూమ్‌లో కూర్చున్నాము మేము. ఆ ఇంటి మనుషులకు అందమైన వస్తువుల పట్ల ఎంతటి మక్కువ ఉందా అని ఆశ్చర్యపోకుండా ఉండలేకపోయాను. ఆ గది ఈ కాలపు రివాజు అనుమతించే కంటే ఎక్కువగా మనుషులతో నిండిపోయింది. ఆ బంగారు నశ్యపు డబ్బాలూ, ఫ్రెంచ్ పింగాణీ నాది కాని అభిరుచిని ప్రతిబింబించాయి. కానీ అవి నిస్సందేహంగా ఏరి ఏరి ఎంపిక చేసిన వస్తువులు. పదిహేనవ లూయీ కాలపు చెక్క సామానుల సెట్టు అమోఘమైన విలువ చేసేది వుంది. గోడలకు ఉన్న లాంక్రెట్‌పేటర్, వాటోల చిత్రాలు నన్నంతగా ఆకర్షించకపోయినా వాటి అంతర్గత వైభావాన్ని గుర్తించకపోలేదు నేను. ఈ వయసుమీరిన ప్రపంచీకుడికి అదొక అనువైన వాతావరణం. అతని కాలానికది బాగా సరిపోయింది. హఠాత్తుగా తలుపులు తెరుచుకుని జార్జ్ వచ్చినట్టు వర్తమానం అందింది. నా ఆశ్చర్యాన్ని చూసిన ఫెర్డీ విజయపూర్వకమైన మందహాసం చేశాడు.

"చివరికి నువ్వు రాగలిగినందుకు నాకెంతో సంతోషంగా వుంది" – జార్జ్‌తో చేయి కలుపుతూ అన్నాడు.

ఆరోజే మొదటిసారిగా చూసిన తన మనుమడిని అతడాహ్వానించడం చూశాను. జార్జ్ చాలా మంచి బట్టలు తొడుక్కుని ఉన్నాడు. నల్లని చిన్నకోటూ, చారల ప్యాంటూ, ఇంకా ఆ రోజుల్లో ఫ్యాషన్‌గా ఉన్న బూడిద రంగు వేస్ట్ కోటూ వేసుకున్నాడు. సన్నగా పొడుగ్గా ఉండి, పొట్ట కొంచెం లోపలికి పోతున్నట్టుగా ఉంటే తప్ప దాన్ని శోభాయమానంగా ధరించలేము. జార్జ్ యొక్క దర్జీ ఎవరో, ఇంకా బట్టలు కుట్టే సామగ్రి కోసం అతడెవరి దగ్గరకి వెళ్లాడో ఫెర్డీకి కచ్చితంగా తెలిస్తే వాళ్లను మెచ్చుకునేవాడని నాకు గట్టి నమ్మకం., సొగసుగా తేటగా వుండి, అందమైన దుస్తులు తొడుక్కున్న జార్జ్ నిస్సందేహంగా ఎంతో ఆకర్షణీయంగా కనబడ్డాడు. భోజనాలకు కూర్చున్నాం మేము. ఫెర్డీకి సాంఘిక మర్యాదలు క్షుణ్ణంగా తెలుసు కనక ఆ అబ్బాయి మనసు తేలికపడేలా అతడు వ్యవహరించాడు. కానీ జార్జ్‌ను ఫెర్డీ జాగ్రత్తగా బేరీజు వేయడం గమనించాను నేను. ఎందుకో తెలియదు కానీ అతడు యూదుల కథలను చెప్పడం ప్రారంభించాడు. ఉత్సాహంతో, అద్భుతమైన ధ్వన్యనుకరణతో వాటిని చెప్పాడు. జార్జ్ కందిపోవడం చూశాను నేను. ఆ కథలను విని నవ్వినప్పటికీ ఆ నవ్వులో కలవరపాటు కనపడింది. ఫెర్డీ ఎందుకంత యుక్తిహీనంగా ప్రవర్తించాడా అని ఆశ్చర్యం కలిగింది నాకు. అతడు కథ తర్వాత కథ చెప్తూ జార్జ్‌ను పరికిస్తున్నాడు. అతడింక అసలే ఆపడా అన్నట్లు కనిపించింది. ఒకవేళ ఆ కుర్రాడి స్పష్టమైన కలవరపాటులో ఫెర్డీ ఒక పైశాచిక ఆనందాన్ని పొందుతున్నట్టు నేను గాని గ్రహించలేకపోయానా అని ఆలోచించాను. చివరికి మేము డాబా మీదికి వెళ్లాము. విషయాన్ని తేలికపరిచే ఉద్దేశంతో ఫెర్డీని నేను పియానో వాయించమని అడిగాను. అతడు

మూడు నాలుగు చిన్న వాల్స్‌లను వాయించాడు మా కోసం. తన మహత్తరమైన మృదుత్వాన్ని గానీ, లయజ్ఞానాన్ని గానీ అతడెంత మాత్రం కోల్పోలేదు. తర్వాత అతడు జార్జ్ వైపు తిరిగాడు.

"నువ్వు వాయిస్తావా?" అని అడిగాడు జార్జ్‌ను.

"కొద్దిగా"

"ఏదో ఒకటి వాయించవా మరి"

"నేను శాస్త్రీయ సంగీతాన్ని మాత్రమే వాయిస్తాను. అది మీకు ఆసక్తిని కలిగిస్తుందనుకోను" అన్నాడు జార్జ్.

ఫెర్డీ చిన్నగా నవ్వాడు. కానీ అతణ్ని బలవంతం చేయలేదు. నాకు వెళ్లే వేళయిందని చెప్పాను. జార్జ్ నన్ను అనుసరించాడు.

"అబ్బ, ఎంతటి మురికి ముసలాడు! ఆ యూదుడి కథలంటే నా కసహ్యం" అన్నాడు జార్జ్ మేము వీధిలోకి వస్తూనే.

"అవి అతని గొప్ప ఆకర్షణలు. అతనెప్పుడూ ఆ కథలను చెప్తుంటాడు" అన్నాను.

"మీరు ఒక యూదుడై ఉంటే అలానే చెప్తారా" అన్నాడు

నేను బుజాలెగరేశాను.

"అసలింతకూ నువ్వు భోజనానికెలా వచ్చావ్?" అని అడిగాను జార్జ్‌ను.

అతడు మందహాసం చేశాడు. హాస్యరసం ఉన్న మెత్తని హృదయపు మనిషి అతడు. తన తాత కలిగించిన చిన్న చిరాకును వదిలించుకున్నాడు.

"నానమ్మ దగ్గరికి వెళ్లాడాయన. మా నానమ్మ మీకు తెలియదు కదూ!" అన్నాడు జార్జ్.

"తెలియదు"

"నాన్నను ఆమె ఎటన్‌లోని ఒక చిన్న పిల్లాడిలా చూస్తుంది. నేను ఫెర్డీ తాతతో భోజనానికి వెళ్లాలని నానమ్మ చెప్పింది. ఇకపోతే నానమ్మ ఏం చెబితే అది చెల్లుతుంది"

'ఓహో. అలాగా" అన్నాను.

ఒకటిరెండు వారాల తర్వాత జార్జ్ జర్మన్ భాషను నేర్చుకోవడానికి మ్యూనిక్ వెళ్లాడు. అప్పుడు నేనొక ప్రయాణం మీద వెళ్ళడం జరిగింది. తరువాతి వసంతకాలం దాకా నేను మళ్లీ లండన్‌కు రాలేదు. లండన్ చేరుకున్న కొంత కాలానికి ఒక విందులో నేను మ్యూరియల్ బ్లాండ్ పక్కన కూర్చున్నాను. అప్పుడు జార్జ్ గురించి ఆమెను అడిగాను.

"వాడింకా జర్మనీలోనే ఉన్నాడు" అన్నదామె.

"అతడు యుక్త వయస్కుడవుతున్న సందర్భంగా టిల్బీలో మీరు గొప్ప వేడుక జరుపబోతున్నట్లు పేపర్లో చదివాను" అన్నాను.

"కౌలుదార్లను పిలవబోతున్నాము మేము. వాళ్లేమో జార్జ్‌ను సత్కరిస్తున్నారు" అంది.

ఆమె ఎప్పటికంటె తక్కువ ఉత్సాహంగా వుంది. కానీ నేను దాని పట్ల ఎక్కువ ధ్యాసనివ్వలేదు. ఆమె శ్రమపూరితమైన జీవితాన్ని గడిపింది. కనుక బ్రతుకులో అలసిపోయి వుంటుంది. తన కొడుకును గురించి మాట్లాడ్డం ఆమెకు ఇష్టమని తెలుసు నాకు. అందుకే నేను మాట్లాడసాగాను.

"జర్మనీలో జార్జ్ కాలాన్ని చాలా బాగా గడిపివుంటాడనుకుంటాను" అన్నాను.

కొంచెం సేపటి దాకా జవాబివ్వకపోవడంతో ఆమె వైపు ఓ చూపు వేశాను. ఆమె కళ్లు నీటితో నిండి ఉండటం నాకాశ్చర్యాన్ని కలిగించింది.

"జార్జ్‌కు పిచ్చెక్కిందేమోనని భయంగా ఉంది నాకు" అన్నది.

"ఏమిటి మీరంటున్నది!"

"భయంకరమైన దిగులుతో ఉన్నాము మేము. ఫ్రెడ్డీ ఎంత కోపంగా ఉన్నాడంటే ఆ విషయాన్ని గురించి చర్చించడమే లేదు. మేమేం చేయబోతున్నామో నాకే తెలీదు" అంది.

భాషను నేర్చుకోవడానికి జర్మనీకి పంపబడి జర్మన్ కుటుంబంతో ఉంచబడ్డ చాలా మంది ఇంగ్లిష్ వాళ్లలాగానే జార్జ్ ఆ ఇంటావిడ కూతురు ప్రేమలో పడి ఆమెను పెళ్లి చేసుకోదలిచాడేమోనని వెంటనే అనిపించింది నాకు. బ్లాండ్‌లు అతనికి గొప్ప సంబంధపు పెళ్లి చేయాలనే ఉద్దేశంతో ఉన్నారని నాకో గట్టి అనుమానం.

"ఎందుకు? అసలేం జరిగింది?" అడిగాను.

"పియానో వాద్యకారుడు కాదల్చుకున్నాడు వాడు"

"ఏమిటీ?"

"అవును, పియానో వాద్యకారుడిగానే జీవితంలో స్థిరపడతాడట"

"అసలతని తలలోకి అలాంటి ఉద్దేశాన్నెవరు చొప్పించారు?"

"భగవంతుడికే తెలియాలి. మాకు దాన్ని గురించి ఏమీ తెలియదు. పరీక్ష కోసం కష్టపడుతున్నాడనుకున్నాం మేము. వాడిని చూడ్డానికి వెళ్ళాను నేను. బాగున్నాడో లేదో తెలుసుకోవాలనుకున్నాను. అబ్బ, ఎలాగో కనిపించాడు. ఎంత చురుగ్గా వుండేవాడని? ఏడ్చేదాన్నే. పరీక్ష రాయబోవడం లేదనీ, ఎప్పుడూ తన కట్లాంటి ఉద్దేశమే లేదనీ చెప్పాడు. ఎంబెస్సీ కార్యాలయంలో పనిచేసే సంగతి చెప్తే మేమతణ్ని జర్మనీ వెళ్లడానికి అనుమతిస్తామనీ తద్వారా తాను సంగీతాధ్యయనం చేసుకోగలుగుతాడనీ అలా చెప్పాడట వాడు"

"కానీ అతనిలో ప్రజ్ఞ ఉందా?" అడిగాను.

"వాడికది ఇక్కడున్నప్పుడూ లేదు, అక్కడున్నప్పుడూ లేదు. ఒకవేళ జార్జ్‌కు పాడెర్యూస్కీ అంతటి ప్రజ్ఞాపాటవాలు ఉన్నా మేము వాణ్ని దేశం మీద బేకారుగా తిరుగుతూ సంగీత

కచేరీలు చేయనివ్వలేము. నేనెంతో కళాదృష్టి కలదాన్ని. ఫ్రెడ్డీ కూడా అంతే. సంగీతమంటే మాకు ప్రాణం. మా కెందరో సంగీతపరులు తెలుసు. దీన్నెవరూ కాదనలేరు. కానీ జార్జికు ఎంతో గొప్ప హోదా రావాలి. వేరే ప్రశ్నే లేదు. మా మనసులు వాడు పార్లమెంట్‌కు వెళ్లడం పట్ల కేంద్రీకృతమై ఉన్నాయి. వాడెంతో ఐశ్వర్యవంతుడయ్యే రోజొస్తుంది. వాడు పొందలేనిదేదీ లేదు".

"ఇదంతా అతనికి చెప్పారా మీరు?" అని అడిగాను.

"చెప్పాననుకోండి. నా మాటలకు వాడు నవ్వాడు. తన తండ్రి హృదయం పగిలి పోతుందని చెప్పాను. "నాన్నకు హ్యారీ ఉన్నాడు కదా" అన్నాడు వాడు. హారీ కోసం నా శ్రమనంతా ధారపోస్తాననేది నిజమే. వాడు చాలా తెలివైనవాడు. కానీ వాడు వ్యాపారంలోకి పోవాలని ఎప్పుడో అనుకున్నాం. నేను వాడి తల్లినైనప్పటికీ జార్జ్‌కున్నన్ని అవకాశాలు వాడికి లేవని నాకు స్పష్టంగా తెలుసు. వాడేమన్నాడో తెలుసా? తండ్రి తనకు వారానికి ఐదు పౌండ్ల చొప్పున ఖాయం చేస్తే ఆస్తినంతా హ్యారీకి వదులుతాననీ, హ్యారీ తన తండ్రికీ, జమీందారీ తనానికీ – ఇంకా అన్నిటికీ వారసుడు కావచ్చుననీ అన్నాడు. ఇది మరీ విడ్డూరం. రుమేనియా రాకుమారుడు సింహాసనాన్నే వదులుకున్నప్పుడు తాను జమీందారీతనాన్ని ఎందుకు వదులుకోకూడదో తెలియదన్నాడు. కానీ అట్లా చేయరాదు. వాడు మూడవ బారొనెట్ కావడాన్ని ఏదీ నిరోధించలేదు. ఇంకా ఫ్రెడ్డీకి బిరుదు లభించాలే గానీ తండ్రి మరణం తర్వాత అది వాడికి సంక్రమిస్తుంది. ఆఖరికి తన పేరులోకి బ్లాండ్‌ను కూడా వదులుకుని ఓ భయంకరమైన జర్మన్ పేరును తగిలించుకుంటాడట. ఇది మీకు తెలుసా?" అంది.

ఏం పేరో అడగకుండా ఉండలేకపోయాను.

"బ్లీకోజెలో లేక అట్లాంటిదేదో" ఆమె బదులిచ్చింది.

ఆ పేరును నేను గుర్తించాను. కాలక్రమేణా సర్ ఆల్‌ఫ్రెడ్ బ్లాండ్ (మొదటి బారొనెట్) గా మారిన ఆల్ఫాన్స్ బ్లీకోజెల్‌ను హానా రాబన్‌స్టీన్ వివాహమాడిందని ఫెర్డీ చెప్పడం జ్ఞాపకం చేసుకున్నాను. అదంతా చాలా విచిత్రంగా తోచింది. కొన్ని నెలల క్రితమే అతణ్ని చూసినప్పుడు అచ్చం ఇంగ్లిష్ వాడిలా ముద్దొచ్చిన జార్జికు ఏమయిందా అని ఆశ్చర్యపడ్డాను.

"నేనింటికి తిరిగి వచ్చి ఫ్రెడ్డీతో చెప్పగానే ఆయన ఎంతో కోపంతో ఊగిపోయారు. అంత కోపంలో ఉండగా ఆయనను నేను ఎప్పుడూ చూడలేదు. నోట్లోంచి నురగలు వచ్చినయ్. తక్షణమే తిరిగి రావలసిందిగా జార్జికు టెలిగ్రామ్ ఇచ్చాడు. పని మూలంగా రాలేనని తిరుగు టెలిగ్రామిచ్చాడు జార్జ్".

"జార్జ్ పని చేస్తున్నాడా?" అడిగాను.

"రాత్రింబవళ్లూ. అదే పిచ్చెక్కించే విషయం. జీవితంలో చిన్నపని చేసి ఎరుగడు వాడు. వాడు సోమరిపోతై పుట్టాడని ఫ్రెడ్డీ అంటుండేవాడు"

"అలాగా" అన్నాను.

"తిరిగి రాకుంటే నెలనెలా పంపే డబ్బును ఆపేస్తానని ఫ్రెడ్డీ టెలిగ్రామ్ ఇచ్చాడు. 'ఆపండి' అని జార్జ్ తిరుగు జవాబిచ్చాడు. దాంతో అగ్నికి ఆజ్యం పోసినట్లయింది. ఫ్రెడ్డీకి కోపం వస్తే ఎట్లా అవుతాడో మీకు తెలియదు" అన్నది.

ఫ్రెడ్డీకి పెద్ద ఆస్తి సంక్రమించిందనీ, దాన్నతడు మరెన్నో రెట్లు అభివృద్ధి చెందించాడనీ తెలుసు నాకు. వినయమూ, సౌహార్దమూ గల ఆ టిల్బీ భూస్వామి వెనుక కనికరం లేని కఠినాత్ముడున్నాడని నేను సులభంగా ఊహించగలిగాను. తన పద్ధతికి తాను అలవాటు పడ్డవాడు కనుక దగా పడితే అతడు కఠినుడూ క్రూరుడూ కాగలడని నేను నమ్ముతాను.

"జార్జ్‌కు మేము ఎంతో ఆకర్షణీయమైన మొత్తాన్ని నెల నెలా ఇస్తూ వచ్చాము. కానీ వాడెంత భయంకరంగా డబ్బును వెచ్చిస్తాడో మీకు తెలుసు గదా. వాడెక్కువ కాలం తట్టుకోలేడనుకున్నాము. నిజానికి నెల రోజుల్లో వంద పౌండ్లు బదులివ్వవలసిందిగా అడుగుతూ ఫెర్డీకి ఉత్తరం రాశాడు. ఇరవై సంవత్సరాలుగా వాళ్లు మాట్లాడుకోకున్నా ఫ్రెడ్డీ ఫెర్డీ దగ్గరకు వెళ్లి జార్జ్‌కు ఒక్క పెన్నీ కూడా పంపవద్దని బ్రతిమాలాడు. ఫెర్డీ పంపనని వాగ్దానం చేశాడు. జార్జ్ ఎలా నెట్టుకొస్తున్నాడో నా కర్థం కావడం లేదు. ఫ్రెడ్డీ చేస్తున్నది సరైనదని నాకు బాగా తెలుసు. కానీ నేను బాధపడకుండా ఉండలేను. వాడికి డబ్బేమీ పంపనని ఫ్రెడ్డీకి నేను మాట ఇచ్చి ఉండకపోతే కవరులో కొన్ని నోట్లు జొప్పించి పంపి ఉండేదాన్ని. నేననేదేమిటంటే బహుశా వాడికి తిండికి కూడా సరిపడేటంత డబ్బు లేదేమోననే ఆలోచనే దుర్భరంగా ఉంటుంది."

"కొంత తక్కువ పడ్డా పెద్ద హాని లేదు" అన్నాను నేను.

"మేమొక చెడ్డ కంతలో పడ్డామనుకోండి. వాడు యుక్తవయస్కుడైన సందర్భంగా జరిపే వేడుక కోసం మేము అన్ని రకాల ఏర్పాట్లు చేశాము. నేను వందల ఆహ్వానాలు పంపాను. అకస్మాత్తుగా జార్జ్ రానన్నాడు. నాకు పిచ్చెక్కినట్టయింది. నేను వాడికి టెలిగ్రామ్ ఇచ్చాను. జర్మనీకి వెళ్లేదాన్నే కానీ ఫ్రెడ్డీనన్ను అనుమతించడు. జార్జ్‌ను నేను నిజంగా కాళ్లా వేళ్లా పడి బ్రతిమాలాను. మమ్మల్ని కుమిలిపోయే పరిస్థితిలో పెట్టొద్దని వేడుకున్నాను. ఇది వివరించడానికి ఎంతో కష్టమైన సంగతి. అప్పుడు మా అత్త కల్పించుకుంది. మీకామె తెలియదు కదూ! ఆమె ఒక అసాధారణురాలైన వృద్ధురాలు. ఆమె ఫ్రెడ్డీ తల్లి అని అనిపించనే అనిపించదు మీకు. జన్మతః ఆమె జర్మన్. కానీ చాలా మంచి కుటుంబం నుండి వచ్చింది" అంది మ్యూరియెల్.

"ఓహో, అలాగా!" అన్నాను.

"నిజం చెప్పాలంటే ఒక విధంగా నేనామెకు భయపడతాను. ఫ్రెడ్డీని ఎదుర్కొని అప్పుడామె జార్జ్‌కు స్వయంగా రాసింది. తన ఇరవయ్యొకటవ జన్మదినానికి ఇంటికి వస్తే మ్యూనిక్‌లో వాడికున్న అప్పులన్నీ తీర్చేస్తాననీ, అప్పుడు వాడు చెప్పే దేన్నైనా మేమంతా ఓపికగా వింటామనీ రాసింది. వాడు దానికి ఒప్పుకున్నాడు. వచ్చే వారంలో ఏదో ఒక రోజు వాడొస్తాడని చూస్తున్నాము. కానీ ఆ రోజు కోసం నేను మాత్రం ఎదురు చూడ్డం లేదు" అని ఆమె దీర్ఘంగా నిట్టూర్చింది.

భోజనం తర్వాత పై గదిలో మేము నడిచేటప్పుడు ఫ్రెడ్డీ నాతో మాట్లాడాడు.

"జార్జ్ గురించి మ్యూరియల్ మీకు చెప్పడం చూశాను. దౌర్భాగ్యపు వెధవ! వాడిపట్ల నాకు ఓపిక నశించింది. పియానో వాద్యకారుడు కాగోరే పిచ్చి ఊహ ఎంత అవమానకరం!"

"జార్జ్ పూర్తి యవ్వనంలో ఉన్నాడని మీకు తెలుసు కదా" అన్నాను శాంత పరుస్తున్నట్టుగా.

"ఏ విషయంలోనూ వాడికి కష్టం ఉండేది కాదు. నేను మరీ పట్టువిడుపుగా ఉంటూ వచ్చాను. వాడు కోరితే నేనివ్వకపోయిందేదీ లేదు. వాడికి తగిన బుద్ధి చెప్తాను" అన్నాడు.

బ్లాండ్ కుటుంబీకులకు ప్రచారపు వాడుకల పట్ల ఔచిత్యమైన భయం ఉంది. టిల్బీలో జార్జ్ ఇరవయ్యొకటవ జన్మదిన వేడుకలు గ్రామీణ ఇంగ్లిష్ కుటుంబాల పద్ధతి కనుగుణంగా జరపబడ్డాయని నేను పత్రికలు చదివి గ్రహించాను. ఉచ్చతరగతి వాళ్ల కోసం విందూ – ఇంకా డాన్స్ కార్యక్రమమూ, కౌలుదార్ల కోసమేమో ఉపహారమూ – ఇంకా లాన్ మీద గుడారాల్లో డాన్సూ ఉండినయ్. ఎంతో డబ్బు వెచ్చించి బాజాభజంత్రీల వాళ్లను లండన్ నుండి తీసుకొచ్చారు. చుట్టూ తన కుటుంబీకులుండగా జార్జ్‌కు కౌలుదార్లు పెద్ద వెండి టీకప్పుల సెట్టును ప్రదానం చేస్తున్నట్లు పత్రికల్లో ఫొటోలు వచ్చాయి. అతని బొమ్మను గీయించడానికి వాళ్లు చందాలు పోగు చేశారు. కానీ జార్జ్ దేశంలో లేని కారణంగా చిత్రం కోసం కూచోవడం అతనికి అసాధ్యమై పోవడంవల్ల దానికి బదులుగా తేనీటి విందు ఏర్పాటు చేయబడింది. తండ్రి ఓ తుపాకీని, తల్లేమో తనంత తానుగా రికార్డులు మార్చే గ్రామఫోనునూ, ఆస్తిపరురాలూ విధవరాలూ ఐన నానమ్మ లేడీ బ్లాండ్ ఎన్‌సైక్లోపీడియా బ్రిటానికాను – ఇంకా తాత ఫెర్దినాండ్ రాబెన్‌స్టీన్ పాలెగ్రినో దమాడెనా రాసిన 'వర్జిన్ అండ్ చైల్డ్' పుస్తకాన్నీ ఇచ్చారనీ లోకాభి రామాయణం రాసే రచయితల కాలమ్స్‌లో చదివాను. పెద్ద పెద్ద ఈ కానుకలు సులభంగా డబ్బు రూపంలోకి మార్చగలిగేవి కావని గమనించకుండా ఉండలేకపోయాను. పూర్వపు వేడుకల్లో ఫెర్డీ హాజరవుతున్నాడు. కనుక జార్జ్ తలలో మెదులుతున్న వింత ఆలోచన తాతా మనవల మధ్య సంధిని సమకూర్చిందనే నిర్ణయానికి వచ్చాను. నా ఊహ నిజమైంది. తన మనవడు పియానో

వాయించడమే వృత్తిగా స్వీకరించే ఆలోచనను ఫెర్డీ అసలు ఇష్టపడలేదు. తమ కుటుంబ ప్రతిష్ఠకు భంగం వాటిల్లే మొదటి సూచన పొడసూపగానే వాళ్ళందరూ ఏకమై జార్జ్ వ్యూహాలను ప్రతిఘటించడానికి మూకుమ్మడి సంస్థను ఎదురు నిలిపారు. జన్మదిన వేడుకలు అయింతర్వాత ఏం జరిగిందో నాకు కర్ణాకర్ణిగా మాత్రమే తెలిసింది. ఎందుకంటే నేనప్పుడు లేను. ఫెర్డీ, మ్యూరియల్ నాకేదేదో చెప్పారు కానీ అనంతరం జార్జ్ నాకు తన స్వంత కథనాన్నిచ్చాడు. ఇంటికి వచ్చినప్పుడు వేదికపై మహత్తర వైభవం మధ్య తనను తాను చూసుకుని అంత గొప్ప ఆస్తికి వారసుడవడం అంటే ఏమిటో మరోసారి స్వయంగా తెలుసుకున్నప్పుడు జార్జ్ బలహీనుడైపోతాడని బ్లాండ్ కుటుంబం వాళ్లు గట్టిగా అభిప్రాయపడ్డారు. ప్రేమతో వాళ్లతన్ని చుట్టుముట్టారు. అతనికి పొగడ్తలు పలికారు. అతని మాటలను శ్రద్ధగా విన్నారు. అతని మంచితనం పట్ల నమ్మకాన్ని వెలిబుచ్చారు. ఇంకా అతనితో చాలా దయగా ఉంటే అతనికి తమ మనసుల్ని నొప్పించే ధైర్యం వుండదనుకున్నారు. జర్మనీకి తిరిగి వెళ్లే ఉద్దేశం అతనికి లేదని అతడు చెప్పకుండానే ఊహించుకున్నట్టు కనిపించారు. తమ సంభాషణల్లో, అన్ని కార్యక్రమాల్లో అతన్ని కలుపుకున్నారు. జార్జ్ ఎక్కువగా మాట్లాడలేదు. బాగా ఆనందిస్తున్నట్టు కనిపించాడు. పియానోను తెరవనే లేదు. అంతా సక్రమంగా జరిగిపోతుందా అన్నట్టనిపించింది. అగచాట్లపాలైన ఆ ఇంట్లో శాంతి నెలకొన్నది. ఒకరోజు మధ్యాహ్నపు భోజనాల వేళ మరుసటి వారంలో వాళ్లందరూ ఆహ్వానింపబడ్డ ఒక విందు గురించి చర్చించుకుంటున్నప్పుడు, "నన్ను లెక్క పెట్టకండి, అప్పటికి నేనుండను"అని జార్జ్ చల్లగా సెలవిచ్చాడు.

"ఎందుకేమిటి?" ఆశ్చర్యంగా అడిగింది తల్లి.

"నా పనికి నేను తిరిగి వెళ్ళాలి. సోమవారం రోజు నేను మ్యూనిక్‌కు బయల్దేరుతున్నాను"

భయంకరమైన నిశ్శబ్దం చోటు చేసుకుంది. అందరూ ఏదో మాట్లాడాలని చూస్తున్నారు కాని ఏం మాట్లాడినా తప్పవుతుందేమోనని భయపడడం వల్ల ఆ మౌనం ఆఖరుకు దుర్భేధ్యంగా కనపడింది. ఏం మాట్లాడకుండా భోజనాలు ముగించారు. జార్జ్ తోట లోనికీ, లేడీ బ్లాండ్, ఫెర్డీ, మ్యూరియెల్ – ఇంకా సర్ ఎడాల్ఫస్ (ఫ్రెడ్డీ) గదిలోకీ వెళ్ళారు. కుటుంబ సమావేశం జరిగింది. మ్యూరియెల్ ఏడ్చింది. ఫ్రెడ్డీ కోపంతో ఊగిపోయాడు. అంతలోనే డ్రాయింగ్ రూమ్‌లోంచి ఎవరో మృదువైన స్వప్నం వంటి చాపిన్ సంగీతాన్ని వాయిస్తున్న శబ్దాన్ని విన్నారు. ఆ వాయిస్తున్నది జార్జ్. సుఖమూ, విశ్రాంతి, స్థైర్యం కోసం తను ప్రేమించిన వాద్యపరికరం దగ్గరికి పోదల్చుకున్న తన నిర్ణయాన్ని వ్యక్తం చేస్తున్నాడా అన్నట్టుంది అది.

ఫ్రెడ్డీ కోపంతో ఒక్క ఉదుటున ఎగిరాడు.

"ఆపు ఆ వెధవ చప్పుడు. నా యింట్లో పియానో వాయించనివ్వను" అని అరిచాడు. మ్యూరియెల్ నౌకరును పిలిచి తనకు చెడ్డ తలనొప్పిగా ఉందనీ, పియానో వాయించకుండా ఉండటానికి ఏమైనా అభ్యంతరమా అని జార్జ్‌కు కబురు పంపింది.

ప్రపంచజ్ఞానం కల ఫెర్డీని జార్జ్‌తో మాట్లాడడానికి నియమించారు. పియానో గురించిన ఆలోచనను వదులుకునే పక్షంలో జార్జ్‌కు కొన్ని వాగ్దానాలు చేసే అధికారాన్నిచ్చారతనికి. ఎంబెస్సీ కార్యాలయంలో పని చేయదల్చుకుంటే దాని గురించి తండ్రి పట్టుపట్టడు. కానీ పార్లమెంట్‌కు నిలబడితే ఎన్నికల ఖర్చులూ, లండన్‌లో ఇల్లూ ఇంకా సంవత్సరానికి ఐదువేల పౌండ్లు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నట్టు చెప్పాలన్నారు. అది చాలా ఆకర్షణీయమైన బేరమనే చెప్పాలి. ఫెర్డీ ఆ అబ్బాయికి ఏం చెప్పాడో నాకు తెలియదు. అట్లాంటి ఆదాయంతో ఒక యువకుడు లండన్‌లో సాగించగలిగే జీవితాన్ని వర్ణించి ఉంటాడనుకుంటాను. అతడు దాన్ని తప్పక మరులు గొల్పేలా చేసి ఉంటాడు. దాంతో లాభమేమీ లేకపోయింది. తన చదువును కొనసాగించగలగడానికీ, తన మానాన తనను వదిలిపెట్టడానికీ జార్జ్ అడిగిందల్లా వారానికి ఐదు పౌండ్లు. ఏదో ఒకరోజు తను ఆనందించడానికి అవకాశమున్న హోదా గల స్థానాన్ని అతడంతగా పట్టించుకోలేదు. వేటాడ్డం కూడా జార్జ్ చేయదలచుకోలేదు. పార్లమెంట్ మెంబరు కానీ, లక్షాధికారి గానీ కాదల్చుకోలేదు. ఇంకా తనకు బిరుదులూ, సమాజంలో ఉన్నత స్థానమూ అఖ్ఖర్లేదన్నాడు. ఫెర్డీ పరాజితుడై ఎంతో చిరాకుగా తిరిగి వచ్చాడు.

భోజనం తర్వాత ఆ సాయంత్రం మహా యుద్ధం జరిగింది. ముక్కోపి అయిన ఫ్రెడ్డీ ప్రతిఘటనకు అలవాటు పడకపోవడం వల్ల జార్జ్ పట్ల నానా దుర్భాషలాడాడు. చాలా కటువుగా మాట్లాడాడని తెలిసింది నాకు. అతని విజృంభణను అణచగోరిన ఆడవాళ్లను కిక్కురమనకుండా చేశాడు. జీవితంలో బహుశా మొదటిసారిగా ఫ్రెడ్డీ తన తల్లి మాటను వినలేదు. జార్జ్ మొండికేసి ఉలుకు పలుకు లేకుండా కూర్చున్నాడు. గట్టిగా నిర్ణయం చేసుకుని తండ్రి దాన్ని ఇష్టపడకపోతే దిగమింగదల్చుకున్నాడు. ఫ్రెడ్డీ నిక్కచ్చిగా ఉన్నాడు. జార్జ్ జర్మనీకి తిరిగి వెళ్లడాన్ని అతడు నిషేధించాడు. తనకు ఇరవయొక్క ఏళ్లు వున్నాయనీ తనకు యజమాని తానేనని జవాబిచ్చాడు జార్జ్. తన ఇష్టం వచ్చిన చోటికి వెళ్తానన్నాడు.

ఒక్క పెన్నీ కూడా ఇవ్వను గాక ఇవ్వనన్నాడు ఫ్రెడ్డీ.

"ఫరవాలేదు. నేను డబ్బు సంపాదిస్తాను".

"నువ్వు! జీవితంలో పూచికపుల్లంత పనైనా చేసి ఎరుగవు నువ్వు. డబ్బు సంపాదించడానికి నువ్వేం చేయగలవు?"

"పాత బట్టలు అమ్ముతాను" అని కిసుక్కుమన్నాడు జార్జ్

వాళ్లంతా నోళ్లు తెరిచారు. మ్యూరియెల్ ఎంత ఆశ్చర్యచకితురాలయిందంటే ఆ విభ్రాంతిలో ఒక బుద్ధి తక్కువ మాటను అనేసిందామె.

"ఒక యూదుడి లాగానా?" అన్నది.

"నేను యూదుడిని కానా మరి? ఇంకా నువ్వూ, నాన్నా యూదులు కారా? మనమంతా యూదులమే! మన కుటుంబం సమస్తమూ! ఆ విషయం అందరికీ తెలిసిందే. అయినా మనం యూదులం కానట్టు నటించడంలో ఏం లాభం ఏడ్చింది?"

అప్పుడొక విపరీత సంఘటన సంభవించింది. అకస్మాత్తుగా ఫ్రెడ్డీ కన్నీళ్ల పర్యంతం అయ్యాడు. తను ప్రేమించిన తన కన్నకొడుకు మీద అతడు పెట్టుకున్న ఆశలన్నీ వమ్మై తన జీవితాశయం నెరవేరక నిరాశ కలిగినందుకు పరాభవంతో ఏడ్చి ఉద్వేగపూరితుడైన ఒక ఎడాల్ఫ్ బ్లీకోజెల్ లాగా ప్రవర్తించాడే తప్ప సర్ ఎడాల్ఫస్ బ్లాండ్, బారొనెట్, ఎం.పి. లాగా – ఇంకా తానెంతో కాగోరుకున్న వృద్ధుడైన ఇంగ్లిష్ పెద్ద మనిషిలాగా ప్రవర్తించలేదు. బిగ్గరగా వెక్కి వెక్కి ఏడుస్తూ, గడ్డాన్ని పీక్కుంటూ, ఛాతీ మీద బాదుకుంటూ ముందుకూ వెనకకూ ఊగిపోయాడు. ముసలి లేడీ బ్లాండ్, మ్యూరియెల్, ఇంకా ముక్కు చీదుతూ ముఖం మీది నుండి కిందికి ధారగా కారుతున్న కన్నీళ్లను తుడుచుకుంటూ ఫ్రెడ్డీ, చివరకు జార్జ్ కూడా – కలిసి అంతా ఏడ్చారు. అది బాధ కలిగించే సంగతే అనుకోండి. కానీ దృఢమైన ఆంగ్ల స్వభావాలకు అది కొంచెం విడ్డూరంగానే కనిపిస్తుంది. ఎవరూ ఎవరినీ ఓదార్చడానికి ప్రయత్నించ లేదు. అదేపనిగా వెక్కి వెక్కి ఏడ్చారంతే! ఆ సంఘటన ఆ వేడుకను ఛిన్నాభిన్నం చేసింది.

కానీ పరిస్థితి మీద దాని ప్రభావమేమీ లేకపోయింది. జార్జ్ మొండికేసి కూర్చున్నాడు. తండ్రి అతనితో మాట్లాడ్డం లేదు. మరికొన్ని గలాభాలయ్యాయి. మ్యూరియెల్ కొడుకును కనికరించమని బ్రతిమాలింది. జాలి గొలిపే ఆమె నివేదనలను అతడు పెడచెవిని పెట్టాడు. తల్లి హృదయం బద్దలౌతుందేమోనని కూడా లెక్క చేయలేదు. తండ్రి చస్తాడనైనా ఏ మాత్రం లక్ష్యపెట్టలేదు. ఫెర్డీ ప్రపంచీకుడిగా తేలికగా నివేదించుకున్నాడు. జార్జ్ దాన్ని కొట్టిపారేసి కోపానికి వచ్చాడు కూడా. ముసలి లేడీబ్లాండ్ గలగల లాడే తన జర్మన్ ఉచ్చారణతో, ఇంకా గట్టి లోకజ్ఞానంతో వాదించింది. కానీ జార్జ్ తర్కాన్ని వినలేదు. మొత్తానికి ఉపాయాన్ని కనిపెట్టింది చివరకు ఆమే! ప్రజ్ఞ ఉంటే తప్ప ప్రపంచం అతని కాళ్ల దగ్గర ఉంచిన అందమైన వస్తువులన్నింటినీ కాలదన్ని ప్రయోజనం లేదని ఆమె జార్జ్ అంగీకరించేలా చేసింది. తనకు ప్రజ్ఞ ఉందని అతడు భావించవచ్చునీ, కానీ అతని భావన తప్పు కావచ్చునీ రెండవ శ్రేణి పియానో వాద్యకారుడు కావడం ఏమంత అభిలషణీయం కాదనీ చెప్పింది. ప్రజ్ఞ ఉన్నట్టయితే అతని దారిలో ప్రతిబంధకంగా నిలిచే హక్కు ఆ కుటుంబానికి లేదనీ అన్నది.

"అప్పుడే ప్రజ్ఞను చూపించాలనడం న్యాయం కాదు. నేను సంవత్సరాల పాటు శ్రమ పడాల్సి వుంటుంది" అన్నాడు జార్జ్.

"దానికి సంసిద్ధుడవని నీకు గట్టి నమ్మకం ఉందా?"

"ప్రపంచంలో నా కోరిక అదొక్కటే. కుక్కలాగా శ్రమిస్తాను. అవకాశం రావాలని మాత్రమే నా కోరిక."

ఆమె చేసిన ప్రతిపాదన ఇట్లా వుంది : అతనికి తండ్రి డబ్బేమీ ఇవ్వకూడదని నిర్ణయించుకున్నాడు. కానీ వాళ్లంతా ఆ అబ్బాయిని పస్తులుండేలా చేయలేరు కదా! వారానికి ఐదు పౌండ్లు అడిగాడతడు. ఆ డబ్బును తనే ఇవ్వడానికి ఆమె సిద్ధమే. జర్మనీకి తిరిగి వెళ్లి రెండు సంవత్సరాల పాటు అతడు అభ్యాసం చేసుకోవచ్చు. ఈ గడువు తర్వాత అతడు తిరిగి రావాలి. అతని వాద్యాన్ని వినడానికి ఒక పక్షపాతం లేని ప్రతిభావంతుణ్ని తీసుకొస్తారు వాళ్ళు. మొదటి శ్రేణి పియానో వాద్యకారుడు కాగలిగే ప్రజ్ఞను అతడు చూపించాడని ఆ వ్యక్తి చెబితే అతని దారిలో మరే ఆటంకాలుండవు. అతనికి అన్ని విధాలైన అవకాశం, సహాయం, ప్రోద్బలం లభిస్తాయి. అలా కాకుండా ఒకవేళ అతని సహజ ప్రజ్ఞా పాటవాలు అతడు సఫలీకృతుడు కాబోతున్నట్టు హామీ ఇచ్చేవిగా లేవని ఆ వ్యక్తి నిశ్చయిస్తే సంగీతాన్ని వృత్తిగా చేసుకునే ఆలోచనలన్నిటికీ స్వస్తి చెపుతానని విశ్వాసపూర్వకంగా వాగ్దానం చేసి అన్ని విధాలా తన తండ్రి కోరికలకు కట్టుబడాలి.

జార్జ్ తన చెవులను తానే నమ్మలేకపోయాడు.

"ఇదంతా నిజంగా అంటున్నావా నానమ్మా?" అన్నాడు.

"నిజంగా అంటున్నాను"

"కానీ నాన్న ఒప్పుకుంటాడా?"

"ఒప్పుకునేలా చూస్తాను" అన్నదావిడ.

జార్జ్ ఆమెను తన చేతులతో పట్టుకొని రెండు చెక్కిళ్ల మీద గట్టిగా ముద్దు పెట్టుకున్నాడు.

"నా ముద్దుల నానమ్మా!" అని అరిచాడు.

"కానీ వాగ్దానం సంగతి?"

ఆ ఏర్పాటుకు సంబంధించిన నిబంధనలన్నింటినీ విశ్వాసపూర్వకంగా శిరసా వహిస్తానని ఆమెకు నిజాయితీగా కచ్చితమైన వాగ్దానం చేశాడు. రెండు రోజుల అనంతరం అతడు జర్మనీకి తిరిగి వెళ్లిపోయాడు. అతని తండ్రి అనుమతించకుండా ఉండలేక, అయిష్టంగా అనుమతించినప్పటికీ తనతో సఖ్యతగా ఉండలేదు. వెళ్లేటప్పుడు జార్జ్‌కు వీడ్కోలు కూడా చెప్పలేదు.

మరే విధంగా కూడా తనను తాను అతడు అంతగా బాధించుకోగలిగి ఉండేవాడు కాదనిపించింది నాకు. ఇక్కడ ఒక్క అరుపు మాట చెప్పడానికి నన్ను నేను అనుమతించు కుంటాను. అమానుషమైన ఈ పరాయి ప్రపంచంలో అతి స్వల్పకాలం నివసించే ఈ మనుషులు తమకు తాము స్వయంగా దుఃఖాన్ని కలిగించుకోవడానికి ప్రత్యేకమైన ప్రయత్నం చేయవలసి రావడం విచిత్రం.

తాను అభ్యాసం చేసే రెండేళ్ల కాలంలో తన కుటుంబం వాళ్లు అతన్ని చూడడానికి రావద్దని జార్జ్ షరతు పెట్టాడు. అతడింటికి రావడానికి మరికొన్ని నెలలుండనగా ఏదో పని మీద నేను మ్యూనిక్ మీదుగా వియెన్నాకు వెళ్తున్నానని మ్యూరియెల్ విన్నప్పుడు అతన్నోసారి చూడవలసిందిగా నన్నడిగింది ఆమె. అది అసహజమేమీ కాదు. జార్జ్‌ను గురించిన ప్రత్యక్ష వర్తమానాన్ని వినాలని ఆమెకు ఆదుర్దాగా వుంది.ఆమె నాకు జార్జ్ చిరునామా ఇవ్వడంతో నేను మ్యూనిక్‌లో ఒక రోజు గడపబోతున్నానని తెలియజేస్తూ నాతో భోజనం చేయవలసిందిగా అడుగుతూ జార్జ్‌కు ముందుగా రాశాను. అతడు రాసిన జవాబు నా హోటలు దగ్గర సిద్ధంగా వుంది. రోజంతా పని చేయడం వల్ల మధ్యాహ్న భోజనానికి అతని వద్ద సమయం లేదనీ, కానీ ఆరు గంటల ప్రాంతంలో నేనతని రూమ్‌కు వెళ్తే దాన్ని నాకు చూపించి నాకు వేరే పనిలేని పక్షంలో ఆ సాయంత్రం నాతో గడపవచ్చుననీ రాశాడు. అతడిచ్చిన చిరునామాకు ఆరు దాటగానే వెళ్లాను. ఎన్నో వాటాలున్న పెద్ద భవనంలోని రెండవ అంతస్తులో వుంటున్నాడు జార్జ్. తలుపు దగ్గరకి రాగానే పియానో వాయిస్తున్న శబ్దం వినపడింది. నేను తలుపు తట్టగానే ఆ శబ్దం ఆపి జార్జ్ నా కోసం తలుపు తెరిచాడు. ఎంతో కష్టం మీద నేనతణ్ని గుర్తు పట్టగలిగాను. బాగా లావైపోయాడు. జుట్టు విపరీతంగా పెరిగి బొమ్మల్లోలాగా తల మీదంతా చిందర వందరైంది. అతడు గడ్డం గీసుకోక మూడు రోజులైనా అయి వుంటుంది. మురికిగా వున్న ఆక్స్‌ఫర్డ్ ప్యాంటు, ఓ టెన్నిస్ చొక్కా – ఇంకా రబ్బరు పట్టీల చెప్పులను వేసుకున్నాడు. మట్టి పేరుకున్న గోళ్ల కొసలు నల్లగా కనిపిస్తూ అతడేమంత శుభ్రంగా లేడు. క్రితం సారి నేను చూసినప్పుడు శుభ్రంగా బక్కపలుచగా ఉండి ఆకర్షణీయమైన దుస్తులను ధరించి శోభాయమానంగా వున్న ఆ యువకుడికీ, ఇతనికీ మధ్య పెద్ద వ్యత్యాసం కనపడింది నాకు. ఫెర్డీ అప్పుడతన్ని చూసివుంటే అదిరిపోయేవాడని అనుకోకుండా ఉండలేకపోయాను. గోడల మీద ఫ్రేములు లేని మూడు నాలుగు క్యూబిస్ట్ స్వభావానికి చెందిన కాన్వాసు చిత్రాలతో, ఎన్నో శిథిలమైన చేతి కుర్చీలతో – ఇంకా ఒక పెద్ద పియానోతో ఆ గది విశాలంగా బోసిగా వుంది. పుస్తకాలు, పాత వార్తాపత్రికలు – ఇంకా ఆర్ట్ పత్రికలు ఇంటి నిండా చిందరవందరగా పడి ఉన్నాయి. పాత పొగ, చెడిపోయిన బీరు తాలూకు కంపు వాసనతో ఆ గది మురికిగా, ఛండాలంగా వుంది.

"నువ్వొక్కడివే ఉంటున్నావా ఇక్కడ?" అడిగాను.

"ఔను. వారానికి రెండుసార్లు ఒకామె వచ్చి శుభ్రం చేస్తుంది. కానీ నా భోజనం నేనే తయారు చేసుకుంటాను".

"నీకు వండుకోవడం వచ్చా?"

"మధ్యాహ్నం భోజనానికి బ్రెడ్ జున్నూ తిని ఓ సీసా బీరు తాగేస్తాను. రాత్రి భోజనం బియెర్ స్ట్యూబ్ హోటల్లో".

నన్ను చూసి అతడెంతో ఆనందించడం నాకు సంతోషాన్ని కలిగించింది. ఆనందోత్సాహాలు వెల్లివిరుస్తూ అతడత్యంత ఉల్లాసంగా కనిపించాడు. తన వాళ్ల గురించిన క్షేమసమాచారాలడిగాడు. ఆ మాటా ఈ మాటా మాట్లాడుకున్నాం మేము. వారానికి రెండుసార్లు అతనికి పాఠం వుంటుంది. మిగతా సమయంలో సాధన చేస్తాడు. రోజుకు పది గంటలు శ్రమిస్తున్నట్టు చెప్పాడు.

"అదొకరకమైన మార్పులాగా ఉంటుంది గదా" అన్నాను.

జార్జ్ నవ్వాడు.

"నేను సోమరిపోతుగా పుట్టానని అనేవాడు నాన్న. నిజానికి నేను సోమరిని కాదు. నాకు విసుగు కలిగించేవాటి కోసం శ్రమించడంలో ప్రయోజనం కనిపించలేదు నాకు" అన్నాడు.

పియానో వాదనం ఎలా సాగుతుందని అడిగాను. తన అభివృద్ధి పట్ల సంతృప్తుడై ఉన్నట్టు కనిపించాడు. వాయించి నాకు వినిపించమని కోరాను.

"ఉహుం ఇప్పుడు కాదు. పొద్దంతా వాయిస్తూ ఉండడం వల్ల బాగా అలసిపోయాను. అట్లా బయటికి వెళ్లి భోజనం చేసి తిరిగి వచ్చింతర్వాత అప్పుడు వాయిస్తాను. భోజనానికి సాధారణంగా నేను ఒకే చోటికి వెళ్తుంటాను. నాకు తెలిసిన విద్యార్థులెందరో ఉన్నారక్కడ. వినోదకరంగా ఉంటుంది" అన్నాడు.

అంతలోనే మేము బయల్దేరాము. అతడు సాక్సూ, బూట్లూ, చాలా పాత గోల్ఫ్ కోటూ వేసుకున్నాడు. విశాలమైన నిశ్శబ్దపు వీధుల గుండా కలిసి నడిచాము మేము. వాతావరణం చల్లగా, ఆహ్లాదకరంగాఉంది. గాలిలో తేలుతున్నట్టు నడుస్తున్నాడు జార్జ్. చుట్టూ కలియజూచి సంతోషంగా నిట్టూర్చాడు.

"మ్యూనిక్ అంటే నాకు వల్లమాలిన ప్రేమ. మనం పీల్చే గాలిలోనే కళ ఉండే పట్టణం ప్రపంచంలో ఇదొక్కటే. అసలు కళ ఒక్కటే ముఖ్యమైనది. కాదంటారా? ఇంటికి పోవడమనే ఆలోచనంటేనే నాకెంతో అసహ్యం' అన్నాడు.

"అయినా పోవాల్సి వుంటుంది" అన్నాను.

"అవును, నిజమే పోతాను సరే. కానీ ఆ సమయం వచ్చేదాకా దాన్ని గురించి నేనాలోచించదల్చుకోలేదు."

"నువ్వు క్షవరం చేయించుకోకపోతే అంతకంటె అధ్వాన్నం మరొకటుండదు. మరోలా అనుకోకపోతే నువ్వు నమ్మశక్యం కానంత కళాత్మకంగా కనబడుతున్నావంటాను".

"మీ ఇంగ్లిష్ వాళ్ళెంతో పాపిష్ఠి మనుషులు" అన్నాడు.

పక్క వీధిలోని ఒక పెద్ద రెస్టారెంటుకు తీసుకు వెళ్లాడు. ఐదు పది శతాబ్దాల ముందు కాలపు జర్మన్ శైలిలో బాగా అలంకరింపబడ్డ ఆ హోటలు సాయంత్రపు భోజనాలు చేసే మనుషులతో కిటకిటలాడి పోతోంది. ఆ వాతావరణానికి కొంచెం దూరంగా ఎర్రగుడ్డ కప్పిన ఒక బల్ల జార్జ్ ఇంకా అతని స్నేహితులకోసం కేటాయించబడింది. మేము వెళ్ళేసరికి దాని దగ్గర నలుగురైదుగురు యువకులు ఉన్నారు. ప్రాచ్యభాషల నభ్యసిస్తున్న ఓ పోలండ్ దేశస్థుడు, వేదాంతాన్ని చదువుతున్న ఒక విద్యార్థి, ఒక చిత్రకారుడు (జార్జ్ గదిలో వున్న క్యూబిస్ట్ చిత్రాలు ఇతనివేననుకుంటాను) స్వీడన్ దేశస్థుడు, ఇంకా బూట్లను టక టకలాడిస్తూ తనను తాను హాన్స్ రీటింగ్ అనే కవిగా నాకు పరిచయం చేసుకున్న ఒక యువకుడు ఉన్నారు. వాళ్లలో ఎవరికీ ఇరవై రెండేళ్ల కంటె తక్కువ వయసు లేకపోవడం వల్ల నాకు ఒక విధంగా చిన్నతనమనిపించింది. జార్జ్‌ను వాళ్లు 'డ్యు' అని సంబోధించారు. జర్మన్ భాషను జార్జ్ అతి ధారాళంగా మాట్లాడటం నేను గమనించాను. చాలా కాలంగా నేనా భాషను మాట్లాడలేకపోవడం వల్ల నా జర్మన్ భాష తుప్పు పట్టినట్టయింది. ఆ విధంగా నేను వాళ్ల ఉల్లాసకరమైన సంభాషణలో ఎక్కువగా పాల్గొనలేక పోయాను. అయినా సంపూర్ణంగా ఆనందాన్ననుభవించాను. వాళ్లు అంతంత మాత్రంగానే తిన్నారు. కానీ బీరు మాత్రం ఎక్కువగా తాగారు. కళను గురించీ ఆడవాళ్ల గురించీ మాట్లాడారు. వాళ్లు సంతోషంగా ఉన్నప్పటికీ దృఢనిశ్చయంతో ఎంతో విప్లవాత్మకంగా ఉన్నారు. ఎరిగిన ప్రతి వ్యక్తి పట్ల వాళ్ళకు ద్వేషం ఉంది. అస్తవ్యస్తమైన ఈ ప్రపంచంలో మొరటు వాళ్లు మాత్రమే సఫలీకృతులు కాగలరనే ఒకే ఒక్క విషయం మీద వాళ్లంతా ఏకీభవించారు. సాంకేతిక విషయాలను చర్చించారు. ఒకరిపట్ల ఒకరు భిన్నాభి ప్రాయాలను వెలిబుచ్చి, అరుస్తూ అసభ్యంగా ప్రవర్తించారు. మొత్తానికి వాళ్లు బాగా ఆనందించారు.

పదకొండు గంటల ప్రాంతంలో నేనూ, జార్జ్ తిరిగి రూముకు నడిచాము. మ్యూనిక్ సోయగంతో తుళ్లిపడే పట్టణం. మేరియన్ ప్లాట్జ్ ప్రాంతాన్ని తప్పిస్తే వీధులన్నీ ఖాళీగా, నిశ్శబ్దంగా ఉన్నాయి. లోపలికి చేరుకోగానే, "ఇప్పుడు మీకు నేను పియానో వాయించి వినిపిస్తాను" అన్నాడు జార్జ్.

శిథిలావస్థలో వున్న ఒక చేతుల కుర్చీలో కూర్చున్నాను నేను. విరిగిన స్ప్రింగొకటి వెనక గుచ్చుకోసాగింది. అయినా నాకు నేను సాధ్యమైనంత సౌకర్యాన్ని కలుగజేసుకున్నాను.

చాపిన్ సంగీతాన్ని వాయించాడు జార్జ్. నాకు సంగీతం బహు స్వల్పంగా తెలుసు. ఈ కథను రాయడం అనేది నాకు కష్టంగా తోచడానికి గల కారణాల్లో అదొకటి. క్వీన్స్ హాల్లో సంగీత కచేరీకి వెళ్లినప్పుడు విశ్రాంతి సమయంలో కార్యక్రమ వివరాలను చదివితే నాకంతా అయోమయంగా ఉంటుంది. లయ గురించి, స్వరాల గురించి నాకేమీ తెలియదు. వాగ్నర్ సంగీతోత్సవాల కోసం ఒకసారి మ్యూనిక్ వచ్చి ట్రిస్టాన్ ఐలోడ్‌ల అద్భుత కచేరీకి వెళ్ళినప్పుడు ఒక్క స్వరాన్ని కూడా గుర్తించలేక నేనెంతగా కుమిలిపోయానో ఎప్పుడూ మరిచిపోను. మొదటి కొన్ని స్వరాలు నన్ను ఊహాలోకానికి వెళ్లగొట్టాయి. నేను రాయబోయే దాని గురించి ఆలోచించ సాగాను. నా పాత్రలు ప్రాణం పోసుకుని వాటి పొడవైన సంభాషణలు నాకు వినబడసాగాయి. వాటి కష్టాలను, సంతోషాన్ని నేను పంచుకున్నాను. సంవత్సరాలు గిర్రున తిరిగి అన్ని రకాల విషయాలు సంభవించినయ్. వసంత ఋతువు పారవశ్యాన్ని తీసుకొచ్చింది. చలికాలం వచ్చి నాకు వణుకు, ఆకలి కలిగినయ్. నేను ప్రేమించి, ద్వేషించి మరణించాను. మధ్య మధ్య విరామం ఉండిందనుకుంటాను. నేను తోట చుట్టూ తిరిగి బహుశా షింకెన్ బ్రూజెన్ తిని బీరు తాగి వుంటాను. కానీ నాకవి జ్ఞాపకం లేవు. నాకు గుర్తున్నదల్లా ఆఖరున తెర వాలి ఉలికిపాటుతో నేను మేల్కొనడమే! నేను ఆనందించాను. కానీ అంత డబ్బు ఖర్చు చేసి, అంత దూరం వచ్చి నేను చూసి విన్నదాని పట్ల ఏకాగ్రత వహించకపోవడం నా బుద్ధితక్కువతనమని అనుకోకుండా ఉండలేకపోయాను.

జార్జి వాయించినవి చాలా వరకు నాకు తెలుసు. అవి సంగీత సభల్లో పేరెన్నిక గన్నవి. హుషారుగా, గొప్ప శక్తితో వాయించాడు. తర్వాత బీతోవెన్ యొక్క అపాషనేటాను వాయించాడు. చాలాకాలం కిందట యవ్వనంలో ఉన్నప్పుడు నేను దాన్ని వాయించేవాణ్ని (చాలా ఘోరంగా అనుకోండి). ఇప్పటికీ ఆ స్వరాలన్నీ నాకు గుర్తే. అది సంగీత పరంగా శాస్త్రీయమైనదీ, చాలా గొప్పదీ అనే విషయాన్ని కాదనడం మూర్ఖత్వమే అవుతుంది. కానివేళ అది అంతగా కదిలించదంటాను. అది పారడైజ్ లాస్ట్ మాదిరిగా అమోఘమైనదే కానీ ఒక విధంగా అనుభూతిని గుప్త పరిచేది. దీన్ని కూడా జార్జ్ గొప్ప ఉత్సాహంతో హుషారుగా వాయించాడు. అతనికి బాగా చెమట పట్టింది. ప్రారంభంలో నేనతడి వాయించడంలోని లోపమేమిటో కనుగొనలేక పోయాను. ఏదో సవ్యంగా లేనట్టనిపించింది. రెండు చేతుల మధ్య సరిగా పొంతన కుదరడం లేదని, మంద్ర స్వరానికి, ఉచ్చస్వరానికి మధ్య స్వల్ప విరామం వుందని అప్పుడు తట్టింది నాకు. కానీ నేను పునరుద్ఘాటించేదేమిటంటే ఈ విషయాల గురించిన జ్ఞానం నాకు లేదు. అతడు ఎక్కువగా తాగిన బీరు ప్రభావమో లేక నేనే ఊరికే ఊహించడమో నాకాశ్చర్యాన్ని కలిగించి ఉండవచ్చు. నేనతనికి సాధ్యమైనన్ని ప్రశంసా వాక్యాలు పలికాను.

"నేనింకా ఎంతగానో శ్రమించడం అవసరమని నాకు తెలుసనుకోండి. నేనింకా ప్రారంభీకుణ్నే. కానీ సాధించగలనని నాకు నిస్సందేహంగా తెలుసు. ఇంకా పది సంవత్సరాలు పట్టవచ్చు. కానీ అప్పుడు నేను ఓ పియానో వాద్యకారుణ్నయిపోతాను"

బాగా అలసి ఉండడం మూలాన అతడు పియానో నుండి దూరంగా జరిగాడు. అర్ధరాత్రి దాటింది. నేను వెళ్తానన్నాను. కాని అతడు వినలేదు. రెండు బీరు సీసాలు తెరిచి పైపు వెలిగించుకున్నాడు. అతనికి మాట్లాడాలని ఉంది.

"నీకిక్కడ సంతోషంగా ఉందా?" అని అడిగాను.

"చాలా సంతోషంగావుంది" అని గంభీరంగా జవాబిచ్చాడు. "ఎప్పటికీ ఇక్కడే ఉండి పోవాలని నా ఇష్టం. జీవితంలో ఎప్పుడూ నేనింతగా ఆనందాన్ననుభవించలేదు. ఉదాహరణకు ఇవ్వాల్టి సాయంత్రాన్నే తీసుకోండి. అద్భుతంగా లేదూ?" అన్నాడు.

"చాలా ఉల్లాసకరంగా ఉండింది. కానీ ఎల్లకాలం విద్యార్థి జీవితాన్ని గడపలేం కదా. ఈ నీ స్నేహితులు పెద్దవాళ్లై వెళ్లిపోతారు"

"వేరే వాళ్లొస్తారు. ఇక్కడ ఎప్పుడూ విద్యార్థులు, ఇంకా అట్లాంటి వాళ్లు ఉంటారు"

'నిజమే. కాని నువ్వు కూడా పెద్దవాడివైపోతావు కదా. మధ్య వయస్కుడైన వాడు ఎల్లకాలం కళాశాల విద్యార్థి జీవితాన్ని గడిపే ప్రయత్నం చేసేకంటె శోచనీయం మరొకటుంటుందా! పిల్లవాళ్ల మధ్య పిల్లవాడిలాగా ఉండగోరి వాళ్లలో ఒకడిగా తనను స్వీకరిస్తారని తనను తాను సముదాయించుకో ప్రయత్నించే వృద్ధుడు ఎంత హాస్యాస్పదంగా కనిపిస్తాడు! అది సాధ్యం కాదు"

"ఇంటి దగ్గర నాకట్లానే అనిపించేది. మా నాన్నకేమో పాపం, నేను మర్యాదస్తుడైన ఇంగ్లిషు వాడిని కావాలని కోరిక. నాకేమో అది తల్చుకుంటే ఒళ్లు జలదరిస్తుంది. నేను ఆటగాణ్ని కాను. వేటాడ్డం, క్రికెట్ ఆడ్డం పట్ల నాకసలే లక్ష్యం లేదు. నేను కేవలం నటించేవాణ్ని".

"నీ నటన చాలా సహజంగా ఉండేది"

"అదంతా యథార్థం కాదని ఇక్కడికి వచ్చేదాకా నేను గుర్తించలేదు. ఎటన్ అంటే నాకెంతో ఇష్టం. ఆక్స్‌ఫర్డ్‌లో జల్సాగా ఉండేది. అయినప్పటికీ అవి నాకు చెందినవి కావని తెలుసు. నటన అనేది నా రక్తంలో ఉండడం వల్ల పాత్రను బాగా పోషించాను. కానీ అసంతుష్టమైనదేదో ఎన్నడూ నాలో ఉండేది. గ్రాస్‌వెనర్ స్క్వేర్‌లోని ఇల్లు మా స్వంతం. ఇంకా టిల్బీ కోసం నాన్న లక్షా ఎనభై వేల పౌండ్లు చెల్లించాడు. నా ఉద్దేశం మీకర్థమవుతున్నదను కుంటాను. అవి కేవలం కొంత కాలం కోసం మేము అద్దెకు తీసుకున్న అలంకృత గృహాలు కదా అనిపిస్తుంది. ఓ రోజు వాటిని మేము ఖాళీ చేయాలి. అసలు స్వంతదారులు వాటి కోసం వచ్చేశారు"

నేను జాగ్రత్తగా విన్నాను. అస్పష్టంగా అతడనుభవించిన దాన్ని ఎంత వరకు వర్ణించగలుగుతున్నాడో, ఇంకా ఈ మారిన పరిస్థితుల్లో తన అనుభూతిని ఎంతవరకు ఊహించుకుంటున్నాడో ననుకున్నాను.

"ఫెర్డీ తాత చెప్పే యూదుల కథలను వినాలంటే నా కెంతో అసహ్యం కలిగేది. అది చాలా నైచ్యం అనుకునే వాణ్ని. అది వేదనను వెళ్లగొట్టే కవాటమని ఇప్పుడు అర్థమైంది నాకు. మైగాడ్! పరువు గల వాడిగా బతకాలంటే ఎంత మనోవేదనో చెప్పలేను. నాన్నకు అది సులభం. టిల్బీలో భూస్వామిగా నటిస్తూ పట్టణంలో తానుగా ఉండగలడు. తనకు ఫరవాలేదు కానీ నేను నా మేకప్‌నూ, నాటకపు దుస్తులనూ వదిలేశాను. ఇప్పుడు నేను నేనుగా ఉండవచ్చు. ఎంత హాయిగా ఉందని! ఇంగ్లిష్ వాళ్లంటే నా కిష్టం లేదు. మీతో ఉంటే మా నిజమైన పరిస్థితి మాకు తెలియనే తెలియదు. మీరెంతో నిరాసక్తంగా నియమిత పద్ధతిలో ఉంటారు. మిమ్మల్ని మీరు స్వేచ్ఛగా ఉంచుకోరు. మీలో స్వేచ్ఛ, ఆత్మస్వాతంత్ర్యం లేవు. పోతే మీరు బాగా హడలిపోతారు. అనుచితమైన దాన్ని చేయడం కంటె మీరెక్కువగా భయపడేది ఈ ప్రపంచంలో మరొకటి లేదు."

"నువ్వు కూడా ఇంగ్లిష్ వాడివని మరిచిపోకు జార్జ్" – గొణిగాను నేను.

అతడు నవ్వాడు.

"నేనా? నేనింగ్లిష్‌వాణ్ని కాను. నాలో ఒక్క చుక్క కూడా ఇంగ్లిష్ రక్తం లేదు. నేను యూదుణ్నని మీకు తెలుసు. ఆ మాటకొస్తే నిజానికి జర్మన్ యూదుణ్ని. ఇంగ్లిష్ వాడినవ్వాలనే కోరిక నాకు లేదు. యూదుడిగా వుండాలనే నా కాంక్ష. నా స్నేహితులు యూదులు. వాళ్లతో నా కెంత హాయిగా ఉంటుందో మీకు తెలియదు. వాళ్లతో నేను నేనుగా ఉండొచ్చు. మా ఇంటికి యూదులు రాకుండా ఉండడానికి మాకు సాధ్యమైనంత ప్రయత్నించాము మేము. తను తెల్లగా ఉండడం మూలాన దాన్నుంచి తప్పించుకొని యూదేతరురాలిలాగా నటించవచ్చునని అనుకుంది అమ్మ. ఎంత కుళ్లు! మ్యూనిక్‌లోని యూదుల ప్రాంతాల్లో సంచరిస్తూ వాళ్ల ముఖాలను చూడడానికి చుట్టూ నడుస్తూ నేనెంతో ఆనందిస్తానని మీకు తెలుసా? నేనొకసారి ఫ్రాంక్‌ఫర్ట్ వెళ్ళాను. అక్కడ యూదులు కొల్లలుగా వున్నారు. నేనక్కడ వంకర తిరిగిన ముక్కులతో చెడ్డవాసన కొట్టే వృద్ధులనూ, నకిలీ వెంట్రుకలను ధరించిన లావుపాటి ఆడవాళ్లనూ చూశాను. వాళ్ల మీద నాకెంతో సానుభూతి కలిగింది. నేను వాళ్ళకు చెందిన వాణ్ననిపించింది. వాళ్లను ముద్దు పెట్టుకునే వాణ్ని. నా వంక చూసినప్పుడు నేనూ వాళ్ళలో ఒకణ్ణని వాళ్లకు తెలిసిందా అనిపించింది. యూదుల భాష నాకు తెలిసి వుంటే బాగుండేదని భగవంతుడిని కోరుకున్నాను. వాళ్లతో స్నేహం చేయాలనీ, వాళ్ళ ఇళ్ళలోకి పోయి వారి ఆహారాన్ని తినాలనీ – ఇంకా ఏమేమో చేయాలని

అనిపించింది. యూదుల ప్రార్థనాలయానికి వెళ్లాలనిపించింది కానీ అక్కడ ఏదైనా సవ్యంగా చేయకపోతే తన్ని బయటకు పంపిస్తారేమోనని భయపడ్డాను. యూదుల కాలనీ యొక్క వాసన, ప్రణయం – ఇవన్నీ నా కిష్టం. వాటి పట్ల నాకు గల తపనను ఇప్పుడు నా మస్తిష్కంలోంచి తీసివేయలేను. అదీ అసలు సంగతి. మిగిలినదంతా బూటకమే"

"నీ తండ్రి హృదయాన్ని గాయపరుస్తావు నువ్వు" అన్నాను.

"ఆయనదైనా నాదైనా హృదయమే. ఆయన నన్ను వదలలేడెందుకని! హ్యారీ ఉన్నాడుగా. టిల్బీకి భూస్వామి కావడం అంటే వాడెంతో ఇష్టపడతాడు. వాడు చాలా మంచి ఇంగ్లిష్ మనిషి కాగలడు. నేను క్రిస్టియన్‌ను పెళ్లి చేసుకోవాలని మా అమ్మ నా మీద ఆశలు పెంచుకుంది. హ్యారీ అయితే అందుకు ఎంతో ఇష్టపడతాడు చక్కని సనాతనమైన ఇంగ్లిషు కుటుంబాన్ని బాగా స్థాపించుకో గలవాడు. ఆఖరుకు నేనడిగేది చాలా స్వల్పం. నాకు కావలసింది వారానికి ఐదు పౌండ్లు మాత్రమే. బిరుదునూ, తోటనూ, గేవ్స్ బరోస్‌నూ – సమస్తం వాళ్ళే ఉంచుకోవచ్చు"

"సరే కానీ వాస్తవానికి రెండేళ్ళ తర్వాత తిరిగి వెళ్తానని మాట ఇచ్చావు నువ్వు" అన్నాను.

"తిరిగి వెళ్తాను సరే. లీ మకార్ట్ నా వాద్యాన్ని వింటానని వాగ్దానం చేసింది" నిర్లిప్తంగా అన్నాడు జార్జ్.

"నీ పియానో వాదనం బాగాలేదని ఆమె చెప్తే నువ్వేం చేస్తావు!"

"నన్ను నేను తుపాకీతో కాల్చేసుకుంటాను" అన్నాడు నవ్వుతూ.

"అది పిచ్చితనం" అదే స్వరంతో జవాబిచ్చాను.

"ఇంగ్లండులో ఉంటే స్వంత ఇంట్లో ఉన్నట్టనిపిస్తుందా మీకు?"

"అనిపించదు. కానీ అలాంటప్పుడు మరే చోటనైనా కూడా స్వంత ఇంట్లో ఉన్నట్టని పించదు"

కానీ సహజంగా అతడు నా పట్ల ఆసక్తిని కనపరచలేదు.

"తిరిగి వెళ్లాలనే ఆలోచనే నాకు అసహ్యాన్ని కలిగిస్తుంది. జీవితం ఇవ్వాల్సిందేదో ఇప్పుడు నాకు తెలిసింది కనుక ప్రపంచంలో ఏదీ నన్ను మర్యాదస్థుడైన ఇంగ్లిష్ పెద్ద మనిషిగా చేయజాలదు. మై గాడ్, అంతకన్న విసుగు తెప్పించేది మరొకటుండదు"

"డబ్బు అనేది ఎంతో మంచి వస్తువు. ఇంగ్లిష్ సమాజంలో హోదాగలవాడిగా ఉండడం అనేది చాలా ఆనందదాయకం" అన్నాను.

"డబ్బు అనేది ఏమంత పెద్ద విషయం కాదు. అది కొనగలిగే వస్తువులేవీ నేను కోరను. పోతే నేను డాబు మనుషుల సాంగత్యాన్ని మాత్రమే ఇష్టపడేవాణ్ని కాను" అన్నాడు.

అప్పటికే చాలా పొద్దుపోయింది. మర్నాడు చాలా పెందరాళే లేవాల్సి ఉంది నాకు. జార్జ్ చెప్పిన దానికి మరీ ఎక్కువ ధ్యాసనివ్వడం అనవసరమనిపించింది నాకు. అకస్మాత్తుగా కళలూ, ఇంకా చిత్రకారుల మధ్యకు విసిరి వేయబడ్డ ఒక యువకుడు చేసే బుద్ధి తక్కువతనంలా వుందది. కళ అనేది ఎంతో ఘాటైన మధువు. దాన్ని భరించడానికి బలమైన మస్తిష్కం కావాలి. దివ్య జ్వాల అనేది దాని ఉధృతిని సాధారణమైన తెలివితేటలతో మలచగలిగే వాళ్ళలోనే గొప్పగా మండుతుంది. జార్జ్‌కు ఇరవై మూడేళ్ళైనా ఉండవు. కాలం ఎంతో నేర్పుతుంది. అంతా చెప్పేసి చేసింతర్వాత అతని భవిష్యత్తుతో నా కెలాంటి సంబంధం లేదు. అతడికి వీడ్కోలు చెప్పి నా హోటలుకు తిరిగి నడిచాను. ఆకాశంలో చుక్కలు ప్రకాశిస్తున్నాయి. ఉదయాన మ్యూనిక్‌ను వదిలి వెళ్ళాను.

లండన్‌కు తిరిగి వచ్చింతర్వాత జార్జ్ నాతో ఏం మాట్లాడిందీ, ఎలా కనిపించిందీ మ్యూరియెల్‌తో చెప్పలేదు నేను. కానీ అతడు క్షేమంగా సంతోషంగా ఉన్నాడనీ, ఇంకా స్వచ్ఛమైన, మర్యాద కరమైన జీవితాన్ని సాగిస్తున్నాడనీ ఆమెకు హామీ ఇవ్వడంతో నన్ను నేను సంతృప్తి పరచుకున్నాను. ఆరు నెలల తర్వాత అతడు ఇంటికి వచ్చాడు. వారాంతంలో టిల్బీకి రావలసిందిగా అడిగింది నన్ను మ్యూరియెల్. జార్జ్ వాయించే పియానోను వినిపించడానికి లీ మాకార్ట్‌ను తీసుకొస్తున్నాడు ఫెర్డీ. రావలసిందిగా నన్ను ప్రత్యేకంగా కోరాడు. నేను ఆహ్వానాన్ని స్వీకరించాను. స్టేషను దగ్గర నాకు మ్యూరియెల్ కలిసింది.

"జార్జ్ ఎట్లా కనిపించాడు మీకు?" అని అడిగాను.

"బాగా లావయ్యాడు. కానీ బాగా ఉత్సాహంగా ఉన్నట్టు కన్పిస్తున్నాడు. ఇంటికి తిరిగి వచ్చినందుకు వాడికి సంతోషంగా ఉందనుకుంటాను. వాళ్ళ నాన్నతో చాలా స్నేహంగా ఉంటున్నాడు" అన్నదామె.

"చాలా సంతోషం" అన్నాను.

"వాడి పియానో వాదనం బాగా లేదని లీ మాకార్ట్ చెబితే బాగుండుననిపిస్తుంది. అది మా అందరికీ ఎంతో ఊరటగా ఉంటుంది"

"అతనికి భయంకరమైన నిరాశను కలిగిస్తుందేమోనని నా భయం"

"జీవితం నిరాశలమయం. కానీ వాటి నుండి తేరుకోవడం నేర్చుకోవాలి" అన్నది పొడిగా మ్యూరియెల్.

నేను వినోదపు తాలూకు దరహాసం చేశాను. మేమప్పుడు రోల్స్‌రాయ్స్ కార్లో కూచొని వున్నాము. మాతో ఇంకా నౌకరూ, డ్రైవరూ ఉన్నారు. సుమారు నలభై వేల పౌండ్ల విలువ చేసే ముత్యాల హారాన్ని ధరించిందామె. జన్మదిన సత్కారమప్పుడు రాజుచేత గొప్ప హోదా ప్రదానం చేయబడ్డ ముగ్గురు పెద్ద మనుషుల్లో సర్ ఎడాల్ఫస్ బ్లాండ్ లేడని జ్ఞాపకం వచ్చింది నాకు.

లీ మకార్ట్ అతి తక్కువ సేపు ఉండబోతోంది. ఆరోజు సాయంత్రం బ్రైటన్‌లో ఆమె కచేరి ఇవ్వబోతుంది. ఆదివారం ఉదయం కారులో టిల్బీకి వచ్చి భోజనం చేయబోతున్నది. సోమవారం మాంచెస్టర్‌లో కార్యక్రమం ఉండడంవల్ల అదేరోజు ఆమె లండన్‌కు తిరిగి వెళ్తుంది. మధ్యాహ్నం పూట జార్జ్ పియానోను వాయించాల్సి వుంది.

"వాడు బాగా అభ్యాసం చేస్తున్నాడు. అందుకే మిమ్మల్ని కలవడానికి వాడు నాతో రాలేదు" అన్నది మ్యూరియెల్.

తోట తలుపుల దగ్గర మలుపు తిరిగి ఆహ్లాదపరిచే సరుగుడు చెట్ల దారి గుండా ఇంటి దాకా వెళ్లాము. పార్టీ లేదని తెలిసింది నాకు.

ఆస్తిపరురాలైన విగత భర్తృక, లేడీబ్లాండ్‌ను మొదటిసారిగా కలిశాను నేను. ఆమెను చూడాలని ఎప్పటి నుండో నాకు సర్వదా ఉత్సుకతగా ఉండేది. పోర్ట్‌లాండ్ ప్లేస్‌లోని ఘనమైన తన ఇంట్లో నివసిస్తూ అన్ని వ్యవహారాల్లో పాత్ర వహించి అధికార హస్తంతో కుటుంబాన్ని ఏలే ఆ వృద్ధ యూదురాలి మనోహర చిత్రం నా హృదయచక్షువుల ముందు కదలాడింది. ఆమెను చూడగానే పరవాలేదనిపించింది నాకు. లావున్నట్టనిపించకుండానే కొంచెం పొడుగ్గా, ధృఢంగా ఉన్న ఆమె ఆకారం మనసుకు హత్తుకునేలా ఉంది. ఆమె ముఖంలో యూదుల పోలికలు కొట్టొచ్చినట్టుగా కనబడుతున్నాయి. శరీరం మీద దట్టమైన వెంట్రుకలతో విచిత్రమైన గోధుమ వర్ణపు విగ్గును ధరించింది. నల్లని జరీగుడ్డతో ఛాతి మీద వరుసగా ఉన్న పెద్ద పెద్ద వజ్రాలతో, మెడ చుట్టూ వజ్రాల హారంతో ఆమె దుస్తులు ఎంతో గొప్పగా వున్నాయి. ముడతలు పడ్డ ఆమె చేతుల మీద వజ్రపుటుంగరాలు మెరుస్తున్నాయి. బలమైన జర్మన్ ఉచ్చారణతో కొంచెం ఖంగుమనే కంఠంతో మాట్లాడిందామె. నన్ను ఆమెకు పరిచయం చేయగానే ప్రకాశించే తన కళ్లతో నన్ను బేరీజు వేసి, తీర్పు అనుకూలంగా లేదనే విషయాన్ని నానుండి దాచడానికి ప్రయత్నం చేయకపోవడం నాకు ఆశ్చర్యాన్ని కలిగించింది.

"నా తమ్ముడు ఫెర్డినాండ్‌ను మీరు చాలా సంవత్సరాలుగా ఎరుగుదురు. ఔనా?" అన్నది. ఫెర్డినాండ్‌లోని ర్ శబ్దాన్ని గొంతులోంచి దొర్లేలా మాట్లాడుతూ – "నా తమ్ముడు ఫెర్డినాండ్ సర్వదా సజ్జనుల సాంగత్యంలో తిరుగుతుంటాడు. సర్ ఎడాల్ఫస్ ఎక్కడున్నాడు మ్యూరియెల్? మీ అతిథి వచ్చేసినట్టు వాడికి తెలుసా? పోతే, నువ్వు జార్జ్‌ను పిలిపించవా? తను వాయించ బోయేది వాడికి ఇప్పుడు తెలియకపోతే రేపు అసలే తెలియదు"అన్నది పొడిగిస్తూ.

ఫ్రెడ్డీ తన సెక్రటరీతో గోల్ఫ్ ఆడుతున్నాడనీ, నేను వచ్చిన విషయం జార్జ్‌కు తానెప్పుడో తెలియజేసిందని చెప్పింది మ్యూరియెల్. మ్యూరియెల్ ఇచ్చిన సమాధానాలు ఎంత మాత్రం సంతృప్తికరంగా లేవన్నట్టు కనిపించిన లేడీబ్లాండ్ మళ్లీ నా వైపు తిరిగింది.

"మీరు ఇటలీకి వెళ్లినట్లు మా కోడలు చెప్పింది" అన్నది.

"అవును. మొన్న మొన్ననే తిరిగొచ్చాను"

"ఆ దేశం ఎంతో సుందరమైనది. రాజు ఎలా ఉన్నాడు?"

నాకు తెలియదన్నాను.

"ఆయన చిన్నపిల్లవాడిగా ఉన్నప్పుడు నాకు తెలుసు. అప్పట్లో అతడంత బలంగా ఉండేవాడు కాదు. అతని తల్లి మార్గెరిటా రాణి నాకు బాగా స్నేహితురాలు. అతడు అసలే పెళ్లి చేసుకోడనుకున్నారు వాళ్లు. మాంటెనెగ్రో యువరాణితో అతడు ప్రేమలో పడ్డప్పుడు అయోస్టా యువరాణికి చాలా ఆగ్రహం కలిగింది"

ఆమె చరిత్రలో ఎప్పుడో గతించిన కాలానికి చెందిన దానిలా కనిపించింది. కానీ చాలా చురుకుగా ఉంది. పూసల వంటి ఆమె కళ్లనుండి ఏదీ తప్పించుకోలేదని నేను గ్రహించాను. అంతలోనే వదులైన పైజామా వంటి ప్యాంటుతో చక్కగా, ఆకర్షణీయంగా ఫ్రెడ్డీ ప్రవేశించాడు. నెరిసిన గడ్డంతో ఎప్పుడూ దాదాపు నియంతలా ఉండే నిబంధనను కలిగిన అతడు ముసలావిడతో అతి సౌమ్య ప్రవర్తనను కలిగి ఉండడం వినోదంగా ఉన్నా కొంచెం హృదయాన్ని కదిలించింది. అతడామెను 'అమ్మా' అని సంబోధించాడు. అంతలోనే జార్జ్ ప్రవేశించాడు. మునుపటిలానే లావుగా ఉన్నాడు కాని నా సలహాను పాటించి క్షవరం చేయించుకున్నాడు. అతనిలోని పిల్లవాడి రూపం పోతోంది. కానీ ఇంకా బలమైన యువకుడిలానే ఉన్నాడు. టీ తాగడాన్ని అతడానందించడం చూస్తే నాకు ముచ్చటేసింది. ఎన్నో సాండ్‌విచ్‌లూ, పెద్ద కేకు ముక్కలూ తిన్నాడు. ఇంకా అతనికి చిన్నపిల్లల ఆకలి వంటిది ఉంది. తండ్రి అతన్ని మృదువైన చిరునవ్వుతో చూశాడు. వాళ్లందరికీ ఆ అబ్బాయి పట్ల నిస్సందేహమైన అవ్యాజానురాగాలు ఉండటం నా కాశ్చర్యాన్ని కలిగించలేదు. నిస్సందేహంగా అత్యంత ఆహ్లాదకరమైన అమాయకత, ఆకర్షణ, ఉత్సాహం కనిపించాయతనిలో. ఇతరులలో తన పట్ల ఆకర్షణను కలిగించే కలుపుగోలుతనం, సహజమైన సహృదయత, ఇంకా అతని ప్రవర్తనలో ఉదారత ఉన్నాయి. నానమ్మ చేసిన సంజ్ఞ వల్లనో లేక కేవలం అతని మంచి స్వభావం వల్లనో తెలియదు కాని, తన నాన్నతో స్నేహంగా ఉండడం కోసం అతడు తన నైజానికి భిన్నంగా ఉన్నట్టు స్పష్టంగా తెలుస్తూనే వుంది. ఇంకా అతని తండ్రి యొక్క మృదువైన కళ్లలో, ఆ అబ్బాయి మాటలను శ్రద్ధగా వినే తీరులో, గర్వమూ సంతోషమూ నిండిన అతని చూపులో గత రెండేళ్ల ఎడబాటు తాలూకు దుర్భర వేదన కనిపించింది. జార్జ్‌ను అతడు దాదాపు ఆరాధించాడు

మ్యూరియెల్ చర్చికి పోవలసిరావడంతో మాతో కలవకపోవడం వల్ల ఉదయం పూట మేము ముగ్గురం గోల్ఫ్ ఆడాము. ఒంటి గంటకు లీ మకార్ట్ కారులో వచ్చాడు

ఫెర్డీ. మేము భోజనానికి కూర్చున్నాము. లీ మకార్ట్ పేరు ప్రఖ్యాతుల గురించి నాకు బాగా తెలుసు. యూరప్‌లోని అతి గొప్ప పియానో వాద్యకారిణిగా ఖ్యాతి నార్జించిందామె. ఫెర్డీకి ఆమె చాలా పాత స్నేహితురాలు. ఆమె కళా జీవితపు ప్రారంభంలో ఫెర్డీ తన ఆసక్తి, అండదండలతో ఆమెకు గొప్ప సహాయం చేశాడు. ఆమె రావడానికి, జార్జ్‌కు గల అవకాశాలను గురించిన తన అభిప్రాయాన్నివ్వడానికి ఏర్పాటు చేసింది ఫెర్డీయే.

ఒకప్పుడు నేనామె కచేరీలకు వీలైనంత తరచుగా వెళ్లేవాణ్ని. ఆమెకు కృత్రిమత్వాలు లేవు. ఎలాంటి శ్రమ ఉన్నట్టు కనిపించకుండా పక్షులు పాడినట్టు చాలా సహజంగా వాయిస్తుంది. తేలికైన ఆమె వేళ్ల నుండి మృదువైన స్వరాలు వాటంతటవే కారుతున్నట్టనిపిస్తూ క్లిష్టమైన ఆ లయలను ఆమె రాగబద్ధం చేస్తుందా అన్న భావన కలుగుతుంది మనకు. ఆమె వాదనలోని టెక్నిక్ అద్భుతమైనదని అనేవాళ్లు కొందరు. ఆమె వాదనం నాకిచ్చిన ఆనందంలో ఎంత భాగం ఆమె రూపం వల్ల కలిగిందో నేనసలే నిర్ధారణ చేసుకోలేకపోయాను. ఆ రోజుల్లో ఆమె అత్యంత పారభౌతికమైనదిగా ఎంచబడేది. సన్నగా, నాజూకుగా దేవకన్యలా ఉండే ఆమె అంత పుష్టిని కలిగి ఉండడం ఆశ్చర్యాన్ని కలిగించేది. విశాలమైన కళ్లతో, అద్భుతమైన నల్లని కురులతో చిన్నగా, తెల్లగా ఉండే ఆమె పియానో దగ్గర కూర్చున్నప్పుడు మనసును కదిలించేలా ఆకర్షణీయంగా ఉండే చిన్న పిల్లల వంటి జాలి, తపన కలిగి ఉండేది. ఆమెలో ఒక మానవేతరమైన గొప్ప సౌందర్యం ఉండేది. మూసిన పెదాల మీద సన్నని చిరునవ్వుతో ఆమె పియానో వాయించేటప్పుడు అన్య ప్రపంచంలో తను విన్నవాటిని జ్ఞాపకం చేసుకుంటున్నదా అన్నట్టు కనపడేది. ఇప్పుడు నలభైల మొదట్లో ఉన్న ఆమె ఇంకా దేవకన్యలా ఎట్లాగూ ఉండదు. ఆమె లావైపోయి ముఖం వెడల్పైంది. సామాన్య మానవులకు అతీతంగా ఉన్నట్టు ఆకర్షణీయంగా కనిపించే ఆమెలోని విశిష్టత ఇప్పుడేమాత్రం లేకుండాపోయింది. కానీ తన సుదీర్ఘ విజయపరంపర తాలూకు గర్వం మాత్రం ఇంకా ఆమెలో ఉంది. ఆమె చురుకుగా, చలాకీగా, నిర్దిష్టమైన క్రమపద్ధతిలో ఇంకా కబళించేలా ఉంది. దేవ ఋషుల చుట్టు పవిత్రత వలయాకారంలో ప్రకాశించినట్టు తన జీవశక్తి ఆమెను ఉజ్వలమైన సహజకాంతితో వెలిగించింది. స్వంత విషయాలలో తప్ప ఇతర సంగతుల పట్ల ఆమెకు అంతగా ఆసక్తి లేకపోయినప్పటికీ లోకాన్నెరిగిన ఆమెలో చమత్కార శక్తి ఉండడం వల్ల వాటిని ఉల్లాసభరితం చేయగలిగే సామర్థ్యం ఉంది. ఆమె సంభాషణ చేసింది కానీ దానిపట్ల ధ్యాసను, ఆసక్తిని కనబరచలేదు. జార్జ్ తక్కువగా మాట్లాడాడు. మధ్య మధ్య అతని వంక ఓ చూపు వేసింది కానీ అతణ్ని సంభాషణలోకి దింపడానికి ఆమె ప్రయత్నించలేదు.

నేనొక్కడినే అక్కడ యూదేతరుణ్ని. ఒక ముసలి లేడీ బ్లాండ్ తప్ప అందరూ కచ్చితమైన ఇంగ్లిష్ మాట్లాడినప్పటికీ వాళ్లు ఇంగ్లిష్ వాళ్లలా మాట్లాడలేదని అనుకోకుండా ఉండ లేకపోయాను నేను. వాళ్లు అచ్చులను మాకంటె ఎక్కువగా చుట్టినట్టనిపించింది. నిస్సందేహంగా వాళ్లు మాకంటే బిగ్గరగా మాట్లాడారు. పదాలు నోట్లోంచి పడుతున్నట్టుగా కాక వాళ్ళ పెదాల్లోంచి తన్నుకువస్తున్నట్టుగా అనిపించాయి. నేను వేరే గదిలో ఉండి వాళ్ల సంభాషణలోని పదాలు కాక గొంతు మాత్రమే నాకు వినపడి ఉంటే వాళ్లు విదేశీ భాషలో మాట్లాడుకుంటున్నారని అనుకునేవాడినేమో. ఆ ప్రభావం కొంచెం కలవరపాటును కలిగించేదిలా ఉంది.

లీ మకార్ట్ ఆరు గంటల ప్రాంతంలో లండన్‌కు బయలు దేరదలచుకోవడం వల్ల నాలుగు గంటలకు జార్జ్ పియానో వాయించవలసిందగా ఏర్పాటు చేయడమైంది. ఆలకించడం తాలూకు ఫలితం ఏదైనా ఆమె నిర్గమనం వాళ్లను మళ్ళీ పూర్తిగా కుటుంబ వాతావరణంలో పడవేస్తుంది కనుక ఆ మనుషులకు కొత్తవాణ్నైన నేను ఆటంకంగా ఉంటాను. కాబట్టి మర్నాడు ఉదయమే నగరంలో నాకు పని ఉన్నట్టు అబద్ధమాడి తనతో కారులో నన్ను తీసుకుపోవడానికి వీలవుతుందా అని లీ మకార్ట్‌ను అడిగాను.

నాలుగు గంటల కంటె కొంచెం ముందుగా మేమంతా డ్రాయింగ్ రూమ్‌లోకి నడిచాము. ముసలి లేడీ బ్లాండ్ ఫెర్డీతో కలిసి సోఫాలో కూర్చుంది. సహజ జ్ఞానంతోనా అన్నట్లు ఆమె కొంచెం సింహాసనంలా ఉన్న ఎత్తయిన జాకోబియన్ కుర్చీని ఎన్నుకుంది. లేత పచ్చని చర్మంతో, పసుపు పచ్చని దుస్తుల్లో వున్న ఆమె చాలా సుందరంగా కనబడింది. ఆమె కళ్ళు అపూర్వమైనవి. బాగా అలంకరించుకుంది. పెదాలు ఎర్రగా వున్నాయి.

జార్జ్‌లో ఆరాటపు ఛాయలు కనపడలేదు. అతని తల్లిదండ్రులతో నేను లోపలికి ప్రవేశించేసరికి అంతకు ముందే పియానో దగ్గర ఆసీనుడై ఉన్నాడు. మేము సర్దుకొని కూర్చుంటుండగా మౌనంగా మమ్మల్ని పరికించాడు. నన్ను చూసి ఛాయామాత్రంగా మందహాసం చేశాడు. మేమందరం పూర్తిగా సర్దుకున్నట్టు గమనించింతర్వాత అతడు పియానో వాయించడం ప్రారంభించాడు. చాపిన్ సంగీతాన్ని వాయించాడు. నాకు తెలిసిన రెండు వాల్స్‌లను వాయించాడు. అందులో ఒకటి పోలండ్ దేశపు మంద్ర సంగీతం. అతని వాదనంలో గొప్ప శక్తీ, ఉత్సాహమూ ఉన్నయ్. అతని వాదనాన్ని గురించిన కచ్చితమైన వర్ణనను ఇవ్వడానికి నాకు సరిపోయేటంత సంగీత జ్ఞానం ఉంటే బాగుండేదనిపించింది. అందులో పుష్టీ, యవ్వనపు ఉత్సాహమూ ఉన్నాయి. కానీ నా మట్టుకు నాకు తోచే చాపిన్ తాలూకు వింత సొగసు, మృదుత్వం, ఆరాటం నిండిన దిగులు, తపనతో కూడిన ఆనందం, ఇంకా నాకు సర్వదా తొలి విక్టోరియా కాలపు

జ్ఞాపక చిహ్నాన్ని తలపించే పాత ప్రణయం – ఇవన్నీ లేనట్టనిపించింది. పోతే అతని రెండు చేతుల మధ్య కచ్చితమైన పొంతనలేనట్టు లీలామాత్రంగా మళ్లీ నాకు తోచిన భావన ఎంత స్వల్పంగా కలిగిందంటే అది నాకు తెలిసీ తెలియనంత బలహీనంగా ఉంది. ఫెర్డీ తన అక్క వైపు చిన్నపాటి ఆశ్చర్యంతో చూడడం గమనించాను నేను. మ్యూరియెల్ కళ్లు జార్జ్ పైనే నిలిచాయి. కానీ అంతలోనే ఆమె చూపులు దింపి మిగిలినంతసేపు నేల మీద దృష్టిని నిలిపింది. తండ్రి కూడా అతణ్ని చూశాడు. అతని కళ్లు నిశ్చలంగా కేంద్రీకృతమయ్యాయి. కానీ నా అభిప్రాయం తప్పుకాని పక్షంలో అతడు తెల్లగా పాలిపోయి ముఖంలో నిరాశ వంటి భావపు చిహ్నాలు కనపడ్డాయి. సంగీతం అనేది వాళ్లందరి రక్తంలో ఉంది. జీవితమంతా వాళ్ళు ప్రపంచంలోని గొప్పగొప్ప పియానో వాద్యకారుల వాదనాన్ని విని సహజ జ్ఞానంతో కచ్చితంగా అంచనా వేశారు. ముఖంలో ఎలాంటి భావాన్ని వ్యక్తం చేయనిది లీ మకార్ట్ ఒక్కతే! ఆమె చాలా ఏకాగ్రతతో విన్నది. గోడ మూలలో ఉండే విగ్రహమంత నిశ్చలంగా ఉన్నదామె.

చివరకు అతడు వాయించడం ఆపి కుర్చీ మీదుగా గిరుక్కున తిరిగి ఆమె వైపు ముఖం చేశాడు. అతడు మాట్లాడలేదు.

“నన్నేం చేయమంటావు?” అనడిగింది లీ మకార్ట్

ఒకరి ముఖం ఒకరు చూసుకున్నారు వాళ్లు.

“ముందు ముందు మొదటి శ్రేణి పియానో వాద్యకారునిగా అయ్యే అవకాశాలు నాకేమైనా వున్నాయా చెప్పండి”

“వెయ్యేళ్లలో కూడా లేవు.”

ఒక్క క్షణం పాటు శ్మశానపు నిశ్శబ్దం చోటు చేసుకుంది. ఫ్రెడ్డీ తల కిందికి వాల్చి కార్పెట్ మీది తన కాళ్ల వైపు చూడసాగాడు. అతని భార్య తన చేతిని చాపి అతని చేతిని పట్టుకుంది. కానీ జార్జ్ లీమకార్ట్ వైపే నిశ్చలంగా చూడసాగాడు.

“పరిస్థితులను గురించి ఫెర్డీ నాకు చెప్పాడు. నేను వాటి ప్రభావానికి లోనయ్యాననుకోవద్దు. అట్లాంటిదేదీ ప్రధానం కాదు” అన్నది చివరకు. అందమైన వస్తువులతో వైభవోపేతమైన ఆ గదినీ, ఇంకా మమ్మల్నందర్నీ ఆక్రమించేలా చేతిని పెద్దగా ఊపింది. “కళాకారుని లక్షణాలు నీలో ఉన్నట్టు నాకు తోచినట్టయితే కళ కోసం అన్నిటినీ త్యజించవలసిందిగా నిన్ను అర్థించడానికి నేను సందేహించేదాన్ని కాదు. కళ ఒక్కటే ముఖ్యమైనది. కళతో పోలిస్తే ఐశ్వర్యం, హోదా, అధికారం – ఇవన్నీ గడ్డిపోచల్లాంటివి” – ఎట్లాంటి కోపం లేనట్టి నిజాయితీ నిండిన చూపు నొకటి మా వైపు విసిరింది– “లెక్కలోకి వచ్చేది మాలాంటి వాళ్ళు మాత్రమే. మేం ప్రపంచానికి సార్థకతను చేకూరుస్తాము. మీలాంటి వాళ్లు కేవలం మాకు ముడి సామగ్రినిస్తారు”

మిగతా వాళ్లతో పాటు నన్నారకంలో జమకట్టడం నాకేమాత్రం నచ్చలేదు. కానీ అదంత పెద్ద విషయం కాదు.

"నువ్వు చాలా కష్టపడి సాధన చేసినట్టు నాకు కనపడుతూనే ఉందనుకో. అదంతా వృథా అయినట్టు భావించవద్దు. పియానో వాయించగలగడం నీకెప్పుడూ ఆనందాన్నిస్తుంది. ఇంకా సాధరణ వ్యక్తులు ఆశించజాలని విధంగా నువ్వు గొప్ప సంగీతాన్ని గుర్తించగలిగేలా చేస్తుంది నిన్ను. నీ చేతుల వైపు చూసుకో. పియానో వాద్యకారుని చేతులు కావవి"

అప్రయత్నంగా నేను జార్జ్ చేతుల వైపు చూశాను. ఇంతకుముందు నేనెప్పుడూ వాటిని పరీక్షగా చూడలేదు. పొట్టిగా, లావుగా ఉన్న ఆ చేతులను, చిన్నగా మందంగా ఉన్న ఆ వేళ్లను చూసిన నాకు విస్మయం కలిగింది.

"నీ చెవులు అంత పరిణతంగా లేవు. నువ్వు ఆరితేరిన అపరిపూర్ణ కళాకారుడిగా కాక వేరే కాగలవని నేననుకోను. అపరిపూర్ణ కళాకారుడికీ, ప్రొఫెషనల్ కళాకారుడికీ మధ్య కళలో ఉన్న వ్యత్యాసం లెక్క కట్టలేనిది"

జార్జ్ సమాధాన మివ్వలేదు. ముఖంపాలిపోవడం తప్పిస్తే అతని ఆశలన్నిటినీ తునాతునకలు చేసే ఆ మాటలను అతడు వింటున్నట్టు ఎవరికీ తెలిసేది కాదు. అక్కడ చోటు చేసుకున్న నిశ్శబ్దం ఎంతో భయంకరంగా ఉంది.

అకస్మాత్తుగా లీ మకార్ట్ కళ్ళలో నీళ్లు నిండాయి.

"కానీ కేవలం నా అభిప్రాయాన్ని మాత్రమే తీసుకోవద్దు. నేనైనా పొరపాటుకు అతీతురాలిని కాను. మరెవర్నైనా అడుగు. పాడెర్యూస్కీ ఎంత మంచివాడో, ఎంతటి ఉదారస్వభావుడో నీకు తెలుసు కదా. నీ గురించి నేనతనికి రాస్తాను. నువ్వు వెళ్లి పియానో వాయించి వినిపించవచ్చు. అతడు తప్పకుండా వింటాడని నా నమ్మకం".

జార్జ్ చిన్నగా నవ్వాడు. అతడు చాలా సత్ప్రవర్తనుడు. తనకు ఎట్లాంటి అనుభూతి ఉన్నా పరిస్థితిని ఇతరులకు ఇబ్బందికరంగా చేయదల్చుకోలేదతడు.

"అది అవసరం అనుకోను నేను. మీ తీర్పును నేను తృప్తితో స్వీకరిస్తాను. నిజం చెప్పాలంటే మీరిచ్చిన తీర్పు మ్యూనిక్‌లో నా గురువు ఇచ్చినదానికి ఎక్కువ భిన్నంగా లేదు".

పియానో దగ్గర నుండి లేచి నిలబడి సిగరెట్టు వెలిగించుకున్నాడు. దాంతో ఆరాటం తగ్గింది. మిగతా వాళ్లు కుర్చీలో కొద్దిగా కదిలారు. లీ మకార్ట్ జార్జ్ వైపు చూసి నవ్వింది.

"నేను వాయించనా?" అంది.

"ఆం, వాయించండి" అన్నాడు జార్జ్.

ఆమె లేచి పియానో దగ్గరికి వెళ్లింది. వేళ్ల నుండి ఉంగరాలను తీసింది. బాహ్ సంగీతాన్ని వాయించింది. నాకు ఆ గీతాల పేర్లు తెలియవు గానీ జర్మన్ పెరళ్లలోని బలమైన సంప్రదాయం, హుందాతనం, రైతుల ఇంటి ప్రాంగణాలలోని సౌకర్యం, గ్రామసీమల పొలాల్లోని నాట్యాలు, క్రిస్మస్ చెట్లలా కనపడే ఆకుపచ్చని వృక్షాలు, విశాలమైన జర్మన్ గ్రామాల్లోని నీరెండ – ఇంకా మెత్తని వెచ్చదనం – ఇవన్నీ తలపుకు రాసాగాయి. నా ముక్కుపుటాల్లో వెచ్చని మట్టివాసన చోటు చేసుకుంది. తల్లినేలలో వేళ్లు పాతుకున్నట్టనిపించే బలమైన శక్తి తాలూకు స్పృహ కలిగింది నాకు. కాలరహితమైన అంతరిక్షంలో ఎక్కడా నివాసం లేని మూలశక్తి అనుభవంలోకి వచ్చింది. వేసవి కాలపు పగటి ఆకాశంలో పూర్ణచంద్రుడు ప్రకాశిస్తున్నట్టనిపింపజేసేలా మృదువైన కాంతితో సుందరంగా వాయించింది. మిగతా వాళ్లు ఎంత తీవ్రంగా అనుభూతిని పొందుతున్నారో నాలోని మరో భాగంతో గమనించాను. వాళ్లు తన్మయులైపోయారు. వాళ్లను ఆవరించిన అపూర్వోద్వేగాన్ని సంగీతం నుండి నేనూ పొందితే బాగుండునని నేను మనసారా కోరుకున్నాను. ఆమె ఆగింది. ఆమె పెదవులపై దరహాసం నిలిచింది. వేళ్లకు తిరిగి ఉంగరాలను తొడుక్కుంది.

జార్జ్ చిన్నగా కిలకిలమని నవ్వాడు.

“కట్టిపడేసేలా ఉంది మీ పియానో వాదనం”అన్నాడు.

పనివాళ్లు టీ తీసుకొచ్చారు. లీ మకార్డ్, నేనూ వాళ్ళందరికీ వీడ్కోలు చెప్పి కారెక్కాము. లండన్‌కు ప్రయాణించాము. దారి పొడవునా ఆమె గొప్పగా కాకపోయినా నిస్సందేహంగా తీవ్రమైన ఉత్సాహంతో మాట్లాడింది. మాంచెస్టర్‌లో తన తొలి సంవత్సరాల గురించి, ప్రారంభ కాలంలో తన యాతనలను గురించి నాకు వివరించింది. ఎంతో ఆసక్తి గొలిపేలా మాట్లాడిందామె. జార్జ్ గురించి మాటైనా ఎత్తలేదు. జరిగిపోయిన ఆ గాథ ఆమెకు ప్రాముఖ్యం లేనిది. దాని గురించి ఆమె తిరిగి ఆలోచించనే లేదు.

మేం వెళ్లింతర్వాత టిల్బీలో ఏం జరిగిందో స్వల్పంగా తెలిసింది. మేం వెళ్ళగానే జార్జ్ డాబా మీదికి పోయాడు. అంతలోనే తండ్రి అతనితో చేరాడు. ఫ్రెడ్డీ గెలిచాడు. కానీ ఆయనకు సంతోషంగా లేదు. స్త్రీల మనోసౌకుమార్యాన్ని మించిన సౌకుమార్యంతో అతడు జార్జ్ బాధపడుతున్నట్టు తెలుసుకున్నాడు. జార్జ్ ఆవేదన అతని హృదయాన్ని ముక్కలు చేసింది. ముందెన్నడూ ప్రేమించనంతగా ఆ సమయాన తన కొడుకునే ప్రేమించాడు. అతడు కనిపించగానే జార్జ్ చిన్న నవ్వుతో స్వాగతమిచ్చాడు. ఫ్రెడ్డీ గొంతు గద్గదమైంది. హఠాత్తుగావచ్చి ముంచెత్తిన ఉద్వేగాన్ని తనలో కనుగొని తన విజయ ఫలితాలను వదలుకుని లొంగిపోవాలనిపించిందతనికి.

"చూడు జార్జ్! నీకెంత పెద్ద నిరాశ కలిగిందో ఊహించడం నా వల్ల కావడం లేదు. మరో సంవత్సరం కోసం మ్యూనిక్ తిరిగి వెళ్లి చూస్తావా?"

జార్జ్ తల అడ్డంగా ఊసాడు.

"ఊహుం అదేం బాగుండదు. నా అవకాశం ఐపోయింది. ఈరోజు చేయవలసిందేదో పూర్తయింది".

"మరీ అంతగా మనసుకు తీసుకోకు"

"పియానో వాద్యకారుడు కావడమొక్కటే ప్రపంచంలో నేను కోరుకునేది. ఇప్పుడిక చేసేదేమీ లేదు. దాన్ని గురించి ఆలోచించడం కొంచెం చేదుగా ఉంటుంది".

ధైర్యంగా ఉండడానికి ఎంతో ప్రయత్నిస్తూ నీరసంగా నవ్వాడు జార్జ్

"ప్రపంచమంతా తిరిగి రావాలని ఉందా? ఆక్స్‌ఫర్డ్ స్నేహితుల్లో ఒకడిని నీతో పాటు తీసుకువెళ్లొచ్చు నువ్వు. ఖర్చులన్నీ నేనిస్తాను. చాలా కాలంగా నువ్వెంతో కష్టపడుతూ వచ్చావు."

"చాలా కృతజ్ఞతలు నాన్నా. దాని గురించి తర్వాత మాట్లాడుకుందాం. నేనిప్పుడు వాహ్యాళికి వెళుతున్నాను."

"నేను కూడా రానా నీతో!"

"ఒంటరిగానే వెళ్లాలనుకుంటున్నాను".

అంతలోనే జార్జ్ ఒక విచిత్రమైన పని చేశాడు. తండ్రి మెడ చుట్టూ చేయి వేసి పెదాల మీద ముద్దు పెట్టుకున్నాడు. వింతైన చిన్న నవ్వొకటి నవ్వి వెళ్ళిపోయాడు. ఫ్రెడ్డీ డ్రాయింగ్ రూమ్‌కు తిరిగి వెళ్ళాడు. అతని తల్లి, ఫెర్డీ, ఇంకా మ్యూరియెల్ కూర్చుని వున్నారక్కడ.

"అబ్బాయికి పెళ్లెందుకు చేయకూడదు ఫ్రెడ్డీ? వాడికి ఇరవై మూడేళ్ళున్నాయి. పెళ్లితో యని మనసు బాధల నుండి దూరమౌతుంది. పెళ్లి తర్వాత ఓ బిడ్డ పుట్టిన వెంటనే వాడు స్థిరపడిపోతాడు" అంది ముసలావిడ.

"వాడెవర్ని పెళ్లి చేసుకోవాలి అమ్మా?" నవ్వుతూ అడిగాడు సర్ ఎడాల్ఫస్.

"అదంత కష్టమైన పని కాదు. కొన్ని రోజుల క్రితం తన కూతురు వయలెట్‌ను తీసుకుని లేడీ ఫ్లైలింగాసెన్ నన్ను చూడ్డానికి వచ్చింది. ఆ అమ్మాయి చాలా బాగుంది. ఆమెకు తన వంతు ధనం కూడా వస్తుంది. వయలెట్ తగిన సంబంధం అయితే సర్ జేకబ్ సంతోషంగా ఇక్కడికి వచ్చి మాట్లాడుతాడని లేడీ ఫ్లైలింగాసెన్ నాకు సూచన ప్రాయంగా తెలిపింది."

“లేడీ ఫ్రైలింగాసెన్ అంటే నా కసహ్యం. పెళ్లి చేసుకోవడానికి జార్జ్ ఇంకా చాలా చిన్నవాడు. తన కిష్టమైన వాళ్లనెవరినైనా వాడు పెళ్లాడవచ్చు.

ముసలి లేడీ బ్లాండ్ వింత చూపొకటి చూసింది.

“నువ్వు చాలా బుద్ధితక్కువ పిల్లవు మిరియామ్” – మ్యూరియెల్ ఏనాడో వదులుకున్న పేరును వాడుతూ అన్నది – “నేనిక్కడ ఉన్నంత వరకు నిన్ను బుద్ధితక్కువ పని చేయనివ్వను” అన్నది.

జార్జ్ యూదేతరురాలిని పెళ్లాడాలని తనకిష్టం ఉన్నట్టు మ్యూరియెల్ సూచిస్తున్నదని ఆమెకు తెలుసు. కానీ తాను బ్రతికున్నంత దాకా ఫ్రెడ్డీ కానీ, అతని భార్య కానీ దాన్ని ప్రస్తావనకు తెచ్చే ధైర్యం చేయరని కూడా ఆమెకు తెలుసు.

జార్జ్ వాహ్యాళికి వెళ్లలేదు. హంటింగ్ సీజన్ సమీపించడం వల్లనేమో తుపాకుల గదిలోకి వెళ్ళాలని అతని మనసుకు తోచింది. తన ఇరవయ్యో జన్మదిన సందర్భంగా తల్లి ఇచ్చిన తుపాకీని శుభ్రం చేయనారంభించాడు. అతడు జర్మనీకి వెళ్ళినప్పటి నుండి దాన్నెవరూ వాడలేదు. హఠాత్తుగా తుపాకీ పేలిన చప్పుడును విని పనివాళ్లు అదిరిపడ్డారు.

గదిలోకి వెళ్లగానే గుండెలో నుండి తుపాకీ గుండు దూసుకుపోయి నేలమీద పడి వున్న జార్జ్‌నుచూశారు వాళ్ళు.

తుపాకీ తూటాలతో నిండి వుండడం వల్ల దానితో ఆడుతున్న జార్జ్ అనుకోకుండా ప్రమాదవశాత్తూ తనను తాను పేల్చుకున్నాడని విశదమవుతున్నది. అట్లాంటి ప్రమాదాల గురించి తరచుగా వార్తా పత్రికల్లో చదువుతూనే వుంటాం.

SOMERSET MAUGHAM KATHALU

*Translated by* ELANAGA

ఒడుపు, చతురతతో కూడుకున్న పరోక్షత (subtlety) సోమర్సెట్ మామ్ రచనా సంవిధానంలోని ప్రత్యేకాంశాలు. అంతేకాక, ఆయన రాసిన వచనం ఎంతో విశిష్టమైనది, విలక్షణమైనది. మానవ స్వభావాల నిశిత పరిశీలన కూడా మామ్ కథల్లో, నవలల్లో స్పష్టంగా కనిపిస్తుంది. అతని కథలలో indirectness ఉన్నా, అసలు విషయాన్ని గ్రహించడానికి ఆయన సరిపోయినన్ని ఆధారాలు ఇస్తాడు. అయితే కొన్నిసార్లు అది అరటిపండును వొలిచి చేతిలో పెట్టినట్లుగా వుండకపోవచ్చు. ఆధారాలను ఇవ్వటంలో చక్కని సమతుల్యత (balance) ను కనబరుస్తాడు మామ్. ఈ లక్షణాలన్నీ నన్ను అమితంగా ఆకర్షించాయి కనుకనే మామ్ రచనలంటే నా కెంతో ఇష్టం. ఈ కథలను తెలుగు పాఠకులు కూడా బాగా ఆదరిస్తారని ఆశిస్తున్నాను.

– ఎలనాగ

₹ 120/-

విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్

చంద్రం బిల్డింగ్స్, చుట్టుగుంట, విజయవాడ-520 004